# నాట్యశాస్త్ర దర్పణము

రచన

నాట్య కళా తపస్వి

**డి. వేణుగోపాల్**

ప్రచురణకర్త

**డి. వేణుగోపాల్, డైరెక్టర్**

ది ఇండియన్ బాలెట్ సెంటర్,

28/16, నాగార్జున నగర్ - 1వ వీధి,

రంగరాజపురం, చెన్నై - 600 024.

# నాట్యశాస్త్ర దర్పణము

56016

రచన

నాట్య కళా తపస్వి

**డి. వేణుగోపాల్**

ప్రచురణకర్త

**డి. వేణుగోపాల్, డైరెక్టర్**

ది ఇండియన్ బాలెట్ సెంటర్,

28/16, నాగార్జున నగర్ - 1వ వీధి,

రంగరాజపురం, చెన్నై - 600 024.

TITLE : NAATYA SAASTRA DARPANAMU

AUTHOR : D. VENUGOPAL

FIRST EDITION : May, 2002


Copies : 1000

© Author

Price : Rs. 90.00

Cover Design : Sri ANKAIAH

For copies : D. VENUGOPAL, DIRECTOR,
THE INDIAN BALLET CENTRE,
28/16, Nagarjuna Nagar, Ist Street,
Rangarajapuram,
CHENNAI - 600 024
Ph. (044) 372 4996



This book is published with the Financial Assistance of TIRUMALA TIRUPATI DEVASTHANAMS under their scheme **"Aid to publish religious books".**


Laser Typesetting : **Creative Offset Printers,**
Vadapalani, Chennai - 26.

Printer at : **HINDI PRACHAR PRESS,**
T. Nagar, Chennai - 600 017.

56016

-: శ్రీ :-

# అంకితము



మహర్షి

## శ్రీ మొవ్వావేంకట దాస స్వామి

నేను పుట్టిన ఆరునెలలకే పరమపదమును పొందిన నాతండ్రి నాగయ్యగార్కి ఆత్మీయులు, అనన్య అసామాన్య పండిత కవిశేఖరులు, గుంటూరుజిల్లా నగరం మండలి పూడివాడ గ్రామంలో -వేణుగోపాలస్వామి దేవాలయ ప్రతిష్ఠాపకులు, విశిష్టాద్వైతమతప్రచారకులు, నన్ను వారి సంతానములో నొకడిగా భావించి, నాకు వెలుగును ప్రసాదించిన పుణ్యపురుషులు నన్ను స్వప్నమందు తట్టిమేల్కొల్పే దివ్యమూర్తులు - నా ఆరాధ్యదైవం.

వారి పాదపద్మములకు
సాష్టాంగ నమస్కృతులొనర్చి
ఈ నాట్యశాస్త్ర దర్పణమును
అంకితభావంతో సమర్పిస్తున్నాను.

- డి. వేణుగోపాల్

-: ఓమ్ :-

''అసతోమాసర్గమయ తమసోమాజ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ హరిః ఓం తత్సత్''
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓంతత్సత్ ఓం
ఓం శాంతి ఓం శాంతి ఓం శాంతి ఓం॥



గ్రంధకర్త : - డి. వేణుగోపాల్

వారి సతీమణి

లక్ష్మీకాంతం

-: ఓమ్ :-

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః

రస, భావములు రమ్యతగా
ప్రదర్శించ గలిగిన
మేటి నాట్యచార్యులు
మాగురుదేవులు
**కీ॥ శే॥**
**శ్రీ బి.వి. నరసింహారావుగారి**
పాదపద్మములకు
హృదయాంజలులు.



---



భరతనాట్య ప్రవీణ,
మైసూరు సంస్థాన
రాజనర్తకిగా పేరొందిన
నల్లియప్ప నట్టువనార్ శిష్యురాలు,

మాగురువులు
కీ॥ శే॥ **శ్రీమతి జీవమ్మాళ్ గార్కి**

హృదయాంజలులు.

నాట్యకళాతపస్వి
**డి. వేణుగోపాల్**



''తల్లికి మించిన త్యాగిలేదు
ప్రేమకు మించిన దైవంలేదు.''

## నాకు ముగ్గురమ్మలు...

నాకు జన్మనిచ్చిన తల్లి-
**సుబ్బమ్మ** - కుడిప్రక్కన.
నన్ను పెంచి, వారి ప్రేమకు చిహ్నంగా
నాకు కొంత ఆస్తిని ప్రసాదించి,
నాభవిష్యత్తును కాంక్షిస్తూ
దివంగతులైన పుణ్యస్త్రీలు - పద్యాల శేషయ్యగారి
ధర్మపత్నీవ్రతులు నామేనత్త - చిన్నమ్మ,
ఆమె సవతి - పెద్దమ్మ (మధ్యనున్నామె).

వారి పవిత్ర పాదపద్మములకు
నాహృదయాంజలులు

**డి. వేణుగోపాల్**

# విషయ సూచిక


ఉపోద్ఘాతము 1-3

1. రసము

నవరసములు - .. .. .. .. ... . .. .. .. ... 4-12

2. భావము

విభావ - అనుభావ,

సాత్త్విక - వ్యభిచారి,

స్థాయీ భావములు .. ...... .... ............... ....13-15

శృంగార రస విభావములు,

అనుభావములు - సంచారి,

లేక వ్యభిచారి భావములు ............ ..... ..... ....16-18

శృంగారాది నవరసములకు,

సంచారి లేక వ్యభిచారి భావములు,

సందర్భము ననుసరించి ................ .. ............ 19

సాత్త్విక భావములు . . .. ......... . ... .. .......... .. 20

శృంగార రసము,

రౌద్ర రసము..... . ............... .. .. .......... . 21

శృంగార చేష్టలు ...... . ....... ..... .. .. .........22-23

శృంగారమున స్త్రీలయందు కలుగు దశావస్థలు. .. .. ...... 24

3. అభినయము:-

అసంయుత హస్తములు......... .. . . . . . . ..25-35

సంయుత హస్తములు ...... ..... . .. .. .. .. ..36-42

నృత్తహస్తములు .. . .............. .. . ..... ..43-52

దేవతా హస్తములు .. . ............ . . .. .. . ..53-56

అష్టదిక్పాలకులు . .. . .. .. . . . . . 57
నవగ్రహములు . . ... ... ..... 58
చతుర్వర్ణములు . . ... .. ........ ... . ... ...... 59
బాంధవ్య హస్తములు ...... ...... ... .. .... .. . ..60-61
అవయవములకు ...... ....... ......... .... .. .... 62
పంచభూతములు,
సముద్రము - గంగానదులు ............... ... .. ...63-64
మృగ హస్తములు ........................................ 65
పక్షి హస్తములు.................. .. ...... .... ........ 66
పిశాచములు ........................... . . ........... 67
శృంగారాది రసములకు ............ .... . . ... .... .. 67
మేషాది రాసులకు, వారాదులకు ... ...... .......... . 68
కాలముకు ............... ........... .... .......... 69
రత్నములు .. ............................................ 69
లోహములు .... ................ .. ..... ............ 70
స్వరములు ................................................ 70
సంఖ్యలు ............................................ 71
షడ్రసములు ........ ......... ......... .......... 71
హస్తప్రాణాలు ........................ .. ......... .. 72
చిహ్నములు ............................ . ........... 72
సంకేతము ......................... . ............. 73
పదార్థ టీక .......... ................. ............. 73
నేత్రము ............ ................. ............. 73
దృష్టి భేదాలు ....................................... .....74-75
హృద్గతమైన భావములను వ్యక్తపరచు సాత్విక దృష్టులు ... 76-80

నవరస దృష్టులు ... ...... ..... .... .. . ... ..81-82
శిరోభేదాలు . . ....... ... ... . . . .83-85
భ్రూ భేదాలు. .. ... ... . ....... ... . .......... 86
గ్రీవా భేదాలు...... .. ............ ... . ....... .. .... 87
నాసా చలన భేదాలు ................ ... ....... . ...... 88
అధరోష్ఠ చాలన భేదాలు .......... ............ ........ 89
హాస భేదాలు ........... ........ . ... ............... 89
వక్షోభినయాలు ...................................89-90
కటిచాలనభేదాలు .... ........... .. ................... 90
పాదకర్మ భేదాలు 91-92
వాచికాభినయము ..... ...... ..... .. ..... ........ 93
ఆహార్యాభి నయము .... ..... ...... ...................... 94
సాత్వికాభినయము .... .... . ....... ................... 95
చిత్రాభినయము....... ................................. 96

4. ధర్మి ..........................................97-98

5. వృత్తి ........................................ 99-101

6. ప్రవృత్తి ..................................... 102-103
ప్రకృతి . . . . . .. .......... . .. ............... 104
నటుని పరభావ ప్రవేశం .......... ...................... 105
భూమికాధారణము .. . ....... .... ................ 105

7. సిద్ధి ........................................ 106-107
స్వరం - ఆతోద్యం - గానం:- ... . . ...............108
నృత్త - నృత్య - నాట్యములు.. .... .. ........... 110-111

లాస్య - తాండవ లక్షణం ... ........ .. ...... 112-114
తాండవము ........ .. .... .. .. .. . ... . 115-117
స్థానకము........ . .......... ... .... ......... 118-120
చారి భేదాలు ............................. 121-122
భౌమీచారులు.. ............................ 123-125
ఆకాశ చారులు ............................. 126-128
గతి ప్రచారము ............................. 129-130
నాట్య పరమార్థం ........................ ......133

## అనుబంధం

1. నాయికా ప్రకరణం ...................... ..... 137-140
అష్టవిధ నాయికలు ........................ . 141-151

2. సుందరి (నృత్యనాటిక) ................ ........ 153-163

3. గోపికా కృష్ణ (నృత్యనాటిక) ...... ........ ...... 164-168

4. కణ్వుడు - శకుంతల (నృత్యనాటిక) ..... . ...... 169-170

5. ఆదిశక్తి (నృత్యనాటిక) ... .... .. ...... .. ... 171-178

6. నవరసములు (శ్లోకములు) .. .. . .... ..... 179-180

7. రిక్షావాలా (నృత్యరూపకం) . ....... . .. ..... 181-190

8. అభయ హస్తము .................. . .. . .. 191-193

9. అర్ధనారీశ్వర (నృత్యనాటిక) ......... .. . . .. 194-201

# నా మాట

**మానవుడు - నాట్యకళ**

శ్లో॥ ''నానా భావోసంపన్నం నానావస్థాంతరాత్మకం

లోకవృత్తానుకరణం నాట్యమేతన్మయా కృతం''

''భరతముని నాట్యశాస్త్రం''

తా॥ పెక్కు భావములతో గూడి, వివిధావస్థలతో

నొప్పారు లోక వ్యాపారానుకరణమే నాట్యం

అంటే నాట్యానికి జీవం- భావం

భావ- రాగ- తాళ- భరితం

అంటే నటన లేక నాట్యం.

**నాట్యోత్పత్తి :**

మానవుడు ప్రకృతిలో బుట్టి ప్రకృతిలో పెరిగి, ప్రకృతిలో కలిసిపోతున్నాడు. అనాదినుండి పశుత్వంలోంచి విడిచివచ్చే మనుష్యుని స్థితినుంచి మానవ ప్రకృతి నుండి సహజమైన లలితకళలు ఉద్భవించాయి.

అతనిచుట్టూ ఉండే రంగురంగుల వస్తువులతో తాను నివసించే గుహల గోడలపై చిత్రాలు గీశాడు వట్టితో బొమ్మలు చేసుకున్నాడు, గంతులు వేశాడు, పాడుకున్నాడు, ప్రాథమిక కావ్యాలల్లుకున్నాడు

లలిత కళలన్నింటిలోను నాట్యకళ ముందు ఆవిర్భవించింది. అప్పుడు పుట్టిన శిశువు చేతులు, కాళ్ళు లయప్రదంగా ఆడిస్తుంది లేదూడ పుట్టిన మరుక్షణంలో చంగ్‌చంగ్‌న గంతులు వేస్తుంది. ఇవి ప్రతి జీవిలో లీనమై ఉన్న సహజ చైతన్య ప్రకృతి లక్షణాలు.

**ఆటవిక నృత్యాలు :**

రాతియుగమున తొలి మానవుడు తనకు దొరికిన ఆకు, అలములను, కాయపండులను, పచ్చిమాంసమును తిని ఉత్సాహ, ఆవేశములతో- రాతి, కర్రల శబ్దాలతో చప్పట్లు, అరుపు మోతలతో విచ్చలవిడిగా గంతులు వేశాడు.

ప్రాథమికావస్థలో నున్న ఆస్ట్రేలియా అడవి మనుషులు, ఆఫ్రికా పొట్టివారు, మన దేశంలో 'సవర' అనాగరకులు- తమలో ఉన్న ఆనందాన్ని నాట్యరూపంగా ప్రదర్శించేవారు.

భాష ఏర్పడని రోజులలో మానవుడు ముఖసంజ్ఞలతో చేతి విన్యాసాలతో తన మనసున ఉదయించిన భావాన్ని తోటి మానవునికి తెలియజేస్తూ వచ్చాడు. ముఖ్యంగా పులి, సింహము, లేడి, ఏనుగు మొదలగు జంతువుల - కాకి, నెమలి, కోయిల మొదలగు పక్షుల ఆగమనమును తెలియజేయుటకు సర్వసాధారణ భంగిమలతో వాటి ఆకృతిని తెల్పేవాడు.

తదుపరి అవే శాస్త్రమున ముద్రలుగ, కరణాలుగ, అంగ విన్యాసాలుగా, ఒక క్రమబద్ధ రీతిన చెప్పబడినవి.

**జానపద నృత్యాలు :**

నగ్నంగా నర్తించిన మానవుడు మర్మాంగాలను ఆకులతో, జంతుచర్మాలతో దాచుకొనుట నేర్చుకున్నాడు.

ప్రకృతి వైపరీత్యాలకు భయపడి రాయి, రప్ప, పుట్ట - చెట్టు, సూర్యుడు- చంద్రుడు, అగ్ని- వాయువు, వరుణుడు - నాగులను దేవులుగా పూజించడం ప్రారంభించాడు. ముఖ్యంగా ప్రార్థనకు వారికప్పటికి తెలిసిన భాష, సంగీతగానాలతో చిందులు వేశాడు. ఇవే ప్రాథమిక జానపద నృత్యాలకు నాంది పలికాయి.

తదుపరి మానవ పరిణామ దశలో భూమిని దున్ని, పంటలు పండించి, ఆహార సముపార్జనకు త్రాగేనీటికి, సన్నిహితంగా నదీతీరములందు గుడిసెలు నిర్మించుకుని, సంఘ సమష్టి జీవమునకు అలవాటు పడ్డాడు. వారి జానపదులు, వారి సమిష్టి ఆనంద నృత్యాలే జానపద నృత్యాలు.

నేడు మనము చూస్తున్న అస్సాములోని నాగా- లాయిహరేబా నృత్యములు, బీహార్‌లోని హో నృత్యము, ఉత్తరప్రదేశ్‌లోని దివాలి నృత్యము, పంజాబ్‌లోని బాంగ్రా నృత్యము, హిమాచల్‌ప్రదేశ్‌లోని పంగీచంబో నృత్యములు, రాజస్థాన్‌లోని దండియారాజ్- జుమార్ నృత్యము, ఒరిస్సాలోని జాదూర్ నృత్యము సౌరాష్ట్రలోని టిప్పనీ నృత్యము, ఆంధ్రప్రదేశ్‌లోని సిద్దీస్- లంబాడీ నృత్యములు, కేరళ- తమిళనాడు దేశములలోని కుమ్మి- కోలాటం నృత్యములు- ఆనాటి మానవుని స్వాభావికమైన శరీర విన్యాసాలనుంచి ఉద్భవించినవే. కావున సాధారణ సంతోష

గంతులు వేసే ప్రాథమిక స్థితిలోంచి, ఆనంద రూపిణిగా ఉత్పన్నమైన నాట్య శాస్త్రము, ప్రకృతినుంచి సంతరించుకున్నదేనని తెలుస్తూ వుంది కాన శాస్త్రము ప్రకృతి విరుద్ధము కారాదు లలిత కళలన్నింట నాట్యకళ సర్వోత్కృష్టమైనది

మనుష్యుని జీవితంలో అంతర్వాహినియై, అగోచరమై ఉన్న పరమ సౌందర్య శృతి, లయ స్వరూపం, దివ్యానందంలో ఐక్యమై నాట్యరూపమగుచున్నది.

సంగీతంలో శ్రుతిలయలు భాసించినప్పటికి మనుష్యుని జీవితంలో నాదం మాత్రమే ఆధారమగుచున్నది.

నాదం మాత్రమే గాక సర్వమానవ మూర్తిమత్వాన్ని ఆధారం చేసుకున్నది నాట్యకళ.

నాట్యకళలో మనుష్యుడే చిత్రం, శిల్పం, గాంధర్వం, లయ, శ్రుతి, కావ్యం అయిపోతాడు.

| | | |
|---|---|---|
| కవిత్వం | - | సాలోక్యం |
| శిల్ప, చిత్రకళలు | - | సారూప్యం |
| సంగీతం | - | సామీప్యం |
| నాట్యం | - | సాయుజ్యం |

అందుకే నాట్యకళలో సంగీత, సాహిత్య, శిల్ప, చిత్రకళలన్నీ నిండి నిబిడీకృతమై ఉన్నాయి

**భారతీయ నాట్యకళ :**

భారతదేశంలో సప్తసింధు దేశములోను, హిమాలయ పర్వతశ్రేణిలోని లోయలలోను, అనాదికాలమునుంచి నివసించి, వృద్ధిపొందిన ఆర్యులలో వేదకాలంనుంచి నాట్యకళ ఉత్తమానుభూతి సమ్మిశ్రమై వెలిసింది. యజ్ఞయాగాది క్రతువుల సమయంలోను, పట్టాభిషేక, వివాహాది శుభ సమయాలలోను నాట్యము ప్రదర్శింపబడేది

దక్షిణ భారతమున నివసించే అనాగరకులలోను ప్రాథమిక స్థితి స్వరూపమైన నాట్యకళ ఉండేది.

యక్షులు, గంధర్వులు, కిన్నరులు, కింపురుషులు అనే పేర్లతో పిలువబడిన మంగోలియన్ జాతివారు టిబెట్, చీనా, అస్సాములలో నివసిస్తూ ఉండేవారు వారిలో నాట్యకళ నిగూఢాత్మకమై తాంత్రిక స్వరూపమై వృద్ధి పొందింది

ఈ జాతులన్నీ భారతదేశములో కలయిక పొంది, క్రొత్త జాతులేర్పడినప్పుడు నాట్యకళలో వివిధ సంప్రదాయాలు, హీనమైనవి, ఉన్నతమైనవీ ఆయా ప్రాంతాలలో విజృంభించాయి

**నాట్యశాస్త్ర రచన :**

ఈ స్థితిని గమనించి కొందరు ఋషులు నాట్యకళకు శాస్త్రస్వరూపం సమకూర్చారు.

చరిత్రకాలం వచ్చేసరికి ప్రథమంలో ఆంధ్రమహర్షియైన నందికేశ్వరుడు అభినయ దర్పణమను ఉత్కృష్టగ్రంధమును రచించాడు. ఈయన శాతవాహనుల కాలపువాడని తెలుస్తుంది. ఈ శాస్త్రాన్ననుసరించే ధాన్య కటకము, భట్టిప్రోలు, ఘంటశాల, గోలి, జగ్గయ్యపేట, నాగార్జునకొండ మొదలైన స్తూపాల శిల్పాలలో నాట్యశిల్పము విలసిల్లింది.

శాతవాహనుల సర్వభారతీయ సామ్రాజ్యము, పాటలీపుత్రంలో సంస్థాపించినపుడు, నందికేశ్వర సంప్రదాయము సర్వ భారతదేశమునూ ఆక్రమించుకున్నది

**భరతముని నాట్యశాస్త్రము:**

దేశ్యాలైన వివిధ దేశ సంప్రదాయాలతో నందికేశ్వర సంప్రదాయము కలిసి కొంత హీనస్థితికి వచ్చేసరికి భరతమహర్షి ఉద్భవించాడు. నందికేశ్వరుని వలెనే భరతమహర్షి మహా తపస్సంపన్నుడు నాట్యకళ మోక్షానికి అతిసన్నిహితమని నమ్మినవాడు. ఆయన పేరేమిటో మనకు తెలియదు. భావ, రాగ, తాళ యుక్తమైన నాట్యాన్ని ఉత్కృష్టస్థితికి తీసుకువచ్చాడు కాన భరతమహర్షి అని పౌరుషనామం ఆయనకు కలిగింది. అప్పటినుంచి నాట్యానికి 'భరతము' అను పేరు వచ్చింది

నాట్యానికి సంగీతం ముఖ్యం సంగీతానికి సాహిత్యం ముఖ్యం. ఈ మూడింటికి చిత్ర, శిల్ప, సాహిత్య కళాజ్ఞానం ముఖ్యం.

నాట్యశాస్త్రవేత్త శిల్పి, చిత్రకారుడు సంగీత, సాహిత్యవేత్త అయి వుండాలి

## సంప్రదాయ నాట్యోత్పత్తి:

సృష్టి, స్థితి, సంహార స్వరూపమైన భగవంతుని లీలయైన సంధ్యానాట్యమునుంచి నాట్యకళ ఉద్భవించిందంటారు. శివుడు ఈ ఉత్కృష్ట కళను నందికేశ్వరునికి నేర్పినాడంటారు. శాక్తేయులు పరదేవతయే త్రిమూర్తులనబడు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు తన లీలా విశేషమై నాట్యాన్ని నేర్పినాడని ఉపదేశిస్తాడు (దేవీభాగవతం).

బ్రహ్మ భగవత్స్వరూపములైన నాలుగు వేదాలలో నుంచినీ, ఉపవేదాలలో ముఖ్యమైన నాట్యవేదమును సంగ్రహించాడనీ,

ఋగ్వేదములోంచి - వాక్యాన్ని,

యజుర్వేదంలోంచి - అభినయాన్ని

సామవేదములోంచి - గానాన్ని

అధర్వణ వేదంలోంచి - శృంగారాది నవరసములను సృష్టించి నాట్యవేదం కూర్చాడంటారు.

## భావ, అభినయ, రసములు :

నాట్యానికి భావ, అభినయ, రసములు ప్రధానములు. తీసుకున్న భావాన్ని అంగ, ప్రత్యంగ, ఉపాంగ చలన, విన్యాసముల ద్వారా వ్యక్తపరిచి, స్థాయీ భావమున రసోత్పత్తిని కలుగజేయవలెను.

### 1. భావము :

మనస్సులోని దృఢ నిశ్చయమును వ్యక్తము చేయుట భావమనబడును. నిర్వికారాత్మకమైన చిత్తంలో సుఖ, దుఃఖాలకు సంబంధించి కలిగే ప్రథమ వికారమునకు లేదా చిత్తవృత్తి విశేషము భావమనబడును.

భావము 4 విధములు.

శో॥ విభావ శ్చానుభావశ్చ సాత్త్వికో వ్యభిచారికః

ఏతే చతుర్విధా భావాః కథ్యంతే పూర్వ సూరిభిః

తా॥ 1. విభావ, 2. అనుభావ, 3. సాత్త్విక

4. వ్యభిచారి భావములని చెప్పబడినవి.

***1. విభావము:***

భావము కలుగుటకు కారణభూతమైనది కనుక

విభావము : కారణము

భావము : కార్యమగును.

విభావము రెండు విధములు.

1. ఆలంబనము : ఆధారము

2. ఉద్దీపనము : భావమునకు దోహదమిచ్చునది (వెలుగు).

***2. అనుభావము :***

విభావం కారణంగా హృదయంలో ఉదయించిన భావమునకు, అనుగుణంగా శరీరం మీద వ్యక్తమయే కటాక్షాది చేష్టలను అనుభావం అంటారు. అనగా మనస్సులో నుదయించిన భావం ప్రయత్నపూర్వకంగా వ్యక్తం చేయబడునది అనుభావం.

***3. సాత్త్వికం :***

సత్త్వమంటే మనస్సుకు సంబంధించిన విశేష స్థితిని తెల్పునది. భావతీవ్రత వల్ల మనస్సులో కలిగే మార్పులు, దేహము మీద అప్రయత్నంగా వ్యక్తమౌతూ ఉంటాయి. రోమాంచాది అనుభవాలు సాత్త్విక భావములనబడును.

***4. సంచారి లేక వ్యభిచారి భావములు :***

హృదయంలో ఉదయించిన భావం చంచలమైనదైతే సంచారి లేక వ్యభిచారి భావమనబడును.

***స్థాయీభావం :***

మనస్సులో నుదయించిన భావం రసస్ఫూర్తి పర్యంతం స్థిరంగా నిలిచేది స్థాయీభావం.

ఇలా మానవ జీవితంలో ఎదురయే అనేక సమస్యలను పరిశీలించి చూసినప్పుడు మనకు ఈ విభావ, అనుభావ, సాత్త్విక, వ్యభిచారి, స్థాయీ భావములు గోచరించుతాయి. అలాగే నవరసములకు అన్వయించుకోవచ్చును

ఉదా.-శృంగార రసమున

1. స్త్రీ-పురుషుల మొదటి సన్నివేశం. విభావము
2. ఇరుచూపుల సంయోగంతో
వారి హృదయంలో జనించునది అనుభావం
3. ఒండొరుల ఆకర్షణ తీవ్రమైనపుడు
కలుగు మానసిక వికారం సాత్త్వికం (ప్రేమ)
4. ఉదయించిన భావము - సిగ్గు, బిడియము, శంక, భయము, చింత, దుఃఖము మొదలగు మానసిక వికారములకు గురియైనచో సంచారి లేక వ్యభిచార భావములు
5. అట్లుగాక హృదయములో జనించిన
(ప్రేమ) భావం రసోదయ పర్యంతం నిలిస్తే స్థాయీభావం.

## 2. అభినయం:

అనగా రూపకార్థములను సామాజిక హృదయాలకు అందజేయుట.

అవి : 1. ఆంగికం, 2 వాచికం, 3 ఆహార్యం, 4. సాత్త్వికం.

### *1. ఆంగికాభినయం:*

శరీరము యొక్క ముఖ్యాంగ, ప్రత్యంగ, ఉపాంగముల చేత భావాన్ని గోచరింపజేయుట.

### *2. వాచికాభినయం*

భావాన్ని పద్యరూపంగా గాని, పదరూపంగా గాని, వచన రూపంగా గాని పలుకుటలో, పాడుటలో సంతృప్తికరంగా అనుట.

### 3. ఆహార్యాభినయం:

భావమునకు తగిన పాత్ర, పాత్రకు తగిన దుస్తులు, నగలు, అలంకరణ నొనర్చుకొనుట.

### 4. సాత్త్వికాభినయం:

రస స్వరూపమైన ప్రతి భావనలోను ఉండే సాత్వతీవృత్తి స్వరూపమైన ఏ మహాభావము, దృశ్యమై విడంబించి వున్నదో ఆ భావాన్ని అంగ, వాక్య, ఆహార్యాభి నయాదుల చేత ధ్వనింప చేయడమే సాత్త్వికాభినయం

### 3. రసము:

సామాన్యుడు ఒక విషయాన్ని అనుభవిస్తాడు కవీ అనుభవిస్తాడు. లోక, శాస్త్ర పరిజ్ఞానంతో ప్రతిభా, వ్యుత్పత్తి, అభ్యాసదక్షుడైన కవి అనుభవం రసముద్రను పొందుతుంది అతని రచనా ప్రాబల్యంతో తిరిగి శ్రోత హృదయంలో రసం క్రిందికే పరివర్తనం చెందుతుంది.

లౌకికంగా అనుభవించే విషయములు రసముద్రలోకి తీసుకువెళ్ళినప్పుడు సామాన్యుడి హృదయం స్పందించి మహదానందం పొందుతుంది. దీనినే రసమన్నారు.

మానవుని హృదయంలో అనేకములైన భావములు ఉద్భవించును. కొన్ని మనస్సులో బుట్టి, అట్లే నశించును మరికొన్ని సర్వజనుల హృదయాలలో నెల్లప్పుడు నుండునవి రసములు. అవి నవరసములుగా చెప్పబడినవి.

**నవరసములు...**

శ్లో॥ శృంగార హాస్య కరుణా రౌద్ర వీరభయానకాః
బీభత్సాద్భుత శాంతాశ్చ రసాః పూర్వైప్రకీర్తితాః

తా॥ 1. శృంగార, 2. హాస్య, 3. కరుణ, 4. రౌద్ర,
5. వీర, 6. భయానక, 7. బీభత్స, 8. అద్భుత,
9. శాంతరసములుగా చెప్పబడినవి.

## వివిధ నాట్య బాణీలు :

దేశ, కాల, నైసర్గిక పరిస్థితులను బట్టి కళలు ఆవిర్భవించాయి. అచటి ఆచార వ్యవహారములను బట్టి మన దేశమున నాట్యకళ వేరు వేరు రూపములలో వివిధ నామములతో భరతనాట్యం, కూచిపూడి, కథాకళి, కథక్, మణిపూరి, ఒడిస్సీ అని పిలువబడుచున్నవి వాటికి వారి వారి ప్రత్యేక వాద్య సమ్మేళనాలు దోహదమగుచున్నవి సంగీత, సాహిత్య, ఆహార్యములలో పాత్ర పోషణలలో వివిధ రీతులను మనము చూడగలుగుచున్నాము.

అందరూ నాట్యశాస్త్రమునే అనుసరించి వారి వారి ప్రత్యేకతలను చాటుకుంటున్నారు. ఏ బాణీకి ఆ బాణీయే గొప్పగా కన్పిస్తుంది. అవి వారి జీవన విధానానికి, సంస్కృతికి ప్రతిబింబాలు.

### లలితకళలు – రాజుల వైభవాలు:

ఆనాడు లలిత కళలు రాజాస్థానమున మహోన్నత స్థితికి అందుకున్నాయి రాజు, కవి, గాయకుడు, చిత్రశిల్పి, కళావేత్త, నాట్యవిశారదుడు, అన్నీ తానై కళల ప్రాముఖ్యమును గ్రహించి కళాకారులను గౌరవించి, ఆదరించి, పోషించి తన ప్రత్యేకతను చాటుకున్నాడు అందువల్ల ప్రసిద్ధ కళావేత్తలంతా రాజాదరణలో వారి ప్రతిభను జగతికి సర్వకాల శోభిత కళాఖండాలను అందించారు.

భోజరాజు ఆస్థానంలోనున్న మహాకవి కాళిదాసు వ్రాసిన అభిజ్ఞాన శాకుంతల నాటకం, హంపీవిజయ నగరాన్ని పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయలు ఆస్థాన కవిశేఖరుడు అల్లసాని పెద్దన రచించిన మనుచరిత్ర మొదలగునవి జగత్ప్రసిద్ధి గాంచిన గ్రంధాలు మరెన్నో వున్నవి.

కవుల ప్రసిద్ధ గ్రంథాలు, నాటకముల వెనుక ఆనాటి నర్తకీమణుల ఉజ్జ్వల నాట్యప్రతిభలు ఎన్నో కనిపిస్తాయి. ఈనాడు మనకు నాట్యాభినయానికి ఎంతగానో ఉపయోగపడుచున్న ప్రసిద్ధ గ్రంథం ''అష్టపది''లో 'పద్మావతీ చరణ చారణ చక్రవర్తి' అని చెప్పుకున్నాడు గ్రంధకర్త ''జయదేవుడు''. అంటే తన భార్య పద్మావతీ నృత్యములకు చైతన్యుడై లోకానికి సార్వకాలిక, సంప్రదాయ నాట్యాభినయ గ్రంథాన్ని అందించాడు.

ఈనాడు అది అన్ని భాషల, సంప్రదాయ, నాట్య కళాకారులందరికి ప్రమాణ గ్రంధమైంది ఆనాడు రాజాస్థానాలు, దేవాలయ మండపాలు, కవి, నాయక, నర్తకీమణులకు ప్రదర్శన కేంద్రాలయినవి ఈనాడు మనము చూస్తున్న అజంతా, ఎల్లోరా, నాగార్జున, బేలూరు, హంపీ, చిదంబరం, తాజ్‌మహల్ లాంటి కళాఖండాలు ఆనాటి రాజుల వైభవాలకు నిదర్శనాలు.

### బ్రిటిష్ పాలనలో నాట్యకళ:

బ్రిటిష్ పాలనలో భారతదేశమున లలిత కళలు కళావిహీనమై, వ్యక్తిగతహీన ప్రవృత్తులకు దాసోహమై పోయినవి. భక్తిప్రపత్తులతో ప్రభవించిన దేవదాసీల నాట్యకళ సానుల అధీనమైంది

#### నాట్యకళాభివృద్ధికి తోడ్పడిన వ్యక్తులు :

భారత స్వాతంత్ర్యానంతరం దేవాలయములలో దేవదాసీ నృత్యములు నిషేధించబడినవి

తమిళనాడులో సంఘ బహిష్కరణకు గురియైన నాట్యకళ నభ్యసించి, విశేష శక్తులనెదిరించి, ప్రదర్శించి దాని ఔన్నత్యమును చాటిన వారిలో ఇ కృష్ణఅయ్యర్, శ్రీమతి రుక్మిణీ అరండేల్, కళావిధి నారాయణన్ ప్రముఖులు.

ఆంధ్రదేశమున నాట్యకళాభివృద్ధికి తోడ్పడినవారిలో శ్రీ వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రిగారు, శ్రీ నటరాజు రామకృష్ణగారు, కోరాడ నరసింహారావుగారు, వెంపటి చినసత్యంగారు, శ్రీ బి.వి. నరసింహారావుగారు ముఖ్యులు.

కీ.శే॥ శ్రీ వేదాంతం లక్ష్మీనారాయణగారు కూచిపూడి నృత్యానికి పితామహులు వారి ప్రజ్ఞావిశేషము వలననే నేడు కూచిపూడి నృత్యం శిష్య పరంపరమూలంగా జగద్విఖ్యాతి గాంచింది

శ్రీయుతులు నటరాజు రామకృష్ణగారు నాట్యకళకు సంబంధించిన అనేక గ్రంధములను వ్రాయుటయేగాక, ప్రత్యేకంగా 'ఆంధ్ర నాట్య' మను పేరున, నృత్య నికేతనమును నడుపుచున్నారు.

శ్రీ కోరాడ నరసింహారావుగారు కూచిపూడి నృత్యాన్ని పారిస్‌లో ప్రదర్శించి, అంతర్జాతీయ బహుమానాన్ని అందుకుని, కూచిపూడి నృత్య వికాసానికి నాంది పలికారు.

డా॥ శ్రీ వెంపటి చినసత్యం గారు, తన సంస్థ 'కూచిపూడి అకాడమీ' ద్వారా అనేక నర్తక నర్తకీమణులను తయారుచేసి పలు దేశములలో ప్రదర్శనలిచ్చి విశేషఖ్యాతి నార్జించారు.

నా గురువులు కీ.శే॥ శ్రీ బి.వి. నరసింహారావుగారు శాస్త్రీయ, జానపద నృత్యాలలో నూతన అధ్యాయాన్ని సృష్టించి, విద్యార్థులకెంతో తోడ్పడ్డారు. సాహిత్యపరంగా వచ్చిన మార్పుల వల్ల అభ్యుదయ కవితాపితామహులు గురజాడ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, నండూరి, కొనకళ్ళ లాంటి మహాకవులగేయాలకు ప్రప్రథమంగా నాట్యాన్ని గూర్చిన ఘనత శ్రీ బి.వి. నరసింహారావు గారికే దక్కింది

సాహిత్యపు లోతులను ఆకళింపు చేసుకుని చైతన్య వంతులై భావగర్భితంగా ప్రదర్శించగల మహానర్తక శిఖామణులు శ్రీ బి.వి. నరసింహారావుగారు.

భారత రత్నములని శ్లాఘించగల విశిష్ట నాట్య కళాకారులు శ్రీ ఉదయశంకర్ గోపీనాధ్, రామగోపాల్‌గారలు.

గోపీనాధుని కథాకళీ తాండవ నృత్యాలు, రామగోపాలుని భరతనాట్య విన్యాసాలు, యువకళాకారులకు ఉత్తేజిత నీరాజనాలు.

ఉదయశంకరుని 'కల్పన చిత్రం'' భారత సంస్కృతికి నిజస్వరూపం, అద్భుత నృత్య కళాఖండం అది ఒక దివ్య సృష్టి అతని గౌతమబుద్ధ, మాన్ అండ్ మెషినరీ, నిలాస్, నిరాశ, నిరీక్ష లాంటి అంశములు అద్భుతకళా విశేషములు.

## ప్రజానాట్యమండలి (ఒక ఉద్యమ కళాసంస్థ):

లలితకళల నన్నిటిని వెలికిదీసి నూతన కథావస్తువులను సంధించి ప్రజా బాహుళ్యాన్ని ఉత్తేజపరిచిన ఘనత ప్రజానాట్యమండలికే దక్కింది అది మరపురాని, చెరగని ముద్ర. మానవ వికాసానికి తోడ్పడిన ఉజ్జ్వల మహోన్నత ఉద్యమం.

1943లో పుట్టిన ప్రజానాట్యమండలితో తెలుగు సాంస్కృతిక కళారూపాలకు నూతన శకం ఆరంభమై ఒక ఉజ్జ్వల ఘట్టాన్ని చేరుకుంది

సుంకర, వాసిరెడ్డి వ్రాసిన 'మాభూమి' నాటకం, తండోపతండాలుగా వచ్చే జనసమూహాన్ని తట్టుకోలేక ఒకేరాత్రి 2 సార్లు ప్రదర్శించవలసి వచ్చేది. ఇది చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించవలసిన విషయం.

ఒక నాటకానికే గాక మరుగున పడిన అనేక జానపద కళారూపాలకు నూతన వెలుగును ప్రసాదించింది. ప్రాచీన జానపద కళారూపాల నాధారంగా తీసుకుని కథావస్తువులను పొందుపరచి-

పంటసిరి నృత్యం, సైసై భారతవీర చెన్నపరెడ్డి, హిట్లరు వీధిభాగవతం, బుర్రకథ, జముకుల కథ, చెక్కభజన, కోలాటం, డప్పుల నృత్యం, పాములవాడి నృత్యం, పిచ్చిగుంటల కథ, గొల్లసుద్దులు, డా॥ రాజారావుగారి ప్రెస్‌వర్కరు, సుత్తికొడవలి నృత్యం మొదలగునవి ప్రజాసమూహాన్ని ఉర్రూతలూగించాయి.

కీ॥శే॥ అనిసెట్టి సుబ్బారావుగారు రచించిన గేయం ''రిక్షావాలా'' కు రూపకల్పననిచ్చి 'నేను' 1955 ఎలెక్షను సందర్భమున ఆంధ్రదేశమంతటా ప్రదర్శించటం జరిగింది. ఇది ఒక నూతన ప్రక్రియ. మూకాభినయంతో కూడిన నృత్యం. రచన అనిసెట్టి సుబ్బారావుగారు, సంగీత దర్శకుడు గాయకుడు శ్రీ బి. గోపాలం దీనికి జీవం. వీరి సహకారంతో నేను ఆంధ్ర, కర్ణాటక, మద్రాసు నగరంలోను అంతటా ప్రదర్శించి పెద్దల పామరుల మన్ననలను అందుకోగలిగాను. ఇది రిక్షావాడి జీవిత విధానమును తెల్పెడి మరపురాని, మహత్తర అంశం.

ఆనాడు, ఆంధ్ర ప్రజానాట్యమండలి వారి కళారూపాలకు ఉత్తేజితులై ప్రజలు రంగస్థలముపై డబ్బును విరజిమ్మేవారు. ముఖ్యంగా స్త్రీలు తమ మెడలోని బంగారు నాణెములను బహూకరించేవారు.

అంటే అవి వారి జీవిత విధానాలను తెల్పే కథావస్తువులు తీసుకున్న మంచి కథావస్తువుకు, తగిన సన్నివేశముల ప్రాబల్యం, చెప్పే విధానం అలా వుండేది. ఇది ఏ కళాకారుడైనా గుర్తించవలసిన ముఖ్య విషయం.

స్వర్గీయ టి చలపతిరావు, మోహనదాసు మరియు బి.గోపాలం గార్ల సంగీతం, ఆత్రేయ, అనిసెట్టి, సుంకర, వాసిరెడ్డి, కోగంటి గార్ల రచనావైచిత్ర్యం, డా॥ రాజారావు, అచ్చయ్యగార్ల దర్శకత్వమున ప్రజానాట్యమండలి ఒక మహత్తర ఉద్యమమై వెలసింది.

డా॥ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిగారి హిట్లర్ భాగవతంలోని హిట్లర్ సిమ్లా, వీధినాటకంలోని వైస్రాయి లేవెల్, తెలంగాణా పోరాటంలోని దేశ్‌ముఖ్ పాత్రలు జనాకర్షణ పొంది విశేషఖ్యాతిని తెచ్చిపెట్టాయి.

**ది ఇండియన్ బాలే సెంటర్ :**

అభ్యుదయ నృత్యకళాసంస్థ. 1955లో యీ సంస్థను నేను, నా మిత్రుడు, పి.వి.బి. మహదేవ్ స్థాపించి, శాస్త్రీయ, జానపద సృజనాత్మక కళారూపాలను రూపొందించి, విరివిగా దేశమంతటా ప్రదర్శనలిస్తూ కళాసేవ దృక్పథంతో పయనిస్తున్నాము. మేము ప్రదర్శించే శివుని ఆనంద తాండవం, అర్ధనారీశ్వరి, డేగా, పావురం, రిక్షావాలా మానవుడు చిరంజీవి (మూకాభినయ నాటిక) శ్రీ కృష్ణశాస్త్రిగారి వేయబోవని తలుపు, అష్టపదులు, తరంగాలు, ఎంకిపాటలు బంగారుమామ పాటలు విశేష ఖ్యాతిని ఆర్జించిపెట్టాయి.

మా సంస్థలో నాట్యమభ్యసించి, అభివృద్ధికి వచ్చినవారిలో అభినేత్రి వాణిశ్రీ, శ్రీమతి విజయలలిత ముఖ్యులు. వీరుగాక శ్రీమతి ఝాన్సీ, శ్రీమతి జ్యోతిశర్మ మరెందరో స్త్రీ, పురుషులు ఉన్నతస్థితిని పొందగలుగుచున్నందులకు మేమెంతో ఆనందపడుచున్నాము.

**కళాకారుని అగమ్యస్థితి :**

రాజులు అంతరించారు. ప్రజాప్రభుత్వం వచ్చింది. ప్రజాపాలనలో ప్రతి మానవుడు స్వతంత్రుడనైతినని ఉత్సాహపడ్డాడు. కాని మనుగడకే ముప్పు వచ్చిన ఈ రోజులలో కళాకారుని స్థితి అధోగతి అయింది.

అసలు వస్తువులకంటే నకిలీ వస్తువులకు విలువ ఎక్కువైంది. నిజమైన కళాకారుని గుర్తించి పోషించే నాథుడు లేడు

కళారంగమును నిర్దేశించు ప్రభుత్వ నేతలు ప్రణాళికలు తయారు చేయు లోపున ప్రభుత్వమే మారిపోతుంది. కాన ప్రభుత్వాన్ని పూర్తిగా విమర్శించి ప్రయోజనం లేదు.

**ప్రజలే కళాపోషకులు:**

కాన ప్రజలే కళాపోషకులు వారి సమస్యల పరిష్కార సూచనలే కథావస్తువులు.

కళ ప్రజల కొరకు, ప్రజాభ్యున్నతి కొరకు. ప్రజలను బ్రతికించి తాను బ్రతకగలిగినప్పుడే నిజమైన కళాకారుడౌతాడు

**కళాకారుని బాధ్యత:**

శాస్త్రాన్ని క్షుణ్ణంగా ఆకళింపు చేసుకుని, నేటికీ ప్రసిద్ధ రూపాలుగా నిలిచిన అంశముల నాధారంగా గ్రహించి దేశ, కాల, సాంఘిక, రాజకీయ పరిణామములను దృష్టిలో ఉంచుకుని వినూత్న సన్నివేశములను దృష్టిలో నుంచుకొని నూతన ప్రక్రియల ద్వారా వినూత్న సన్నివేశములను ప్రజలకు అందించాలి. తీసుకున్న సన్నివేశమునకు శిల్పనైపుణ్యం, రసభావములు కుంటుపడకూడదు.

కళావస్తువు సందేశాత్మకం, ప్రబోధాత్మకంగా ఉండాలి. అప్పుడే సద్భావన, సత్సంప్రదాయములతో కూర్చిన అంశములతో నాట్యకళ ద్వారా ప్రజలకు అందించి వారి జీవన వికాసానికి తోడ్పడినవాడవుతాడు కళాకారుడు.

నాట్యం జీవితానికి ప్రతిబింబం కారాదు. జీవిత యథార్థతనుండి రసానందానుభూతి ద్వారా ప్రేక్షకుల మనస్సులను రంజింపజేయాలి.

ఊహాతీతమైన అంశములు కూడ రస విహీనము కారాదు. చైతన్యవంతమై జనించే రస, భావములు పరమానంద భరితమైన సత్యస్వరూపం సంతరించు కోవాలి. అప్పుడే నాట్యం ఉత్తమకళగా శాశ్వతంగా నిలిచిపోతుంది

నాట్యకళాకారుడు తన హృదయంలో సృజనాశక్తిని పెంపొందింపజేసుకుని, వినూత్న కళారూపాలను ప్రజలకు అందించాలి. అది శాశ్వతంగా హృదయానంద భరితంగా ఉండిపోతుంది.

– డి. వేణుగోపాల్

## K. Viswanath

*Film Director*

2-6th Cross Street,
United India Colony,
Kodambakkam,
Chennai- 600 024




శ్రీ వేణుగోపాల్‌గారు 75 సంవత్సరాలు పైబడ్డ యువకులు. నాట్యాచార్యులుగా 75 సంవత్సరాల యశోవృద్ధులు. వారు రచించిన **'నాట్యశాస్త్ర దర్పణము'** నాకిచ్చి అభిప్రాయం చెప్పమన్నారు. వీలుంటే వ్రాసి ఇవ్వమన్నారు! వెనుకటికి ఒక పుట్టుగుడ్డివాడి చేతికి ఒక మణినిచ్చి, దాని అమూల్యతను వర్ణించి చెప్పమన్నారట! అలాంటి పరిస్థితే నాదీనూ.. మణిని చూడాలంటే కళ్ళుండాలి దృష్టి వుంటేగాని, దాని విశిష్టతేమిటో చెప్పలేం. ఇది అందరూ ఎరిగిన సత్యం!

నాట్యకళలో నాకెలాంటి ప్రవేశమూ లేదు. మరలాంటి 'గుడ్డి' వాడిని; వారి గ్రంథం చదివి ఏం అర్థం చేసుకోగలను? అయితే వారు వ్రాసిన తీరు చూస్తే, కొన్ని కొన్ని విషయాలు అర్థం అవుతున్నట్టు అనిపించాయి. అంత సరళంగా, అంత విపులంగా వ్రాశారు. అర్థం అయినంత వరకు అనిపించినది! మనం చూసే ఒక నాట్యం వెనుక ఇంత grammar వుంది అని తెలుస్తుంది. గాలికి నేర్చుకునేది నాట్యం కాదని, కాళ్ళు చేతులు యిష్టం వచ్చినట్లు ఆడించడం నాట్యం కాదని, ప్రతి కదలికకు ఒక నిర్దిష్టమైన ప్రమాణం వుందని నా బోంట్లకు తెలిసొస్తుంది . తెలిసింది.

వేణుగోపాల్‌గారి అనుభవం అపారమైనది. నాట్యకళ మీద ఆయనకున్న భక్తిప్రపత్తులు అసాధారణమైనవి. సాంప్రదాయం మీద ఆయనకున్న గౌరవం అంతులేనిది.

అందుకే వారికి రెండు చేతులూ ఎత్తి మనసారా నమస్కారం చెయ్యడం తప్ప, చేతిలోకి కలం తీసుకుని యింతకన్నా మరేమీ రాయడానికి (గ్రంథం గురించి) సాహసించడం లేదు!

చెన్నై, — విశ్వనాథ్

28-3-2001

**D.V.S. Raju**

*Film Director*

No 410 (old no 45)

Road No.6, Film Nagar

Jubilee Hills, Hyderabad- 500 033

Ph:- 3608041, 3544334



శ్రీయుతుడు వేణుగోపాల్‌గారూ,

మీరు రచించిన నాట్యశాస్త్ర దర్పణము చదివి చాల సంతోషించాను మీరు పురాణ, ఇతిహాసాలలోని నాట్య నవరసములను విశ్లేషించి వ్రాసిన విధానము, **'నాట్యకళాతపస్వి'** అనే మీరు పొందిన బిరుదుకు అర్థం పడుతోంది. నాట్యశాస్త్రంలోని ఎన్నో విషయాలను సూక్ష్మీకరించి, సామాన్యులు సహితం అవగాహన చేసుకొనే విధంగా మీరు చేసిన కృషి శ్లాఘనీయం. పండితులకు, నాట్యజ్ఞులకు ఈ నాట్యశాస్త్ర దర్పణము ఒక నిఘంటువుగా ఉంటుందని ఆశిస్తున్నాను. నాట్య శాస్త్రంలో ఘనాపాటిగా పేరుగాంచిన మీరు ఈ రచనలో ఒక శాస్త్ర యుక్తమైన రచయితగా గుర్తింపబడ్డారు. మీ సేవలు మరింతగా సమాజానికి ఉపయోగపడతాయని చెప్పడానికి గర్వపడుతున్నాను. ఒక తెలుగు నాట్యాచార్యులు సాధించిన విజయంగా చరిత్రలో మీ పుస్తకం నిలుస్తుందని ఆశిస్తున్నాను. మీ కృషిని మనసారా అభినందిస్తున్నాను.

చెన్నై,

14-3-2001

మీ శ్రేయోభిలాషి

**డి. వి. యస్. రాజు**

**Dr. D. CHINNA KRISHNAIAH**

*M A , M Litt, Ph D,*

(Formerly Prof & Head,
Dept of Telugu,
Presidency College)



# వినుతి

చతుర్ముఖుని బహుభిన్న రూపక సంకల్పాలకు ప్రతిబింబం భరత మహర్షి నాట్యశాస్త్రం ఆ నాట్యకళా ప్రధానాంశాలకు హితమిత దర్పణం కళాతపస్వి వేణుగోపాల్‌గారి ప్రస్తుత రచన.

భరతనాట్యశాస్త్రం అధృష్యమూ, అభిగమ్యమూ అయిన మహాసాహితీ సాగరం భారతీయులకు పెన్నిధి. కేవల శాస్త్ర ప్రజ్ఞానం, కేవల ప్రయోగ విజ్ఞానం కానీ ఈ నాట్యవేద అవగాహనకు చాలవు ఈ రెంటి సమన్వయ పరిజ్ఞానం, సమభ్యాహార కౌశలం ఉన్న కొద్దిమందికి మాత్రమే నాట్యకళ ప్రసన్నం కాగలదు. ఈ విషయంలో వేణుగోపాల్‌గారు- సిద్ధ సంకల్పులు, సిద్ధహస్తులు వారు స్థాపించి, సమర్థంగా నిర్వహిస్తున్న ''ది ఇండియన్ బాలే సెంటర్'' నృత్యకళాకేంద్రం దీనికి ప్రత్యక్ష ప్రమాణం. స్వానుభవానికి ప్రసన్న సాత్షక రూపం వారి ''నాట్యశాస్త్ర దర్పణము''.

తెలుగులో నాట్యశాస్త్రమన్నంతనే దక్షులు, మా గురువుగారు ఆచార్య శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావుగారు సాక్షాత్కరిస్తారు. నిరంతర అధ్యయనం, అధ్యాపనం, వచనం వారి ఆదర్శ పథం గుప్తభావ ప్రకాశికా సహితంగా వారు మొదట ''నాట్యశాస్త్రం'' ప్రకటించారు పుంఖానుపుంఖాలుగా తర్వాత వారు ప్రచురించిన గ్రంథాలు. పరిశోధనలు, తెలుగువారికి తేనెపెరలో సాదృశ గ్రంథకర్తగా భారతీయ భాషల్లో వారిది అద్వితీయ స్థానం. వారికి శిష్యుడు కావడమన్న అదృష్టమూ, శ్రీ వేణుగోపాల్‌గారి వాత్సల్యాశయమూ ఈ 'వినుతి' వ్రాయడానికి మూలకారణం.

ఏబదేండ్ల బహురూపానుభవపూర్వకమైన విద్య ప్రసాదించిన వినయగుణ సంపన్నులు వేణుగోపాల్‌గారు. వారి మనసూ, మాటా మెత్తనిది. ప్రజ్ఞ నిశితమైనది

నాట్యకళకు ఏది ప్రధానమో, గ్రాహ్యమో, ఆ పదకొండు అంశాలనే రచయిత తన 'నాట్యశాస్త్ర నిర్ణయము'లో ప్రసంగించారు

పనికిరాని పాండితి ప్రదర్శనానికి పూనుకోక, సహజమూ, సరళమూ, సుబోధమూ అయిన విషయ సమర్థ పద్ధతిలో నృత్యకళా మూల రహస్య సమన్వయం చేస్తూ, వారు ఆత్మీయ సౌజన్యాన్ని ఈ గ్రంథంలో ప్రతిఫలింప జేయగలిగారు

అధ్యయన క్లేశం కలిగించనిదీ, అభ్యాసానికి అనుగుణమైనదీ, పఠన పాఠన యోగ్యమైనదీ, కరతలామలకం వంటిదీ- ఈ రచనం- పిట్ట కొంచెం, కూత ఘనం- వారికి హృత్పూర్వక శుభాకాంక్షలు.

దేవళ్ల చిన్నికృష్ణయ్య

No 7, Thanikachalam Street,
Triplicane, Chennai - 600 005
Phone 844 0406
5-6-1997



సహజ కవితా విలాస,
సాహిత్యతత్త్వ సందర్శన

**- చిల్లర భావనారాయణరావు**

*MABOL*

# ''నాట్య కళారాధనము''

'రసోవై సః' అన్నారు వేదాంత విదులు. పరమాత్మ రస స్వరూపుడు. ఆ బ్రహ్మానందానుభూతిలో ఓలలాడు మహాయోగులకు 'రసోవైసః' అన్నది అనుభవైక వేద్యము. అది అందరము పొందలేనిది అందుకోలేనిది. కారణం నిష్కామస్థితిని, పుణ్య పాప రహిత స్థితిని పొందాలి. అంతటి పరిపూర్ణ బ్రహ్మానందతుల్యమైన ఆనందరసానుభూతిలో, కొందరు వారి సుకృత విశేషము వలన, తేలియాడగల భాగ్యమును పొందగలరు. దానికి కారణం ముఖ్యంగా కళాపోషణ పవిత్ర కళోపాసన ద్వారా వారెరిగి, యెదిగి పరబ్రహ్మాను సంధానస్థితిని కూడ చివరకు పొందగలరు

కవిత్వము, సంగీతము, శిల్పము, చిత్రలేఖనము, నాట్యము ఇవి లలిత కళలు వీటికన్నింటికి భావము ఆశ్రయము. రసతన్మయత్వము సిద్ధి. లలిత కళలను పేర్కొను క్రమములో నాట్యకళ చివరిది. ఈ నాట్యకళ సకల లలిత కళా సమాహారము. కవితా విలాస భాసురమగు పదముల సొగసు, సంగీత సుస్వర నిష్పంద మకరందము, శిల్ప విన్యాసములలోని సోయగపు వంపుసొంపులు, చిత్రలేఖనములోని వివిధ వర్ణమిశ్రిత శోభిత విలాస జీవకళ ( ఆహార్యములో) ఈ నాట్య కళలో లీనమై, ఇది ఒక సకల కళాకేంద్రమై విరాజిల్లును.

నాట్యకళకు ఆరాధ్య దేవతామూర్తులు శివపార్వతులు. ఆ ఆదిదంపతులను నృత్త, నృత్య, నాట్య తాండవ లాస్యముల ఉపాసనము వారిని ఆరాధించుటయేయగును

ఈ దృష్టి గల నాట్య కళాకారుడు మహర్షి తుల్యుడు గదా!

ఇట్టి పరమ పవిత్రమైన నాట్యకళను అభ్యసించి, జీర్ణించుకుని, నాట్యాలయము స్థాపించి, నిర్వహించుచు దాదాపు నలుబదేండ్ల నుండి నర్తకీ, నర్తకుల కెందరకో శిక్షణనిచ్చి, తీర్చిదిద్దిన నాట్య కళాచార్యుడు శ్రీ డి. వేణుగోపాల్‌గారు ధన్యులు. వారి అనుభవమును పురస్కరించుకుని ఈ **'నాట్యశాస్త్ర దర్పణము'** గ్రంధమును వ్రాసి ధన్యతములైనారు.

భరతముని నాట్యశాస్త్ర ప్రవక్త. సాంప్రదాయికమయిన ఆ భరతనాట్య శాస్త్రమునకు ఎందరో మహనీయులు సువ్యాఖ్యలు వ్రాసినారు. నిత్య నాట్యకళానందములో ఓలలాడుచున్న ఈ గ్రంథకర్త నాట్యకళా విద్యార్థినీ విద్యార్థులకు జటిలములై, అవగాహనము వెంటనే అందని అనేక విశేషాంశములను, విపులముగా, సుబోధకముగా ఈ గ్రంథమున అందించుట ప్రత్యేకత.

శ్లో॥ వయోనురూపః ప్రథమస్తు వేషః
వేషానురూపో గతి ప్రచారే
గతిప్రచారానుగతంచ పాఠ్యమ్
పాఠ్యానురూపోऽభినయస్తు కార్యమ్॥

నాట్యకళను గురించి శాస్త్రకారులు సంక్షేపముగా చెప్పినదీమాట. తదను గుణ్యములు, అంతర్భూతములగు వివిధాంశములగు, నవరసముల, విభావానుభావ సాత్విక సంచారులు, స్థాయి నాయికానాయకుల భేదములు, భావరసానుగుణ్యమైన అంగాంగ విన్యాసములు, వివిధ ముద్రలు, గతి, ప్రచారములు, చారీభేదములు నాట్య ధర్మి మొదలగు వాటిని, వాటి ప్రయోజనములు నాట్యాచార్య వేణుగోపాల్‌గారు, శాస్త్ర మర్యాదానుకూలముగా, సులభశైలిలో ఈ గ్రంధమున వివరించినారు.

శాస్త్రములోని ఆయా సాంకేతిక పదములకు అర్థములు తేలిక మాటలలో తెలిపినారు ప్రతి నాట్య కళాకారుని వద్ద ఉండవలసిన గ్రంథమిది. వారికిది నాట్య కళాతల్పభూజము

రేఖాచిత్రములతో గ్రంధమున ఉండుట ఈ గ్రంధమునకు ఎనలేని ప్రత్యేకత అంతేగాదు, నాట్యాచార్య శ్రీ వేణుగోపాల్‌గారు ఈ గ్రంధమునకు చేర్చిన అనుబంధములు ప్రత్యేకాకర్షణీయములు. మహోపయుక్తములు

నవరస రూపకములు గ్రంథకర్త అందించినారు ఈ రూపకములు వారి సాహిత్య ప్రజ్ఞావైభవమునే గాక, పాఠకులైన విద్యార్థుల ముందు తాము నిలిచి నాట్యశాస్త్రము ప్రత్యక్షముగా బోధించుచున్నట్లున్నది.

ఇక అష్టవిధ నాయికల గురించి యున్నది- స్త్రీ జీవితంలోని వయస్సును బట్టి క్రమానుబద్ధంగా నాయికల నిరూపిస్తూ నృత్య, గాన లయానుకూలమైన ఈ గీతములు, నాయికా స్వరూపాలను స్పష్టంగా, చక్కగా తెలుపుతున్నవి కవి సాంప్రదాయంగా, గోపికాకృష్ణులనే నాయికానాయకులుగా తీసుకున్నారు. ఈ రచన హృదయాలను తప్పక రంజింపచేస్తుంది.

ఈ గ్రంధ రచన జేసి నాట్యాచార్య శ్రీ వేణుగోపాల్ గారు ఆంధ్ర నాట్యకళా రంగమున చిరకీర్తి గడించుకున్నారు.

**చిల్లర భావనారాయణరావు**

విశ్రాంత ఆంధ్రాధ్యాపకులు
**మద్రాసు క్రైస్తవ కళాశాల**
మహోన్నత పాఠశాల, చెట్‌పట్,
చెన్నపురి - 600 031

18/10/1996

వి.ఎ.కె. రంగారావు

శ్రీకృష్ణశ్శరణం మమ



# ఇన్ని ఉండగా నాట్యం గురించి మరో పుస్తకం ఎందుకు?

ఎందరో మహానుభావులు కృష్ణుని గురించి ఆడినా, పాడినా, కొనియాడినా యింకా ఎందరో అదే మార్గాన పయనించడం లేదా?

ఎందరో మహావాగ్గేయకారులు అపూర్వ సంగీత, సాహిత్య సృష్టి కావించినా, యింకా మంచి పాటలు వ్రాద్దామని రచయితలు శ్రమించడం లేదా?

చేసిన పనే చేయడం కాదిది. నేను చేయంగల పూజ యిదీ. నా ఆత్మతృప్తి కోసం యీ అర్చన, నేను శ్రమ, శ్రద్ధ వెచ్చించి సాధించిన అనుభవపు ఆణిముత్యాలు తక్కిన వారితో పంచుకోవాలన్న తపన.

నటరాజు మూల మ్రోల కాళీయ ఫణిఫణ నటరాజు

దయతో నాట్యాచార్యులు శ్రీ వేణుగోపాల్ పెట్టిన

నైవేద్యమిది. ఆ ప్రసాదానికి నాట్య కళ యందభిరుచి ఉన్న ప్రతి ఒక్కరూ అర్హులే. అవధరించి, ఆనందించి అర్థం చేసుకుని, జ్ఞానాన్ని పెంచుకోగలిగిన వారు ధన్యులు. శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రిగారి ఆశీస్సులతో, వారిలో నేనూ ఒకడిని

ఇట్లు

వి.ఎ.కె. రంగారావు

రామమహల్
18, పైక్రాఫ్ట్స్ గార్డెన్
మద్రాసు 600 006
ఫోన్ : 827 8308

## బి.వి. పద్మనాభరావు

ప్రఖ్యాత హాస్యనటుడు



## ఎందరో మహానుభావులు..
## అందరికీ వందనములు!!

శ్రీ వేణుగోపాల్‌గారు ''నాట్యశాస్త్ర దర్పణము'' అనే గ్రంథాన్ని నాట్యం నేర్చుకునే అబ్బాయిలకు, అమ్మాయిలకు సులభ శైలిలో, అర్థమయ్యేట్లుగా రచించారు. వారి తల్లిదండ్రులు శ్రీ నాగయ్యగారు, శ్రీమతి సుబ్బమ్మగార్ల శుభాశీస్సులతో శ్రీ వేణుగోపాల్ తన చిన్నతనం నుంచే, నాట్యశాస్త్రాన్ని రంగరించి, వడపోశారు. ప్రజానాట్యమండలిలో వారు నటుడుగా, నాట్యదర్శకుడుగా బాధ్యతను చేబట్టి, రిక్షావాలా, శాంతివయూకాభినయం, అర్ధనారీశ్వర, శివతాండవము అద్భుత కళాఖండాలుగా, ఇంకా? ఎంకినాయుడుబావ, ధర్మచక్రం నాటకాలు ఆంధ్రదేశం అంతా ప్రదర్శించి అనేక బహుమతులు, పేరుప్రతిష్ఠలు పొందారు

సినిమా ప్రపంచంలో 1952లో అడుగుపెట్టి షుమారు 150 చిత్రాలు, తెలుగు, కన్నడము, అరవము, హిందీచిత్రాలకు నాట్యదర్శకుడిగా పనిచేశారు. అందులో ఆణిముత్యాలు శ్రీ డాక్టరు రాజారావుగారి దర్శకత్వంలో పుట్టిల్లు, శ్రీ కె.బి. తిలక్‌గారి దర్శకత్వంలో ''ముద్దుబిడ్డ'', ''అత్తా ఒకింటి కోడలే'', ''ఎమ్.ఎల్.ఎ'' శ్రీ బి ఎన్. రెడ్డిగారి ''రంగులరాట్నం'', శ్రీ రంగనాథదాసుగారి దర్శకత్వంలో ''సంతానం'', సంకల్పం, శ్రీ రేఖా అండ్ మురళి ఆర్ట్సు దేవత, పొట్టి ప్లీడరు, శ్రీ శ్రీ శ్రీ మర్యాద రామన్న, శ్రీరామకథ, కథానాయిక మొల్ల, మరియు కన్నడ కంఠీరవ శ్రీ రాజ్‌కుమార్‌గారి 'కవిరత్న కాళిదాసు', 'భక్తప్రహ్లాద' వగైరా చిత్రాలకు, హిందీ, 'బచ్‌పన్' చిత్రం ప్రత్యగాత్మ దర్శకత్వంలో అద్భుత నాట్యకళాసృష్టిని అలరింపజేశారు.

ప్రత్యేకతను సంతరించుకున్న చిత్రములలోని బాలేలు, 'అసాధ్యుడు'

చిత్రంలోని 'అల్లూరి సీతారామరాజు', 'దేశమంటే మనుషులోయ్' చిత్రంలోని 'కార్మిక విజయం', 'నా తమ్ముడు' చిత్రంలోని 'నెహ్రూ గులాబి' (బాలనటి శ్రీదేవి ద్విపాత్రాభినయం) ఇంకా ఎన్నో చిత్రాలలో వారు కనపరచిన నైపుణ్యం శ్లాఘనీయం వీరి శిష్యురాళ్ళు సావిత్రి, జమున, దేవిక, వాణిశ్రీ, విజయలలిత, మరెందరో నాటక, నాట్య కళాకారులకు శిక్షణనిచ్చి, వారి కళాభివృద్ధికి తోడ్పడిన గురుదేవులు. వీరి కంపోజిషన్‌లో డాన్సు బాణీ చూస్తున్నప్పుడు ఎక్కువ భావముతో పాటు- కమనీయమైన దృశ్యకావ్యాన్ని చూస్తున్నట్లుగా వుండడం తన ప్రత్యేకత.

ఇంత గొప్ప అనుభవాన్ని **'నాట్యశాస్త్ర దర్పణము'** అనే మహాగ్రంథంలో పొందుపరచారు. ఆంధ్రప్రదేశ్ నాట్యకళామతల్లికి అంకితమైన ఈ మహాకావ్యం భావితరాలకు ఒక ఆశాజ్యోతి. అందరూ చదివి, చదివించి, యిందులోని నాట్యకళాసృష్టిని ఆస్వాదించాలని కోరుతున్నాను వారి ధ్యేయానికి ఏ ఆటంకం లేకుండా శ్రీ విఘ్నేశ్వరుని దయ కలిగి, శ్రీ నటరాజ, శివగామ సుందరీదేవులు ఆశీర్వదించాలని వేడుకుంటున్నాను.

శ్రీ శ్రీ శ్రీ వేంకటేశ్వరులవారు, వారికి వారి కుటుంబానికి ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని వినయపూర్వకంగా అర్థిస్తున్నాను.

కళ గొప్పది

మీ

*బి.వి. పద్మనాభరావు*

14/2/2001

శ్రీరామజయం

శ్రీ కృష్ణ విజయం


శ్రీ రేఖా & మురళీ ఆర్ట్సు

నం. 19, నాగార్జున నగర్

మొదటి వీధి

చెన్నై 600 024

# జనం ప్రయోజనం



కాకరాల

''శ్రీ హర్షోనిపుణః కవిః పరిషదప్యేషా గుణగ్రాహిణీ

లోకే హారిచ వత్స రాజ చరితమ్, నాట్యే దక్షా వయమ్''

[ఇవి శ్రీహర్షుని నాటక ప్రస్తావనలలోని సూత్రధార వాక్యాలు. నైపుణ్యమున్న కవి, గుణాన్ని గ్రహించగల పరిషత్తు, సహృదయాన్ని ఆకర్షించగల ఇతివృత్తం, దక్షులైన నటులు - వీటిలో ఏది లోపించినా నాట్యము సమగ్ర సత్ఫలితాన్ని సాధించలేదు]

❖ ❖ ❖

నాట్య ప్రయోగానికి సంబంధించి సంప్రదాయ సూత్రవాక్యాలివి. ప్రయోగానికి సంబంధించి యివి చాలావరకూ ప్రామాణిక వాక్యాలే ఏ ప్రయోగానికైనా ప్రయోక్త ప్రాణం. ఈ ప్రయోక్త నటుల్నించీ రావచ్చు, కవుల్నించీ రావచ్చు. నటుల దక్షత రాణించడానికైనా ఇతివృత్తం (జన) హృదయాన్ని ఆకర్షించడానికైనా కీలకమైన 'కమేండ్' ప్రయోక్త ప్రతిభాప్రావీణ్యాల మీదా, అంతకుమించి, అతనికున్న ముందుచూపు మీదా ఆధారపడి వుంటుంది

నేనిలా రాస్తున్నది వేణుగోపాల్ మాష్టారి కృషిని ప్రశంసించి పరిచయం చెయ్యడానికి కాదు నాకు అనుభవమూ లేదు, అర్హత అంతకన్నా లేదు. నలభై సంవత్సరాలు అతి సన్నిహితంగా వున్న నేను వారి అంతరంగం అట్టడుగున వుండి లోకానికి పూర్తిగా పరిచయం కాని ఒకానొక నవీన ప్రయోక్తని స్థూలంగా మీ ముందుంచే ప్రయత్నం మాత్రమే చేస్తున్నాను.

మన సంగీత నాట్యాల మీద నాకు చాలాకాలంగా ఓ ఫిర్యాదు వుంది. ఇవి మిగతా సాహిత్య కళాప్రక్రియలైనంతగానైనా 'ఆధునికం' కాలేదు. ఆధునికం అన్నదానికి గీటేమిటని ఎవరైనా అడగవచ్చును. ప్రబోధాత్మకంగా వచ్చిన ప్రక్రియ ఆధునిక కాలంలో వచ్చినా అది బోధిస్తున్న 'మంచి' పాలక వర్గాల ప్రయోజనాలకి లోబడే

వుంటుంది. అదే ఆలోచనాత్మకంగా వచ్చిన ప్రక్రియ శీలురైన జనస్థ ఆలోచింపజేసి వారి చైతన్యస్థాయిని పెంచేందుకు దోహదం ది ఇదిగో. ఈ లక్షణాన్ని మిగిలిన సాహిత్య కళా ప్రక్రియలు అందుకున్నంతగా, ఆధునిక నాటకం అందుకున్నంతైనా మన నాట్య, సంగీతాలు అందుకున్నాయా?..

ఈ ప్రశ్నకి సమాధానంగా కారుచీకట్లో కాంతిరేఖలాంటి స్వల్పాతి స్వల్పమైన కృషే కనిపిస్తుంది కంచుకాగడాతో ఈ శతాబ్దాన్నంతా వెతికి సమీక్షించుకుంటే నాట్యానికి సంబంధించి అఖిలభారత స్థాయిలో సంస్థగా 'ఇప్టా' - ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ అసోసియేషన్- కనిపిస్తుంది వ్యక్తులే సంస్థగా సాగిన 'ఉదయశంకర్' అమలాశంకర్ కనిపిస్తారు. అలాగే సంగీతానికి సంబంధించి 'రవిశంకర్' లాంటివారు సకృత్తుగా కనిపిస్తున్నారు.

ఆంధ్రదేశంలో ఆంధ్రప్రజా నాట్యమండలి కృషి సంస్థాపరంగానూ, బి.వి. నరసింహారావుగారి కృషి వ్యక్తిపరంగానూ- నాట్యాభినయ రీతుల్ని సరళీకరించి, జానపద సంగీత జీవధారతో సమన్వయించిన ప్రయోగాలలో ఆశారేఖలా కనిపిస్తుంది

వేణుగోపాల్ శాస్త్రీయ నాట్యశిక్షణ ఏ గురువు దగ్గర జరిగినా, వారిని బలంగా ప్రభావితం చేసింది మాత్రం, సన్నని కాంతిరేఖ లాంటి ఈ నవీన సంప్రదాయమే. మరీ ముఖ్యంగా 'ఇప్టా' కృషిలో కనిపించే సమకాలీనత. ఉదయశంకర్ నాట్యప్రయోగాల్లో కనిపించే సూచనాత్మకత. వాటిని మాష్టారు అభ్యుదయ సినిమాల్లో చేయించిన బాలేల్లో చూడవచ్చును. ఉదయశంకర్ 'కల్పన' సినిమాని చూసినవారు వాటిని సులువుగా పోల్చుకోగలరు. అలాగే 'శాంతి' మూకాభినయం, 'మానవుడు చిరంజీవి' మూకాభినయం, 'రిక్షావాలా' నృత్యరూపకం- ఇవన్నీ ఆ స్ఫూర్తితో మాష్టారు చేసిన క్రియాశీలక కృషికి సాదృశ్య సాక్ష్యాలు.

నాకు తెలిసి ఈ మాత్రం కృషిని ఈ దేశంలో - కనీసం ఆంధ్రదేశంలో - చేసిన నాట్యప్రయోక్తలు- కొరియోగ్రాఫర్స్- చాలా తక్కువగా కనిపిస్తున్నారు. విజయనగరం సంపత్‌కుమార్ వున్నా, అతను నా దృష్టిలో మాష్టారి మార్గంలో మరింత సాంకేతికంగా ముందుకి నడిచే ప్రయత్నం మాత్రమే చేశాడు. ఇతరులు ఈ మాత్రం చేసినట్టూ కనపడదు. ఏ కారణంగానైనా ముందుకి నడిచి సమాజాన్ని ముందుకి నడిపించాల్సిన మార్గం ఆదిలోనే హంసపాదన్నట్టు ఆగిపోయింది.

ఇక నా రెండో ఫిర్యాదు- నాట్యశాస్త్రంలోని నాట్యోత్పత్తి కథల్లో 'అమృత మథనం' కథ అందరికీ తెలిసిందే ఆ ప్రయోగం అవగానే అసురులు తమని అవమానించారంటూ రంగస్థలాన్ని ధ్వంసం చేస్తారు. అప్పుడు బ్రహ్మ సన్నసన్నగా సన్నాయి నొక్కులు నొక్కి శాంతింపజేస్తే, ఇంద్రుడు ఆయుధాన్ని తీసుకుని మర్దిస్తాడు. ఆనాడు వర్గసమాజంలో వున్న వైరుధ్యం తెచ్చిన 'ఘర్షణ'ని నివారించేందుకు సమకాలీన యితివృత్తాన్ని నిషేధించింది నాట్యశాస్త్రం. అప్పట్నించి మానవ సుఖదుఃఖాలన్నీ- గతకాలపు పురాణ యితివృత్తాల్లోనే వ్యక్తం చేయడం సంప్రదాయంగా వస్తోంది.

ఆధునిక కాలంలో ఆ పరిస్థితి పోతుందా అంటే పోలేదు. ఇప్పటికీ ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసే ఏ ప్రయత్నం దృశ్యకళాప్రక్రియల ద్వారా జరిగినా శాంతిభద్రతల పేర ఆంక్షలు- నిషేధాలు విధించబడుతూనే వున్నాయి. అయినా ఆధునిక కాలంలో సమకాలీన యితివృత్తాన్ని తీసుకుని ''జనం ప్రయోజనం'' కోసం ప్రయోగించడం జరిగింది. జరుగుతూనే వుంది. ఇందుకు మచ్చులుగా ఆలిండియా నుంచి IPTA నుంచి- నీల్‌దర్పణ్, నవాన్నా లాంటి నాటకాలు, పోష్టురన్నర్ లాంటి నృత్యరూపకాలు కనిపిస్తాయి. అలాగే ఆంధ్రదేశం నుంచి- ఆంధ్ర ప్రజానాట్యమండలి నుంచి- ముందడుగు, మాభూమి నాటకాలు, హిట్లర్ భాగవతం; క్రిప్ట్ రాయబారం, ప్రెస్‌వర్కర్ లాంటి నృత్యరూపకాలు కనిపిస్తాయి. కొనసాగింపుగా J.N.M. రగల్‌జండా, భూమి భాగవతం లాంటి జీవధారా కనిపిస్తుంది. అంటే గంగాయమునల్లా అందరికీ కనిపించేలా కాకపోయినా, అంతర్వాహిని సరస్వతిలానైనా ఆ నవీన సంప్రదాయం కొనసాగుతూ వుంది. ఇదిగో.. ఈ శతాబ్దపు నవీన సంప్రదాయానికి ప్రాతినిధ్యం వహించిన నవీన ప్రయోక్తల్లో- కొరియోగ్రాఫర్స్‌లో తొలి తరానికి చెందినవారు వేణుగోపాల్ మాష్టారు.

ఆధునిక నాట్యకళకి తొలి షరతు ''జనప్రయోజనం'' లక్ష్యంగా సమకాలీన యితివృత్తాన్ని నాట్యరూపకంలో చిత్రించడం. అందుకు పాలకుల ''ఆంక్షలు, నిషేధాలు'' ఆవులించి ఆటంకంగా నిలిస్తే- పురాణ యితివృత్తాల్లో ఆధునిక జీవిత సమస్యల్ని యిమిడ్చి పరిష్కారాన్ని మాత్రం ''జనం ప్రయోజనం'' లక్ష్యంగా విశదీకరించి ఆలోచింపజేయడం మలి షరతు. ఈ రెండు పన్లూ చేసిన ఈ శతాబ్దపు

నవీన ప్రయోక్తల్లో - కొరియోగ్రాఫర్స్‌లో- మాష్టారు ముందు పీటన నిలుస్తారు.

మాష్టారు మార్కెట్‌కి కావల్సిన విధంగా- సినిమాల్లోగాని, రంగస్థలం మీదగాని, ఏవేవో ప్రయోగాలు ఎన్నైనా చేసి వుండవచ్చును కానీ.. తనలో దాగి వున్న నవీన ప్రయోక్తని తృప్తిపరచే ప్రయోగాలు చేయలేకపోయానన్న అసంతృప్తి ఆయన్లో గూడుకట్టుకుని వుంది. ఆ అసంతృప్తే ఆయన చేత **'సప్త తాళాత్మక ఈశ్వర విజయం'** - తాళప్రకరణం అనే గ్రంథాన్ని తేలిక పద్ధతిలో భావితరాల కందించేలా చేసింది. ఇప్పుడు ''నాట్యశాస్త్ర దర్పణము'' చతుర్విధాభినయ శాస్త్రాన్ని- అతి సులువైన రీతిలో అందిస్తున్నారు. దీని వెనుక ఆయన అంతరాంతాల్లో వున్నదేమిటంటే- ''జనం ప్రయోజనం'' లక్ష్యంగా ముందుచూపుతో తాము ముందుకి నడచి, సమాజాన్ని ముందుకి నడిపించే నవీన ప్రయోక్తలకిది 'కరదీపికలై' దారి చూపించాలనీ, చూపిస్తాయనీ బలంగా వున్న నమ్మకం.

అలాగే వీటిలో వున్న జ్ఞానసారాన్ని జీర్ణించుకున్న భావిప్రయోక్తలు- కొరియోగ్రాఫర్స్ - ఆ నవీన సంప్రదాయాన్ని విస్తరింపజేస్తూ, వికసింపజేస్తారని, వికసింపజేస్తూ విస్తరింపజేస్తారని బలీయమైన ఆశ.. వారి జీవితకాలపు అనుభవ అధ్యయనాల కృషి వెనుకున్నది ఆ ఆశానమ్మకాలే- అవే ఈ వయస్సులో కూడా వారిచేత ఈ పనిని చేయిస్తున్నాయి.

మరో మాటలో - మాష్టారు రాబోయే నవీన ప్రయోక్తలకు రంగాన్ని సిద్ధం చేస్తున్నారు. దీన్నందుకుని రాబోయే నవీన ప్రయోక్తలు మన రంగస్థలాన్ని మరింత సుసంపన్నం చేయాలనీ, చేస్తారనీ ఆశిద్దాం- చిరంజీవి మానవుడు ఎప్పుడూ ఆశాజీవే.. అతని నిఘా యెప్పుడూ భవిష్యత్తు మీదే-

ఈ పరంపరకి చెందిన నవీన ప్రయోక్తే వేణుగోపాల్ మాస్టార్లో ఉన్నాడు. కనగలవారికే కనిపిస్తాడు.

**- కాకరాల**

చెన్నై,

19-1-2001

సాహితీ వాచస్పతి
మొవ్వ వృషాద్రిపతి



# కళాభినందన

వినుతిన్నాట్యము సత్ర యజ్ఞము- కళావేదంబటంచున్- మహా
ముని పద్మోద్భవులామతించిరి- జగన్మోహాను మోదంబులన్
తనరన్ జేయు రసైకవిద్య యది తత్ప్రావీణ్య భాగ్యంబు నీ
కొనరెన్ పూర్ణముగా సరస్వతి కృపాభ్యుత్థాన సంపత్తిచే।

మేలిమి నాట్యశాస్త్రమున మిన్నును ముట్టిన ప్రజ్ఞ నీది- ఉ
ద్వేల భవత్పరిశ్రమము తెల్పగ నేనెటులోర్తు? వేణుగో
పాల! కళాసభస్థలి నపారమనోజ్ఞ సుధామయూఖరే
ఖాళి వెలుంగ జేయు కుముదాప్తుడ వీవు కళాతపోనిధీ।

తాండవాడంబర త్వత్కౌశలము గాంచి
హరుడు పార్వతి దేహమరువు గొనియె,
నీవు రిక్షావాల గావెలయగ కళా
సతికి తద్రోహణాసక్తి యడరె,
అర్ధనారీ   నాట్యంబీవు సలుపంగ
ప్రకృతి పుంస్త్రీ రూప భావమొందె
పసిపిల్లలకు నాట్యభంగిమ లీవు నే
ర్పగ నెమ్మి పురివిప్పి పరుగులిడియె,

్యాలయాన ననంత సంఖ్య
తతి దిద్దితీర్చితివి ప్రజ్ఞ
అరయ 'పుంభావ నాట్య విద్యా సరస్వ
తి యితʼʼ డనగ ప్రఖ్యాతి పొందితి తపస్వి!

సినిమాలోకము నీదు ప్రజ్ఞకును జేజేలంచు దీవ్యత్కళా
సన నీరాజనమెత్తె, నిప్పుడు యశోవర్ధిష్ణుతన్నిత్యశో
భనతన్ రాజిలు తారలెందరో తొలిన్ ప్రారంభపారంబులో
య్యన నీయొద్దనె యభ్యసించిరట నాట్యంబందు ధీమన్మణీ! 4

ఎక్కడి పూడివాడపుర? మెక్కడ చెన్నపురంబు? చిత్రసీ
మెక్కడ? నాట్యశిక్షణ మదెక్కడ? ఏ విధ నీకు నబ్బె? నీ
వక్కట! యింత వాడవగుదంచు తలంచిరె? సత్కళాసతి
చక్కగ కొల్చితీవు గత జన్మమునన్ శ్రుతి నాట్యముద్రలన్. 5

పేర్చిన నాట్యవిద్యను భవిష్య జనంబుల కందుబాటులో
కూర్చగ గ్రంథ రూపమునకున్ గొని వచ్చితి నీ పరిశ్రమన్
గూర్చి తలంచి యాంధ్ర జనకోటి త్వదీయ ఋణంబు తీర్పగా
నేర్చునా? నేర్వదో? భవిత నిర్ణయముం బొనరించు దేశికా! 6

స్థూలచిరత్న రత్నములు తోయధి గర్భము నందడంగ ఉ
ద్వేలత గాజురాలు గణుతింగను- అల్ప మణి ప్రరోహముల్
చాల ప్రకాశమందుకొను సత్యము నిర్భర పాండితీ ప్రభా
శీలుర కంటె స్వల్పగుణచిత్తులు ఖ్యాతి వహింతురేలకో? 7

జగతి మెప్పును గోరి జలదంబు కురియునే?
నైజ స్వభావ సంధతను గాక!
ప్రజల ప్రశంసల వాంఛించి విరులు వా
సనలు నింపునే? సహజమ్ము గాక!
అడుగనిచ్చునె ప్రజ? కమృతోపమఫలాళి
తరువులు నిజధర్మపరత గాక!
జనుల సన్నుతి గోరి చల్లని వెన్నెలల్
విధుడొసంగునె? తన విధియె కాక!

అట్లై కవులు పండితులును నధికమైన
జ్ఞాన ధనమును జాతికి కాన్క-యిత్తు
రంచితంబగు గ్రంథదివ్యాకృతులను
వాని నిలుపుట కాల ప్రభావగరిమ. ౮

లాలిత నాట్యవేద సువిలాసము జాతికి కాన్క- యిచ్చి యు
ద్వేల భవన్మహా ప్రతిభవిశ్వము నిండగ చాటినాడ వే
క్కాలము నీ చరిత్రకును కానము వృద్ధతసుంత వేణుగో
పాల కళాతపస్వి! యిల పంచుము తావక నాట్యదీధితుల్. 9

కలుములు భోగభాగ్యము లఖండ చిరాయువు దిగ్విశాల ని
ర్మల తరకీర్తి వైభవ ధురంబగు సత్కృతులిచ్చి భారతీ
జలజ విశాల నేత్రయ నిశంబును నీవెను వెంట నిల్చి ని
శ్చల కరుణాకటాక్షముల సాకును నిన్ను త్రిలోక వంద్యుగన్. 10

– శుభమ్ –

ఇట్లు

**సాహితీ వాచస్పతి**

**మొవ్వ వృషాద్రిపతి**

రేపల్లె

8/1/2001

KONTHMURU - 533 103

Dt. 15-2-1998


**MAJOR CH. RAJESWARA RAO**

*M A , M com., LL B.,*

**RETD. PRINCIPAL, A.P. EDUCATIONAL SERVICE**

**ADVOCATE**


NATYA SASTRA DARPANAM by SRI D VENUGOPAL, a Renowned Dance Director of BHARATA NATYAM ART for over four decades in Chennai, is a treatise, in fact, and it will, no doubt, serve as a touch for the present and future generations as well.

MAJOR **CH. RAJESWARA RAO**

# Venugopal and his Ballet Centre



***VINJAMURI PRABHAKAR***

**H**ailing from Pudıvada, an unsophistıcated vıllage ın Guntur Dıstrıct of Andhra Pradesh, Venugopal was more attached to Fine Arts than to studies, whıch he dıscontinued after the Intermediate. Ever sınce, he strıved to correlate the three Muses-dance, music and lıterature and concentrated on Bharata Natya and folkdances. Hıs synthetic efforts drew ınspıration from the pioneering efforts of Udayashankar, Ramgopal, Rukmını Devi and hıs dance guru, B.V Narasımha Rao. He had hıs traınıng in Classıcal Dances under late Guru Jeevammal of Vellore, the tradıtional exponent of Bharathanatyam who enjoyed the Royal patronage at Mysore, Srı Venugopal's aesthetic career gradually took shape at Vıjayawada ın 1945 while he was studyıng ın the college. He was the founder member of "Arunodaya Sangeeta Natya Mandali" whıch was the famous instıtution for the arts of Dance, Musıc and Drama ın Andhra Pradesh,Conducted by Kalapraveena, Sri Sunkara Kanaka Rao, a Freedom fighter and Socıal Worker Thıs ""Kala Tapas" - penance of Art - resulted ın the establishment of the Indıan Ballet centre at Madras.

Venugopal aıms at glorıfyıng the songs of our greate, poets by presentıng them ın dance form revıtalisıng our vırıle natıve folk dances and more than everythıng else, portraying the ever strugglıng man and hıs problems through the Ballet form. He aıms to reach the Cherıshed through hıs Ballet Centre by Systematıcally traınıng boys and gırls of talent ın the Ballet technıque by gıvıng perıodıcal publıc performances and by establıshıng cultural contacts wıth natıonal and ınternatıonal ınstıtutıons whose aıms and objectıves are similar

In his effort to Project the inherent interlinks between dance and music. literature and drama, Venugopal produced experimental Ballets and plays as well His play "Santhi' first staged in Madras, on 16th April, 1951 and then all over Andhra, is an out and out pantomime with appropriate stage, lighting and music effects it was such a roaring success that in 1952 when it was staged before the visiting Soviet Film delegates, they were so pleased that they picturised it forth with in colour, in vahini studios, Madras,. That picture became a hit and ran to packed houses in Russia, China and other countries and won international Award when it was screened in the world peace conference in Paris in 1953. And it was this contact with Russia that enabled Venugopal to treat Krushchev and Bulganin to a dynamic variety Ballet programme when they visited Madras in 1955 and it was this memorable incident that inspired Venugopal to found the Indian Ballet Centre at Madras, the very same year

1955 onwards, Venugopal's activities became identical with those of the Ballet Centre Ever searching and striving for something new and novel, he and the Ballet centre produced items with a purpose and a message, His ""Eagle and Dove", ""Rickshawala" Art and Life, ""Man is immortal", etc had chalked out a resaissance path in dance style Besides these idealistic creations, Venugopal, as a exponent of Bharata Natya, presented traditional items like "Sandhya Thandava and Ardha Nareeswara" also, but in a different colour with a modern interpretation His ""Rickshawala" an unique and sensational item, kept in the hearts of the people, packed with lakhs of audience when ever it is presented

The plays by the Ballet Centre are equally noteworthy ""Dharma Chakra" with its message of peace and tolerance, "Bhagya Nagar' the historical tale of romance and Kanyakaparameswari the devotional drama, are some of the plays which were much applauded

But perhaps the best of Venugopal's plays, "Yenki Nayudu Bawa depicting the idealistic love of the rural couple, is a peculiar synthesis of drama and ballet Wherever staged, it had won laurels The activities of Venugopal did not confine to the theatre alone With

a burning desire to introduce his ballet into the films, he made Cine dance direction his profession and won a distinguished place in the field He had directed dances for more than 150 pictures in Telugu, Canarese and Tamil and many of them were hits He could introduce his ballet technique in films like, "Asadhyudu" where in his ballet item "Alluri Seetharama Raju" drew large audiences Similarly, "Karmika Vijayam", in "Deesamate Manushuloy" and "Nehru Gulabi" in "naa Tammudu", are popular innovations.

Due to this multi-pronged aesthetic drive of Venugopal and the Ballet Centre some of his pupils became professional dancers on stage and screen, some stage artistes and a few Cine dance Directors But, they are all the torch-bearers of the Indian Ballet Centre.

The Man of Sri Venugopal is the universal man which he visualises, the ideal Man of the future which he hopes to evolve The latest Classical Compositions for NAVARASAS absorbed from puranas as well as Social Themes to express real sense of Rasa

The latest poetry and compositions of Sri Venugopal rendered in "Astavidha Nayikas are Viewed as the woman's life itself is the Combination of Astavidha Nayikas with the Man

The book ""Saptha Talathmaka Eswara Vijayam" and Tala Prakanranam is an unique and Versatile Composition of Sri D Venuogopal, rendered for the students of Dance and Music to imporove their knowledge in particular of Laya and Tala

Present publication titled as ""NATYASASTRADARPANAM" is dealing with the Technicalities of the ""NATYASASTRA" which will surely guide the teachers in this knowledge of Dance and as well as the student to enrich their versatlity regarding Dance Art

*- VINJAMURI PRABHAKAR*

### "PADMABHUSHAN'
### "KALAA VACHASPATHI'
# K. JAGGAIAH B.A. D.Lit.,

*Movie Artiste &*
*former member of parliament*



భారతీయ నాట్యశాస్త్రం అతి ప్రాచీనమైనది. భరతుని నాట్యశాస్త్రం షట్సాహస్రి - అంటే ఆరువేల శ్లోకాలు కలది. కాని దానికంటే ముందు పన్నెండువేల శ్లోకాల నాట్యశాస్త్రమొక్కటీ, ఇంకా అంతకుముందు ముప్పయ్యారు వేల శ్లోకాల గ్రంథమొకటీ ఉండేవని పరిశోధకులు చెబుతున్నారు. అవి ఈనాడు లబ్ధం కావు. భరతునికి ముందే ప్రసిద్ధులైన నాట్యశాస్త్రకారులూ, ప్రయోక్తలూ ఇంకా కొందరుండేవారని కూడా పరిశోధకులు తేల్చారు.

ఏమయినా, నాట్యశాస్త్రానికి సంబంధించిన అనేకాంశాలను క్రోడీకరించి, మహత్తరమైన లక్షణ గ్రంథం రూపొందించిన ఘనత భరతమునిదే. అది 'నాట్యవేదం' గా ప్రసిద్ధమైంది. భరతుని జీవితకాలం క్రీస్తుకు పూర్వం మూడవ శతాబ్దియా, క్రీస్తుశకం మూడవ శతాబ్దియా ఇంకా తేలలేదు.

ఆనాడు 'నాట్యమ్' అనే పదానికి అర్థం ప్రయోగాత్మకమైన రూపకం ; దానికి సాధనమైన అభినయం.

*''యోఽయం స్వభావో లోకస్య సుఖ దుఃఖ సమన్వితః*
*సోఽగా ద్యభినయోపేతో నాట్యమిత్యభి ధీయతే''*

అని భరతముని నిర్వచనం. నాట్యం కంటె నృత్యం ప్రాథమికమైనది. అది ఆంగిక ప్రధానం. భరతముని నృత్తాన్ని, నాట్యాన్నీ మేళవించి 'నృత్తా'న్ని రూపొందించాడు. తన నాట్యశాస్త్రంలో రసం, భావం, అభినయం, సంగీతం అలంకార శాస్త్రం మొదలైన పదకొండు విషయాలపై విస్తృతమైన విశ్లేషణ చేశాడు. రస సిద్ధాంతాన్ని ప్రతిష్ఠించాడు. అందుకే అది ఈనాటికీ ప్రామాణికమైన అపూర్వలక్షణ గ్రంథంగా నిలిచిపోయింది. నటులకూ, నర్తకులకూ, నాట్య ప్రయోక్తలకూ తప్పనిసరిగా అధ్యయనీయమైంది.

అయితే, ఆరువేల శ్లోకాలతో, ముప్పయ్యారు అధ్యాయాలతో సంస్కృతంలో ఉన్న భరతుని నాట్యశాస్త్రాన్ని ప్రతిఒక్కరూ అధ్యయనం చేయటం సాధ్యం కాదు కొందరు మహా పండితులు దీనికి ప్రశంసనీయమైన తెనుగు అనువాదాలు అందించినా, అవీ ఉద్గ్రంధాలే- అందరికీ అందిరావు కనుక ఈ శాస్త్రాన్ని తెలుగులో సంగ్రహంగా, సుబోధకంగా, ఒక పాఠ్యగ్రంధం రీతిలో ప్రతిపాదించవలసిన అవసరం ఏర్పడింది. ఆ అవసరాన్నిప్పుడు ఆచార్య డి వేణుగోపాల్‌గారు సమర్థవంతంగా తీర్చారు.

ఇందుకు శ్రీ వేణుగోపాల్ గారు అన్నివిధాలా అర్హులు. వారు నాట్యశాస్త్రాన్ని క్షుణ్ణంగా ఆకళించుకొన్నవారు. ఈ రంగంలో యాభై ఏండ్లకు పైగా కృషిచేసినవారు. వివిధమైన నృత్యరూపకాలను దేశమంతటా ప్రదర్శించి, ప్రశంసలనందుకొని, అనుభవం గడించినవారు ఎందరో యువతీయువకులకు చక్కని శిక్షణ యిచ్చి, ఉత్తమ కళాకారులుగా తీర్చి దిద్దినవారు. ఒకవైపు ప్రాచీనతను గౌరవిస్తూ, సంప్రదాయాన్ని విడవకుండా, మరోవైపు సామాజిక ప్రయోజనం కలిగిన నూతన రూపాలను సృష్టించడానికి విశేషమైన కృషిచేసినవారు. అలాంటివారి కర్తృత్వంలో ఈ గ్రంథం వెలువడడం హర్షణీయం.

శ్రీ వేణుగోపాల్‌గారు నాకు యాభై ఏండ్లుగా మిత్రులు. 1950కి ముందు విజయవాడ 'అరుణోదయ' సంస్థలో సహచరులు. సినిమారంగంలో సన్నిహితులు మద్రాసులో స్థిరపడి ''ది ఇండియన్ బా ంటర్' వంటి సంస్థలను స్థాపించి, వారు సాగించిన తపస్సు కూడా నేనెరుగుదును. కనుకనే ''నాట్యశాస్త్ర దర్పణము'' అనే ఈ లక్షణ గ్రంధాన్ని వ్రాసి, శ్రీ వేణుగోపాల్‌గారు తమ విజ్ఞానాన్ని, అనుభవాన్ని అందరికీ పంచిపెట్టడంతో పాటు, కళాజిజ్ఞాసువులకు మహోపకారం చేశారని నేను వక్కాణించగలుగుతున్నాను.


మిత్రులు వేణుగోపాల్‌గారికి నా అభినందనాలు. వారు చేసిన ఈ విశిష్ట కృషి అసంఖ్యాకులైన పఠితల హృదయాల్లోకి చొచ్చుకుపోతుందని మనసారా నమ్ముతున్నాను.

'న తత్ జ్ఞానమ్ నతచ్ఛిల్పమ్ నసావిద్యానసాకలా<br>
నాసౌ యోగో న తత్కర్మనాట్యేస్మిన్ యన్నదృశ్యతే''

చెన్నపురి — కొంగర జగ్గయ్య

1-6-2001

# FOREWORD



DHARMA shall be the cardinal principle of the world's well being. It is the incalculable force of Dharma that holds the universe together against the centripetal disturbances of the irate and the illiterate outrages. Hence it is necessary to educate everyone. Education does not mean learning ABC and its different connotations. Bookish erudition or expertise is only a preliminary part of education and provides a platform to acquire knowledge. Education is a multifaceted concept and its goal is to provide knowledge required for making a perfect execution possible.

A comprehensive knowledge of Indian culture cannot be achieved by merely reading the books pertaining to its different aspects. Particularly, the information with regard to the performing arts shall not be reduced to piece of literature. It shall induce the reader to practice it if possible or at least drive him out of home in quest of its real shape and live showing.

***'Natyam'*** - better understood as "dance" nowadays - is a performing art. The theatre of a country serves as a mirror of its culture, as it generally reflects the trends of living or its ambitions or aberrations. Natyam, as the Indians believe, is the gift of God to the human beings and

is meant to propagate Dharma effectively. Hence, there is a chapter in Natyasastra touching upon Dharma - the Loka Dharmi and Natyadharmi - having been dealt therein. Any step towards the propagation of this art is adding to the force of Dharma.

This book - authored by GURU Sri D. Venugopal - is not a translation of any other book in Natyam from any other language. Being a practitioner, preacher and producer of modern dance forms for the last sixty years, he has understood the essence of the art and science of dance as it unfolded to him in its pristine purity. In other words, he had the Darshan of the Art of Dance. At the age of 75, he believes that he shall leave behind him the fruits of his toll and toil to the world of future generations to benefit from. He has, therefore, codified the line of approach to this great Art, glorifying the time - honoured principles at the right places.

The book creates interest in the minds of the young readers to have a basic stint at the art and for others to understand the naunces of a dance performance. For example, in explaining the different "Hasta Mudras", the book gives details of what Hastas are to be deployed to different Gods, Navagrahas, Navarasas and so on and so forth. Hence, a reading of this book gives the basic knowledge to really involve, enjoy and analyse the quality of a Sampradaya Nrityam". Similarly, the book gives both the novice and the connoisseur of the art of natyam, a sence of satisfaction that something is added to his zeal and know-how of the Art.

This book has got an Appendix as well, dealing with "Ashta Vidha Nayikas" (the eight different manifestations

of "Sringara' in women) - "Navarasamanjari' (Practical depiction of the "Navarasa's in a dance performance) - "Rickchaw Wala' (a special mime show of the Author which shot him to fame during freedom struggle) and "Ardha Nariswara' - in which the author was in a class apart during his young days.

Classics, particularly pertaining to the science of fine arts, are unfortunately not within the conceptul reach of the present generation. These, being the treasure of the ancestral exploits, shall not be left to their fate of doom. There is a strong need to bring them back to the hands of the young torch-bearers of the future India in a well-structured manner - in content and curriculum - to extend their meaningful life for years to come. This book has got such an approach that it brings to hands the essence of Natyasastram in an easy, elegant prose with a flowery approach. The value of the book lies there.

**G. SRINIVASA RAO**

B Sc , (AMIE), M A ; M COM,

DIM , P G Dip in PM

Divisional Engineer,

***Chennai Telephones***

* + *

**Dr. P.V.B. Mahadev,**
M Com M H M

Founder Secretary,
**Indian Ballet Centre,**
"Sri Gurukripa"
30/21, Papathiammal Street,
Kodambakkam,
Chennai 600 024.
Ph: 472 7824.



# కళాభివందనం

ప్రణమ్య శిరసా దేవౌ పితామహ మహేశ్వరౌ
నాట్యశాస్త్రం ప్రవక్ష్యామి బ్రహ్మణా యదుహాహృతమ్.

*భ.నా.శా. - అధ్యాయం 1. శ్లో.1*

శ్రీ భరతమునీంద్రుడు నాట్యశాస్త్రారంభమునందు పితామహునికి మహేశ్వరునికి ప్రణమిల్లి, బ్రహ్మదేవుని వలన తనకు ఉపదేశింపబడిన నాట్యశాస్త్రంబును వివరింపదొడంగిరి.

ఈ శాస్త్రము యొక్క ఆకాంక్ష లేక ప్రయోజనాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ, ఇందు ధర్మము, అర్థము, యసస్సు సదుపదేశములను సంగ్రహము గల్గినదై ఈ లోకంలో అన్ని కార్యములకు మార్గదర్శకముగా వెలయుచున్నది.

ధర్మ మర్థ్యం యశస్యం చ సోపదేశ్యం ససంగ్రహమ్
భవిష్యతశ్చ లోకస్య సర్వ కర్మానుదర్శనకమ్.

*భ.నా.శా. 1. శ్లో.14*

ఈ శాస్త్రము సమగ్రంగా సర్వశాస్త్రార్థములకు ఆలవాలమై, అన్ని కళల శిల్పములతో శోభిల్లునదై, ఇతిహాసములను విశదీకరించునదియునై నాట్య శాస్త్రము అను పేరు గల్గి పంచమ వేదము అని సార్థకమైనది.

సర్వశాస్త్రార్థ సంపన్నం సర్వ శిల్ప ప్రదర్శకమ్
నాట్యాఖ్యం పంచమం వేదం సేతిహాసం కరోమ్యహం.

*భ.నా.శా. అ 1, శ్లో 15*

ఈ నాట్యశాస్త్రమును విధియందు జ్ఞానము, శిల్పము, విద్య, కళా, యోగము, కుశల కార్యాచరణ ప్రక్రియలన్నీ సమగ్రంగానూ పుష్టిగానూ లభించగలవు. అనగా ఇందు కనిపించని విషయము లేనేలేదు.

ననత్ జ్ఞానం నతచ్ఛిల్పం న సావిద్యా న సాకలా
నసా యోగో న తత్కర్మ నాట్యేస్మి యన్నదృశ్యతే.

*భ నా.శా. అ 1, శ్లో 113*

సహజంగా శుఖదుఃఖములతో మిశ్రమమై యున్న లోక స్వభావాలను, శరీరమునందలి అంగముల చేష్టల ద్వారా ప్రదర్శించు ప్రక్రియను నాట్యము అని అంటారు.

యోఽ స్వభావో లోకస్య సుఖదుఃఖ సమన్వితః
సోఽయం గాద్యభినయోపేతో నాట్యమిత్యభి ధీయతే.

భ.నా.శా- అ 1, శ్లో 119

ఈ ప్రదర్శన ప్రక్రియ నాట్యము - నృత్తము- నృత్యము అని మూడు విధములుగా వర్ణింపబడినది. అందు నాట్యము అనుదానినిని నాటకము వ్యవహరించుట పరిపాట. ఇందు పూర్వ కథా ఇతివృత్తము ప్రస్తుతింపబడును.

నాట్యం నృత్తం నృత్యమితి మునిభిః పరికీర్తితం.
నాట్యం తన్నాటకం చైవ యోజ్యం పూర్వ కథాయుతం.

రసముగాని దానికి వ్యంజకములైన భావము గాని లేనిదానిని నృత్తమందురు. రసము, భావములు వాటి వ్యంజకాలతో కూడియుండుదానిని నృత్యము అందురు.

రసభావ విహీనంతు నృత్త మిత్యభి ధీయతే
రసభావ వ్యంజకాది యుతం నృత్యమితీర్యతే

ఈ పై నాట్య, నృత్త, నృత్యములు మూడునూ లాస్యము, తాండవము అని రెండు విధములుగా లోకంలో ప్రసిద్ధములైనవి సుకుమారముతో గూడినది లాస్యమగానూ, ఉద్ధతమైనది తాండవముగాను వ్యవహరింపబడుచున్నది.

ఈ విస్తారమైన నాట్యశాస్త్రాన్ని తెల్సుకోగోరిన మునులకు భరతముని పుంగవుడు క్లుప్తంగా ఏకాదశ నాట్య సంగ్రహమును సూత్రప్రాయంగా ముందుగా ఆరవ అధ్యాయము నందు వివరించారు. ఈ పదకొండు అంశముల విస్తారరూపమే 36 అధ్యాయములు గల సమగ్ర ''భరతనాట్య శాస్త్రము'' గ్రంధముగా సంతరించుకొన్నది.

రసా భావా హ్యభినయాః ధర్మీ వృత్తి ప్రవృత్తయః
సిద్ధి స్వరాస్తథా తోద్యం గానం రంగం శ్చ సంగ్రహః.

*భ.నా.శా. అ-6 శ్లో. 10*

## ఏకాదశ నాట్య సంగ్రహము

1. రసము 2. భావము 3. అభినయము 4. ధర్మి
5 వృత్తి 6. ప్రవృత్తి 7. సిద్ధి 8. స్వరాః
9 అతోద్యము 10. గానము 11. రంగము.

ఈ ఏకాదశ నాట్యాంశములు నాట్యప్రదర్శన యందు మిక్కిలి ప్రాముఖ్యమైనవి కవి గాని, నటుడు గాని ప్రేక్షకులలో రస నిష్పత్తిని కలుగజేయుటయే తన ప్రదర్శన యొక్క ప్రయోజనముగా ఎంచును. అందుచే..

1. రసము ప్రధానము. ఈరస నిష్పత్తికి ముఖ్యకారణభూతమైనది.
2. భావము. అందుచే రసభావములు పరస్పర సంబంధము గల్గియున్నవి. ప్రేక్షకుల రసానుభూతికి ముఖ్య సాధనము.
3. అభినయము. అభినయము ద్వారానే కావ్యము యొక్క అర్థము ప్రదర్శింపబడును
4. ధర్మి అనగా స్వభావము లేక పరంపరాగతమైన కార్యము లేక వ్యవహారము.

ఈ ప్రదర్శన యొక్క ప్రయోగ సందర్భంలో వృత్తికి ప్రాముఖ్యత వుంది.

5. వృత్తి అనగా- నాట్య స్థితులకు అనుకూలంగా అభివ్యక్తీకరించి చేసే సమర్థవంతమైన ప్రదర్శనా ప్రక్రియలు.

మనుష్యుల యొక్క బాహ్య ప్రవృత్తులు- అనగా - దేశము, వేషము, భాష మొదలగు విధానములు

6. ప్రవృత్తి అనబడును. నాట్య ప్రదర్శన యొక్క సఫలత- విఫలతల యొక్క అంచనాలే

7 సిద్ధి అంటారు. ఇక స్వరము, అతోద్యము, గానము, ఈమూడి పరస్పర సంబంధము గలదు. ఇవి ప్రదర్శనను జనరంజకముగా చేసి రక్తి కట్టించే ఉపకరణాలు.

8 స్వరము - షడ్జము, నిషాదము, ఋషభము, గాంధారము, మధ్యమము, దైవతము.

9 అతోద్యము - వాద్య విశేషణములు. అవి - తతము, అనగా తంత్రీ వాద్యములు అవనద్ధము - అనగా చర్మవాద్యములు. ఘనము - అనగా తాళప్రమాణమును చూపుటకు ఉపయోగించు కంచు తాళములు. గంటలు, గజ్జలు మొదలైనవి సుషిరము - అనగా రంధ్రముల ద్వారా వూరించి మ్రోగించు మురళి మొదలగు వాద్య విశేషములు.

10. గీతము నాట్యమునకు అంగము మాత్రమే కాక నాట్యమునకు ప్రాణము గూడ. గీతమును శ్రమించి అభ్యసించవలెను ఎందుకనగా గీతము నాట్యకర్మకు ప్రధానమైన భిత్తి వంటిది గీతమునకు ఆధారభూతమైన పదముల సముదాయమును ధృవా అందురు గానము 5 రకములు

1. ప్రవేశ గానము- పాత్రలు రంగస్థలమును ప్రవేశించు సందరభమున ప్రయోగింపబడును.

2. అక్షేపగానము- రసాంతమును విశదీకరించు గానము.

3 నిష్క్రమణ గానము - నాట్యమందలి అంకము పరిసమాప్తి సమయమున పాత్ర నిష్క్రమణ మందు ప్రయోక్తమగు గానము.

4. ప్రాసాదిక గానము - విషాద సన్నివేశముల అనంతరం ప్రేక్షకుల చిత్తము ప్రసన్నపరుచు గానము. ఇది రస నిష్పత్తికి ఉపయుక్తము.

5. అంతరగానము- రంగస్థలమందు పాత్రల హావ, భావ ప్రదర్శనలకనుగుణముగా ప్రయోగించు గానము.

11. రంగము - రంగస్థలము, రంగమండపము, రంగశాల ఈ పదములు అన్నియు నాట్యగృహమునకు పర్యాయపదాలు. నాట్య ప్రయోగశాల మూడు రకాలు.

1 వికృష్టం అనగా దీర్ఘ చతురస్రాకారము.

2. చతురస్రము. నలచతురము.

3 త్ర్యస్రము, త్రిభుజాకారము, ప్రదర్శనకు మూలాధారము రంగస్థలము.

ఈ ఏకాదశ నాట్య అంగాములు నాట్య ప్రయోగము యొక్క సాధ్య సాధన పరిణామాలుగా గుర్తింపబడును. ఇందు రసము వీటితో పాటు కలిసి విడదీయబడక అవినాభావ సంబంధం కలది. భావము నాట్య ప్రయోగము యొక్క సాధ్యము లేక లక్ష్య రూపము.

ఇక అభినయము, ధర్మి, వృత్తి, ప్రవృత్తి ప్రయోగమునకు సాధనములు. నాట్య ప్రయోగము యొక్క సిద్ధియే పరిణామము.

కవి మరియు ప్రర్శకుడు ఈ సాధ్య సాధన పరిణామములను బాగుగా గ్రహించి తన ప్రదర్శనను పటిష్టం చేసుకుని విజయవంతం గావించవలెను. అందుచే ఈ ఏకాదశ నాట్యాంగాలు కుశలతతో ఉపయోగించుటలోనే నాట్యపురుషుని దేహము యొక్క పరిపూర్ణ రూపము ఏర్పడుననుట విద్వద్విదితమైన సత్యము.

ఇంత మహిమాన్వితమైన నాట్యశాస్త్ర గ్రంధాన్ని సునిశితంగా అధ్యయనము చేసి, చిన్నతనం నుండి, నాట్య సంస్కారాన్ని పొంది, పెద్దల, గురువుల ఆశీర్వాదబలంతో కళాతపస్వి ఆదరణీయులు. డి. వేణుగోపాల్ ఆ నాట్యశాస్త్రానికి దర్పణం పట్టారు ఈ గ్రంధ రచనతో స్వయంగా వారు

నాట్యాచార్యులు. ఆరితేరిన నాట్యశిక్షకులు అగుటచే వారి అమూల్య అనుభవమును పొందుపరచి నిర్మించారు ఈ కళాకృతిని

నాట్యశాస్త్రాధ్యయనం చేసే విద్యార్థులకు ప్రయోజనపడేట్లుగా హస్తాభినయ అధ్యాయంలో అందంగా అసంయుత, సంయుత, నృత్త హస్తాలు చిత్రీకరించి సంప్రదాయబద్ధం కావించారు. రసోత్పత్తిని ప్రదర్శించడంలో శ్రీ వేణుగోపాల్ సిద్ధహస్తుడు. ఈ గ్రంథంలో వివరించిన నవరస అధ్యాయం వారి కళాసృజనాశక్తికి గీటురాయిలాంటిది.

వేణుగోపాల్ ప్రదర్శించిన అనేక నాట్యకళా ఖండాలు స్వయంగా వారు రచించిన గీతాలకే నాట్యరూప కళాకృతులు. వారు రచించిన గీతాలు ఈ గ్రంథంలో పొందుపరిచారు. రిక్షావాలా పాట శ్రీ అనిశెట్టి సుబ్బారావుగారు 1964లో రచించారు. అప్పట్లో దానిని శ్రీ వేణుగోపాల్ తన నృత్య పరికల్పనతో సంతరించి ప్రదర్శించారు. ఈ కళాఖండం నేటివరకు 'వేణుగోపాల్ రిక్షావాలా' అన్వర్థ నామధేయం అయింది. వారి నాట్య సృజనలో ప్రసిద్ధి గాంచిన ఇతర కళాఖండాలు- శివతాండవం, అర్థనారీశ్వర.

కళాపిపాసతో - ఒక కళాతపస్వి జరిపిన నిర్విరామ యాత్ర ప్రారంభం 1944వ సంవత్సరం యస్.ఆర్.ఆర్ కాలేజ్, విజయవాడ లో విద్యార్థిదశలో, మధ్యలో జీవితం కల్పించిన సహజమైన సుఖదుఃఖాలనే మైలురాళ్ళను ఓపికతో క్రమంగా నిబ్బరంగా దాటుతూ 79వ పడికి చేరారు. వయసులో. ఇప్పటికీ ప్రతినిత్యం నవరసమంజరి అనే తన నాట్య కళాశాలలో డ్యాన్సు క్లాసుల్లో చిన్నారి పాపలకు నాట్య పరంపర విచ్ఛిన్నం కాకుండా పాఠాలు నేర్పుతున్నారు. ఈ పురుషుడిని చూస్తే కళామతల్లి తన సేవకు ఎంచుకున్న అచంచల ఆరాధకుడా అనిపిస్తుంది. వీరి ఆరాధన వీరారాధన, అంటే పట్టుదల, స్థైర్యం పెనవేసుకుని సాధన చెయ్యటమే. కీర్తిశేషుడు జగద్విఖ్యాత నాట్య సామ్రాట్ శ్రీ ఉదయశంకర్‌ను శ్రీ వేణుగోపాల్ యొక్క తాత్త్విక, సైద్ధాంతిక, ఆదర్శ గురువుగా తల్చి ఉపాసించుచుచూ తన జీవిత విధానానికి ఆదర్శంగా ఎంచుకున్న మహిమాన్విత మహామనిషి. ఆ లక్ష్యంతోనే శ్రీ ఉదయశంకర్‌గారి సూక్తులతోపాటు వారి చిత్రపటం గూడా అంకితం చేసి, ఆ లోకోత్తర ప్రఖ్యాత పురుషుని, భావితరానికి పరిచయం చేస్తున్నారా అనిపిస్తుంది.

వేణుగోపాల్‌గారి ఈ కృతి వారికి లక్ష్యసిద్ధిని ప్రసాదించి, నాట్యకళా జగత్తులో ఖ్యాతి గడించి, బహుజనోపయోగ్యమగు గాక అని పర దేవతను ప్రార్థిస్తూ ... .

డాక్టర్ పినపాటి వీరభద్ర మహాదేవ్

చెన్నై,

31-7-2001

-: శ్రీ :-

# నాట్యశాస్త్ర దర్పణము

రచన :

డి. వేణుగోపాల్

- : ఓం :-

# ఉపోద్ఘాతము

శ్రీ సర్వేశ్వర గురువులు సచ్చిదానంద స్వరూపులు, నాట్యకళామూర్తి, సంగీత, సాహిత్య, శిల్ప, చిత్రకళా కోవిదులు, ఎంతటి సూక్ష్మభావమునైన అభినయించి నవరసముల రంజింప జేయగల ప్రతిభాశాలి.

అతని దేహ భంగిమలు, కరప్రసారాలు, హస్త ముద్రలు, దృష్టి లౌల్యాలు (కదలికలు), భావమంజనాలు (గుఱుతులు) పరిమళాల వెదజల్లు ఆనంద కుసుమాలు. వృద్ధుడైనా అతని నాట్యశక్తి ఆవంతయు తగ్గిపోలేదు.

కళాజ్ఞాన పీఠమును ప్రతిష్ఠించి సంగీత, నాట్య, శిల్ప, చిత్ర కళలలో విద్యార్థులకు శిక్షణలిస్తూ మన భారతీయ సంస్కృతికి నీరాజనాలర్పిస్తూ, తన జీవితాన్ని పునీతం చేసుకుంటున్నారు ఆనాడు గురుదేవులు

శ్లో ॥ **ఓంకార నాదప్రణవాంకిత జీవనాయ**
**ప్రాకార రూప నిఖిలాంతర చిన్మయాయ**
**కామేశ్వరీ ప్రణయ రంజిత మానసాయ**
**శ్రీ హరాయ, శుభకరాయ, నమశ్శివాయ.**

**తా॥** ఓంకార నాదమును ప్రణవమునకు జీవమును, ప్రాకార రూపములోనున్న సర్వ ప్రపంచమునకు జ్ఞాన జ్యోతి వంటివాడును, కామేశ్వరీ దేవి (పార్వతి) ప్రణయము వలన రంజింపజేయబడిన మనసు గలవాడును, శుభమును కలుగజేయువాడును అగు ఈశ్వరునకు నమస్కృతులు.

అని శ్లోకానికి అర్థాన్ని విపులంగా చెప్పి, అభినయించి చూపెట్టి -

ఓం నన తోం । ధిమి కిట తోం ॥

ధిం ధిమి కిట నాం । కిణి కిణీం॥

అను శబ్దమును ప్రారంభించి, విద్యార్థుల చేత అడుగులు వేయిస్తూ లయ, గతులలోని శ్రుతిపక్వాలను - తాను ఆడిచూపెడుతూ క్రమబద్ధంగా విద్యార్థులకు శిక్షణ యిస్తున్నారు.

ఇంతలో, ముప్పది సంవత్సరాల వయస్సులో ఉన్న ప్రఖ్యాత నర్తకి మధుమతి, ఘల్లు ఘల్లుమనే శబ్దంతో తురగ గతిని ప్రవేశించి, ''ఆచార్యుల వారికి నమస్కృతులు'' అంటూ అంజలి ఘటించి నమస్కరించింది.

గురుదేవులు ''ఎవరమ్మా? రండి'' అంటూ ఆహ్వానించారు. ఆమె ''నా పేరు నాట్యశిఖామణి **'మధుమతి'**. వివిధ దేశాలు తిరిగి, ప్రేక్షక మహాశయులను మెప్పించి, విశేష ఖ్యాతిని గడించాను. నా విద్యను చూపెట్టి మీ ఆశీస్సులు అందుకోవాలని వచ్చాను. తమరు అనుగ్రహిస్తే ఒక అష్టపది చూపెడతాను'' అన్నది.

ఆమె ధోరణికి విస్తుబోయి ''అలాగే'' అన్నారు గురుదేవులు.

ఆమె ''ధీర సమీరే యమునా తీరే'' అనే అష్టపదిని పాడి, అంగ, ప్రత్యంగ హస్త విన్యాసాలతో వివిధ భంగిమలను ప్రదర్శించి, చిరునగవులతో ముగించింది.

సర్వేశ్వర గురువులు మౌనంగా అలా ఉండిపోయారు.

'ఏమండి! మాట్లాడలేదు' - అంది మధుమతి.

''బాగుంది. జగమెరిగిన నర్తకివి గదా!'' అంటూ తన గదిలోకి వెళ్ళిపోయారు గురుదేవులు.

అంతా విస్తుబోయి చూస్తున్నారు. మరునాడు పాఠాలు ప్రారంభించబోతూ, ''ఎలా ఉంది? నిన్నటి మధుమతి నాట్యం?'' అని శిష్యులను ప్రశ్నించారు గురుదేవులు. 'బాగుం'దని ఒకరు, 'స్వర, జతులు అద్భుతం' అని ఒకరు, పరిపరి విధాల పలికారు. శిష్యుల నాట్య విచక్షణా జ్ఞానానికి నవ్వుకుని గురుదేవులు చెప్పటం ప్రారంభించారు. 'నాట్యానికి జీవం భావం భావాన్ని మింగే స్వర, జతులు- అంగ, ప్రత్యంగ ప్రదర్శనావళులు అందులో చోటు చేసుకోరాదు.

అనుకున్న భావాన్ని ఒక్క భంగిమతో చూపగలిగితే సంతోషిస్తాను. అదే, ఉత్తమ కళ అవుతుంది **భావ రహితమైన ఏ కళైనా ప్రేత కళ మాత్రమే!**

భావప్రకటనకు **కన్ను** ముఖ్యం. మధుమతి కళ్లలో జీవం లేదు. అంటే ఆమె చేస్తున్న నాట్యం భావరహితమై వివిధ భంగిమలు, పదగతులు, విన్యాసాలతో నడిచింది. అంటే ప్రేక్షకుల మెప్పు, చప్పట్లు పొందాలనే అభిలాష మాత్రమే ఆమె హృదయంలో చోటు చేసుకున్నదని చెప్పక తప్పదు.

భక్తిగీతాలకు శృంగార చేష్టలు కామప్రకోపిత విన్యాసాలు, ఎంతవరకు ఆమోదయోగ్యమో నేటి ప్రపంచానికి తెల్పవలసి ఉంది.

చిదంబరంలోని నటరాజు ఆలయంలో ఉన్న శిల్పాలు - భరతుడు చెప్పిన- నాట్యశాస్త్రములోని 108 కరణములకు (Poses) ప్రత్యేక శబ్దార్థ రూపాలు. అవి భంగిమలు మాత్రమే. అవి మనము ఊహించు భావములకు అంగహారములుగా మాత్రమే ఉపయోగపడతాయి. మనము పట్టే భంగిమలకు (కరణములకు) సందర్భోచితమైన **భావం** ముఖ్యం.

అజంతా, ఎల్లోర, నాగార్జున కొండల్లోని శిల్ప సంపదను చూసినప్పుడు బుద్ధుని జీవిత విశేషాలు మనకు గోచరిస్తాయి. అవి సిద్ధహస్తులైన శిల్పుల భావ పరంపరనుండి ఆవిర్భవించిన దివ్యాకృతులు.

నిజమైన కళ అనగా ప్రకృతి సిద్ధమైన కళ, మనలో ఆవిర్భవించినప్పుడు అసంతృప్తికి తావుండదు.

మన అంతరాత్మే మనకు సాక్షి. తృప్తిని ప్రసాదించే ఏ కళైనా హృదయానందదాయకమైన పరమ సత్యం అవుతుంది.

అదే వేదాంతులు నిర్వచించే చిత్కళానందమయమైన **సత్యం- శివం- సుందరం** అనే **త్రితయం''.**

అంతలో ఒక విద్యార్థి ''వేదం'' అంటే ఏమిటని ప్రశ్నించాడు.

గురుదేవులు అతని ఆసక్తికి సంతోషించి 'వేదం' అనగా విత్, అంటే తెలుసుకొనుట. దాన్నే జ్ఞానం అన్నారు కనుక వేదం అంటే జ్ఞానం జ్ఞానమును ప్రబోధించునది వేదం.

నాట్యశాస్త్రమును ''పంచమవేద'' మన్నారు.వేదాలు నాలుగు అవి - ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదం, ఇదీ అలాంటిదే- అయిదవ వేదం - అని వారి అభిప్రాయం.

# నాట్యవేద సంగ్రహము

శ్లో ॥ రసా - భావా- హ్యభినయాః
ధర్మీ - వృత్తి- ప్రవృత్తయః
సిద్ధిః స్వరాః - తథాఽఽతోద్యం
గానం - రంగశ్చ - సంగ్రహః

| | | | |
|---|---|---|---|
| 1. | రసము | 7. | సిద్ధి |
| 2. | భావము | 8. | స్వరము |
| 3. | అభినయము | 9. | ఆతోద్యము (వాద్యములు) |
| 4. | ధర్మి | | |
| 5. | వృత్తి | 10. | గానము |
| 6. | ప్రవృత్తి | 11. | రంగము |

అను ఈ పదునొకండు విషయముల స్వరూపమే నాట్యవేద సంగ్రహము.

## 1. రసము

సామాన్యుడు ఒక విషయాన్ని అనుభవిస్తాడు. కవీ అనుభవిస్తాడు. లోక, శాస్త్ర పరిజ్ఞానంతో ప్రతిభా, వ్యుత్పత్తి, అభ్యాస దక్షుడైన కవి యొక్క హృదయం స్పందించి- రసముద్రను పొందుతుంది. అతని రచనా ప్రాబల్యంతో తిరిగి ప్రేక్షకుని హృదయంలో రసం క్రిందికే పరివర్తనం చెందుతుంది.

లౌకికంగా అనుభవించే విషయములు రస ముద్రలోకి తీసుకు వెళ్ళినప్పుడు సామాన్యుడి హృదయం స్పందించి అలౌకికమైన మహా నందమును పొందుతుంది. దీనినే **రసమన్నారు.**

మానవుని హృదయంలో అనేకములైన భావములు ఉద్భవిస్తాయి. కొన్ని మనస్సులో పుట్టి అట్టే నశిస్తాయి.

మరికొన్ని సర్వజనుల హృదయాలలో బలీయమైన ముద్రలతో శాశ్వతంగా నిలుస్తాయి. అవే నిజమైన రసములు. అందులో ముఖ్యమైనవి తొమ్మిది. వాటిని **నవరసములు** అన్నారు పెద్దలు.

## నవరసములు

**శ్లో॥ శృంగార హాస్య కరుణాః రౌద్ర వీర భయానకాః,**
**బీభత్సాద్భుత శాంతాశ్చ రసాః పూర్వే ప్రకీర్తితాః .**

**తా॥** శృంగార, హాస్య, కరుణములు
రౌద్ర, వీర, భయానకములు
బీభత్స, అద్భుత.శాంతములు
అని రసములు వినుతింపబడినవి.

ఈ నవరసములకు - ప్రధాన కథల మూలమున తెల్పే సన్నివేశాలకు ఉదాహరణములు :

### *1.* శృంగారం

పుట్టుక :- కోరిక

స్థాయిభావం :- రతి

హస్తము :- అలపల్లవి

రాధాకృష్ణుల ప్రణయం పవిత్ర ప్రేమకు ప్రతీక. వియోగ-సంయోగములు ప్రేమికుల ప్రణయ విహారం. అది ప్రకృతి సిద్ధం.

బృందావనమున కృష్ణుడు, గోపికలతో రాసక్రీడ సలుపు సమయమున రాధ ప్రవేశించి-

తరుణ వయసులో తన్మయురాలై

హృదయావేశము ముప్పిరిగొనగా

రాధకృష్ణుని కౌగలింపగా

పకపక నవ్విరి గోపికలంతా

రాధ ఖిన్నయై నిష్క్రమించి

ఒక పూపొద చేరి పరితపిస్తుంది. కృష్ణుడు, రాధ కోపానికి కారణము గ్రహించి, సంకేత స్థలమున, రాధకొరకు వేచివున్నాడు.

రాధ విరహతప్తయై, కృష్ణుని జాడ తెల్పుమని, చెలికత్తెను వేడుకొనగా- చెలి కృష్ణుని గాంచి, రాధ వృత్తాంతము తెలియచెప్పింది.

అంత కృష్ణుడు రాధను సహృదయంతో ఆహ్వానించగా- సఖి కృష్ణుని అనురాగ విశేషములను తెల్పి రాధాకృష్ణులను సంయోగపరిచింది.

ఇది ప్రతి ఒక్కని హృదయంలో మెదిలే ప్రధాన శృంగార రసము.

రాధాకృష్ణుల ప్రణయకేళి పాశవికమైనది గాక పవిత్ర శృంగార రసమునకు ప్రతీక.

## *2.* హాస్యం

పుట్టుక : హాస్యం

స్థాయిభావం : హాసము

హస్తము : హంసాస్యం

మహాభారతంలో విరాట పర్వంలో ఉత్తరగోగ్రహణ సందర్భమున - విరాట రాజు కుమారుడు ఉత్తరుడు. ''కౌరవ సైన్యమును హతమార్చి, గోవులను రక్షించి తెస్తాను. కాని అత్యుత్తమ రథికుడనైన నాకు, సారథ్యం చేయువాడేడి?'' అని స్త్రీగణముల ముందు ప్రగల్భములాడి, చివరకు కౌరవ సేనను చూసి భయపడి, రథము దూకి, పారిపోవుట హాస్యరస ప్రధానమగును.

### 3. కరుణ

పుట్టుక : దుఃఖము

స్థాయిభావం : శోకము

హస్తము : ముకుళ

మన జాతిపిత, త్యాగమూర్తి, భరతమాత సంకెళ్ళను, శాంతసమర మహోద్యమమున, త్రెంచి మనకు స్వాతంత్ర్యం సమకూర్చిన మహాత్ముడు గాంధితాత - తుపాకి గుండుకు బలి కాగా ఆ మరణవార్తకు క్రుంగిపోయి, లోకమంతా - మానవాళి - దుఃఖించింది.

ఇది కరుణ రస ప్రధానమైన కథాంశము.

### 4. రౌద్రం

పుట్టుక : రోషము

స్థాయిభావం : కోపము

హస్తము : శుకతుండ

దక్షాధ్వరమును దర్శింపగ జని
దక్షుడు చేసిన శివదూషణ విని
సహింపజాలక చలించి సతి
పరాభవాగ్నికి ఆహుతి కాగా
తపస్సులో నున్న ఈశ్వరుని
వామభాగము చలించ
విషయమును గ్రహించిన శివుడు
రుద్రుడై, తన జడనుండి
వీరభద్రుని సృష్టించి, దక్ష యజ్ఞమును
ధ్వంసము చేయించెను.

ఇది రౌద్రరస ప్రధానమైన కథాంశము.

## 5. వీరం

పుట్టుక . ఉత్సాహం

స్థాయిభావం . ఉత్సాహం

హస్తము : త్రిపతాకం

మహాభారత యుద్ధంలో అర్జునుడు లేని సమయమున గురుశ్రేష్ఠుడు ద్రోణాచార్యులు, కర్ణ, కృతవర్మ, కృపాచార్య అశ్వత్థామ, దుశ్శాసనాది మహారథికులు కుట్రబూని, పద్మవ్యూహంలో ఒక్కుమ్మడి పైబడి- పసివాడైన అభిమన్యుని హతమార్చెడి సన్నివేశమున, అభిమన్యుడు చూపిన వీరోత్సాహం జగత్తును దిగ్భ్రాంతి గావించిన ఘట్టం అభిమన్యుని వీర విహారం. ఇది వీర రస ప్రధానమైన కథాంశం.

## 6. భయానకం

పుట్టుక : భయానకం

స్థాయిభావం · భయం

హస్తం కర్తీరముఖ లేక పతాక

భస్మాసురుడు శివుని ప్రార్థించి, తన హస్తము నెవని నెత్తిపై ఉంచునో అతడు భస్మమయ్యేటట్లు వరమును పొంది తనకిచ్చిన వరమును పరీక్షించదలచి, శివునిపైనే ప్రయోగించ యత్నించాడు శివుడు భయ కంపితుడై పరుగెత్తెను.

ఈ సన్నివేశం **భయానక** రసమునకు ఉదాహరణ.

## 7. బీభత్సం

పుట్టుక . విచారం

స్థాయిభావం : జుగుప్స (రోత)

హస్తము : ఊర్ణనాభ

సర్వశక్తి సంపన్నుడనని గర్వించు హిరణ్యకశిపుడు, తనకు విరోధియైన విష్ణువును ధ్యానించే తన కుమారుడు ప్రహ్లాదునిపై కోపోద్రిక్తుడై, అతనిని అనేక హింసలపాలు చేస్తాడు ప్రహ్లాదుడు నిష్కల్మష హృదయంతో ఏకోన్ముఖుడై విష్ణువును ప్రార్థిస్తూనే ఉన్నాడు.

''సర్వవ్యాపకుడని నీవు విర్రవీగే నీ హరిని ఈ స్తంభమున చూపగలవా?'' అని గద్దించి, తన గదతో స్తంభమున మోదాడు.

విష్ణువు నరసింహ రూపమున దానినుండి వెలువడి, హిరణ్య కశిపుని వెంటాడి, పట్టి, గుండె చీల్చి, రక్తము త్రాగి, ప్రేవులు హారంగా ధరించాడు.

ఈ వికృత దృశ్యం **బీభత్స** రసమునకు ఉదాహరణ.

## *8.* అద్భుతం

పుట్టుక : ఆశ్చర్యం

స్థాయిభావం : విస్మయం

హస్తము : సందంశం

బాలకృష్ణుని చిలిపి చేష్టలకు ముగ్ధులై కుపితులై ఒకనాడు ఇద్దరు గోపికలు యశోద చెంత జేరి కృష్ణుడు వెన్నదొంగ వస్త్రాపహరుడని అతని చేష్టలను - దుయ్యబట్టి, చివరకు మన్ను తినుచున్నాడని చెప్పారు.

అది విన్న యశోద కోపావేశమున కృష్ణుని దండింపబోయి, నోరు చూపమనగా ఆ బాలకృష్ణుడు తన నోరు తెరిచి, సకల బ్రహ్మాండమును చూపగా, ఆమె- ఆశ్చర్య చకిత అయింది.

**ఇచట అద్భుత రస ప్రకటితం.**

## *9.* శాంతం

పుట్టుక : శాంతి

స్థాయిభావం : శమము

హస్తము : హంసపక్షం

గురుదక్షిణకై తెగించి వినయశీలుడను విద్యార్థి, తొంబది తొమ్మిదిమంది నరులను సంహరించి, 99 వ్రేళ్ళను నరికి, మాలగా కట్టి ధరించి, **అంగుళీమాలుడను** నామమును సార్థకము చేసుకొన్నాడు.

గురు శుశ్రూష లబ్ధి కొరకు మరొకరిని సంహరించి, అతని వ్రేలును నరికి మాలకు చేర్చవలసి ఉంది.

ఈ దృఢనిశ్చయంతో కడకు తన మాతృమూర్తి తల్లినే నరకబోవ, తథాగతుడు అడ్డుకొని తననే బలిగొనమని కోరాడు.

అంత విభ్రాంతుడై, అంగుళీమాలుడు బుద్ధుని కాళ్ళపై బడి, వినయశీలుడై బుద్ధ భగవానుని ప్రవచనము విని శాంత నిరతుడై బౌద్ధుడయ్యెను.

**ఇది శాంత రసమును తెల్పు విచిత్ర గాథ.**

మానవుడు సంఘజీవి.

సంఘశ్రేయస్సు కొరకు అతడు కట్టుబడి వుండక తప్పదు. స్త్రీ-పురుషుల అనుబంధం ప్రకృతిసిద్ధం. కావున స్త్రీ-పురుషుల సన్నివేశమున నవరసముల ఆవిర్భావం: ఒక వివరణ.

## *1. శృంగారం:*

స్త్రీ- పురుషుల పరస్పరం ఆకర్షితులైన ప్రేమకలాపాలను తెల్పునది శృంగారం.

దీని పుట్టుక :- కోరిక

స్థాయిభావం :- రతి

## *2. హాస్యం :*

స్త్రీ- పురుషులలో ఒకరు ప్రేమించి, మరొకరు విముఖత చూపినపుడు, అది రసాభాసమగును. ప్రేమలో భ్రమించిన స్త్రీ గాని, పురుషుడు గాని,

వేష, భాష, నటనల్లో తబ్బిబ్బులు కావటం హాస్యాస్పదమవుతుంది. ఇది హాస్యరసం

దీని పుట్టుక :- హాస్యం

స్థాయిభావం :- హాస్యం

### 3. కరుణ :

ప్రేమించు పురుషుడు విముఖత చూపు స్త్రీని, లేక ప్రేమించు స్త్రీ-విముఖత చూపు పురుషుని మరువలేక, తపించుచు మనోదౌర్బల్యమునకు కారణమైనప్పుడు దుఃఖితులగుదురు. ఇది కరుణ రసం.

దీని పుట్టుక :- దుఃఖం

స్థాయిభావం :- శోకం

### 4. రౌద్రం :

వెంటాడు పురుషుడు, నిరసించు స్త్రీ చేత చెంప దెబ్బ తిన్నప్పుడు పురుషుడు రోషమునకు గురియై, కుపితుడై రుద్రుడగును. ఇది రౌద్రరసం.

దీని పుట్టుక :- రోషం

స్థాయిభావం :- కోపం

### 5. వీరం :

పట్టుదల వదలక సద్భావనతో పురుషుడు స్త్రీని, లేక స్త్రీ పురుషుని వశపరుచుకొనుటకు ప్రయత్నించుట వీరరసమనబడును.

దీని పుట్టుక :- ఉత్సాహం

స్థాయిభావం :- ఉత్సాహం

ఇచట పురుషుడు తాను ప్రేమించిన స్త్రీ కొరకు తన సర్వస్వము త్యజించుటకు సిద్ధమగును. అట్లే స్త్రీ తాను ప్రేమించిన పురుషుని కొరకు

తన సర్వము అతనికి సమర్పించుటకు సిద్ధమగును. అనగా హృదయ పూర్వకంగా సమర్పించు పవిత్ర ప్రేమకు ఇది తార్కాణం.

### 6. భయానకం :

చేసిన ప్రయత్నం ఫలించక భీతి గొలుపు దుష్కార్యములకు పూనుకొనుట (బలవంతపెట్టుట వంటివి) భయానకమగును.

దీని పుట్టుక :- భయం

స్థాయిభావం :- భయం

### 7. భీభత్సం :

పరిస్థితులు విషమించి ఒండొరులు అఘాయిత్యాలకు పాల్పడినప్పుడు భీభత్సమగును.

దీని పుట్టుక :- విచారం

స్థాయిభావం :- జుగుప్స (రోత)

### 8. అద్భుతం :

స్త్రీ పురుషులొండొరులు తమ తప్పిదమును తెలుసుకుని, అనుకొనని విధముగా ప్రేమికులై కలిసి ఆనందమును పొందినప్పుడు అద్భుతమగును.

దీని పుట్టుక :- ఆశ్చర్యం

స్థాయిభావం :- విస్మయం

### 9. శాంతం :

కలిసిన స్త్రీ పురుషులు జీవిత భాగస్వాములై, ప్రశాంత జీవనమును గడుపునపుడు శాంతరసమగును.

దీని పుట్టుక : శాంతి

స్థాయిభావం : శమం

## రసము వలన రసములు పుట్టుట

1 శృంగారం వలన హాస్యరసం పుట్టును.

2 రౌద్రం వలన కరుణరసం పుట్టును.

3. వీరం వలన అద్భుత రసం పుట్టును.

4. బీభత్సం వలన భయానకం పుట్టును.

## పరస్పర విరోధ రసములు

| | | |
|---|---|---|
| 1. శృంగారం | - | బీభత్సం |
| 2. వీరం | - | భయానకం |
| 3. రౌద్రం | - | అద్భుతం |
| 4. హాస్యం | - | కరుణం |

**శ్లో ॥ రసాః కార్యవశాత్సర్వే మిళంత్యేవ పరస్పరం**
**ప్రథమం యో రసః ఖ్యాతః ప్రధానో భవిష్యతి॥**

**తా॥** అన్ని రసములు కార్యవశము వలన చేరుచున్నవి. వీటిలో తొలుత ఏ రసం స్పష్టమగునో ఆ రసము ప్రధానమవుతుంది. దీనినే **అంగిరసం** అంటారు.

### *1.* భావం

మనస్సులోని దృఢ నిశ్చయమును వ్యక్తము చేయటం భావం అంటారు నిర్వికారాత్మకమైన చిత్తంలో సుఖ, దుఃఖాలకు సంబంధించి కలిగే ప్రథమ వికారాన్ని లేదా చిత్తవృత్తి విశేషాన్ని **భావం** అంటారు.

**శ్లో॥ విభావ శ్చానుభావశ్చ సాత్వికో వ్యభిచారికః।**
**ఏతే చతుర్విధా భావాః కథ్యంతే పూర్వసూరిభిః ॥**

**తా॥** 1. విభావ, 2. అనుభావ, 3. సాత్విక, 4. వ్యభిచారి భావములు అని నాలుగు విధములుగా వీటిని పేర్కొన్నారు.

నేను నా చిన్నతనంలో అంటే నా పదవ ఏట కూచిపూడి వారి నాటక ప్రదర్శనం చూడటానికి వెళ్ళాను. ఆనాడు వారు **''మోహినీ రుక్మాంగద''** నాటకం ఆడారు.

అందులో మన ప్రఖ్యాత నర్తకులు, సినిమా దర్శకులు, స్వర్గీయ వేదాంతం రాఘవయ్యగారు మోహిని వేషంలో ప్రదర్శించిన హావ, భావ విన్యాసాలు నన్ను ముగ్ధుణ్ణి చేశాయి. ఆ రోజే నా నాట్యకళకు అంకురార్పణ జరిగింది.

ఆ ఘట్టం ఇప్పటికీ తలచుకొన్నప్పుడు నాకు మహానందమవుతుంది. అంటే సజీవంగా నటించి శ్రీ రాఘవయ్యగారు ఆ ''మోహినీ'' పాత్రకు ఔన్నత్యాన్ని చేకూర్చారన్నమాట! ఆ అద్భుత సన్నివేశం నాట్యకళను అభ్యసించడానికి నన్ను ప్రోత్సహించి, నేనొక కళాకారునిగా జీవించడానికి కారణమైంది.

ఈ సన్నివేశానికి నాట్యశాస్త్ర పరిభాషలో **విభావం** అని పేరు. రాఘవయ్యగారి మోహిని పాత్రను దర్శించడం వల్ల నాకు నాట్యం నేర్చుకోవాలి అనే భావం కలిగింది. అంటే ఆ మోహినీ నాట్యం దర్శించుట- విభావం.

విభావం - కారణం ; భావం - కార్యం అవుతుంది.

విభావం 2 విధాలు-

**1. ఆలంబన విభావం** (ఆధారం)

భావమునకు కారణమైనది.

**2. ఉద్దీపన విభావం** (వెలుగు)

భావమునకు దోహదమిచ్చునది. నేను మోహినీ నాట్యం దర్శించిన రాత్రి నిద్రలోనే కలవరిస్తూ, కదలించే హస్త విన్యాసాలను చూసి, మా అమ్మ నిద్ర లేపి ''ఏమిటిరా, నిద్రలో కలవరిస్తున్నా''వని ఆదుర్దాగా అడిగింది.

అప్పుడు నేను- ''అమ్మా! నేను నాట్యం నేర్చుకుంటానమ్మా'' అన్నాను. ఆమె వెంటనే ''తప్పక నేర్చుకో బాబూ'' అని నన్ను బుజ్జగించి నిద్రబుచ్చింది. అంటే నా తల్లి చల్లని మాట నా భావానికి దోహదమై నన్ను ఉద్దీపింపజేసింది.

## 2. అనుభావం :

'విభావం' కారణంగా హృదయంలో ఉదయించిన భావానికి అనుగుణంగా శరీరం మీద వ్యక్తమయ్యే కటాక్షాది చేష్టలను అనుభావం అంటారు. అంటే మనస్సులో ఉదయించిన భావం ప్రయత్న పూర్వకంగా వ్యక్తం చేయబడేది ''అనుభావం''. అంటే నేను నర్తకుణ్ణి అనిపించు కొనుటకు నాట్యం అభ్యసించాలి అనే ప్రయత్నం అనుభావం.

## 3. సాత్విక భావం :

సత్వమంటే మనస్సుకు సంబంధించిన విశేష స్థితిని తెల్పేది. భావతీవ్రత వల్ల మనస్సులో కలిగే మార్పులు దేహం మీద అప్రయత్నంగా వ్యక్తమౌతూ ఉంటాయి.

ఉదా : రోమాంచాది అనుభవాలను **సాత్విక భావములని** అంటారు.

## 4. సంచారి లేక వ్యభిచారి భావాలు:

హృదయంలో ఉదయించిన భావం చంచలమైనదైతే సంచారి లేక వ్యభిచారి భావమని అంటారు. అంటే నేను నాట్యం నేర్చుకోవడమా? లేక మానడమా? అనే సందిగ్ధావస్థ. ఇలాంటివి.

దీనిని సముద్ర తరంగాలతో పోలుస్తారు.

## 5. స్థాయిభావం :

**Deep rooted feelings or Permanent State**

మనస్సులో ఉదయించిన భావం రసస్ఫూర్తి పర్యంతం, స్థిరంగా నిలిచేది

స్థాయీభావం అంటే భావానికి సంపూర్ణ స్థిరత్వం కూర్చేది

ఉదా॰ నేను వర్తకునిగా స్థిరపడే వరకు నిలిచేది.

**శ్లో ॥ విభావైరనుభావైశ్చ భావసంచారి సాత్త్వికైః**
**జనితో బోధి స్ఫీతో వృద్ధ శృంగార ఇష్యతే॥**
**(భరతుని నాట్యశాస్త్రం)**

**తా॥** తొలుత విభావముచే జనితమై, అనుభావముచే బోధితమై (తెలియబడినదై), సంచారి భావములచే స్ఫీతమై (అతిశయించినదై), సాత్త్విక భావములచే వృద్ధమై (వృద్ధి పొంది) ప్రకాశించేది **శృంగారం.**

ఇట్లే తక్కిన రసములున్నూ.

***1. శృంగార రస విభావములు***

ప్రియజన సాంగత్యము, ఉద్యానవన విహారం, సంగీత, సాహిత్య గోష్ఠులు, సినిమా, నృత్య, నాటక ప్రదర్శనలు మొ॥నవి.

***2. అనుభవాలు***

నేత్ర, ముఖ వికాసం, చిరునగవుతో మధురంగా మాట్లాడుట, సుందరంగా అవయవములతో అభినయించుట అవ్యక్తమైన ప్రేమ అనవచ్చు.

***3. సంచారి లేక వ్యభిచారి భావాలు***

విభావ, అనుభావ, సాత్త్విక భావములచే వెంట వెంట ననుసరించి, సహచరులుగా బుట్టునవిగా సంచారి లేక వ్యభిచారి భావములనబడును

లజ్జ, స్మరణ, సంతోషం, చంచల స్వభావం, ఉన్మాదం, భయం, దుఃఖం, చంచల స్వభావం మొదలగునవి శృంగార రస ప్రధానమైనవి.

ఇవిగాక భరతుడు చెప్పినవి :

**ముప్పదిమూడు.**

1. నిర్వేదము :- దేనియందు నిచ్ఛ లేకుండుట

2 శ్రమ .- విరహాదులచే చెమట పొడమునంత మనశ్శరీర వేదనలు.

3 దైన్యం :- మనస్తాపము. దీనత్వంచే మదనాదులను ప్రార్థించుట.

4. జాడ్యము :- ఏమియును తోచకుండుట.

5. గ్లాని :- శక్తి తగ్గి బడలిక గల్గుట.

6. త్రాసము :- చంద్రాదుల జూచి భయపడుట.

7 శంక :- తన యిష్టము సిద్ధించునో లేదో యని సంశయించుట.

8. ఆర్తి ;- దుఃఖము, మన్మథ జ్వరముచే గలుగు విశేష స్థితి

9. రోషము :- విరహ తాపమును భరించలేక మదనునిపై గలుగు కోపము .

10. గర్వము :- తనతో సరివారెవరని యొరుల నిందించి తన్ను బొగడుకొను చిత్తౌన్నత్యం.

11. ఆవేశము .- ఇష్టానిష్ట ప్రాప్తి వలన గలుగు మనస్సంభ్రమము.

12. ధృతి :- మనమున కృతార్థత్వమును చెందుట (సంతృప్తి) సంతోషం.

13. స్మృతి :- పూర్వమనుభవించిన దానిని తలచుకొనుట.

14 చపలత :- రాగ, ద్వేష జనిత చేష్టాద్యవస్థ.

15 ఉగ్రత :- తనకు ఎగ్గు గలిగినచో గలుగు కోపము.

16 అవహిత్థ :- మనోభావ ప్రకాశకమైన ఆకారమును మరుగు పఱచుట (తప్పిదమను కప్పిపుచ్చుట).

17. త్రప :- మనస్సంకోచము

18. **విషాదము** :- వివిధోపాయ భంగము వలన కలుగు వేదన.

19. **మదము** :- మద్యపానము వలనను, విశేష సంపత్ప్రాప్తి వలనను గలుగు అహంకారము.

20. **ఔత్సుక్యము**:-సందర్భమున క్షమించుట లేక జాగు నోర్వజాల కుండుట.

21. **మతి** :- అర్థమును వ్యాఖ్యానించుట, సంశయమును పోగొట్టుట.

22. **మోహము** :- మూర్ఛ, నేలమీద పడుట.

23. నిద్ర :- చిత్తనిమీలితము. (మానసిక విశ్రాంతి)

24. **బోధము** :- మేల్కొనుట.

25. **మృతి** :- మరణోద్యోగము (చావు).

26. **ముదము** :- ఇష్టప్రాప్తి వలన గలుగు సంతోషము.

27. **ఆలస్యము** :- చేయదలచిన కార్యమందు జాగు చేయుట.

28. **వితర్కము** :- సందేహ బాహుళ్యము (విమర్శ).

29. **సుప్తి** :- అతి నిద్ర.

30. **అసూయ** :- ఒరుల అతిశయత్వమును జూచి సహింప కుండుట.

31. **అధ్యాహము**:- ఇష్టసిద్ధి కానందున దానినే చింతించుట.

32. భ్రమము :-చేతనాచేతన జ్ఞానము లేక ముచ్చటించుట.

33. **అపస్మృతి** :-మన్మథావేశముచే గలుగు విపరీత వికారము.

## శృంగారాది నవరసములకు సంచారి లేక వ్యభిచారి భావములు సందర్భము ననుసరించి యుండును.

***1. శృంగారం :-***

శృంగార రసమందు సమస్త సంచారి భావములు సందర్భము ననుసరించి యుండును.

***2. హాస్యం :-***

శ్రమము- చపలత - నిద్ర- స్వప్నము -గ్లాని - శంక- అసూయ - అవహిత. ఇవి హాస్యరసమున గలిగి యుండును.

***3. కరుణ :-***

దైన్యము- చింత- గ్లాని- నిర్వేదము - జాడ్యము - స్మృతి వ్యాధి. ఇవి కరుణ రసమున గలిగి యుండును.

***4. రౌద్రం :-***

హర్షము - అసూయ - గర్వము - ఉత్సాహము - మదము - చపలత - ఉగ్రత్వము. ఇవి రౌద్రరసమున గలిగి యుండును.

***5. వీరం :-***

అమర్షము - బోధము - వితర్కము - మతి- ధృతి - క్రోధము - అసూయ - సమ్మోహము - ఆవేగము - హర్షము- గర్వము - మదము - ఉగ్రత్వము. ఇవి వీర రసమున గలిగి యుండును.

***6. భయానకం :-***

త్రాసము - మరణము - దైన్యము - గ్లాని. ఇవి భయానక రసమున గలిగి యుండును.

***7. బీభత్సం :-***

అపస్మారకం - విషాదము - భయము - రోషము - మృతి - మదము - ఉత్సాహము ఇవి బీభత్స రసమున గలిగి యుండును

***8. అద్భుతం :-***

ఆవేగము - జడత - మోహము - హర్షము - విస్మయం - స్మృతి. ఇవి అద్భుత రసమున గలిగి యుండును

***9. శాంతం :-***

ధృతి (సంతృప్తి) సంతోషము.

# 4. సాత్విక భావములు

(ఇవి ఎనిమిది)

శ్లో॥ స్తంభ ప్రళయ రోమాంచాః
స్వేదో వైవర్ణ వేప థూః
అశ్రు వైస్వర్య మిత్య ష్టాః
సాత్వికాః పరికీర్తితాః॥

1. స్తంభము :- మ్రాన్పాటు (ఏమియు తోచకుండునట్లు)

2. ప్రళయము :- మూర్ఛ (అతిమోహముచే గలుగునది)

3. రోమాంచము :- గగుర్పాటు

4. స్వేదము :- చెమటబోయుట

5. వైవర్ణము :- తెల్లబోవుట

6. వేపథువు :- వణకుట

7 అశ్రువు :- కంట తడిబెట్టుట

8. వైస్వర్యము :- గొంతు బొంగురుపోవుట (గాద్గదికము)

ఇలా మానవ జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలను పరిశీలించి చూసినప్పుడు మనకు విభావ- అనుభావ - సాత్విక - వ్యభిచారి - స్థాయి భావములు గోచరిస్తాయి. అలాగే నవరసములకు అన్వయించుకోవచ్చు.

## శృంగార రసము

| | |
|---|---|
| 1. స్త్రీ, పురుషుల సన్నివేశం :- | విభావం |
| 2. ఇరువురి చూపుల సంయోగం వలన వారి హృదయంలో ఉదయించినది - | అనుభావం |
| 3 ఒండొరుల ఆకర్షణ తీవ్రమైనప్పుడు కలుగు మానసిక వికారం - | సాత్విక భావం ప్రేమ |
| 4 ఉదయించిన భావం - సిగ్గు, బిడియం శంక, భయం, చింత దుఃఖం మొ॥ మానసిక వికారములకు గురియైతే | వ్యభిచారి లేక సంచారి భావములు |
| 5. అట్లుగాక హృదయంలో - జనించిన (ప్రేమ) భావం రసోదయ పర్యంతం స్థిరంగా అంటే (రతి) సంభోగం వరకు నిలిచేది | స్థాయిభావం |

## రౌద్ర రసము

దక్షయజ్ఞమునకు విచ్చేసిన సతీదేవి తండ్రిచే అవమానితయై ఆత్మాహుతి చెందగా, యోగ సమాధిలోనున్న ఈశ్వరుని వామభాగం చలించినది అంత ఈశ్వరుడు దివ్యదృష్టితో జరిగిన వృత్తాంతమును గమనించి, క్రోధావేశుడై, రుద్రుడై, వీరభద్రుని సృష్టించి, అతని మూలమున దక్షయజ్ఞమును ధ్వంసము చేయించెను

1. యోగ సమాధిలోనున్న ఈశ్వరుని వామభాగం చలించుట - విభావం

2. సతీదేవి ఆత్మాహుతిని తెలుసుకొనుట - అనుభావం

3. ఆవేశపడి కోపోద్రిక్తుడై రుద్రరూపం దాల్చుట - సాత్వికం

4. వీరభద్రుని సృష్టించి పంపుట - సంచారి లేక వ్యభిచారి భావం

5. దక్షయజ్ఞమును ధ్వంసము చేయుట - స్థాయిభావము

ఇలా నవరసములకు తగిన సన్నివేశములను ఊహించి సమన్వయ పరచవచ్చును.

## శృంగార చేష్టలు

ఇవి పద్దెనిమిది:

1. భావము :- యౌవనాంకురంతో పాటు కలిగే మనోవికారం.

2 హావము :- భ్రూవిక్షేపాదులతో కొంచెంగా భావాన్ని వ్యక్తపరచడం

3. హేల :- అదే భావాన్ని సుస్పష్టంగా వ్యక్తపరచడం.

4. విలాసము :- ప్రియుని జూచి స్త్రీకి కలుగు తాత్కాలిక చేష్ట ముఖ, నేత్రాది భంగిమలు, ఆకార వికారములు.

5 మాధుర్యము : అన్ని పరిస్థితులలోనూ ఒకే రీతిగా రామణీయత కల్గి ఉండటం

6 ధైర్యము :- అతి మోహము కలిగినను గుణశీలాదులను అతిక్రమించకుండా ఉండటం.

7. విభ్రమము :- ప్రియుని యందే ఉండు తలంపు చేత భూషణాదులను వ్యత్యస్తముగా ధరించడం.

8 లీల - వాక్కులు, గమనము, చేష్టల ద్వారా ప్రియుని అనుకరించడం

9 కిలికించితము .- రోషము, కన్నీరు, హర్షము (తత్తరపాటు), భీతి మొదలగునవి సంకరమ్మై వ్యక్తమవడం

10 మొట్టాయితము :- ప్రియుని గూర్చి తన్మయత్వంతో వినడం

11 లలితము ·- సొగసగు దేహ విన్యాసము.

12 విచ్ఛిత్తి :- స్వల్ప భూషణములు ధరించినప్పటికీ అతి రమ్యంగా నుండటం.

13 బిబ్బోకము ·- ఇష్టమైన విషయంలో కూడ అనాదరాన్ని చూపి గర్వమభినయించడం.

14. విహృతము :- ప్రాప్తం బైన కాలమున లజ్జించి క్రియలచే తెల్పడం

15 చకితము :-మౌఢ్యముచే భయపడటం.

16 హసితము :- సంతోషము వలన కలుగు నవ్వు వలన ప్రకాశించడం

17 కుట్టమితము :- సురతానందము చేత దంతక్షతాదులను గుర్తెరుగక పోవడం

18 కుతూహలము ·- ప్రియవిషయక మోహచాపల్యం

## శృంగారమున స్త్రీలయందు కలుగు దశావస్థలు

1 చక్షుఃప్రీతి - ప్రియుణ్ణి ప్రీతితో చూడటం

2 చింత - ప్రియ సంఘటన విషయకచింత.

3 సంస్మృతి - ప్రియుని తదేకముగా ధ్యానించడం

4 గుణకీర్తన :- ప్రియుని గుణములను కొనియాడటం

5. అరతి - ప్రియుని పట్ల మోహము వల్ల దేనియందును ఇచ్ఛ లేకపోవడం

6 తాపము -మోహమున తపించిపోవడం.

7 లజ్జాత్యాగము - ప్రియుని యందు కలుగు మోహము అతిశయించి చెప్పుకొనటం

8 గమనము :- ప్రియుని వద్దకు తానే పోవడం.

9. మూర్ఛ :- అతి మోహము వల్ల మూర్ఛిల్లడం

10. ధన్యత :- ప్రియసమాగమము వల్ల కలిగే ఇష్టసిద్ధిచే తృప్తి పొందడం.

-: శ్రీ :-

## అభినయానికి ముఖ్యం

1. హస్తము

2 కన్ను

**హస్త భేదములు: 3**

1. అసంయుత హస్తములు

2. సంయుత హస్తములు

3 నృత్య హస్తములు


**1. అసంయుత హస్తములు: 27**

శ్లో॥ పతాక స్త్రిపతాకో అర్ధ పతాకః కర్తరీముఖః
మయూరశ్చార్ధ చంద్రశ్చాప్యరాళః శుకతుండకః
ముష్టి శిఖర కపిత్థ సూచ్యాస్యః కటకాముఖః
బాణస్సర్పశిరః పద్మకోశో మృగశిరస్తథా
లాంగూల సింహ వదనశ్చతురశ్చాల పల్లవః
హంసాస్యోభ్రమరో హంస పక్ష సందంశ ఇత్యపి
ముకుళ స్తామ్ర చూడశ్చకథితాః అసంయుత హస్తాః!
ఏతే సప్త వింశతి హస్తాః పూర్వాచార్యోదితాః॥

1. పతాకము
2. త్రిపతాకము
3. అర్ధపతాకము
4. కర్తరీ ముఖము
5. మయూరము
6. అర్ధచంద్రము
7. అరాళము
8. శుకతుండము
9. ముష్టి
10. శిఖరము
11. కపిత్థము
12. సూచీముఖము
13. కటకాముఖము
14. బాణము
15. సర్పశిరము
16. పద్మ కోశము

17. మృగశీర్షము
18. లాంగూలము
19. సింహవదనము
20. చతురము
21. అలపల్లవము
22. హంసాస్యము
23 భ్రమరము
24 హంసపక్షము
25. సందంశము
26 ముకుళము
27. తామ్రచూడము

అను యీ ఇరువది ఏడు అసంయుత హస్తములు పూర్వాచార్యుల చేత చెప్పబడినవి.




### 1. పతాక హస్తము

(పతాకము అనగా జండా)

అధి దేవత: పరబ్రహ్మ

**వినియోగం:** నాట్యారంభము, మేఘము, పండితుడు, రాత్రి, కుచ స్థలము (రొమ్ము), నది, దేవతా సమూహము, ఉద్యాన వనము, అశ్వము, యోగ్యము, దుఃఖము, నీడ, నమస్కారము, ద్వీపము, వెండి నాణెములు, బాండము, వాయువు, శయనించుట, వెళ్లే ప్రయత్నము, నీడ, అనుగ్రహం, ఎర్రని ఎండ, చల్లదనము, పాదము, నుదురు, తలుపులు తెరవటం లేదా తట్టటం, ఏడు విభక్తులను చెప్పుట, అలలు, వీధిలో ప్రవేశించుట, సమత్వం, గంధాదులు పూసుకొనటం, ''నేను'' అనటం, శపథం, తూష్ణీంభావం (మిన్నకుండటం), ఆశీర్వాదం, రాజశ్రేష్ఠుడనటం, డాలు, చెంపపెట్టు, అక్కడనే అక్కడనే అనటం, సముద్రము, మంచి పనులని చెప్పటం, ముందుకు పోవడం, కత్తియొక్కరూపం నిరూపించుట, తుడవటం, కల్లాపి చల్లటం, తటాకం (చెరువు), జయము, భయము, వినయము, నిర్భయము, సైన్యము, కప్పుకొనుట, రక్షించుట, భూమి తళతళమను మెరుగు, సూర్య, చంద్ర, అగ్ని, సౌందర్యము, తొందర, మెల్లన, యుద్ధము, సమూహము, గొడుగు, ధిక్కార, అహంకార,


మనోవికారములు, తొండము, రాళ్లు, వాద్యము, తిథి, వారము, అయనము (ఉత్తరాయణ-దక్షిణాయనములు), నెలలు, సంవత్సరములు, దిక్కులు, జలపానము, ప్రవాహము, పాపపుణ్యములు, విరోధము, కపోలము (చెక్కిలి), నడుము, గోడ, పరబ్రహ్మ, దట్టము, విద్య, క్షమించుట, ఓర్పు, కౌగిలి, ఓదార్చుట, వెతుకుట, మొ॥ వానియందు.



### 2. త్రిపతాక హస్తము

అధి దేవత: శివుడు

**వినియోగం:** విష్ణువు, రాజు, దేవేంద్రుడు, వజ్రాయుధం, దేవతల కిరీటం, వంశము, వాహనము, వృక్షము, నెరసిన వెంట్రుకలు, మొగలిపూవు, కోపము, అరణ్యము, భయ, వీరరసములు, కేశ సమూహము, క్రింది పెదవి, అరటిచెట్టు, ఎరుపు వర్ణము, ఊర్ధ్వ పుండ్రము, తరుణి బాష్పము, ఈగ, స్థాణువు, నిష్ఠురము, శాపము, తుమ్ము, కడగంటి చూపు, తాపము, మంగళవారము, ప్రతీపమను అర్థాలంకారము, ఓడ, ముల్లు, గోళ్లు, దీపం, పావురం మొ॥ వాని యందు.



### 3. అర్ధ పతాక హస్తము

అధి దేవత: శివ, కేశవులు.

**వినియోగం:** ఇద్దరనుట, చిగురుటాకు, ఫాలము (నుదురు), అంపము, పలక, ఒట్టు, ధ్వజ గోపురము, కొమ్ము, చాకు, గోమేధికము. (పసుపువన్నె గల రత్నము) యుక్తి, నదియొక్క ఉభయతీరములు మొ॥ వానియందు




### 4. కర్తరీముఖ హస్తము

అధి దేవత: శ్రీమహావిష్ణువు

**వినియోగం:** దాంపత్య వియోగం, ఏకశయ్యా వియోగం (చెరియొక వైపు పరుండుట), జింక, చమరీ మృగం, కారెనుపోతు, మొసలి మెరుపు, కపటము, వేగము, మనోవికారము, భయము, పర్వతము,

దొంగిలించుట, మరణము, లత్తుక పూసికొనుట, వెంట్రుకలు, నింద, వేగిరపాటు, పక్షులు, బీభత్సరసము, కత్తిరించుట మొ॥ వానియందు



## 5. మయూర హస్తము

(మయూరము అనగా నెమలి)

అధిదేవత: ఇంద్రుడు

**వినియోగం:** నెమలి, తీగ, హారము, ఇంద్రనీలమణి, విద్యాధరకులము, షడ్జ స్వరము, ముంగురులు దిద్దుట, తిలకము దిద్దుట, ప్రసిద్ధి, శాస్త్రమును వ్యవహరించుట మొ॥వానియందు.




## 6. అర్ధ చంద్ర హస్తము

(అర్ధ చంద్ర అనగా చంద్రవంక)

అధిదేవత: ఈశ్వరుడు

**వినియోగం:** అర్ధ చంద్రుడు, మెడపట్టి గెంటుట, భల్లాయుధము, దేవతాభిషేకము, కంకణము, కంఠము, విస్మయము, అంకుశము, వెన్నెల, కాముకుడు, చింత, అవయవములను పిసుకుట, చెక్కిలి, చెంబు, మోయుట, ప్రాకృతులకు (పామరులకు, నీచులకు) నమస్కారము, నుదురు, పరాఙ్ముఖము (పెడముఖము), వీపు, అపరాధ నిరూపణము, పాదము, గరుత్మంతుడు, సగము, మృగము, కుండలములు, శత్రువు, చంద్ర కాంతము, పిరుదులు, జడ, చంకలు, మోకాలు, అంకురము, (మొలక) సిగముడి, పరిశుభ్రము, అర్ధము, ఏమి? మొ॥వానియందు



## 7. అరాళ హస్తము

అధి దేవత: విష్ణువు

**వినియోగం:** అమృతము, విషము త్రాగుట, ఆపోశనము, ఉత్సాహము, శోభ, జుట్టుముడి చూచుకొనుట, శౌర్యము, బొమముడి, పరాఙ్ముఖము, కూచిమారుడను నాయకుడు (శృంగార నాయకులలో నొకడు), రుచులు,


గడియారము, భూమి చివరి భాగము, చేయదగినపని, గట్టిమాట, ప్రతిబింబము, మౌనము, వాసన చూచుట, అందము, యోగము, మౌనము, ఆశీర్వచనము మొ॥ వానియందు.



## 8. శుక తుండ హస్తము

అధి దేవత: మరీచి

**వినియోగం:** ఈటె, చిలుక, మర్మముగా మాట్లాడుట, ఎరుపురంగు, బ్రహ్మాస్త్రము, కాంతి, బాణము, పక్షి, భూమి, తిరస్కారము, గోరువంక, పిట్ట, నీవు-నేను అనుట, తేలు, తాబేలు, ముఖస్తుతి, ఆత్మస్తుతి, ఉత్తమ-మధ్యమ-అధముల మాటలు, జూదము, పాచికలు ఆడుట, కోరిక, భయము, వంశము, దేవజాతి, రౌద్రరసము, తామరతూడు, భవిష్యదర్థము, ఆలోచన. వ్యాళీ నాట్యము, (నాట్య భేదము) ప్రారంభించుట, నాట్యము ముగించుట, పంచమస్వరము, పాంచాలపురుషుడను శృంగార నాయకుడు మొ॥ వానియందు.



## 9. ముష్టి హస్తము

అధి దేవత: వీరభద్రుడు

**వినియోగం:** స్థిరత్వము, స్థైర్యము, మల్లయుద్ధము, గంటను పట్టుకొనుట, శీఘ్ర గమనము, తొడలు పిసుగుట, తేలిక, అవమానము, ఆకర్షించుట, డాలు-ఖడ్గము, కుంతము (ఈటె) మొ॥లగు ఆయుధములు ధరించుట, భద్రుడను శృంగారనాయకుడు, నడుము, క్రోధము, చిహ్నము, మూర్ఖుడు, లోహము, త్రాసు, పూలగుత్తి, గడ్డము మొ॥వానియందు.




## 10. శిఖర హస్తము

అధిదేవత: మన్మధుడు

**వినియోగం:** తాను, నిశ్చయము, కాదనుట, స్తంభము, గంట, మన్మథుడు, ధనుస్సు, స్థిరత్వము, శిఖరము, బొట్టు,


దత్తుడను శృంగార నాయకుడు, వినాయకుడు, ముని, ఈశ్వరుడు, యముడు, బోయవాడు, ధ్వజము, గంభీరము, సంతోషము, గు[్రపు కళ్లెము, భల్లము, గుద్దలి శక్త్యాయుధము, సరసము, నిశ్చలము, పితృ తర్పణము, నాలుగను సంఖ్య, కపటము,కృశించుట, ఇష్టము, గౌరి, కుటుంబపోషణ, ఆప్తుడు, ఏమి? అనుట, వృషభరాశి, బృహస్పతి, గురువారం మొ॥వాని యందు.



## 11. కపిత్థ హస్తము

అధి దేవత: బ్రహ్మ

**వినియోగం:** పార్వతి, లక్ష్మి, సరస్వతి, ధూప, దీప, పూజలు, గద, అంకుశము, అస్త్రము, చక్రము, జపమాల, వజ్రాయుధ ధారి యగు ఇంద్రుడు, పుచ్చుకొనుట, నిశ్చలముగా యుండుట, కవ్వపుత్రాడు లాగుట, నటుడు తాళము పట్టుకొనుట, పమిటచెంగుపట్టుకొనుట, పడవ, ఓర్పు, మోహము, విసరివేయుట, (ఎగురవేయుట), వాసన చూచుట, మునీశ్వరుడు, పుట్టుక, మేఘము, గౌరవర్ణము, సంతోషము మొ॥వాని యందు.



## 12. సూచీముఖ హస్తము

అధి దేవత: విశ్వకర్మ

**వినియోగం:** ఏకసంఖ్య, బాణము, సూర్యుడు, పరబ్రహ్మ, బ్రహ్మ, దేవుడు, పట్టణము, లోకము, అలాగే అను అర్థము, ఏదియో అది అను అర్థము, భయపెట్టుట, దిక్కులు, ఉదయము, అస్తమయము, చక్రము త్రిప్పుట (తిరుగుట), రక్షించుట, సత్యవాక్కు, వెయ్యిసంఖ్య, నూరుసంఖ్య, కోపము, భూమి, నాశనము, (బాణము లేక ఎముక) వ్రాయుట, సూది, కృశించుట, తామరతూడు, చిత్రము, నిర్ణయము, మనస్సూచన, నీచులను చూపుట, వినుట, మోసము, లెక్కబెట్టుట, బుద్ధి గుణము, కనుబొమలు, ఘటిక (గడియ), నాభి మొ॥వాని యందు.



## 13. కటకాముఖ హస్తము

అధి దేవత శ్రీరాముడు.

**వినియోగం:** గుఱ్ఱపు కళ్లెము పట్టుకొనుట, పండ్లు తోముకొనుట, వింజామర-విసనకర్ర, గొడుగు, గంధము-హారము, పూలమాల, అద్దము వీనిని ధరించుట, తాంబూలమిచ్చుట, ఆటప్రదేశము, నృత్యాంతము, బాణముసంధించుట, ఇంద్రనీలమణి, పూవులుకోయుట, భేరి వాయించుట, మర్యాద మొ॥వాని యందు.



## 14. బాణ హస్తము

అధి దేవత· కుమారస్వామి


**వినియోగం:** వెంట్రుకలు దిద్దుకొనుట, సంధినృత్యమను, నాట్యవిశేషము, నాగలి ధరించుట, ఆరు అనుసంఖ్య, గొడుగు కొంటె వాని తనము, నఖక్షతము, చెమట తీయుట, పర్వత మెత్తుట మొ॥వాని యందు



## 15. సర్పశిర హస్తము

అధి దేవత. శివుడు

**వినియోగం:** గంధము, పాము, పొట్టివాడు, కుంకుమము, బురద, కుస్తీపట్టుట, మంచిమాట, నీళ్లు మొదలగువానిని త్రాగుట, దేవ-ఋషి తర్పణము, ఇల్లు, యాచించుట, లాలించుట, కన్నీరు తుడుచుకొనుట, ముఖము కడుగుకొనుట, పసిబిడ్డ, కొంచెము, శోషణము (వేగించుట) వంగుట, జుట్టుముడివేసుకొనుట, సిగ్గు, దోషము లెన్నుట, గూఢార్థము, అయ్యోయనుట, చిత్రము, గంధపుపొడి చల్లుట మొ॥వాని యందు.




## 16. పద్మకోశ హస్తము

అధి దేవత భార్గవుడు

**వినియోగం:** కమలము, ఘంట, బంతి, అద్దము, చకోరము పాముపుట్ట కొప్పు, గుండ్రని వస్తువు,


రథచక్రము, వికాసము, మామిడి పండు, పూలవర్షము, చెంబు, కొబ్బరి బొండము, పూమొగ్గ, కొండగోగు, తీగెలు మొ॥వాని యందు.



## 17. మృగశీర్ష హస్తము

అధి దేవత: శివుడు


**వినియోగం :** పసిపిల్లలు, కన్యక, వాదము, సంతోషము, ప్రత్యక్షముచేయుట, ఆవులు, చెమట తుడుచుకొనుట, వస్త్రము, శరీరము, గొడుగు పట్టుకొనుట, గుర్రము, పైరు, గృహము, పక్షి ముక్కు, గంధము మొదలగునవి పూయుట, సోపానము, శాంతము, సమానము, గోడ, పుణ్యము, మృగముఖము, సిగ్గు, చమత్కారము, సంజ్ఞ, రంగవల్లి (ముగ్గు), ఇష్టము, నేను అను అర్థము, ఎద్దు, ''సరిగమపదని'' యను సప్తస్వరములందలి ''గ'' అను స్వరగాంధారము, శిశ్నము, తెర, పిలుచుట, జింక మొ॥వాని యందు.



## 18. లాంగూల హస్తము

అధిదేవత: విష్ణువు


**వినియోగం:** పూగుత్తి, పండు(గజ్జ) కింకిణి, గుండ్రని వస్తువు (గోలి), చాతకపక్షి, చకోరపక్షి, వక్క, నిమ్మ, నేరేడు, ద్రాక్షపండ్లు, వడగండ్లు, కరక్కాయ, మితభోజనము, పగడము, గడ్డము పట్టుకొనుట, రుద్రాక్ష, పుష్యరాగమణి, నక్షత్ర సముదాయము, సీసము, ప్రశస్తము మొ॥వానియందు.



## 19. సింహ వదన హస్తము

అధిదేవత. శివుడు

**వినియోగం:** సింహము, చిరునవ్వు, సువాసన, మంగళస్నానము, హోమము, వైద్యము, నీతి, మోక్షము, సంధానము, దర్భను కదిలించుట, శుద్ధిచేయుట, ధైర్యము, వంటకము, వజ్రమణి, కంచు, గాంధారము, సింహాసనము, జపమాల ధరించుట. ఉప్పు, చెవి, గున్న ఏనుగు మొ॥వాని యందు.



## 20. చతుర హస్తము

అధిదేవత: గరుత్మంతుడు


**వినియోగం:** నుదురు, చెక్కిలి, చిన్నపిల్ల, నేర్పరితనము, చూపు, అద్దము, నెయ్యి, నీలము, మొదలగు రంగులు, రత్నములు, తేనె, నూనె, కస్తూరి, పంచదార, బురద, పదునారేండ్ల స్త్రీ, ముఖము, చెవికమ్మ, మర్మము గల మాటలు, కొంచెమను అర్థము, ఇంద్రనీలమణి, బంగారము మొ॥ వానియందు.



## 21. అలపల్లవ హస్తము

అధిదేవత: సూర్యుడు


**వినియోగం:** వస్త్రము, సొమ్ములు, మాధుర్యము, వెన్న, శిరస్సు, వికసించిన, కమలము, సాధువాక్యము, దుర్గ (పార్వతి), అందము, మేడ, పట్టణము, విరహము, తాళ ఫలము, కిరీటము, వృక్షము, ధనము, స్తనములు, చాళీయ నాట్యము, జడ, కొప్పు, సూర్యకాంతిమణి -మొ॥వాని యందు. .




## 22. హంసాస్య హస్తము

అధి దేవత: బ్రహ్మ

**వినియోగం:** అదియే నేను అనుభావము. శోధించుట, మాలిక ధరించుట, గీతలు, చిత్రలేఖనము, సంగీతము, లాస్యము, కాటుక, అలచంద ధాన్యము, సత్యము పలుకుట, అర్థము చెప్పుట, లక్ష్యము, నఖము, నఖ క్షతము, చిరునవ్వు, దంతక్షతము, విషము, ముత్యము, జలబిందువు, నల్లి, దోమ, చలి, ఈగ, నూగారు, తుమ్ముట, క్షణకాలము, త్రాసు, జందెము, గగుర్పాటు, సన్నని వస్తువు లేదనుట, అరవిరి మొగ్గ, వేదిక, సంస్కారము, నిర్జన స్థలము, కొంచెమను అర్థము, గురిగింజ, భస్మము, ఆకారము, వేషము, వంగుట, తీగె, వెండి, గుళిక, మొ॥వాని యందు.



## 23. భ్రమర హస్తము



అధిదేవత: గరుత్మంతుడు


**వినియోగం:** తుమ్మెద, ఏనుగుదంతము, చాతకము (వానకోయిల), యాగము, మౌనము, నాళము, పుప్పొడి, మాయ, నీటి తుంపర, అవ్యయపదము, పోకముడి విప్పుట, కపటము, రంధ్రము, రకము మొ॥వాని యందు.



## 24. హంస పక్ష హస్తము

అధిదేవత: మన్మథుడు


**వినియోగం:** స్త్రీ, వీణవాయించుట, శుద్ధ నాట్యము, మాటిమాటికి చెప్పుట, ఎండ, సరసము, మోహము, విద్య, స్తంభము, ఉపదేశము, సముద్ర బంధము, మకరికా పత్రము, కప్పుట, మత్తుపదార్థము, రెక్కలు, కౌగిలి, ధైర్యము, వక్షము, స్థానము, రూపము, పులకాంకురము, దత్తపుత్రుడు మొ॥వాని యందు.



## 25. సందంశ హస్తము

అధిదేవత: వాల్మీకి

**వినియోగం:** ముత్యము, పగడము, పులకాంకురము, నీటిచుక్క, రుద్రాక్ష, నాట్యము, మల్లెమొగ్గ, తిల హోమము, మాత్ర, మంచిగా మాట్లాడుట, జ్ఞానోపదేశము, హంస ముఖము, పిల్లనగ్రోవి వాయించుట, పూజ, ధ్యానము, లక్ష్యము, ముద్దు పెట్టుకొనుట, నీచము, చదువు, సంగీతము, శిథిలము, కపటము, మేషాస్యము, ధైర్యము, కోమలము, చెవి, మెడ మొ॥వాని యందు.




## 26. ముకుళ హస్తము

అధిదేవత· చంద్రుడు

**వినియోగం:** భోజనము, జపము, ఆవిరిమొగ్గ, మంచితనము, దానము, మన్మథ బాణము,

పంచప్రాణములు, దీనవచనములు, పసిపిల్లలను ముద్దిడుకొనుట, గాలి, ఐదు అను సంఖ్య, దేవపూజ, ధ్యానము, గర్భము, పుట్టుట, దయారసము, పార్శ్వాంగుళీ స్పర్శనము, స్త్రీయొక్క చక్కిలిగింత, గడ్డము, చూచుకము (స్తనాగ్రము), గోళ్లు మొ॥వానియందు.




## 27. తామ్రచూడ హస్తము

అధిదేవత: బృహస్పతి


**వినియోగం:** నృత్త-గీత-వాద్యములు, కోడిజుట్టు, వేదత్రయము, ముల్లోకములు, శూలము, త్రికూట పర్వతము, ప్రణయము, కన్నీరు తుడుచుట, బ్రహ్మ-విష్ణు-మహేశ్వరులు, ఏడుపు, లెక్కపెట్టుట, ఎరుపు, నలుపు-తెలుపు అను మూడు రంగులు, నిట్టూర్పు,కీర్తి, బావి, పలక మొ॥వానియందు

ఈ ఇరువది ఏడు అసంయుత హస్తములు గాక మిగతావి కొన్ని గ్రంథములలోనున్న ముఖ్యహస్తములు తెల్పబడినవి




## 1. చంద్రకళా లేక రేఖాచంద్ర హస్తము

**వినియోగం:** చంద్రుడు, ముఖం, చూపుడువ్రేలు-బొటన వ్రేలు మధ్యగల దూరం, శివ జటాజూటం, గంగానది, దండం, వినయం, న్యాయము, కీర్తి, పొగడుట, విభక్తులు, ప్రేమ వాక్కులు, విశాలమగు వక్షము, మొ॥ వానియందు



## 2 ఊర్ణనాభ హస్తము (సాలెపురుగు)

**వినియోగం:** కోతి, పెద్దపులి, తాబేలు, రాక్షసి, స్తనములు, భయము, వారము, గడ్డముపట్టుకొనుట, తలగోకుకొనుట, కొండగోగు, దొంగతనం, నరసింహుడు, మృగముఖం మొ॥ వానియందు.



## 3. త్రిశూల హస్తము

వినియోగం:


మూడు అను సంఖ్య, త్రిశూలము, మారేడు పత్రి మొ॥ వానియందు.

## సంయుత హస్తములు

శ్లో॥ స్వస్తికశ్చాంజలిః పుష్పపుటశ్చ చతరశ్రకః॥
కర్తరీ స్వస్తికో డోలాపతాక స్వస్తిక స్తథా
అవహిత్థోవర్ధమానకర ఉత్థానవంచితః
ఉత్సంగః కలశః పక్షవంచిత స్తిలకస్తథా
వైష్ణవో నాగ బంధశ్చ మకరోవల్లభాయితః
కటకావర్ధమానశ్చ మిత్రోత్సంగశ్చ కర్కటః
నిషిద్ధశ్చ రతామోదః కపోతో గజదంతకః
కథితాః సంయుత హస్తాః
ఏతే పంచవింశతి హస్తాః పూర్వాచార్యోదితాః

1. స్వస్తిక
2 అంజలి
3. పుష్పపుట
4. చతురశ్రక
5. కర్తరీ స్వస్తిక
6. డోల
7. పతాకస్వస్తిక
8. అవహిత్థ
9. వర్ధమాన
10. ఉత్థానవంచిత
11 ఉత్సంగ
12. కలశ
13. పక్షవంచిత
14. తిలక
15. వైష్ణవ
16. నాగబంధ
17. మకర
18. వల్లభాయిత
19. కటకావర్ధమాన
20. మిత్రోత్సంగ
21. కర్కట
22 నిషిద్ధ
23. రతామోద
24. కపోత
25 గజదంతక

అను యీ ఇరువది ఐదు సంయుత హస్తములు పూర్వాచార్యులచేత చెప్పబడినవి.




**1. స్వస్తిక హస్తలక్షణం**

మణికట్టు కలియునట్లు త్రిపతాక హస్తములను స్వస్తికముగా పట్టిన స్వస్తికమను హస్తము వచ్చును.

**వినియోగం:** సౌధము, కల్ప వృక్షము, మంగళ వస్తువు, కవచము మొ॥వాని యందు.

**2. అంజలి హస్తలక్షణం**



అరచేతుల చివరలు కలియునట్లు పతాక హస్తములు పట్టిన అంజలి హస్తము వచ్చును.

**వినియోగం :** ప్రణయము, మంగళము, వినయముతో వంగుట, దోసిలి మొ॥ వాని యందు.




**3. పుష్పపుట హస్త లక్షణం**

సర్పశీర్ష హస్తముల రెండిటిని కలిపి పట్టిన పుష్పపుట హస్తము వచ్చును

**వినియోగం:** పుష్పాంజలి, ఫలాదులను సమర్పించుట, ధ్యానము, భూమి, దానము మొ॥వానియందు.


**4. చతురశ్ర హస్త లక్షణం**



కటకాముఖ హస్తములు చతురశ్ర స్థానమున అధోముఖములుగా చేసిన చతురశ్రమను హస్తము వచ్చును.

**వినియోగం:** చాళీ నాట్యము, చామరము, హారము ధరించుట, పట్టాభిషేకము, గుర్రమును త్రాళ్లతో అదుపులో ఉంచుట, మొ॥ వానియందు.


**5. కర్తరీ స్వస్తిక లక్షణం**



మణికట్టులకు క్రిందుగా కర్తరీముఖ హస్తములు స్వస్తికముగా పట్టిన కర్తరీ స్వస్తికమను హస్తము వచ్చును.

**వినియోగం:** చెట్టు, పర్వతము, అడ్డముగా నడుచునది, జడ మొ॥వానియందు.

**6. డోలా హస్త లక్షణం**



పతాక హస్తముల చివరలు ఊరు(తొడ) సమీపమునకు వచ్చునట్లు చేసిన డోలయను హస్తము వచ్చును.

**వినియోగం:** మోహము, అలస భావము, మదము, నాట్యరేఖ, మార్గనాట్యము, మూర్ఛ మొ॥వాటి యందు.


**7. పతాక స్వస్తిక లక్షణం**



మణికట్టు కలియునట్లు పతాక హస్తములు స్వస్తికముగా చేసిన పతాక స్వస్తిక హస్తము వచ్చును.


**వినియోగం :** సముద్రము, మొసలి, మెరుపులు, క్షమాగుణము, వృక్షము, మేఘము మొ॥వాని యందు

**8.** (a) **అవహిత్థ హస్త లక్షణం**



శుకతుండ హస్తములు వక్షమునకు ప్రక్కగా పట్టిన అవహిత్థ హస్తము వచ్చును.

**వినియోగం:** దుర్బలత్వము, సోమరి తనము, యుద్ధము, దేహము కృశించుట, నిట్టూర్పు మొ॥ వాని యందు.




**8. (b) అవహిత్థ హస్త లక్షణం.**

వక్షము దగ్గర అలపల్లవ హస్తములు పట్టిన అవహిత్థ మను హస్తము వచ్చును.

**వినియోగం :** శృంగార నటనము, చాళీ నాట్యము, స్తనములు చూపుట మొ॥వాని యందు

**9. వర్ధమాన హస్త లక్షణం**



హంస పక్షములు అభిముఖముగా పట్టిన వర్ధమాన హస్తమగును.

**వినియోగం:** నృసింహావతారము యొక్క గోళ్లయందు



**10. ఉత్తానవంచిత హస్త లక్షణం**

పార్శ్వముల యందు త్రిపతాక హస్తములు భుజమునకు దగ్గరగా పట్టిన ఉత్తాన వంచిత హస్తము వచ్చును.


**వినియోగం :** విష్ణువు, దైవము, వైష్ణవ విగ్రహములు, దేవతల పుట్టుక మొ॥ వానియందు.

**11. ఉత్సంగ హస్త లక్షణం**



అరాళ హస్తములు వక్షఃస్థలమున ముంజేతులు కలిపి పట్టిన ఉత్సంగమను హస్తము వచ్చును.

**వినియోగం :** ఆదరము, స్నేహము, సిగ్గు కౌగిలించు కొనుట, క్రొత్త పెండ్లికూతురు, స్తనములను దాచుకొనుట మొ॥ వాని యందు.




**12. కలశ హస్త లక్షణం**

అర్ధచంద్ర హస్తములు ఒకదానికొకటి ఎదురుగా కలియునట్లు చేసిన కలశ హస్తమగును,


**వినియోగం:** చెంబు, పూర్ణవస్తువు, కాంతి, నీటిలో మునుగుట, తరంగము మొ॥వానియందు

**13. పక్ష వంచిత హస్త లక్షణం**



అర్ధచంద్ర హస్తములు రెక్కలవలె నడుమున చేర్చిన పక్షవంచిత హస్తమగును.

**వినియోగం:** పిరుదులు, పక్షులరెక్కలు, పక్షులు, మొలత్రాడు మొ॥వానియందు.




**14. తిలక హస్త లక్షణం**

త్రిపతాక హస్తములు ముఖమునందు ఉంచిన తిలకమను హస్తము వచ్చును.

**వినియోగం:** బొట్టు, గంధము, పుష్పము పుష్పాంజలి మొ॥ వానియందు.

**15. నాగబంధ హస్తలక్షణం**



మణికట్టు కలియునట్లుగా సర్పశీర్ష హస్తములు పట్టిన నాగబంధమను హస్తము వచ్చును.

**వినియోగం:** అద్దము, పొదరిల్లు, నాగబంధము, మంత్ర సముదాయము మొ॥వానియందు.



**16. వైష్ణవ హస్త లక్షణం**


వక్షఃస్థలమున పతాక హస్తముయొక్క బొటన వ్రేళ్లు కూర్చి పట్టిన వైష్ణవ హస్తమగును.

**వినియోగం:** చక్రవాకముల జంట, దంపతులు, నిదానము, సముదాయము, విశ్రాంతి, గరుడ మొ॥ వానియందు

(వైష్ణవ హస్త పాఠ భేదము)

ఊర్ధ్వ ముఖములుగా చివరలు కలిపిన పతాక హస్తములు వైష్ణవ హస్తమగును


వినియోగం: పొదరిల్లు ,వర్షము, కిరీటము, పర్వత శిఖరము, చెట్లనుండి పూలు రాలుట, దేవాలయ గోపురము మరియు ఎడమభుజముకు దగ్గరగా పట్టిన సేవా వృత్తిని, కుడి భుజముకు దగ్గరగా పట్టిన భక్తిని, చెవుల దగ్గరగా పట్టిన వినరాని విషయమును వినుట మొ॥వాని యందు.



**17. మకర హస్త లక్షణం**

బొటన వ్రేళ్లు కదిలించుచు అర్ధచంద్ర హస్తములు ఒకదాని మీద నొకటి యుంచిన మకరమను హస్తము వచ్చును.


**వినియోగం:** చేప, మొసలి, సింహము, రాక్షసుడు, సివంగి, కొలను, నది మొ॥వాని యందు.



**18. వల్లభాయిత హస్త లక్షణం**

శిఖర హస్తము మీద మృగశీర్ష హస్తము ఉండునట్లు చేసిన వల్లభాయిత హస్తము వచ్చును.

**వినియోగం:** స్తంభము మొదలగునవి ఎక్కుట, ఉపరతి మొ॥ వానియందు.



**19. కటకావర్ధమాన హస్త లక్షణం**

మణికట్లు క్రింది భాగములు కలియునట్లు కటకాముఖ హస్తములు పట్టిన కటకావర్ధమానమను హస్తము వచ్చును.

**వినియోగం :** నాట్యము, భయము, చింత, దంతము, ఝుక్కిణి యను నృత్యవిశేషము మొ॥వాని యందు.




**20. మిత్రోత్సంగ హస్త లక్షణం**

ఒక దాని మీద ఒకటి నాభి పైభాగమున మృగశీర్ష హస్తములు ఉంచిన మిత్రోత్సంగమను హస్తము వచ్చును.


**వినియోగం:** బుద్ధదేవుడు, బౌద్ధ మతస్థుడు మొ॥ వానియందు.

**21. కర్కాట హస్త లక్షణం**



ఊర్ణ నాభ హస్తము యొక్క వ్రేళ్లసందుల యందు ఒక దానితో ఒకటి దూర్చిపట్టిన కర్కాట హస్తమగును.

**వినియోగం:** విలాసము, ఆవలింత, చిత్త నిగ్రహము, యెంద్రకాయ, అసూయ, శంఖము ధరించుట మొ॥వానియందు.



**22. నిషిద్ధ హస్త లక్షణం**


కపిత్థ హస్తము మీద ముకుళ హస్తము వంచిపట్టిన నిషిద్ధ హస్తము వచ్చును


**వినియోగం:** సత్యం, తక్కువ దనం, దాచుట, శాస్త్రము, పదార్థములను గ్రహించుట, లింగార్చన మొ॥వానియందు.

**23. రతామోద హస్త లక్షణం**




రెండు పతాక హస్తములను ఒకదానికి ఒకటి ఎదురుగా వక్షఃస్థలమున ఉంచి తదుపరి పతాక హస్తములను విరళములుగా జేసి అరాళ హస్తములుగా కూర్చి, ముకుళములుగా నొనర్చిన రతామోద హస్తమగును.





**వినియోగం:** రతి బంధములయందు.


### 24. కపోత హస్త లక్షణం



అంజలి హస్తము యొక్క మొదలు చివరలు కలియునట్లు పట్టి, మధ్యభాగము విరళముగా జేసిన కపోత హస్తమగును.

**వినియోగం:** నమస్కారము, పుష్పాంజలి, కొబ్బరి, బొండము, దాచుట, అరటిపూవు,దంపతులు, పోకచెట్లు మొ॥వాని యందు.

### 25. గజదంత హస్త లక్షణం



సర్ప శీర్ష హస్తములు భుజములు వద్ద వ్యుత్క్రమముగా పట్టిన గజదంతమను హస్తమగును

**వినియోగం:** స్తంభములు, రాళ్లు, కొండలు, స్థైర్యము, ఏనుగు దంతములు పట్టుకొనుట మొ॥ వానియందు.

## నృత్త హస్తములు–33.

శ్లో॥ గజదంత స్తలముఖ విప్రకీర్ణ హస్తా
వధ సూచీ విద్ధనలినీ సరోజ కోశా
మకర జ్ఞాన కిసలయార్ధ రేచితాఖ్యాః
కచబంధశ్చ కపోత పార్శ్వమండలౌ ద్వౌ
త్రిపతాక పక్ష వంచిత కరి హస్త ఊర్ధ్వ మండల శ్చైకః
ముష్టి స్వస్తిక నామా పృద్వృత్త పురోమండలౌ నితంబః
ఉల్బణశ్చ ప్రయుక్తాలపల్లవశ్చ లతాకరః
సూచికాస్య ఉరః పార్శ్వ మండలోదండ పక్షకః
పక్ష ప్రద్యోతిత నామా ముకుళః స్వస్తిక స్తథా
రేచితా విద్ధవక్త్రశ్చాప్యరాళ కటకాముఖః
ముద్రా గరుడ పక్షౌ చ త థైవ వరదా భయః
త్రయస్త్రింశ న్నృత్త హస్తా విశేషాః పరికీర్తితాః

1 గజదంత

2. తలముఖ

3. విప్రకీర్ణ

4. సూచీవిద్ధ

5. నలినీ సరోజ కోశ

6. మకర

7. జ్ఞాన

8. కిసలయ (పల్లవ)

9 అర్ధరేచిత

10 కచబంధ (కేశబంధ)

11 కపోత

12. పార్శ్వ మండల

13. త్రిపతాక పక్ష వంచిత

14. కరిహస్త

15. ఊర్ధ్వమండల

16. ముష్టిస్వస్తిక

17. ఉద్వృత్త

18. పురోమండల

19. నితంబ

20. ఉల్బణ

21. ప్రయుక్తాల పల్లవ

22. లతాకర

23. సూచికాస్య

24. ఉరః పార్శ్వమండల

25. దండ పక్ష

26 పక్ష ప్రద్యోతిత

27. ముకుళ స్వస్తిక

28. రేచిత

29. అవిత్థవక్త్ర


30. అరాళ కటకాముఖ

31. ముద్ర

32. గరుడ పక్ష

33. వరదాభయము

అని ముప్పదిమూడు నృత్య హస్తములు విశేషముగా చెప్పబడినవి



**1. గజదంత హస్త లక్షణం**

శిఖర హస్తముల యొక్క చిటికెన వ్రేళ్లు సాచి పట్టిన గజదంత హస్తమగును


**వినియోగం:** ఏనుగుదంతములు, నీటమునుగుట, శంకుస్థాపనము, భూమిని త్రవ్వుట మొ॥వానియందు.

**2. తలముఖ హస్త లక్షణం**



పతాక హస్తములు మాటిమాటికి చలింప జేయుచు, ఒకదానికొకటి అభిముఖములుగా పట్టిన తలముఖమను హస్తమగును.

**వినియోగం:** నాట్యమును ప్రారంభించుట ఇటు అటు అను అర్థము, స్త్రీల యొక్క స్వభావము మొ॥వానియందు.




**3. విప్రకీర్ణ హస్త లక్షణం**

త్రిపతాక హస్తములు మోచేతులమీద స్వస్తికముగా కూర్చిపట్టిన విప్రకీర్ణ హస్తము అగును.


**వినియోగం:** దేవతాహ్వానము, మంత్రముల యందు, అరణ్య సంబంధ వృక్షాదికములు, కరన్యాసము (హస్తవిన్యాసము), వస్త్రముల చివరిభాగము మొ॥వాని యందు.

**4. సూచీవిద్ధ హస్త లక్షణం**



చివర భాగములు కలియునట్లు ఎదురెదురుగా సూచీముఖ హస్తములు పట్టిన సూచీ విద్ధమను హస్తమగును.

**వినియోగం:** ఆదరము, కూడిక, కలిసికొనుట, కోలాటము వేయుట, చెట్లకొమ్మల యొరపిడి మొ॥వానియందు.




**5. నలినీ పద్మకోశ హస్త లక్షణం**

పద్మకోశ హస్తములు ఊరువుల దగ్గర వ్యావృత్తకరణమున చలింపజేయుచుపట్టిన నలినీ పద్మ (సరోజ) కోశ హస్తమగును.


**వినియోగం:** ముఖనాట్యము, కాడతోకూడిన కమలముల జంట మొ॥వానియందు.

**6. మకర హస్త లక్షణం**



బొటనవ్రేళ్లు చలింపజేయుచు సర్పశీర్ష హస్తములు ఒకదానిమీద ఒకటి ఉంచిన మకరహస్తమగును.

**వినియోగం:** మొసలి, ఈదుట, చెమట మొ॥వానియందు.




**7. జ్ఞాన హస్త లక్షణం**

పతాక హస్తము మీద హంసాస్య హస్తముంచిన జ్ఞాన హస్తమగును


**వినియోగం:** శమము, ధ్యానము, మొ॥వానియందు.

**8. పల్లవ హస్త లక్షణం**



అధోముఖముగా ముంజేతులు కలియునట్లు పతాక హస్తములు చలింపజేయుచు పట్టిన పల్లవ హస్తమగును

**వినియోగం:** ఫలముల బరువు వలన వంగిన చెట్లకొమ్మలు, వినయము, నమ్రభావం మొ॥వానియందు.




**9. అర్ధరేచిత హస్తలక్షణం**

వక్షము వద్ద ఒకదానిమీద ఒకటి హంస పక్ష హస్తములు పట్టిన అర్ధరేచిత హస్తమగును.

**వినియోగం:** సత్యాసత్య నిరూపణము మొ॥ వాని యందు.


**10. కేశ బంధ హస్త లక్షణం**



త్రిపతాక హస్తములు పిరుదులు నుండి ఆకేశాంతము చలింపజేయుచు పట్టిన కేశబంధ హస్తమగును.

**వినియోగం:** రత్నసాను పర్వతము, వృక్షద్వయము, పైకి నడుచుట మొ॥ వానియందు


**11. కపోత హస్త లక్షణం**



ఒక సర్పశీర్ష హస్తము మీద మరియొక సర్పశీర్ష హస్తముంచిన కపోత హస్తమగును.


**వినియోగం :** సర్పముల యొక్క సంయోగముల యందు, పావురముల జంట మొ॥ వానియందు

**12. పార్శ్వమండల హస్తలక్షణం**



ఆరాళ హస్తములను పార్శ్వములందు పట్టిన పార్శ్వమండల హస్తమగును

**వినియోగం:** చక్రవాద్యము, గజ్జెలు మొ॥వానియందు.




**13. త్రిపతాక పక్ష వంచిత హస్త లక్షణం**

త్రిపతాక హస్తములు నడుము దగ్గరగా ఈషదూర్ధ్వముఖముగా పట్టిన త్రిపతాక పక్ష వంచిత హస్తమగును.

**వినియోగం:** తొడలు, భేదము, అతిశయము వీనియందు.

**14. కరిహస్త లక్షణం**



ఎడమ భుజమందు ఎడమచేయి త్రిపతాకము, కుడిచేయి అధోముఖముగా పద్మకోశ హస్తము సాచి పట్టిన కరిహస్తమగును.

**వినియోగం:** ఏనుగుతొండము, వినాయకుడు వీనియందు

**పాఠాంతరము:** ఎడమచేయి సాచి సర్ప శీర్ష హస్తము, కుడిచేయి చెవివద్ద కటకాముఖ హస్తము పట్టిన కరిహస్తమగును

**వినియోగం:** ఏనుగు.




**15. ఊర్ధ్వ మండల హస్త లక్షణం**

ఆరాళ హస్తములు ఊర్ధ్వముఖముగా సాచి పట్టిన ఊర్ధ్వమండల హస్తము వచ్చును.


**వినియోగం:** ప్రళయము, శుక దంపతుల నడక వీనియందు.

**16. ముష్టి స్వస్తిక హస్త లక్షణం**



ముష్టి హస్తములు పొట్టమీద మణికట్ల క్రింద భాగము కలియునట్లు స్వస్తికముగా పట్టిన ముష్టి స్వస్తిక హస్తమగును.

. **వినియోగం :** సిగ్గు, ఓర్పు, పోకముడి, దృఢమగు వస్తువు వీనియందు.



**17. ఉద్వృత్త హస్త లక్షణం**

వక్షమున కెదురుగా హంస పక్ష హస్తములు ఒకదాని కొకటి ఎదురుగ నుండునట్లు పట్టిన ఉద్వృత్త హస్తమగును.


**వినియోగం:** హంస మిధునము, నీటిసుడి, అర్థభావనము, వింజామరము పట్టుకొనుట, తాపము, సిగ్గు, పసిపిల్లలను లాలించుట, ఉండువనుట వీనియందు.

**18. పురోమండల హస్త లక్షణం**



వక్షఃస్థలమున కెదురుగ పతాక హస్తములు పట్టిన పురోమండల హస్తమగును.

**వినియోగం:** భ్రాంతి, అసూయ, క్రోధము, గర్జనము, పామరజనుడు వీనియందు.



## 19 (a) నితంబ హస్త లక్షణం

త్రిపతాకములు భుజములనుండి పిరుదుల వరకు చలింపజేయుచు పట్టిన నితంబ హస్తమగును.


**వినియోగం:** తెర, చీర, తుమ్మెద, భ్రమణము, సూర్యచంద్రుల యొక్క పరివేషము, మకర తోరణము వీనియందు.

## 19 (b) పాఠాంతరం



శిరస్సునుండి పిరుదుల వరకు పతాక హస్తములు (అవవేష్టితముగా) అధోముఖముగా చలింపజేసిన నితంబ మను హస్తము వచ్చును.

వినియోగం : వివశము (సంతోష పారవశముచే తెలివిదప్పుట), ఆశ్చర్యము, శ్రమము, దైన్యము వీనియందు.




## 20. ఉల్బణ హస్త లక్షణం

అలపల్లవ హస్తము సమానమగునట్లు గావించి కించిత్పార్శ్వభాగమునకు పట్టిన ఉల్బణమను హస్తమగును.

**వినియోగం:** పుష్పగుచ్ఛము, పద్మములు, నేత్రములు వీనియందు.


## 21. ప్రయుక్తాలపల్లవ హస్త లక్షణం



వక్షమునకు ముందు ఊర్ధ్వముఖముగా అలపల్లవ హస్తములు పట్టిన ప్రయుక్తాలపల్లవ హస్తమగును

**వినియోగం:** కోరిక, పద్మము, స్తనములు వీనియందు

## 22. (a) లతా హస్త లక్షణం




వక్షమునకు అగ్రభాగముగా అల పల్లవ హస్తములు చలింపజేయుచు సాచి పట్టిన లతాహస్తమగును.

**వినియోగం:** పూలు, మొగ్గలు గల తీగె, నారీ నాట్యము వీనియందు.

## 22. (b) పాఠాంతరం

పతాక హస్తములు మాటి మాటికి ఉయ్యేల వలె నూపుచు, నిలుపుచు-కలిపి పట్టుచు నుండిన లతా హస్తమగును

**వినియోగం:** చేష్టలు, దక్కుట, నిశ్చలము, సరసము, నాట్యము వీనియందు.




## 23. సూచికాస్య హస్త లక్షణం

వక్షము నుండి సూచీ ముఖ హస్తములు పార్శ్వభాగములకు, పార్శ్వములనుండి వక్షమునకు ప్రసరింపజేసిన సూచికాస్యమను నృత్య హస్తము రాగలదు.

**వినియోగం:** సంయోగము, వియోగము, చూడమనుట, శ్రమ, చెక్కిళ్లు, చితి, కాలము మొ॥లగు వానియందు.

## 24. ఉరః పార్శ్వమండల హస్త లక్షణం



వక్షమునకు దగ్గరగా పతాక హస్త మొకటి చలింపజేయుచు, మరియొక పతాక హస్తము పార్శ్వమునకు సాచి పట్టిన ఉరః పార్శ్వమండల హస్తమగును.

వినియోగం: గుర్రముయొక్క కళ్లెము, అశ్వశిక్షణ వీనియందు.

## 25. (a) దండ పక్ష హస్త లక్షణం




భుజముల దగ్గర, ముఖము దగ్గర అలపల్లవ హస్తములు వ్యావృత్త -పరివృత్తములుగా చేసిన దండ పక్షమను హస్తము వచ్చును.

**వినియోగం:** నాట్యమందలి చారీ విధానము-మండల విధానము, గుండ్రముగా తిరుగుట పుష్పాంజలి, నాట్యాంతము, పక్షుల సంచలనము వీనియందు.




25 (b) హంస పక్షలతా హస్తములు ఒక దాని తరువాత నొకటి.




25 (c) వ్యావృత్తీకరణమున పార్శ్వముల యందు పట్టిన దండ పక్షమను హస్తమగును.

**వినియోగం:** స్త్రీ విలాసాలు, నడకలు వీనియందు.

## 26. పక్షజ్యోతిత హస్త లక్షణం




(a) అర్ధచంద్ర హస్తములు రెక్కలవలె నడుము వద్దపట్టి.



(b) తరువాత వక్షమునకు అర్ధ చంద్ర హస్తములనే స్వస్తికగా చేర్చి పట్టిన పక్ష జ్యోతితమను హస్తము వచ్చును.

**వినియోగం:** లోతుగల నది, ఆదివరాహము.

## 27. ముకుళ స్వస్తిక హస్త లక్షణం




ఈ బొమ్మలో చూపబడిన ముకుళ హస్తములను ముంజేతులు కలియునట్లు స్వస్తికగా పట్టిన ముకుళ స్వస్తిక మను హస్తము వచ్చును.

వినియోగం: పదియను సంఖ్య, తామర పూలు, అరవిరి మొగ్గలు వీనియందు



56016

## 28. రేచిత హస్త లక్షణం



వక్షమునకు ముందు చతురస్రములుగా నున్న అలపల్లవ హస్తములు పార్శ్వ భాగమునకు ప్రసాదింపుచు చలింపజేసిన రేచితమను హస్తమగును.


**వినియోగం:** చాలీయము( నాట్యవిశేషము) కొబ్బరికాయ, ప్రతాపము, నాట్య పరిసమాప్తము వీనియందు.

**పాఠాంతరము**

హంస పక్ష హస్తములు ముందు భాగమునకు సాచి ఊర్ధ్వముగా ఎత్తుచు పట్టిన రేచిత మను హస్తమగును.

**వినియోగం:** చిత్ర ఫలకము, చదువులు చదివించుట వీనియందు


## 29. అవిద్ధ వక్ర హస్త లక్షణం



ముకుళ హస్తములు మణికట్లు కలిపి చలింప జేయుచు పట్టిన అవిద్ధ వక్ర మను హస్తము వచ్చును.


**వినియోగం:** ఆట ప్రదేశము, దేవతాపూజ, నటనము, పక్షులయొక్క పోట్లాట వీనియందు.

## 30. అరాళ కటకాముఖ హస్త లక్షణం



ఒక చేయి అరాళముగను, మరొక చేయి కటకా ముఖముగను స్వస్తికముగ చేసిన అరాళ కటకా ముఖమను హస్తము అగును.

**వినియోగం :** ఆకుమడుపు లిచ్చుట. స్ఫురణ, భేదము, శ్లాఘనము వీనియందు.



**31. ముద్రాహస్త లక్షణం**


రెండు హస్తములయొక్క నడిమి వ్రేళ్లు-బొటన వ్రేళ్ళు కలిపి పట్టిన ముద్రాహస్తము వచ్చును.

**వినియోగం:** అణువు, గడ్డిపోచ, ఆవు మోర (ముఖము), పక్షులముక్కు చూపుట వీనియందు.

**32. గరుడ పక్ష హస్త లక్షణం**

అర్ధ చంద్ర హస్తములు ముందునకు ప్రక్కలకు, పిరుదుల దగ్గర మార్పుచేయుచు పట్టిన గరుడ పక్ష మను హస్తమగును.

**వినియోగం:** ఒయ్యారముగా నడుచుట, గరుత్మంతుడు వీనియందు.



**33. వరదాభయ హస్త లక్షణం**

పతాక హస్తములు వక్ష భాగమునకు కొంచెము ముందుగా ఒకటి ఊర్ధ్వ ముఖముగను, మరొకటి అధోముఖముగను పట్టిన వరదాభయ హస్తము వచ్చును.

**వినియోగం:** మహావిష్ణువు, దేవతా మూర్తులు, పరాశక్తి మొ॥వానియందు.

## దేవతా హస్తప్రకరణం

**దశావతారములు:**

శ్లో॥ మత్స్య కూర్మ వరాహశ్చ నారసింహశ్చ వామనః
రామశ్చరామోకృష్ణశ్చ బౌద్ధః కల్కిమేవ చ॥

తా॥ మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ, రామ, కృష్ణ, బుద్ధ, కల్కి యని శ్రీమహావిష్ణువు యొక్క అవతారములు పది విధములు.

### 1 మత్స్యావతారం (చేప)

వైష్ణవ స్థానమందు నిలిచి, మకర హస్తములను ఒకదానిమీద ఒకటి పట్టిన మత్స్యావతార మగును.

### 2. కూర్మావతారం (తాబేలు)

వైష్ణవ స్థానమునందుండి కుడిచేయి అధోముఖముగా ఎడమచేయి ఊర్ధ్వముఖముగా ఒకదానిపై నొకటి శుక తుండము హస్తములను పట్టిన కూర్మావతార మగును.

### 3. వరాహావతారం (పంది)

రెండు మృగశీర్ష హస్తములను ఒకదానిపై నొకటి పట్టి నడుము వద్ద నిలిపి వైష్ణవ స్థానమున నిలిచిన వరాహావతార మగును.

### 4. నృసింహావతారం

ఎడమ కాలి మీద నిలిచి కుడికాలు పురోభాగమునకు మడిచి, ఎడమకాలి యందుంచి వర్ధమాన హస్తములను ముందు భాగములకు పట్టి వ్రేళ్లు కంపింపజేసిన నృసింహావతార మగును.

### 5. వామనావతారం

ఎడమచేయి కమండలము ధరించినట్లుగా పద్మకోశ హస్తమును బోర్లవైచి, కుడిచేయి హృదయమందు ఆరాళ హస్తముగా పట్టి వైష్ణవ స్థానమందు నిలిచిన వామనావతార మగును.

### 6. పరశురామావతారం

సమస్థానమున నిలిచి ఎడమ భుజమున పతాక హస్తములు ఊర్ధ్వ ముఖముగా కలిపి పట్టిన పరశురామావతార మగును.

### 7. రామావతారం

ఆలీఢ స్థానమందు నిలిచి, ఎడమచేయి సాచి శిఖర హస్తము పట్టి, కుడిచేయి కుడి భుజమునకు ప్రక్కగా చెవి సమీపమున కటకాముఖ హస్తము పట్టిన రామావతార మగును.

**8. కృష్ణావతారం**

రెండు మృగశీర్ష హస్తములు భుజ, శిరస్సు సమీపమున ఎదురెదురుగా (మురళి పట్టినట్లు ) పట్టిన కృష్ణావతార హస్త మగును.

**9. బౌద్ధావతారం**

ఎడమ హస్తమున సర్పశీర్ష హస్తమును బొడ్డువద్ద పట్టి (భిక్షాపాత్ర పట్టినట్లు) కుడి హస్తమున హంసాస్య హస్తమును పట్టిన బౌద్ధావతార హస్త మగును.

**10. కల్క్యవతారం.**

ఎడమ భుజముమీద పతాక హస్తమును కుడి భుజముమీద ముష్టి హస్తమును బట్టి ఒంటికాలు మీద నిలిచిన కల్క్యవతార మగును.

బ్రహ్మ

కుడిచేయి హంసాస్యము, ఎడమ చేయి చతురము (వేదములు పట్టినట్లు) పట్టి బ్రహ్మ స్థానమున నిలిచిన బ్రహ్మ యగును.

(a) విష్ణు

సమస్థానమున నిలిచి, వరదాభయ హస్తములు పట్టిన విష్ణుమూర్తి యొక్క నానా రూపముల యందు వినియోగించును.

(b) రెండు చేతులను త్రిపతాక హస్తములు భుజముల వద్ద పట్టిన విష్ణు నిరూపణ మగును.

(c) శంఖు, చక్ర హస్తములు భుజముల కిరుప్రక్కల చూపిన విష్ణునిరూపణ మగును.

శివుడు

ఎడమచేత మృగ శీర్ష, కుడిచేత త్రిశూల హస్తములను పట్టిన శంభు నిరూపణ మగును.

అర్ధనారీశ్వరుడు

కుడిచేయి పద్మకోశము, ఎడమచేయి తామ్రచూడమును పట్టి శైవస్థానమున నిలిచిన అర్ధనారీశ్వరు డగును.

### సరస్వతి

కుడిచేత సూచీ హస్తమును ఎడమచేత అర్ధచంద్ర హస్తమును (వీణపట్టినట్లు) పట్టిన సరస్వతీ దేవి యగును.

### (a) పార్వతి

కుడియెడమచేతులకు క్రింద మీదు చేసి అర్ధచంద్ర హస్తములు పట్టిన పార్వతీ దేవి యగును.

(b) ఎడమచేయి ఎడమ భుజము దగ్గర కటకాముఖము, కుడిచేయి అధోముఖముగా పతాక హస్తమును పట్టి నిలిచిన పార్వతీ దేవి యగును

### లక్ష్మి

బాహువు మూలములందు రెండు కపిత్థ హస్తములు పట్టిన లక్ష్మీ దేవి యగును.

### విఘ్నేశ్వరుడు

ఎదురుగా రెండు కపిత్థ హస్తములు పట్టిన విఘ్నేశ్వర నిరూపణ మగును.

### షణ్ముఖుడు

ఎడమచేతియందు త్రిశూల హస్తమును, కుడిచేతియందు శిఖర హస్తమును ఎత్తుగా పట్టిన షణ్ముఖ నిరూపణ మగును.

### మన్మథుడు

ఎడమ చేతియందు శిఖర హస్తమును కుడిచేతియందు కటకాముఖ హస్తమును పట్టిన మన్మథ హస్త మగును.

### భూదేవి

ఎడమచేయి కటకాముఖము, కుడిచేయి పతాకము పట్టి అధోముఖముగా మండలాకారము వచ్చునట్లు పట్టిన భూమి హస్త మగును.

### ఊర్వశి

ఎడమ భుజమున ఎడమ చేయి కటకా ముఖమును, కుడిచేయి శిరమున త్రిపతాకగాను పట్టి, క్రీగంటి చూపులు చూస్తూ నిలిచిన ఊర్వశి యగును.

## ఆంజనేయుడు

ఒక కాలు మడిచి కూర్చుండి, ముకుళ హస్తములను పట్టిన ఆంజనేయుడగును. దీనినే సుగ్రీవునకు అన్వయించవచ్చును.

## అష్టదిక్పాలకులు

**ఇంద్రుడు :**

ఎడమచేత ఆరాళ హస్తమును, కుడిచేత త్రిపతాక హస్తమును, ఫాల భాగమందు పట్టిన ఇంద్రుడగును.

**అగ్ని :**

హృదయమందు ఎడమచేత అడ్డముగా త్రిప్పి కర్తరీముఖము, కుడిచేయి త్రిపతాకము పట్టిన అగ్ని యగును.

**యముడు :**

ఎడమచేయి ఎడమభుజమునందు సూచీ ముఖమును, కుడిచేయి వక్షఃస్థలమున అలపల్లవ పట్టిన యము డగును.

**నైఋుతి :**

ఎడమచేయి ఎడమభుజమందు అర్ధచంద్రము, కుడిచేయి ఊర్ధ్వ ముఖముగా పతాకము పట్టి సమస్థానమందు నిలిచిన నైఋుతి యగును.

**వరుణుడు :**

ఎడమచేయి అధోముఖముగా పతాకము, కుడిచేయి ఆరాళము పట్టి మరల అభయ హస్తమువలె మార్చి పట్టిన వరుణు డగును.

**వాయువు :**

సమస్థానమున నిలిచి, ఎడమచేయి పతాకము అధోముఖముగాను, కుడిచేయి పతాకము ఊర్ధ్వముఖముగాను చలింపజేయుచుండిన వాయు వగును.

**కుబేరుడు :**

ఎడమచేతియందు పద్మ హస్తమును, కుడిచేతియందు శిఖర హస్తముపట్టి సమపాదమున నిలిచిన కుబేర హస్త మగును.

ఈశానుడు :

కుడిచేయి త్రిపతాకము, ఎడమచేయి ముష్టి హస్తము పట్టి శైవ స్థానమున నిలిచిన ఈశాన దిక్పతి యగును ( శివుడగును).

## నవగ్రహములు

**1. సూర్య హస్తము**

భుజ శిరస్సుల యందు ఎడమచేత అలపద్మ హస్తమును, కుడిచేత పతాక హస్తమును పట్టిన సూర్య హస్త మగును.

**2. చంద్ర హస్తము**

ఎడమచేత సోలపద్మ హస్తమును, కుడిచేత పతాక హస్తమును పట్టిన చంద్రహస్త మగును.

**3. అంగారక హస్తము**

ఎడమచేత సూచీ హస్తమును, కుడిచేత ముష్టి హస్తమును పట్టిన అంగారక హస్త మగును.

**4. బుధ హస్తము**

ఎడమచేత నడ్డముగా ముష్టి హస్తమును, కుడిచేత పతాక హస్తమును పట్టిన బుధ హస్త మగును.

**5. బృహస్పతి హస్తము**

హస్తముల రెంటిచేత శిఖర హస్తములు యజ్ఞ సూత్ర ప్రదర్శనమందు వలె పట్టిన బృహస్పతి హస్త మగును. ఇది ఋషుల యందును, బ్రాహ్మణుల యందును చెల్లును.

**6. శుక్ర హస్తము**

ఎడమ ప్రక్క మీదుగాను, కుడి ప్రక్క క్రిందుగాను ముష్టి హస్తములు పట్టిన శుక్ర హస్త మగును.

**7. శని (శనైశ్చర) హస్తము**

ఎడమచేత శిఖర హస్తమును, కుడిచేత త్రిశూల హస్తమును పట్టిన శనైశ్చర హస్త మగును.

**8. రాహు హస్తము**

ఎడమచేత సర్పశీర్షహస్తమును, కుడిచేత సూచీహస్తమును పట్టిన రాహుహస్త మగును

**9. కేతు హస్తము**

ఎడమచేత సూచీహస్తము, కుడిచేత అర్ధపతాకహస్తమును పట్టిన కేతుహస్త మగును.

## చతుర్వర్ణములు

**1. బ్రాహ్మణ హస్తము**

రెండు శిఖర హస్తములను పట్టి కుడిచేత అడ్డముగా జన్నిదమును జూపునెడ బ్రాహ్మణ హస్త మగును.

**2. క్షత్రియ హస్తము**

ఎడమచేత శిఖర హస్తమును అడ్డముగా పట్టి, కుడిచేత పతాక హస్తమును పట్టునెడ క్షత్రియ హస్త మగును.

**3. వైశ్య హస్తము**

ఎడమచేత హంసాస్య హస్తము, కుడిచేత కటకాముఖ హస్తమును పట్టిన వైశ్య హస్త మగును.

**4. శూద్ర హస్తము**

ఎడమచేత శిఖర హస్తమును, కుడిచేత సూచీ హస్తమును బట్టిన శూద్ర హస్త మగును.

## బాంధవ్య హస్తములు

**1. మాతృహస్తము (తల్లిహస్తము) :**

ఎడమచేత అర్ధచంద్ర హస్తము, కుడిచేత సందంశ హస్తమును నాభి కెదురుగా పట్టి, పిమ్మట ఎడమచేత మృగశీర్ష హస్తమును పట్టిన యెడల మాతృహస్త మగును. ఇది తల్లికి, కుమార్తెకు ఉపయోగించును.

**2. పితృ హస్తము (తండ్రి హస్తము)**

ఎడమచేయి పార్శ్వమునకు పతాక హస్తము పట్టి, కుడిచేయి సింహ ముఖ హస్తము ఊర్ధ్వముఖముగా చలింపజేసిన పితృహస్త మగును.

**3. దంపతీ హస్తము**

ఎడమచేత శిఖర హస్తమును, కుడిచేత మృగశీర్ష హస్తములు పట్టిన దంపతీ హస్త మగును.

**4. తాత హస్తము**

లలాటమున అంజలి హస్తము, తర్వాత కుడిచేత శిఖర హస్తము పట్టిన తాత హస్త మగును.

**5. నాయనమ్మ హస్తము**

కుడిచేయి వక్షమందు ముకుళ హస్తము పట్టి, ఎడమచేయి సర్పశీర్ష శిరమునందుంచిన నాయనమ్మ హస్త మగును.

**6. పినతండ్రి హస్తము**

నడుమునందు సర్పశీర్ష హస్తము పట్టినను, కుడిపార్శ్వమున అంజలిహస్తము పట్టినను పినతండ్రి హస్త మగును.

**7. అక్క హస్తము**

భుజములయందు పతాక హస్తములను పట్టి, చతుర హస్తములుగా మార్చిన అక్కహస్త మగును

**8. చెల్లెలు హస్తము**

నాభి స్థానమున మృగశీర్ష హస్తము పట్టిన చెల్లెలు హస్త మగును.

**9. శ్వశ్రు హస్తము (అత్త)**

కంఠమందు హంసాస్యము నుంచి కుడిచేత బట్టిన సందంశ హస్తమును నాభి కెదురుగా త్రిప్పి, ఎడమచేత స్త్రీ హస్తమును పట్టిన శ్వశ్రు హస్త మగును

**10. శ్వశుర హస్తము (మామ)**

కంఠమందు హంసాస్య హస్తమునుంచి, కుడిచేత శిఖర హస్తము నాభి కెదురుగా పట్టిన శ్వశుర హస్త మగును

**11. భర్తృ హస్తము (భర్త)**

కంఠమందు ఎడమచేత హంసాస్యము, కుడిచేత శిఖర హస్తము పట్టిన భర్తృహస్త మగును.

**12. సపత్నీ హస్తము (భార్య)**

పాశ హస్తమును చూపి రెండుచేతుల యందును స్త్రీ హస్తములను పట్టిన సపత్నీ హస్త మగును.

**13. బావ హస్తము**

వక్షమందు కుడిచేత శిఖరము, ఎడమచేత పతాకము పట్టిన బావ హస్త మగును. ఇది మరిదికి కూడ చెల్లును

మరిది: చెల్లెలు భర్త.

బావ: మగని అన్న మరియు అక్కకు భర్త.

**14. మేనమామ హస్తము**

ఎడమపార్శ్వమున అంజలి హస్తము పట్టిన మేనమామ యందు వినియోగించును.

**15. స్నేహితుని హస్తము:**

(a) ఎడమచేత పతాక హస్తము, కుడిచేత అర్ధపతాకము పట్టిన స్నేహితుని హస్త మగును.

(b) కుడి, ఎడమల చేత ఎదుటివానికి కరచాలనము చేయునట్లు ముష్టి హస్తమును పట్టిన స్నేహితుని హస్త మగును.

## 16. అవయవములకు హస్తములు

| | | |
|---|---|---|
| 1. | పాదములు<br>నుదురు | పతాకము చేతను |
| 2. | చీలమండలు<br>నడుము | ముష్టి చేతను |
| 3. | పిరుదులు<br>మోకాళ్లు | అర్ధచంద్ర చేతను |
| 4. | పిక్క<br>పొట్ట | కపోతము చేతను |
| 5. | తొడలు : | కరి హస్తము చేతను |
| 6. | యోని : | కటకాముఖముచేతను |
| 7. | శిశ్నము : | మృగశీర్ష చేతను |
| 8. | గోళ్లు<br>ముంగురులు<br>శిరము<br>చెక్కిళ్లు<br>వృషణములు | త్రిపతాక హస్తముచేతను |
| 9. | దంతములు : | శుక తుండముచేతను |
| 10. | గుదము : | సందంశము చేతను |
| 11. | దృష్టి:<br>కనుబొమలు<br>బొడ్డు<br>ముక్కు | సూచీ ముఖము చేతను |

12. క్రింది పెదవి | సూచీ ముఖముచేతను
గుణము
బుద్ధి

13. కేశ పాశము (జడ)· కర్తరీ స్వస్తిక చేతను

14. మనోవికారము . కర్తరీ ముఖముచేతను

15. స్తనములు : నళినీ పద్మ కోశము చేతను

16. వెంట్రుకలు : అలపల్లవి చేతను

17. హృదయము : స్వస్తికము చేతను

18. చూచుకములు : | ముకుళము చేతను
(స్తనాగ్రములు)
గోరు :

19. నూగారు · సర్పశిరము చేతను
(ఉదరమందు రోమావళి)

20. చెవులు : . | హంసపక్షము చేతను
మాటలు

యథాయోగ్యముగా అభినయించవలెను.

## పంచ భూతములు – నదులు

ఎడమచేత పతాక హస్తము, కుడిచేత సూచీముఖము పట్టిన పంచభూతములను శబ్దమునకు చెల్లును.

**పంచభూతములు : 5**

1) భూమి 2) నీరు 3) అగ్ని 4) వాయువు 5) ఆకాశము

**1. భూమి :** పతాకము లేక సూచీముఖ హస్తములు కుడిచేత పట్టి క్రిందకు చూపిన భూమికి చెల్లును

**2. నీరు :** శిఖర హస్తమును కుడిచేత పట్టి నోటియందు నీరు త్రాగునట్లు చూపిన నీటికి చెల్లును.

**3. అగ్ని :** త్రిపతాక హస్తము కుడిచేత పట్టి, తీక్ష్ణ దృష్టితో చూసిన అగ్నికి చెల్లును.

**4. వాయువు :** పతాక హస్తమును కుడిచేత పట్టి కదిలించిన వాయువుకు చెల్లును.

**5. ఆకాశము :** సూచీముఖ హస్తము కుడిచేత పట్టి పైకి చూపిన ఆకాశమునకు చెల్లును

**6. సముద్రము :**

పతాక హస్తములు కుడి, ఎడమ చేతులను ప్రక్క ప్రక్కన బెట్టి సముద్రపు అలలు వచ్చునట్లు విన్యాసమున తెలియుజేయవలెను.

**7. ఆకాశ గంగ :**

సముద్రము వలె కుడిచేయి పతాక హస్తము ఊర్ధ్వముఖముగాను, ఎడమచేయి, ఊర్ధ్వముఖ పతాక హస్తమును అడ్డముగా సంచరింప జేసిన ఆకాశ గంగ యగును.

**8. గంగానది :**

ఎడమచేయి కటకాముఖము, కుడిచేయి వ్రేళ్లు ఎడమెడముగా పతాకము సాచిపట్టి ముందు భాగమునకు నడిచిన గంగానదికి చెల్లును.

**9. గోదావరి నది :**

చేతి వ్రేళ్లు ఎడమెడముగా రెండు చేతులు పతాక హస్తములు పట్టి అధోముఖముగా సంచరింపజేసిన గోదావరినది యగును

**10. కావేరి-రేవా-నర్మదానదులు :**

గోదావరి వలె రెండు పతాక హస్తములు ఎడమెడముగా వ్రేళ్లుపట్టి, చక్ర సంచారము చేయుచు వక్రముగా నడిచిన కావేరి నదికి చెల్లును. ఇవి రేవా, నర్మదా నదులకు ఆచరణ యోగ్యము.

**11. తుంగభద్రానది :**

అధోముఖముగా చలింపజేయు కుడిచేయి పతాక హస్తము, ఎడమచేయి మధ్య యందు కొంచెము వంగి మృగశీర్ష హస్తము పట్టిన తుంగ భద్రానదికి చెల్లును

## మృగ హస్తములు

**1. సింహము**

కుడిచేత సింహముఖ హస్తమును పట్టి దాని వెనుక వైపు పతాక హస్తమును ఎడమచేత వ్రేళ్లను విభజించి పట్టిన శ్లిష్ట సింహముఖ హస్తమగును. ఈ హస్తము సింహమునందు చెల్లును.

**2. వ్యాఘ్రము (పెద్దపులి)**

క్రూర దృష్టితో రెండుచేతులతో అలపల్లవి హస్తములు ముందునకు సాచిపట్టి ఆలీఢస్థానమున కాలు కుంచించి నిలిచిన పెద్దపులికి చెల్లును.

**3. వృషభము (ఎద్దు)**

మధ్యమ అనామికను కొంచెము అరచేతి తట్టునకు వంచి, వాని మీద అంగుష్ఠమును చేర్చి తక్కిన వ్రేళ్లను చాచి పట్టిన తల సింహ హస్త మగును. ఇది వృషభము (ఎద్దు) నకు చెల్లును.

**4. ధేనువు (ఆవు)**

నడిమి వ్రేలిని వంచి, తక్కిన వ్రేళ్లను చాచిపట్టిన యెడల సంకీర్ణముద్ర హస్త మగును. ఇది ఆవునందును, యంత్ర భేదము నందును చెల్లును.

**5. సూకర హస్తము (పంది)**

మత్స్య హస్తమందు కుడి హస్తమును వంచి కదిలించుచు వ్రేళ్ల నైదింటిని విరళముగా పట్టిన నది సంకీర్ణమకర హస్త మనబడును. ఇది పందియందు వినియోగించును.

**6. కపి హస్తము (కోతి)**

ముష్టి హస్తము మధ్యమాంగుష్ఠముల చేరికవలన అధోముష్టి ముకుళ హస్త మనబడును ఇది కోతియందు చెల్లును.

**7. భల్లూక హస్తము (ఎలుగు బంటి)**

ఎడమచేత దిగుమొగముగా పద్మకోశ హస్తమును పట్టి, కుడిచేత పతాక హస్తమును దానిపై నుంచిన యెడల పద్మకోశ పతాక హస్తమగును. ఇది ఎలుగుబంటి యందు చెల్లును.

**8. మార్జాల హస్తము (పిల్లి)**

ముంది చెప్పబడిన ముష్టి హస్తముయొక్క అనామికాంగుష్ఠములను జేర్చి పట్టిన అది అర్ధముకుళ హస్తమగును. ఇది పిల్లియందు చెల్లును.

**9. కురంగ హస్తము (జింక)**

మృగశీర్ష హస్తము జింకయందు చెల్లును.

**10. మూషిక హస్తము (ఎలుక)**

ముకుళ హస్తమందు చూపుడు వ్రేలిని బాగుగా చాచిపట్టిన ఖండము కుళహస్త మనబడును. ఇది ఎలుక యందు చెల్లును

## పక్షి హస్తములు

**1. పారావతము (పావురము)**

కపోత హస్తమును పుంఖితాకారముగ (మొనదేలి) పట్టిన పావుర హస్త మగును.

**2. కపోత హస్తము (గువ్వ)**

అడ్డముగా పట్టిన కపోత హస్తమగును.

**3. పికము (కోకిల)**

అరాళ హస్తమును పుంఖితముగా పట్టిన పిక హస్త మగును.

**4. చాతకము (వానకోయిల)**

లాంగూల హస్తమును పుంఖితముగా పట్టిన చాతక హస్త మగును

**5. శుకము (చిలుక)**

శుక తుండ హస్తమును పుంఖితముగా పట్టిన శుక హస్త మగును

**6. భ్రమరము (తుమ్మెద)**

భ్రమర హస్తమును పుంఖితముగా పట్టిన యెడల భ్రమర హస్త మగును.

**7. మయూరము (నెమలి)**

మయూర హస్తమును ఊర్ధ్వముఖముగా పట్టిన మయూర హస్త మగును.

**8. హంస**

హంసాస్య హస్తము హంస పక్షి యందు చెల్లును.

**9. చక్రవాకము**

అల పద్మహస్తమును పుంఖితముగ పట్టిన చక్రవాక పక్షియందు చెల్లును.

## పిశాచములు

వంకర నడక, క్రూరదృష్టి గలిగి, అడ్డదిడ్డముగా చలింపజేయు ముష్టి సోల పద్మ హస్తములతో దంత ఘట్టనము చేసిన శాకిని, ఢాకిని మొదలగు పిశాచముల యందు చెల్లును.

**శృంగారాది రసములకు హస్తములు:**

| | | | |
|---|---|---|---|
| 1 | శృంగారము | : | అలపల్లవము |
| 2 | హాస్యము | : | హంసాస్యము |
| 3 | కరుణము | : | ముకుళము |
| 4 | రౌద్రము | . | శుకతుండము |
| 5 | వీరము | : | త్రిపతాకము |
| 6. | భయానకము | : | కర్తరీ ముఖము |
| 7 | బీభత్సము | : | ఊర్ణనాభము |
| 8. | అద్భుతము | : | పద్మకోశము |
| 9 | శాంతము | : | హంస పక్షము |

ఈ రసములకు - ఈ హస్తములు సందర్భమును బట్టి తగిన స్థానకములతో పట్టవలెను.

### మేషాది రాసులకు హస్తములు :

1. మేషరాశికి హంసాస్యము
2. వృషభరాశికి శిఖరము
3. మిథునరాశికి అర్ధపతాకము
4. కర్కాటకరాశికి కర్కటకము
5. సింహరాశికి సింహముఖము
6. కన్యరాశికి మృగశీర్షము
7. తులా రాశికి ముష్టి
8. వృశ్చిక రాశికి శుకతుండము
9. ధనుస్సు రాశికి అర్ధచంద్రము
10. మకర రాశికి పతాక స్వస్తిక
11. కుంభ రాశికి కలశము
12. మీన రాశికి మకరము

హస్తములు చెల్లును.

## వారాదులకు హస్తములు

| | |
|---|---|
| 1. ఆదివారమునకు:- | అల పల్లవము |
| 2. సోమ వారమునకు:- | అర్ధచంద్ర |
| 3. మంగళ వారమునకు:- | త్రిపతాకము |
| 4. బుధ వారమునకు:- | సందంశము |
| 5. గురు వారమునకు:- | శిఖరము |
| 6. శుక్ర వారమునకు:- | పతాకము |
| 7. శని వారమునకు:- | ముష్టి |

## కాలమునకు హస్తములు

1 గడియలకు : సూచీ ముఖము

| | |
|---|---|
| 2. జాములు<br>నిముసములు | హంసాస్యము |
| 3 దినములు<br>పక్షములు<br>అయనములు<br>వత్సరములు | పతాకముచే<br>అభినయించదగును. |

## రత్నములు

| | | |
|---|---|---|
| 1. | పుష్యరాగం:- | లాంగూలము |
| 2. | వజ్రము:- | సింహ ముఖము |
| 3. | చంద్ర కాంత మణి:- | అర్ధ చంద్రము |
| 4. | ముత్యము :- | హంసాస్యము |
| 5. | నీలము:- | కటకాముఖము |
| 6. | మరకతము :- | చతురము |
| 7. | పద్మరాగము:- | సందంశము |
| 8. | పగడము:- | శిఖరము |
| 9. | గోమేధికము·- | అర్ధ పతాకము |
| 10. | సూర్యకాంత మణి:- | అలపల్లవము |
| 11. | వైఢూర్యము:- | సింహాముఖము |

హస్తముల చేత అభినయించదగును.

## లోహములు

1. ధనము .- త్రిపతాకము
2 బంగారము - చతురము
3. వెండి .- పతాకము
4. కంచు .- సింహముఖము
5. ఇనుము :- ముష్టి
6. సత్తు :- / తగరము — సూచీముఖము
7. సీసము :- లాంగూలము
8. ఇత్తడి :- చతురము
9. లోహ భేదములను / లోహ ప్రయోజనములను — అర్ధపతాకము

హస్తములతో అభినయించదగును.

## స్వరములు

1. షడ్జమును మయూర
2. ఋషభమును మృగశీర్ష
3. గాంధారమును సింహముఖ
4. మధ్యమమును హంసాస్య
5. పంచమమును శుకతుండ
6. దైవతమును అర్ధపతాక
7. నిషాదమును సందంశ

హస్తములతో అభినయించదగును.

## సంఖ్యలు

ఒకటి అను సంఖ్యకు సూచీముఖ

రెండు అను సంఖ్యకు అర్ధపతాక

మూడు అను సంఖ్యకు త్రిశూల

నాలుగు అను సంఖ్యకు త్రిపతాక

ఐదు అను సంఖ్యకు ముకుళ- పతాక

ఆరు అను సంఖ్యకు బాణ

ఏడు అను సంఖ్యకు సందంశ

ఎనిమిది అను సంఖ్యకు హంసాస్య

తొమ్మిది అను సంఖ్యకు కటకాముఖ

పది అను సంఖ్యకు అర్ధచంద్ర

హస్తములను వినియోగించవచ్చును.

## షడ్రసములు

1. మధుర రసము (తీపి)నకు అలపల్లవ
2. తిక్తరసము (చేదు)నకు
   సింహ ముఖము పట్టి బొటన వ్రేలిని కదిలించవలెను.
3. ఆమ్లరసము (పులుపు)
   లాంగూలము ఊర్ధ్వముగా చలింపజేయవలెను.
4. వగరు చతుర
5. కారము ఖండచతుర
6. ఉప్పు ముకుళ

హస్తములచే అభినయించదగును.

అభినయము చేసే విధానాలను ప్రాణములు అంటారు. హస్తాభినయం చేసే విధానమును హస్తప్రాణాలు అంటారు.

**హస్త ప్రాణాలు :- ఇవి పన్నెండు విధాలు.**

1. ప్రసారితము :- హస్తములు సాచి అభినయించడం.
2. కుంచితము :- హస్తములు వంచి అభినయించడం.
3. రేచితము :- హస్తములు కదిలించి అభినయించడం.
4. పుంఖితము :- హస్తవములు కుడివైపున ఎత్తి సాచి కదలించి అభినయించడం.
5. ప్రేరితము :- హస్తవములు ఎడవమవైపున వంచి కదిలించి అభినయించడం.
6. అపవేష్టితము :- హస్తములు దిగువగా వంచి అభినయించడం.
7. ఉద్వేష్టితము :- హస్తములు ఎత్తి అభినయించడం
8. పరివృత్తము :- హస్తములు ప్రక్కనుండి ముందుకు, వెనుకకు అభినయించడ(.
9. వ్యావృత్తము :- అన్ని చోట్ల త్రిప్పి అభినయించడం.
10. చిహ్నము :- నాట్య సమయంలో హస్తములద్వారా ప్రత్యక్ష, పరోక్ష వస్తువులయొక్క స్థావర జంగవం త్వములను తెల్పేది చిహ్నము అనగా గుర్తు అంటారు.

## చిహ్నములు (గుర్తులు)

ఇవి ఎనిమిది విధాలు.

1. వాటి ఆకారములను ప్రదర్శించడం

2 వాటి ముఖములను ప్రదర్శించడం.

3 అవి ఉండే తావులను ప్రదర్శించడం

4. వాటి చిహ్నాలను ఒక వస్తువుతో పోల్చి ప్రదర్శించడం.

5. వాటి ఆయుధాలను ప్రదర్శించడం.

6 వాటి ప్రయోజనాలను ప్రదర్శించడం.

7. వాటి వ్యాప్తిని ప్రదర్శించడం.

8. వాటి చేష్టలు ప్రదర్శించడం.

### *11. సంకేతము :*

మాటలతో నిమిత్తం లేకుండా సైగలతో తెల్పడం. అంటే భావనకు సంకేతరూపం ఇవ్వడం.

### *12. పదార్థం టీక : (పద- అర్థం- టీక)*

చెప్పబడిన పదముయొక్క అర్థము హస్త ప్రదర్శనముతో తెలియ జెప్పడం.

ఆకృతి - చేష్ట - చిహ్నము - జాతి అను వానిని బట్టి బాగుగా ఆలోచించి హస్తాభినయం చేయవలసి ఉంటుంది.

## *2. నేత్రము (కన్ను)*

ముఖ్యంగా సాత్త్వికాభినయమునకు కన్ను ప్రధానం.

సుఖ, దుఃఖ సమన్వితమైన సమస్త భావములను వ్యక్తము చేయునది 'కన్ను'. నవరసములను ద్యోతకము చేయునది 'కన్ను'.

కన్నును విస్మరించి చేయు భావ ప్రకటన కేవలం అంగ, ప్రత్యంగ విన్యాసాలు మాత్రమే అవుతుంది.

అది జీవుడు లేని కళేబరంతో సమానం. రస పరిపుష్టికి ఆధారం నే(త్రాభినయం.

## దృష్టి భేదాలు

(ఇవి ఎనిమిది విధాలు)

**శ్లో ॥ సమవలోకితం సాచీ ప్రలోకిత నిమీలితే**
**ఉల్లోకితానువృత్తే చ తథాచైవాఽవలోకితమ్**
**ఇత్యష్ట దృష్టి భేదాస్తు కీర్తితా భరతాగమే॥**

**తా॥** సమము, అవలోకితము, సాచి, ప్రలోకితము, ఉల్లోకితము, అనువృత్తము, అవలోకితము - అని దృష్టి భేదాలు ఎనిమిది విధాలుగా భరతశాస్త్రమందు చెప్పబడినవి.

### 1. సమదృష్టి :-

కన్నులు పెద్దవి చేసి, రెప్ప వేయక నిలకడగా చూడటం, చలించని తారకలు గల దృప్త (దర్శించిన లేక హర్షించిన) దృష్టి సమదృష్టి.

**వినియోగం :-** నాట్యారంభము - త్రాసును చూచుట, ఇతరుల ఆలోచనలను ఊహించడం, ఆశ్చర్యం, దేవతా రూపదర్శనం, దేవతాస్త్రీలు. ఈ సందర్భంలో ఈ దృష్టిని ప్రదర్శించాలి.

### 2. అవలోకిత దృష్టి:-

కన్నులు విప్పారడం- కనుగ్రుడ్లు వడిగా తిప్పడం.

**వినియోగం :-** కుమ్మరి సారె వలె కనుగ్రుడ్లు తిరుగడం - చుట్టూ ఉన్న అన్ని వస్తువులను చూడడం - ఇచ్ఛ (కోరిక) సందర్భాలలో ఈ దృష్టిని ప్రదర్శించాలి.

**3. సాచిదృష్టి:-**

క్రమంగా అడ్డంగా తిరిగిన కడగంటి చూపు.

**వినియోగం :-** మీసము దువ్వడం లేదా సరిజేయడం, బాణము ఎక్కుబెట్టడం (గురిచూచుట).

**4. ప్రలోకిత దృష్టి :-**

ఇరుప్రక్కలకు చలించుట.

**వినియోగం :-** రెండు ప్రక్కలనున్న వస్తువులను చూడడం, సైగ చేయడం, కలవరపాటు, చలనం.

**5. నిమీలిత దృష్టి :-**

సగము కన్ను తెరచి చూడడం.

**వినియోగం :-** ఋషివేషవు, పారవశ్యం, జపం, ధ్యానవు, నమస్కారం, ఉన్మాదం, సూక్ష్మదృష్టి, మదించి ఉండటం. ఈ సందర్భాలలో ఈ దృష్టిని ప్రదర్శించాలి

**6. ఉల్లోకిత దృష్టి :-**

మీదికి నిక్కించి చూడటం.

**వినియోగం :-** ఎత్తు, ధ్వజాగ్రం, గోపురం, దేవమండపం, పూర్వజన్మ స్మరణ, వెన్నెల జాణత్వము. ఈ సందర్భాలలో ఈ దృష్టి సంకేతం.

**7. అనువృత్త దృష్టి :-**

వేగముగా క్రింది మీదుగా జూచుట.

**వినియోగం :-** కోపముగా చూడటం, ప్రీతితో పిలవడం. వీటియందు ఈ దృష్టికి సంకేతం.

**8. అవలోకిత దృష్టి :-**

క్రిందికి చూడటం

**వినియోగం :-** నీడను చూచుట, ఆలోచన, పని చేయుట, చదువుట, తన అవయవములను చూచుకొనుట, నడక యందు ప్రదర్శనకు ఈ దృష్టి సంకేతం.

## హృద్గతమైన భావములను వ్యక్తపరచు సాత్త్విక దృష్టులు

**(ఇవి ఇరువది ఆరు విధాలు)**

**1. స్నిగ్ధము:-**

సంతోషము, అభిలాష, మనోజ్ఞత, అంతర్వికాసము, మన్మథోద్రేకము గల దృష్టి స్నిగ్ధ దృష్టి.

**వినియోగం :-** స్నేహము గల వస్తు ప్రియుల విషయాల్లో వినియోగపడుతుంది.

**2. విస్మయము :-**

చక్కగా తెరువబడిన రెప్పలు గలది. మిక్కిలి నిక్కును చూపునది. సమమయినది. వికాసము గల దృష్టి విస్మయదృష్టి.

**వినియోగం:-** ఆశ్చర్యము మొదలైన వాటి యందు వినియోగపడుతుంది

**3. విషణ్ణము :-**

విసిరిన రెప్పలు, తొలగించిన రెప్పపాట్లు, చలింపని నల్లగ్రుడ్లు గలది విషణ్ణ దృష్టి.

**వినియోగము:-** ఖేదం, చింత మొదలగువాటి యందు వినియోగపడుతుంది.

**4. ద్రుతము :-**

రెండు నల్లగ్రుడ్ల యొక్క చలనం గలది ద్రుతదృష్టి.

**వినియోగం :-** సంభ్రమము మొదలగు భావాల యందు వినియోగ పడుతుంది.

**5. దూరము :-**

కొంచెము మీది కెత్తబడిన చూపు దూరదృష్టి.

**వినియోగం :-** దూరమునందుండు వస్తువులను చూడటం, జరుగనున్న విషయాలను గ్రహించడం వంటి భావాల ప్రదర్శనకు ఉద్దేశించింది.

**6. ఇంగితము:-**

కటాక్ష చలనము గలిగి సంతోషముతో కూడినది ఇంగితదృష్టి.

**వినియోగం :-** ఇంగితమును తెల్పునది- అనగా మనస్సులోని భావమును (అభిప్రాయమును) తెల్పునది.

**7. విలోకితము:-**

వెనుకకు చూచుట విలోకిత దృష్టి

**వినియోగం:-** వెనుక భాగమునందున్న వాటిని చూడటం, ఆలోచించడం లేక లోనున్న భావమును గ్రహించడం కోసం ఉద్దేశించినది.

**8. వితర్కితము:-**

వికసించినది. మీదకు ఎత్తబడిన కనురెప్పలు గలది, విసిరిన తారకలు గలది కొంచెముగా భయపడునట్లున్నది. సమ తారకలు గలది వితర్కిత దృష్టి.

**వినియోగం :-** ఊహించడం మొదలైన భావాల ప్రకటనకు ఉద్దేశించినది.

**9. శంకితము :-**

కొంచెము చలనం, కొంచెము నిలకడ కలది, మీదకూ అడ్డంగానూ చూచేది, మరుగుపడేది, బెదరే తారకలు గలది- శంకిత దృష్టి.

**వినియోగం :-** శంక మొదలైన భావాల ప్రకటనలందు ప్రయోగింప దగినది ఇది 'శంకిత' అనే సంచారి భావదృష్టి

**10. అభితప్తము :-**

రెప్పల కదలిక, అలసిన తారకలు గలది అభితప్త దృష్టి.

వినియోగం . నిర్వేదం (విచారం) విసుగు మొదలగు భావాల ప్రదర్శనలో ప్రయోగింపదగినది.

**11. శూన్యము :-**

సమంగా ఉన్న తారకలు కనురెప్పల చలనం లేనిది శూన్యదృష్టి

వినియోగం :- ఎదురుగా ఉన్న వాటిని గ్రహించలేని స్థితిని తెలుసుకోలేనటువంటి భావాల ప్రదర్శనలో ఉపయుక్తమైనది.

**12. హృష్టము:-**

చలించడం, కొంచెం సంకోచించడం, రెప్పపాట్లు, మనోహరమైన దృష్టి హ్రస్వదృష్టి.

వినియోగం : నవ్వు మొదలగు అభినయాల్లో ఉపయోగపడుతుంది.

**13. ఉగ్రము :-**

బాగుగా వికసించిన కనురెప్పలు. ఎర్రబడిన రెండు కనుగొనలు ఉండే దృష్టి ఉగ్రదృష్టి

వినియోగం :- ఉగ్రము (కోపము) మొదలైన భావాల ప్రదర్శనలో ప్రయుక్తమౌతుంది.

**14. విభ్రాంతము:-**

చలించు తారకలు, ప్రీతికరమైనది నడుమ నడుమ వెలవెలపాటు-మరల తేటదనము గలది విభ్రాంత దృష్టి.

వినియోగం :- సంభ్రమము మొదలగు భావాల ప్రదర్శనలో ఉపయుక్తమౌతుంది ఇది 'విభ్రాంత' అనే సంచార భావదృష్టి

**15. సూచన :-**

చేతి సైగను అనుసరిస్తూ కొంచెము మూయబడినది సూచనాదృష్టి.

**వినియోగం :-** సూచన చేయడం మొదలగు వాటియందు ఉపయుక్త మగును

**16. లజ్జితము :-**

ముడుచుకొన్న రెప్పల కొనలు కలది లజ్జిత దృష్టి.

**వినియోగం :-** సిగ్గుపడడం మొదలగు భావాల అభినయానికి ఉపయుక్త మగును.

**17. మలినము :-**

సంకోచించిన కనుగొనలు, చంచలమైన రెప్పలు, ఆకర్షింపబడిన తారకలు గల దృష్టి మలినదృష్టి.

**వినియోగం :-** అనుమానించడం మొదలగు భావప్రకటనకు ఇది ముఖ్యంగా స్త్రీపాత్రలలో కనిపిస్తుంది. ఇది 'మలిన' అను సంచారి భావదృష్టి. (ప్రియునితో సరస సల్లాపములాడునపుడు - వ్యక్తమవుతుంది.)

**18. త్రస్త :-**

తొలుత వికాసము, పిమ్మట చలించుచున్న నల్లగ్రుడ్లతో మీది కెత్తబడిన రెప్పలు గలది త్రస్త దృష్టి.

**వినియోగం :-** భయము, మదము (మత్తు) భావాల ప్రదర్శనకు ఉద్దేశించినది

**19. మ్లాని :-**

సడలి కొద్దిపాటి కదలికతో క్రమంగా సోలుచున్న నల్లగ్రుడ్లు గలది. రెప్పల కొనల నంటుచున్న కనుబొమలు గలది మ్లానదృష్టి.

వినియోగం :- శిధిలమైన వస్తువులు మొదలైన వానిని చూడటంవలన కలుగు భావముల ప్రదర్శనకు ఉద్దేశించబడినది

**20. ముకుళము (మొగ్గ) :-**

రెప్పల మీద వెంట్రుకలు కదులుతూ దగ్గరగా సౌమ్యంగా ఉన్నది తారకలు కనిపించనది, పైరెప్పలు మూయబడినది- ముకుళ దృష్టి.

వినియోగం :- ఆనంద ప్రకటనకు ఉద్దేశించినది. ఇది ముకుళ అనుసంచారి భావదృష్టి

**21. కుంచితము :-**

కొంచెము వాల్చబడిన కొనరెప్పలు, మిక్కిలి లోగొనబడిన నల్లగ్రుడ్లు గలది కుంచిత దృష్టి

వినియోగం : అనిష్టము, అసూయ భావాల ప్రకటనకు ఉద్దేశించినది.

**22. విప్లుతము :-**

అదురుతూ వికసించినవై వాలిన రెప్పలు గల దృష్టి విప్లుత దృష్టి.

వినియోగం :- అన్ని వస్తువులలో సౌందర్యమును చూడటం లేదా భావించడం ప్రదర్శన కోసం ఉద్దేశించింది.

**23. జిహ్మము :-**

బాగుగా వాల్చబడిన రెప్పలు గలది. తారకలు కనిపించక అడ్డంగా మెల్లగా చూచునది జిహ్మదృష్టి.

వినియోగం :- నిగూఢమైన అర్థములు, అసూయ మొదలగు భావాల ప్రకటనకు ఉద్దేశించినది

**24. మదిర :-**

సూటిగా లేనిది, దిక్కులు చూసేది మధ్యస్థమైనది. కలుపబడిన కనులు గలది, క్రిందికి వాలినది బెదరుతున్నది. మదిర దృష్టి.

వినియోగం :- తరుణ (తత్కాలి) మద ప్రకటనకు ఉపయుక్త మౌతుంది.

**25. హృద్య :-**

నిలకడ లేనిది, తడబాటు గలది, కొంచెము చలించుచున్న తారకలు గలది, వాల్చబడిన రెప్పలు గలది హృద్యదృష్టి.

**వినియోగం :-** సంతోష, విచార సంఘటనలకు చలించి, తగు రీతిని ప్రదర్శించుటకు ఉపయుక్తమౌతుంది

**26. లలితము :-**

కనుబొమల కదలికచే వాల్చబడిన కడకన్నులు, మన్మథ వికారము వలన చిరునవ్వు, తేటదనము గలది లలిత దృష్టి

**వినియోగం :-** ఆనందకరమైన వస్తువులను సుకుమారంగా చూడడంలో ప్రదర్శిత మగును.

## నవరస దృష్టులు

**1. శృంగార దృష్టి:-**

సంతోషముతో, సుఖము చేత కలిగినది. మిక్కిలి మన్మథాధీనమైనది. కనుబొమలు నిక్కించి, కడగంటి చూపు వలన కలిగినది శృంగార దృష్టి.

**వినియోగం :-** మన్మథావిష్టులైన కామినీ కాముకుల చూపుల విషయంలో ప్రదర్శనయోగ్యం.

**2. హాస్యదృష్టి:-**

విప్పారిన నేత్రములు గలది హాస్య దృష్టి.

వినియోగం :- నవ్వునందు ప్రదర్శనయోగ్యం.

**3. కరుణ దృష్టి:-**

క్రిందకు వాలి, సగము తెరువబడి, కన్నీళ్లతో మెల్లగా తిరుగుచున్న

తారకలు గలిగిన నాసాగ్రమందు నిలిచిన చూపు కరుణదృష్టి.

**వినియోగం :-** కరుణరసమందు ప్రదర్శన యోగ్యము.

**4. రౌద్రదృష్టి :-**

ఎర్రగా నున్నది. క్రూరమైనది చలించని రెప్పలు తారకలు గలది. వంకరగా మీదకు ఎత్తబడిన బొమముడి గలది రౌద్రదృష్టి.

**వినియోగం :-** రౌద్ర రసమందు ప్రదర్శన యోగ్యం.

**5. వీరదృష్టి :-**

కాంతిమంతమైనది. తేటగా నున్నది. విప్పారినది. ఉగ్రమూ, శాంతము కాక మధ్యస్థంగా నున్నది. గంభీరంగానున్నది వీరదృష్టి.

**వినియోగం :-** వీరరసమందు ప్రదర్శన యోగ్యం.

**6. భయానక దృష్టి :-**

చలనం లేనిది, మీదకు ఎత్తబడిన కనురెప్పలు గలది, బాగా చలిస్తూ వికసించిన తారకలు గలది భయానక దృష్టి.

**వినియోగం :-** భయానక రసమందు ప్రదర్శనయోగ్యం.

**7. భీభత్స దృష్టి:-**

కనురెప్పలు సగము మూతబడి, కదలని తారకలు గలది బీభత్స దృష్టి.

**వినియోగం :-** బీభత్స రసమందు ప్రదర్శన యోగ్యం.

**8. అద్భుత దృష్టి:-**

కొంచెము వంచబడిన రెప్పకొనలు, ఆశ్చర్యము చేత నెత్తబడిన కనుబొమలు వికాసముతో కూడిన సమదృష్టి - అద్భుత దృష్టి.

**వినియోగం :-** అద్భుత రసమందు ప్రదర్శన యోగ్యం.

**9. శాంతదృష్టి:-**

మూతబడు రెప్పలు గలదియు, కొంచెము చలించునట్టి కన్నులు గలదియు, చలించుచున్న నల్లగ్రుడ్లు గలిగినది శాంతదృష్టి.

**వినియోగం :-** శాంతరసమందు ప్రదర్శన యోగ్యం.

---

**భావము యొక్క విశిష్టతలను తెల్పునపుడు**
**చేతులు, నేత్రముల ననుసరించునవి.**

---

| | | |
|---|---|---|
| 1. శిరోబేధాలు | - | 9 |
| 2. భ్రూ (కనుబొమ్మ) | - | 6 |
| 3. గ్రీవా (మెడ) | - | 4 |
| 4. నాసా (ముక్కు) | - | 2 |
| 5. అధరోష్ఠ చాలన | - | 3 |
| 6. హాస | - | 5 |
| 7. వక్షోభినయాలు | - | 5 |
| 8. కటిచాలన భేదాలు | - | 5 |
| 9. పాదకర్మ భేదాలు | - | 5 |

## *1. శిరోభేదాలు :- (9)*

**శ్లో॥ ''సమముద్వాహిత మధోముఖ మాలోలితం ధుతమ్**
**కంపితం చ పరావృత్తము త్క్షిప్తం పరివాహితమ్**
**నవధా కథితం శీర్షం నాట్యశాస్త్ర విశారదైః.**

**తా॥**

1 సమము

2. ఉద్వాహితం

3. అధోముఖం

4. ఆలోలితం

5. ధుతం

6. కంపితం

7. పరావృత్తం

8. ఉత్క్షిప్తం

9. పరివాహితం

అని తొమ్మిది శిరోభేదాలుగా నాట్యశాస్త్రవేత్తలు చెప్పారు.

**1. సమశిరస్సు :-**

చలనము లేనిది, నిశ్చలంగా సమముగా ఉన్న శిరస్సు సమశిరస్సు.

**వినియోగం :-** నృత్తారంభం, జపం, గర్వం మొ॥ వాటియందు ప్రణయం, కోపం, స్తంభనం, నిష్క్రియత్వం మొ॥ వాటియందు.

**2. ఉద్వాహిత శిరస్సు :-**

మీదికి ఎత్తబడిన శిరస్సు.

**వినియోగం :-** పతాకం, చంద్రుడు, ఆకాశం, పర్వతం, ఆకాశంలో సంచరించే వారు ఎత్తుగా ఉన్న వస్తువులు మొ॥ వాటియందు.

**3. అధోముఖ శిరస్సు:-**

క్రిందకు వంచబడిన శిరస్సు.

**వినియోగం :-** లజ్జ, ఖేదం, ప్రణామం, దుశ్చింత, మూర్ఛ, క్రిందుగా ఉన్న వస్తువులను నిర్దేశించడం నీటిలో మునగడం మొ॥ వాటియందు.

**4. ఆలోలిత శిరస్సు :-**

చక్రాకారంగా త్రిప్పబడినది ఆలోలిత శిరస్సు.

**వినియోగం :-** ఉద్వేగంగా వచ్చే నిద్ర, గ్రహం ఆవేశించడం, మదం, మూర్ఛ, భ్రమణం, వెర్రినవ్వు మొ॥ వాటియందు.

**5. ధుత శిరస్సు :-**

కుడి, ఎడమ ప్రక్కలకు త్రిప్పబడినది ధుత శిరస్సు.

**వినియోగం :-** ''లేదు'' అనే మాట - మాటిమాటికి ప్రక్కలకు చూడటం- జనులను ఊరడించడం- ఆశ్చర్యం- విషాదం- ఇష్టం లేకపోవటం- చలిబాధ (వణుకు)- జ్వరం- భయం- మద్యం త్రాగిన వెంటనే ఉండు స్థితి - యుద్ధం- ప్రయత్నం - నిషేధం - కోపం - తన అవయవాలను చూచుకొనుట - ప్రక్కకు పిలవటం మొ॥ వాటియందు.

**6. కంపిత శిరస్సు :-**

పైకి, క్రిందికి కదల్చబడిన శిరస్సు కంపిత శిరస్సు.

**వినియోగం :-** రోషం - ''ఉండు'' లేదా ''నిలు'' అనే మాట ప్రశ్న - సూచన చేయుట- దగ్గరకు రమ్మని పిలవటం - ఆవాహనం - బెదరింపు మొ॥ వాటియందు.

**7. పరావృత్త శిరస్సు :-**

ప్రక్కకు త్రిప్పబడిన - పెడముఖంగా ఉన్న శిరస్సు - పరావృత్త శిరస్సు.

**వినియోగం :-** కోపం - సిగ్గు- మొదలగువాటి వల్ల పెడముఖం పెట్టటం - నిరాదరణ చూపటం - జడ చూసుకోవటం - అమ్ముల పొది చూడటం మొ॥ వాటియందు.

**8. ఉత్క్షిప్త శిరస్సు :-**

ఒక ప్రక్కగా మీదికి ఎత్తిన శిరస్సు ఉత్క్షిప్త శిరస్సు.

**వినియోగం :-** ఇది తీసుకో - ఇటుగా - ఇట్లు అను అర్థాలను సూచించుటలో వినియోగ పడుతుంది.

**9. పరివాహిత శిరస్సు :-**

పింజామరం వలె రెండు ప్రక్కలకు వంపబడునది పరివాహిత శిరస్సు.

**వినియోగం :-** మోహం - విరహం - స్తుతి - సంతోషం - అను మోదనం - విచారం మొ॥ వాటియందు.

## భ్రూ- భేదాలు (కనుబొమలు) (6)

1. సహజ 2. పతిత
3 ఉత్క్షిప్త 4. చతుర
5. రేచిత 6. కుంచిత

**1. సహజ :-**

ముఖమందు ఏ విధమైన వికారము లేక సహజస్థితిలో ఉన్నది సహజభ్రువు.

వినియోగం :- ఇది సహజ భావములందు వినియుక్త మవుతుంది.

**2. పతితభ్రువు :-**

చలించక క్రిందకు వాల్చబడినది పతితభ్రువు.

**వినియోగం :-** జుగుప్స (రోత), విస్మయం, అసూయ మొ॥వాటి యందు వినియుక్త మవుతుంది.

**3. ఉత్క్షిప్తభ్రువు :-**

కనుబొమలు రెండింటిలో ఒకటి గాని రెండు గాని బాగా పైకి ఎత్తబడితే దానిని ఉత్క్షిప్తభ్రువు అంటారు.

**వినియోగం :-** స్త్రీల కోపం, సత్యవచనం, శృంగార భావం- వీటియందు వినియుక్త మవుతుంది.

**4. చతురభ్రువు :-**

కనుబొమల కూడికతో కొంచెము మెల్లగా చలిస్తూ మత్తుగా ఉంటే దానిని చతురభ్రువు అంటారు

**వినియోగం :-** ముఖమును తాకటం, మనోల్లాసం, సంభ్రమం వీటియందు వినియుక్త మవుతుంది

**5. రేచితభ్రువు :-**

ఒక కనుబొమ అందంగాను, ఇంపుగాను పైకి త్రోయబడిన అది 'రేచితభ్రువు'.

**వినియోగం :-** రహస్యము వినడం, మంచి విషయాలు చెప్పడం, స్థానమును పరికించడం మొ॥ వాటియందు వినియుక్త మగును.

**6. కుంచితభ్రువు:-**

కనుబొమ ఒకటిగాని, రెండు గాని వంచబడితే కుంచితభ్రువు అవుతుంది.

**వినియోగం :-** మొట్టాయితం, కుట్టమితం, విలాసం, కిలికించితం, వీటి మందు వినియుక్త మవుతుంది.

## *3. గ్రీవాభేదాలు (4 విధాలు)*

**శ్లో ॥ సుందరీ చ తిరశ్చీనం తథైవ పరివర్తితా,**
**ప్రకంపితా చ భావజ్ఞైః జ్ఞేయా గ్రీవా చతుర్విధా**
**(నాట్యశాస్త్రం)**

1 సుందరి 2. తిరశ్చీనం

3 పరివర్తనం 4. ప్రకంపితం

అని గ్రీవా భేదాలు నాలుగు.

**1. సుందరీగ్రీవ :-**

అటు-నిటు అడ్డంగా కదలించబడిన మెడ సుందరీగ్రీవ మనబడును

**వినియోగం :-** స్నేహారంభం, ప్రయత్నం, మంచిది అనుట, జ్ఞప్తికి తెచ్చుకొనుట, సరసత్వం, అంగీకారం- వీటియందు ప్రయుక్త మగును.

**2. తిరశ్చీన గ్రీవ :-**

ఇరుప్రక్కల పైభాగమందు పాము కదలిక వలె మెడ తిరిగితే దానిని ''తిరశ్చీనగ్రీవ'' మంటారు.

వినియోగం :- కత్తి త్రిప్పుట, పాము నడకలు మొ॥ వాటియందు ప్రయుక్త మవుతుంది.

**3. పరివర్తిత గ్రీవ :-**

అర్ధచంద్రాకారంగా కుడి - ఎడమలకు కదిలింపబడిన ''పరివర్తితగ్రీవ'' అంటారు.

**వినియోగం** :- ఇది శృంగారాభినయమందు, ప్రియురాలి రెండు చెక్కిళ్ళను ముద్దుపెట్టుకొనుట యందు ప్రయుక్త మగును.

**4. ప్రకంపిత గ్రీవ :-**

(ఆడపావురం వలె) మెడను ముందు వెనుకలకు కదిలించినట్లు కదులుతున్న మెడ ''ప్రకంపితగ్రీవ'' మనబడును.

వినియోగం :- నీది- నాది అని చెప్పుట, దీనిని అధికంగా దేశనాట్యం, ఉయ్యేల, మణితం యందు వినియోగిస్తారు.

## *4. నాసా చలన భేదాలు (2)*

**1. వికాసము :-**

సంతోష సమయమున ముక్కుపుటాలు బ్బించుట.

**2. సంకోచము :-**

కోప, అసహ్యాది సమయములందు ముక్కు సంకోచింపజేయుట (ముడుచుకొనుట).

## 5. అధరోష్ఠ చాలన భేదాలు (3)

1 స్పందము - కోపాది సమయములయందు పెదవి వణుకుట

2 సంకోచము :- మూతి ముడుచుట.

3 వికాసము :- హాస్య, అద్భుతాదుల యందు విప్పుట.

## 6. హాసభేదాలు (5)

1. స్మితము :- చిరునగవు.

2. హసితము :- సహజమైన నవ్వు.

3. ప్రహసితము :- ఒడలు తెలియని నవ్వు.

4 అపహసితము :- పరిహాస యోగ్యమైన నవ్వు.

5. ఉపహసితము :- ప్రథమములో నవ్వు గలిగిన దానికి కారణమును తలచుకొని మాటిమాటికి నవ్వుకొనడం.

## 7. వక్షోభినయాలు

**శ్లో॥ సమమాభుగ్న నిర్భుగ్నే కంపి తోద్వాహితే పరే,**
**ఇతి పంచవిధం వక్షః ప్రోచ్యతే శంభునిర్మితం॥**

1. సమము
2. ఆభుగ్నము
3. నిర్భుగ్నము
4. కంపితము
5 ఉద్వాహితము

**1. సమవక్షస్సు:-**

చక్కగా, మనోహరంగా, ఉపాంగముల నాశ్రయించియుండునది- సమ వక్షస్సు.

**వినియోగం:-** ఇది స్వభావాభినయమునందు వర్తిస్తుంది.

**2. ఆభుగ్న వక్షస్సు:-**

నిమ్నమగునట్లు వంచబడినది ఆభుగ్నవక్షస్సు.

వినియోగం :- గర్వము- లజ్జ- చలి- హృచ్ఛల్య రోగము - మూర్ఛ- సంభ్రమణము నందు వర్తిస్తుంది.

**3. నిర్భుగ్న వక్షస్సు :-**

(అసలు వంగినది) నిశ్చలమగునట్లు జేయబడినది, నిర్భుగ్న వక్షస్సు.

**వినియోగం :-** గర్వము, సత్యమగు ప్రీతి, జ్ఞానవచనము, స్తంభము, ఆశ్చర్యము, సంతోష భాషణమందు వర్తించును.

**4. కంపిత వక్షస్సు :-**

ఎడ లేకుండా ఊర్ధ్వోక్షేపముల చేత అనగా నిరంతరంగా ఱొమ్మును ఎగశ్వాసతో పైకి ఎగురవేయుట కంపిత వక్షస్సు.

**వినియోగం :-** విశేష హాసము - శ్రమ- శ్వాసుల యందును- హిక్క (ఎక్కిలి), రోదనము లందును వర్తిస్తుంది.

**5. ఉద్వాహిత వక్షస్సు :-**

పైకి ఎత్తబడి, స్వల్ప కంపనముతో కూడుకొని యుండెడిది ఉద్వాహిత వక్షస్సు.

**వినియోగం :-** పై వస్తువులను జూచుట యందును, విజృంభణ మందును ఊర్ధ్వ శ్వాసమందును వర్తిస్తుంది.

## *8. కటిచాలన భేదాలు (5 విధాలు)*

**1. కంపిత కటి :-**

శీఘ్రముగా సాగే గమనాగమనముల యందు ఉభయ పార్శ్వముల యందు చలించు కటి కంపిత

**వినియోగం :-**గూనుగల - పొట్టిగల వారియందు వినియోగపడుతుంది.

**2. ఉద్వాహిత కటి :-**

పార్శ్వ ద్వయము మెల్లమెల్లగా ఉచ్ఛలితంబగు కటి ఉద్వాహిత.

వినియోగం :- విలాస గమనము నందు- స్థూలదేహము గలవానియందు వినియోగపడుతుంది.

3. ఛిన్నము:-

పాత్ర తిర్యఙ్ముఖమగుచునుండగను మధ్యముయొక్క చలనము వలన కలుగు కటి ఛిన్నము.

వినియోగం :- విస్తారముగ తిరుగుట యందును - వెనుక తిరిగి చూచుట యందు వినియోగపడుతుంది.

4. నివృత్త కటి:-

పరాఙ్ముఖమగు పాత్ర అభిముఖముగ త్రిప్పబడిన కటి నివృత్తము.

5. రేచిత కటి :-

అంతట తిరుగు కటి రేచిత.

వినియోగం :- మల్లామునందు నిలిచి పిరుదులు వెనుకకు బోవునట్లు కదిలించుట.

## *9. పాదకర్మ భేదాలు (19 విధాలు)*

| | |
|---|---|
| 1. సమపాదము | 11. అంచితము |
| 2. ఏకపాదము | 12. పార్శ్వగము |
| 3. వినివర్తితము | 13. ఘట్టితము |
| 4. గతాగతము | 14. ఘట్టితోత్సేధము |
| 5. వళితము | 15. సూచీపాదము |
| 6. వైశాఖమండలము | 16. తాడితము |
| 7. త్రిభంగి | 17. పార్శ్వగము |
| 8. అగ్రగము | 18. ఉద్ఘట్టితము |
| 9. మర్దితము | 19. అగ్రతల సంచారము |
| 10. కుంచితము | |

1. **సమపాదము:–** రెండు పాదములు సమముగా ఆన్చి నిలుచుట.

2. **ఏకపాదము:–** ఒక పాదము మోపి నిలుచుట.

3. **వినివర్తితము:–** పాదములు మార్చుట.

4. **గతాగతము:–** ముందుకు-వెనుకకు బోవుచు వచ్చుచు నుండుట.

5. **వళితము:–** తిరుగుట.

6. **వైశాఖ మండలము:–** ఇరుప్రక్కల తిరుగుట.

7. **త్రిభంగి:–** పాత్రరేఖ ప్రమాణము మీద నిల్చునప్పుడు నడుము-రొమ్ము- శిరస్సు నిలువంపుగా నిలుపుట.

8. **అగ్రగము:-** మునివ్రేళ్ళ మోపు మీద నీక పాదమున కంట నీక పాదమును ముందు ముందుగా వడివడిగా నుంచుట.

9. **మర్దితము:–** నిల్చిన చోటనే పాదములతో తట్టుట.

10. **కుంచితము:–** పాదముల మొనవ్రేళ్ళు నేలనాన్చి మడమలు పైకెత్తి నిక్కుట.

11. **అంచితము:–** మడమలు భూమిమీద ఆన్చి వ్రేళ్ళు పైకెత్తుట.

12. **పార్శ్వగము:–** మునివేళ్ళు మోపి మడమలు పైకెత్తి యుండి తిరుగ మడమలు ఆన్చి మునివ్రేళ్ళు ఎత్తుట.

13. **ఘట్టితము:–** మడమలతో తట్టుట

14. **ఘట్టితోత్సేధము:–** అరికాలి మధ్యభాగము మడిచి నేలకు తగులకుండ కొనవ్రేళ్ళతో భూమిని తట్టుట.

15. **సూచీ పాదము :–** ఒక పాదము సమముగా నేల నాన్చి మరియొక పాదముయొక్క మడమ ఎత్తి ఆ కాలియొక్క బొటన వ్రేలు భూమి మీద ఆన్చుట

16. **తాడితము :-** మడమల మీద నిల్చి ముని పాదముల పైకెత్తి ఆ ముని పాదములచేత భూమిని తట్టుట

17. **పార్శ్వగము :-** పాదములయొక్క వెలి ప్రక్కలు నేల నాన్చి లోప్రక్కలు తగుల కుండ నిల్చిగాని, అట్లే ముందుకు అడుగు నుంచుచుగాని యుండుట.

18. **ఉద్ఘట్టితము :-** మునివ్రేళ్లతో నిలబడి మాటి మాటికి మడమలతో నేలను తట్టుట.

19. **అగ్రతల సంచారము :-** మడమ లెత్తుకొని వ్రేళ్ల భూమి యందు ఆనకుండ అరికాళ్ల యొక్క ముందు కొనలు నేలనాన్చి నిలిచిన చోట నుండుట లేదా ముందు - వెనుకకు సంచరించుట

# 2. వాచికాభినయము

వాక్కు నాట్యమునకు తనువు. **ఆంగిక, ఆహార్య, సాత్త్వికాభినయాలు** మూడు వాక్యార్థమునే అభివ్యక్తం చేస్తాయి. సమస్త శాస్త్రాలు వాక్స్వరూపాలే. వాక్కే సమస్తమునకు - కారణ మౌతుంది. సకల ప్రయోగానికి గోడ వంటిది. **గీత - వాద్య - అభినయాలకు** ఆశ్రయమైనది. ఇతివృత్తమును వ్యక్తము చేయునది **''వాక్కు''.**

వాచికాభినయంలో హృద్గతమైన సూక్ష్మాతిసూక్ష్మభావాలెన్నో వెల్లడించబడతాయి. ఆంగికమైన క్రియలలో ప్రదర్శించుట కనువుగాని భావాలను వాక్కు ద్వారా వెల్లడించడం సులభం.

భావ తీవ్రత కూడ వాక్కు ద్వారా స్పష్టంగా వెల్లడించబడుతుంది.

కోపం వంటి భావం ఎంత తీవ్ర రూపంలో ఉన్నా ఆంగికమైన క్రియలలో వ్యక్తం కావాలంటే ప్రాణాంతకమైన **దెబ్బకు** మించి వేరొక రూపాన్ని పొందలేము

అదే భావం వాచికాభినయంలో **'పచ్చడి చేస్తా'** మనో **'నూరుకు త్రాగుతా'** మనో అని భావతీవ్రతను వ్యక్తం చేయవచ్చును.

అలాగా 'ఇలారా' అనే మాటను కోపంగా అనవచ్చును. బ్రతిమాలుతూ, ఆజ్ఞాపిస్తూ, ఏడుస్తూ అనవచ్చును.

ఏ భావాన్ని మనము అభినయం చేస్తున్నామో ఆ భావాన్ని పద్య రూపంగా గాని, పదరూపంగా గాని, వచన రూపంగా గాని, పాడటంలో, పలకటంలో, కాకువు (ధ్వని) మొదలైన వాటితో విషాదము, కోపము, త్వర, అధికారము, బ్రతిమాలుట, శోకము, సంతృప్తి మొదలైనవి వ్యక్తపరుచుట - **వాచికాభినయము** అనబడును.

# 3. ఆహార్యాభినయము

ఆహార్యమంటే వేష, భూషణములని అర్థం. నర్తకిగాని, నటుడు గాని ఏ పాత్ర నభినయిస్తే ఆ పాత్రకు తగిన (చెప్పబడిన) వేష, భూషణములను ధరించి నటించాలి.

ఆహార్యానికి శిల్పము, చిత్రకళ వంటి యితర కళల సహాయము అపేక్షణీయం. అంతేగాక, కథా నాట్యాలలో (Ballets) పాత్రలు దేశ, కాల, మత, జాతి, ప్రవృత్తి, ప్రకృతి స్థితి, గతి వగైరాలెన్నిటి మీదనో ఆధారపడి - ఆహార్యమును సమకూర్చవలసి ఉంటుంది

ఆయా పాత్రల కట్టు, బొట్టు తీరు తిన్న దనం సరిగా గమనించుట వల్లను, పాదలాక్షారుణిమ, తాంబూలము, గోరింటాకు మొదలైనవి పెట్టుకున్నట్లు రచించు కోవటము వల్లను, గంధపు పూత, పుష్ప సంసేవనము వల్లను, ఆహార్యాభినయం చూపబడుతుంది.

ముఖమునకు పూసుకొనే రంగు కూడా ఆయా పాత్రల ప్రకృతి ప్రవృత్తులను బట్టి మారుతుంది. రసానుకూలంగా రంగులు చెప్పబడినవి.

ఎర్రటి బొట్టు కోపమునకు, స్త్రీకి విశేష చిహ్నంగాను, మత పరంగాను (హిందు) తెలియజేస్తుంది.

విడిపోయిన, చెదిరిపోయిన నగలు, వస్త్రాలు విరహాన్ని తెలియజేస్తాయి

సర్వాలంకార భూషితయై, పీతాంబరంగాని, శ్వేతదుకూలంగాని, ధరించి, గంధాది సువాసన ద్రవ్యాలు పండ్లు పూలు పెట్టుకుని కూర్చున్న స్త్రీ వాసక సజ్జిక. ఇది ఆహార్యానికి ఉదాహరణ.

**సరస్వతి, లక్ష్మి, పార్వతి** వంటి పాత్రలు తటాలున బోధపడాలంటే అందుకు తగిన విశేష చిహ్నాలుగా **వీణ, పద్మం, శూలం** మొదలగు వస్తువులు ధరించవలెను.

అదే విధంగా ఉద్యానవనంలో విహరించే ప్రేయసీ ప్రియుల దుస్తులు యుద్ధరంగంలో విహరించే వీరుల దుస్తులు - రంగులోను, రకంలోను కూడ తేడా చూపబడాలి.

విదూషకుని వంటి పాత్ర వెక్కిరించినట్లుంటేనే అందం. హనుమంతుని వంటి పాత్రలకు **ముఖం తొడగులు** కూడ అవసరమే

# 4. సాత్త్వికాభినయము

**శ్లో॥ సాత్విక సాత్వికేభావే భావజ్ఞై ర్విభాగితః**

(భరత ముని నా-శా)

రస స్వరూపమైన ప్రతి భావనలోను ఉండే సాత్త్వతీ వృత్తి స్వరూపమైన - ఏ మహాభావము దృశ్యాదృశ్యమై విడంబించి ఉన్నదో ఆ భావాన్ని - **అంగ, వాక్య,** ఆహార్యాభినయాదులచేత విశదింపజేయడమే **సాత్త్వికాభినయము.**

**''సత్త్వేన నివృత్తే సాత్త్వికాః''**

పరగతములైన సుఖ దుఃఖములయొక్క భావనా చేతనమైన చిత్తముయొక్క తన్మయీ భావము సత్త్వము అనబడును, అనగా దుఃఖము వచ్చినపుడు **కన్నీరు,** సంతోషము కల్గినపుడు - **గగుర్పాటు** చెందుట. ఇదే మనస్సుయొక్క **సత్త్వము.** దీని వలన పుట్టినవి **సాత్త్వికములు.**

# చిత్రాభినయము

అంగాద్యభినయములకు సంబంధించి, ఇంతవరకు పేర్కొనబడని వానిని ప్రయోగించే విశేష అభినయం చిత్రమైనదిగా బట్టి దానిని - చిత్రాభినయం అంటారు

లోక మందలి **స్థావర** (వృక్ష పర్వతాదులు), **జంగమ** (పశు, పక్ష్యాదులు) ముల భావ, చేష్టా విధి నంతటిని శాస్త్రము చేత నిర్ణయించుట శక్యం కాదు గనుక, ప్రకృతి సహజ, స్వభావములను అనుసరించి అభినయించవలెను. అదే ఇందుకు ప్రమాణమని భరతముని విశదపరచాడు.

నర్తకుడు పులి వేషమున (పులి ఆకృతిన) పులి చేష్టలను అభినయించుట చిత్రమనిపించును గాన అది **చిత్రాభినయం.**

అలాగే 'వృషభ' (ఎద్దు) 'ఏనుగు', 'మార్జాలం' (పిల్లి) మొదలగు జంతువులను, గ్రద్ద, పావురం, మయూరం (నెమలి) మొదలగు పక్షులను అనుకరించి అభినయించుట **చిత్రాభినయం.**

ఒకే నర్తకుడు రెండు విరుద్ధ పాత్రలను ఒకదానిని విడిచి ఒకటి వెంట వెంటనే అభినయించుట చిత్రాభినయ మనబడుతుంది.

ఉదా:- **''అర్ధనారీశ్వర''** రూపం.

కుడివైపున 'ఈశ్వరుడు', ఎడమవైపున 'పార్వతి' కేవలం శరీరంమీద తెర మార్పుతో వెంట వెంటనే గోచరిస్తూ కథను నడుపుతారు.

రామాయణ గాథను అంతటినీ, ఒకే నర్తకి లేక నర్తకుడు తన ప్రతిభా విశేషముల చేత అభినయించి ప్రేక్షకులను మెప్పించుట విచిత్రమే గదా! కాబట్టి **చిత్రాభినయ**మౌతుంది.

**'మ్యాజిక్'** చేయు కళాకారుడు తన విశేష ప్రతిభతో, చాకచక్యంతో అసాధారణమైన ప్రతి అంశమును సాధ్యముగా చూపెట్టి ప్రేక్షకుల మనస్సులను ఆకట్టుకుంటాడు. అలాగే **'సర్కసు'** నందు చూపెట్టు ప్రతి అంశము విశేష చిత్రణగా కన్పడుతుంది.

ఇవి చిత్రాభినయ ప్రకటితములు

కడకు కూచిపూడివారి నెత్తిమీద నీళ్ళ 'చెంబు', కాళ్ళక్రింద 'పళ్ళెము' నృత్యాలు చిత్రాభినయమని భావించవలసి ఉంటుంది.

## ధర్మి

'ధర్మి' అనగా అభినయ విధానము. అంటే అభినయం లోకానుసారిగా ఎప్పుడు ఎలా ఉండాలి? లేక లోక భిన్నంగా (నాట్యశాస్త్ర లక్షణయుతంగా) ఎప్పుడు ఎట్లా మాట్లాడాలి? అను విషయమును తెల్పునది ''ధర్మి''.

ధర్మి 2 విధాలు.

1. లోక ధర్మి:- సహజ జీవిత వాస్తవం

2. నాట్య ధర్మి :- కల్పితం, జీవిత వాస్తవాన్ని, కళాత్మకంగా చిత్రించడం.

**1. లోక ధర్మి:-**

ఎట్టి కల్పిత వైచిత్రి లేనిదై, కేవలం లోక స్వభావానుగుణంగా ఉండే నాట్యం లోకధర్మి అనబడుతుంది.

**2. నాట్య ధర్మి:-**

సహజ ప్రకృతిని, చిత్త ప్రవృత్తిని అతిక్రమించి, కవికల్పిత విశేషములతో మూర్తిమంతమై, మనోహరమై, శాస్త్ర సమ్మతలక్ష్య లక్షణములతో విరాజిల్లు నాట్యం **'నాట్య ధర్మి'** అనబడుతుంది.

**ఉదా:-**

(1) పాముల వాడు సజీవ సర్పమును ఆడించుట **'లోక ధర్మి'**.

నర్తకుడు సర్పాకారము గల ఆహార్యమును ధరించి సర్పము వలె నృత్యము చేయుట **నాట్య ధర్మి.**

(2) స్త్రీ, పురుషులు స్వతస్సిద్ధంగా ప్రేమికులై ఒండొరులు ప్రేమ కలాపములను గడుపుట **లోక ధర్మి.**

నాయికా నాయకాది వేషములను ధరించి స్త్రీ, పురుషులు, ప్రేమికుల పాత్రలను అభినయించుట **నాట్య ధర్మి.**

ఇందు పాత్ర యొక్క ఔచిత్యమును ఎరిగి, సందర్భమును పాటించి, తగిన మోతాదులతో అభినయించాలి.

(3) ఒక వ్యక్తి పిల్ల కాలువను ఒక్క గంతుతో ఆవలకు చేరుట **లోక ధర్మి.**

హనుమంతుడు సముద్రమును దాటి లంకలో ప్రవేశించినట్లు అభినయించుట **నాట్య ధర్మి.**

(4) దశరథ పుత్రుడు ధీరోదాత్తుడు, సర్వశక్తి సంపన్నుడు అయిన రాముడు- శివధనుస్సును విరుచుట **– లోక ధర్మి.**

ఒక సామాన్య నర్తకుడు రాముని పాత్ర వహించి శివధనుస్సును విరిచినట్లు అభినయించి ప్రేక్షకుల మెప్పును పొందుట **– నాట్యధర్మి.**

| | |
|---|---|
| సత్యము పలుకుట | - **లోకధర్మి** |
| సత్యమని నటించుట | - **నాట్య ధర్మి** |

<u>వాచికాభినయంలో-</u>

| | |
|---|---|
| సహజ భావానుగుణమైన మాటలు | - **లోకధర్మి** |
| రాగ తాళ లయాన్వితమైన పాటలు | - **నాట్యధర్మి** |
| అశ్రువులు | - **లోక ధర్మి** |
| అశ్రువును ప్రకటించుట | - **నాట్య ధర్మి** |

**''అసలు నాట్యమునకు లోకమే మూలం''** అన్నాడు **భరతుడు.**

అనగా లోకధర్మి- నాట్యధర్మికి **మాతృక.** ప్రకృతిలోని సర్వ పదార్థములు, పరిణామములు **లోక ధర్మి** అయితే, మానవుని హృదయంలో జనించిన ప్రతి భావమునకు రూపకల్పనము **నాట్యధర్మి** అవుతుంది.

అయితే, కల్పించిన రూపకము లోక విరుద్ధమై సహజ ప్రకృతికి దూరం కాకూడదు అందువల్ల నాట్యధర్మిలో లోక ధర్మి కూడ అంతర్భూతమై **ఉంటుంది, ఉండాలి.**

అప్పుడు తీసుకున్న రూపకమునకు రస స్ఫూర్తి గలిగి ప్రేక్షకులను మెప్పు పొందగలము.

సద్భావనను సంతరించుకుని గీత, వాద్య, అభినయాదులతో కూడిన నృత్య రూపకము ఉత్తమ **నాట్య** మనబడుతుంది.

# వృత్తి

వృత్తి అంటే **వ్యాపారం.**

లోకంలో ఏ కర్మ (పని) ఆచరించినా అది **మనస్సు- వాక్కు- కర్మ** అను **త్రికరణములతో** జరుగుతుంది. అనగా చేయబోవు పనిని మనస్సుతో ఆలోచించి, మాటతో వెల్లడించి, చేతలతో జరుపుతాము.

ఒక్క మాటలో చెప్పాలంటే భావం వ్యక్తము చేయునది **వృత్తి.**

| **వృత్తి - 4 విధాలు** | |
|---|---|
| **1. భారతి** | **3. కైశికి** |
| **2. సాత్త్వతి** | **4. ఆరభటి** |

1.**భారతి** · వాగ్-వ్యాపారమునకు ప్రాధాన్యము నిచ్చునది.

2.**సాత్త్వతి** : మానసికమైన వ్యాపారం అధికంగా ఉండునది

3. **కైశికి** · లాలిత్య స్వరూపమైన భావాలకు శృంగార రస ప్రధానమైనది.

4 **ఆరభటి** . చేష్ట ప్రధానమైనది.

**అభినవ గుప్తుని మాటలతో**

1 భారతి : వాక్చేష్ట లేక వాచికాభినయం.

2 సాత్త్వతి : మనశ్చేష్ట లేక సాత్త్వికాభినయం.

3. కైశికి
4. ఆరభటి } కాయచేష్ట.

**కాయచేష్ట :- 2 విధాలు**

1. **సుకుమారము** :- కైశికి.

2. **ఉద్ధతము** :- ఆరభటి.

ఉదా:- 1. దేవుని (కృష్ణుని) **స్తుతించుట.**

**భారతి :- వాచికం**

2. దేవుని (కృష్ణుని) మనస్సులోనే తలచి **ధ్యానించుట.**

**సాత్త్వతి :- సాత్త్వికం**

3. దేవుని (కృష్ణుని) శృంగార పురుషునిగా తలచి విరహ వేదన పడుట.

**కైశికి :- సుకుమారం- శృంగారం**

4. దేవుని (కృష్ణుని) పుష్ప- గంధ- ధూప దీప నైవేద్యములతో పూజించుట.

**ఆరభటి :- కాయచేష్ట.**

## సతీ సావిత్రి కథ నుండి

## (ఒక ఉదాహరణ చూడండి)

సత్యవంతుడు నిర్జీవుడయిన వెంటనే యమధర్మరాజు వచ్చి, పాశము బిగించి, ప్రాణాలు తీసుకుపోతుండగా, పతివ్రత అయిన సావిత్రి యముని ప్రార్థించగా సత్యవంతుని ప్రాణములు దక్క, ఏదయినా వరం కోరుకో మన్నాడు.

ఆమె ఆలోచించి, తనను సుమంగళిగా దీవించమని కోరింది. యమ ధర్మరాజు అంగీకరించి ఆమెను సుమంగళిగా దీవించి వరప్రదానం చేసాడు.

**ఈ ఘట్టంలో :-**

1. తన భర్త ప్రాణములు ప్రసాదించుమని యమధర్మరాజును ప్రార్థించుట.

**భారతీ వృత్తి :- వాక్చేష్ట**

2. పతిని దైవముగా తలచిన స్త్రీ సావిత్రి మానసిక వ్యథ: **సాత్త్వతీ వృత్తి : సాత్త్వతీ.**

3. దాంపత్య జీవితం అంతమగునను ఆవేదనతో యముని వెంబడించుట.

**ఆరభటి కృతి :- కాయచేష్ట.**

ఈ సన్నివేశమున కైశికి వృత్తికి తావు లేదు.

కావున ప్రతి సన్నివేశమందు 4 వృత్తులకు తావుండునని భావించరాదు. కథా సన్నివేశ ప్రాముఖ్యం అనుసరించి వృత్తులు ఆవిర్భవించును. కాన **భరతుడు చెప్పినట్లు** ఈ రసమందు ఈ వృత్తి ప్రాధాన్యం వహించునని భావింపవచ్చును.

1. భారతీ వృత్తికి :- బీభత్స, కరుణ రసములు.

2. సాత్త్వతీ వృత్తికి :- వీర, అద్భుత, శాంతరసములు.

3. కౌశికీ వృత్తికి :- హాస్య, శృంగార రసములు.

4 ఆరభటీ వృత్తికి :- రౌద్ర, భయానక రసములు.

వృత్తులకు రసములకు గల సంబంధమును బట్టి అభినయ ప్రధానమైన నాట్యమునకు ఈ నాలుగు వృత్తులు అర్థ ప్రధానము లగుచున్నవి.

లాస్యంతో కైశిక వృత్తి మాత్రమే కాకుండా, ఒక్కొక్కప్పుడు భారతీ వృత్తి సాత్త్వతీ వృత్తి కూడా ఉంటుంది.

శృంగార, శాంత, కరుణ, హాస్య, అద్భుత రసాలు లాస్యంతో ఒప్పుతవి.

వీర, బీభత్స, భయానక, రౌద్ర రసాలు తాండవంతో ఒప్పుతవి.

ఆవేశపూరితమైన శృంగారము, భక్తి తాండవములోనికే వస్తాయి.

# ప్రవృత్తి

ప్రవృత్తి శబ్దార్థము :- గుణము లేక నడత.

భరతముని చెప్పిన నిర్వచనం : స్థూలదృష్టి

ఆ యా దేశములందలి వేష భాషలు, ఆచారాల వైచిత్రిని లేక ప్రత్యేకతను తెల్పునది ప్రవృత్తి.

భరతదేశమును తీసుకున్నప్పుడు ఇవి స్థూలంగా 4 విధాలు.

1. దాక్షిణాత్య ప్రవృత్తి
2. అవంతీ ప్రవృత్తి
3. ఓఢ్ర మాగధీ ప్రవృత్తి
4. పాంచాల మధ్యమ ప్రవృత్తి

## *1. దాక్షిణాత్య ప్రవృత్తి*

మహేంద్రము, మలయము, సహ్యాము, మేఖలము, పాలమంజరము లేక (కాలపంజరము) అను పర్వతముల సమీపమందున్న దేశములు దక్షిణాపథమునకు చెందినవి. కాగా, దక్షిణ సముద్రమునకును, వింధ్య పర్వతమునకును మధ్య నివసించు కోసల- తోసల- కళింగ- యవన- ఖాస- ద్రవిడ- ఆంధ్ర- మహారాష్ట్ర- వైణ్ణ (కృష్ణా- పినాకినీల మధ్య దేశము)- వన వాసాది దేశములందలి వారు ఈ దాక్షిణాత్య ప్రవృత్తినే అవలంబించి ఉంటారని ప్రాచీనుల భావన.

దాక్షిణాత్యులు బహునృత్త- గీత- వాద్యప్రియులును, సుకుమార ముగ కైశికి వృత్తియే ప్రధానముగా కలవారును, చతురములును, లలితములును, మనోహరములును అగు- అంగాభినయములు కలవారును అయి ఉందురు.

## *2. అవంతీ ప్రవృత్తి:-*

అవంతీ- విదిశ- సౌరాష్ట్ర- మాలవ- సింధు- సౌవర- అనర్త- అర్బుద-

దశార్ణ- త్రిపుర- మృత్తికావతీ దేశస్థులు అవంతీ ప్రవృత్తిని అనుసరిస్తారు.

వీరికి సాత్త్వతీ, కైశికీ వృత్తులు ప్రధానం

### 3. ఓఢ్ర మాగధీ ప్రవృత్తి:-

తూర్పున ఉన్న అంగ- వంగ- కళింగ- వత్స- ఓఢ్ర- మగధ- పుండ్ర- నేపాల- అంతర్గిర- బహిర్గిర- ప్లవంగము- మలద- మల్లవర్తక- బ్రహ్మోత్తర- భార్గవ- మార్గవ- ప్రాగ్జ్యోతిష- పుళింద- విదేహ- తామ్రలిప్త దేశస్థులు ఓఢ్రమాగధీ ప్రవృత్తిని అవలంబించి ఉంటారు.

వీరికి ఆరభటీ, భారతీ వృత్తులు ప్రధానం.

### 4. పాంచాల మధ్యమ ప్రవృత్తి:-

గంగానదికి ఉత్తర దిశయందున్నవియును, హిమాలయమును అంటి ఉన్నవియును అగు పాంచాల- శూరసేన- కాశ్మీర- హస్తినాపుర- బాహీక- శకల- మద్రక- ఉధీనర దేశములందు వారు పాంచాల మధ్యమ ప్రవృత్తి నవలంబించి ఉంటారు.

వీరికి సాత్త్వతీ- ఆరభటీ వృత్తులు ప్రధానములు.

**ఇక సూక్ష్మదృష్టి...**

ఒక వ్యక్తి యొక్క నడత- **గుణములను** పరిగణనలోనికి తీసుకున్నప్పుడు - అతని ప్రవృత్తి స్పష్టంగా గోచరమవుతుంది.

వృత్తిని (అనగా అతను చేసే వ్యాపారాన్ని) బట్టి గుణాన్ని అంచనా వేయలేము. జంతువులను చంపి మాంసము విక్రయించి జీవించు కసాయివాడని పిలువబడే వ్యక్తిని నిర్దయుడని, హింసాత్మకుడని ముద్ర వేయలేము. అందులో ధర్మపరులు, త్యాగశీలురు లేకపోలేదు.

అలాగే వేశ్యను పతితగా భావించి దానికి హృదయం లేదని భావించలేము. దానధర్మాలు, భక్తిప్రపత్తులు ఉన్న వేశ్యలను మనము చూస్తూనే ఉన్నాము.

ఇక నాట్యపరంగా మనము చేపట్టిన కథావస్తువులోని సన్నివేశము ననుసరించి వచ్చు పాత్రయొక్క విశిష్టతను గుర్తించి గుణమును ఎరిగి, నడత అంటే నాట్య ప్రయోగము చేయవలెను.

పాత్రయొక్క ఔచిత్యమును విడువక అభినయించవలెను.

రాజుకు సేవకుని నృత్త, నృత్య, నాట్య, అభినయాదులలో తేడా విపులంగా కన్పించవలెను. ఇది నాట్యకళాకారుని కనీస బాధ్యతగా భావించాలి **శ్రీకృష్ణ- సత్యభామ** పాత్రలు ధరించి చెంబు నెత్తిన బెట్టి- పళ్ళెముపై నృత్యం చేసే కళాకారులను నేడు మనము చూస్తున్నాము. అది కేవలం **వ్యాపార దృష్టితో చేసే గారడీ** అని చెప్పాలి.

# ప్రకృతి

ప్రకృతి పదమునకు అర్థం:-

1. సహజము
2. స్వభావము

**1. సహజము:-**

1. గ్రుడ్డివాడికి ప్రపంచమంతా అంధకారం.

2. చెవిటివాడికి ఏ శబ్దమూ వినిపించదు.

3. సుదూరంలో కన్పించే వ్యక్తి దగ్గరవుతున్న కొద్దీ అతని ఆకారము, నడకను బట్టి ఫలానా అని గుర్తించగలం.

4. కుంటివాడి నడక

నత్తివాని మాట

ఎడమచేతి వ్రాత

ఇవి మనకు ప్రత్యక్షంగా కనిపించే సహజ ప్రకృతులు.

**2. స్వభావము:-**

మానవుని స్వభావం భిన్న వృత్తి ప్రవృత్తులపై ఆధారపడి ఉంటుంది

1. మంచివాడు ప్రతి విషయాన్ని మంచిగానే భావిస్తాడు.

2. చెడ్డవాడు ప్రతి విషయాన్ని చెడ్డగానే తలుస్తాడు.

**ఒక కథ ...**

శ్రీకృష్ణుడు ధర్మరాజును ప్రపంచమంతా గాలించి ఒక్క చెడ్డవానిని తీసుకు రమ్మంటాడు. అలాగే దుర్యోధనుని ప్రపంచమంతా గాలించి ఒక్క మంచివానిని తీసుకురమ్మంటాడు.

ఇద్దరూ నిరాశాపరులై తిరిగి వస్తారు. ధర్మరాజుకు ఏదో ఒక మంచి లేని వాడు, దుర్యోధనునకు ఏదో ఒక చెడు లేనివాడు లోకమంతా వెతికినా కనుపించరు కాన ఇది వారి స్వభావములను తెల్పుతుంది.

## నటుని పరభావ ప్రవేశం

శ్లో॥ యథాజీవః స్వభావం హి
పరిత్యజ్యాన్యదేహికమ్,
పరభావం ప్రకురుతే
పరభావం సమాశ్రితః॥
(నాట్యశాస్త్రం)

**తా॥** జీవుడు తన స్వభావమును పరిత్యజించి, ఏ దేహమున తాను ప్రవేశించునో దానికి సహజమైన భావమునే చక్కగా కలిగి యుండునట్లు, ఉత్తమనటుడు ''అతడే'' నేను అని మనస్సునందు తలంచుచు వాక్- అంగ- లీలా చేష్టలతో పరభావమును ( అనుకార్యుని స్వభావాదులను) ప్రదర్శించ వలెను.

## భూమికాధారణము

పాత్రను దృష్టియందుంచుకొని ప్రయోగజ్ఞులు ( దర్శకులు) నటులచేత తదనుగుణములైన భూమికలను (పాత్రలను) ధరింపజేయవలెను

ఇందు - 1. అనురూపము

2. రూపానురూపము అని 2 విధములు

**1. అనురూపము :-**

ఆ యా అవస్థలకును, వయస్సులకును తగినట్లు స్త్రీలు - స్త్రీగత (సుకుమార) భావములను -

పురుషులు పౌరుష భావములను నిరూపించుట ''అనురూప'' మనబడును.

**2. రూపానురూపము :-**

పురుషుడు స్త్రీ రూపమును ధరించి స్త్రీగతమైన సుకుమార, సహజ భావమును అభినయించుట. అట్లే స్త్రీ, పురుష రూపమును ధరించి పురుషగతమైన ఉద్ధత, సహజ భావమును అభినయించుట రూపానురూప మనబడును.

## సిద్ధి

సిద్ధి అనగా సాధింపదలచిన ప్రయోజనము సుసంపన్నమగుట, అది నటులకు (నర్తకులకు) సామాజికులకు (ప్రేక్షకులకు) సమానమే. అనగా సామాజికుల సిద్ధిని దృష్టియందుంచుకొని, నర్తకుడు నాట్యమును ప్రదర్శించ వలెను.

అట్టి సామాజిక సిద్ధిహేతువైన ప్రయోగమందు నాట్య సిద్ధి ఎట్లుండవలెనో చెప్పబడినది.

ఇవి 1. మానుష సిద్ధి ; 2 దైవ సిద్ధి అని రెండు విధములు.

**1. మానుష సిద్ధి:-**

శాస్త్రజ్ఞాన సంపన్నుడైన నర్తకునకు పరులగు సామాజికుల ప్రోత్సాహముచే నృత్త. అభినయ ప్రతిభా విశేష బలముచే ప్రయోగమున సిద్ధి కలుగును

అనగా ఇతరుల ప్రోత్సాహముచే నటుడు (నర్తకుడు) తన ప్రయోగమున పరిపూర్ణతను పొందుట **మానుష సిద్ధి.**

అనగా ఒక్క మాటలో గుర్తింపు. తనలో ఉన్న శక్తి, సామర్థ్యములు కూడ ఒక్కొక్కప్పుడు ఇతరుల ప్రోత్సాహముచే బయల్పడుతవి

ఉదా:-

హనుమంతుడు తోటి వానర శ్రేష్ఠుల ప్రోత్సాహబలముచే సాగరమును దాటి లంకను ప్రవేశించగలిగాడు.

ఇది మానుష సిద్ధి హేతు వవుతుంది.

ఇవి 1. వాచికము ; 2. శారీరకము అని రెండు విధములు.

**1. వాచికము :-**

నాట్య ప్రదర్శనమును దర్శించిన ప్రేక్షకుని (సామాజికుడు) అద్భుతం అనన్య సామాన్యం అను విశేష శబ్దార్థములతో పొగడుట వాచిక మనబడును

**2. శారీరకము :-**

చేలము (వస్త్రము), అంగుళీయకము (ఉంగరము) మొదలగునవి ప్రధానము చేయుట 'కళాప్రపూర్ణ. పద్మశ్రీ' మొదలగునవి బిరుదులతో సత్కరించుట.

అయితే ఇట్లు సామాజికుల ప్రోత్సాహము లభించిన కళాకారుడు ఆనంద భరితుడై విర్రవీగక, నమ్రత నలవర్చుకుని, తన కళాభివృద్ధిని మరువక సంఘ శ్రేయస్సుకు తోడ్పడవలెను.

**2. దైవ సిద్ధి:-**

స్వ ప్రతిభాతారతమ్య కృత మగు సిద్ధి దైవ సిద్ధి.

అనగా కళాకారుడు ఎంత ప్రతిభావంతుడైనా, ఒక్కొక్క ప్రదర్శన మందు తన యోగ్యతను కోల్పోయి. రసాభాసమునకు గురియగును.

దానికి కారణము :-

1. ఆధ్యాత్మికము

2 ఆది దైవికము

**1. ఆధ్యాత్మికము:-**

అనగా శరీర జన్యములగు వ్యాధి రూపములు (జ్వరము, తల నొప్పి, మానసిక ఆవేదనలు) మొదలగునవి

**2. ఆది దైవికము:-**

అనగా బాహ్య, భూత జనిత కలకల శబ్దాదికవములు భూకంపవము, వాయువు, వర్షము, మత, రాజకీయ, వ్యక్తిగత కక్షలు మొదలగునవి.

ఉదా:- నేనొక ప్రసిద్ధ కళాకారుని ప్రదర్శనం చూచాను. ప్రదర్శనలో తనకు సహాయ కళాకారులుగా వచ్చిన ప్రబుద్ధులు, కడపటి రిహార్సల్సు చూసి చిన్నబుచ్చుకుని ఆఖరు క్షణములో తమ పాత్రలను నిర్వహించడానికి నిరాకరించారు. అయినా ఆ కళాకారుడు ధైర్య, సాహసములతో దైవ సంకల్పమునకు వదలి, తన ప్రతిభతో ప్రదర్శించిన కళారూపాలు ఆనాడు ఉన్నత స్థాయి నందుకుని ప్రేక్షకుల విశేష మన్ననలను పొందగలిగాయి. ఇది **దైవ సిద్ధి.**

## స్వరం – ఆతోద్యం – గానం

**స్వరం :-**

అనగా ధ్వని. స్వతఃశ్రుతికి రంజనము చేయుచున్నది గాన ''స్వర'' మన్నారు.

**ఆతోద్యం:-**

అనగా వాద్యములు. ఇది వాద్య సంగీత సంబంధమైనది

**గానం:-**

అనగా పాటలను, ధ్రువలను పాడుట.

**గానం - అభినయం - వాద్యం -**

వివిధాశ్రయములైన యీ మూడున్నూ ఒక దాని వెంబడి ఇంకొకటి ప్రయుక్తమవుతూ ఉంటాయి.

గాంధర్వం:-

ఇది స్వరాత్మక, **తాళాత్మక**, పదాత్మకాలు అని మూడు విధాలు స్థూలంగా ఆలోచిస్తే ఈ మూడు స్వర - **ఆతోద్య - గానములనే** భేదములకు సమానములు.

**1. స్వరములు :-**

షడ్జము - ఋషభము - గాంధారము, మధ్యమము - పంచమము - ధైవతము - నిషాదము అనునవి సప్త స్వరములు. స - రి - గ - మ - ప - ద - ని అను ఏడు అక్షరములతో ఇవి వ్యక్త మగుచున్నవి. ఇవి స్వర రాగములకు ఆధారములు.

**2. ఆతోద్యములు:-**

అంటే **తాళాత్మక గాంధర్వం** (వాద్యములు).

1. **తతము:-** తంత్రీవాద్యం (వీణ వంటిది)
2. **అవనద్ధము:-** చర్మవాద్యం (మృదంగం)
3. **ఘనం:-** కంచుతాళం
4. **సుషిరం:-** వేణువు

**3. గానం:-**

పదాత్మక గాంధర్వం అర్థవంతమైన అక్షర సమూహం పదము అవుతుంది. స్వరతాళానుబద్ధమైన నిబద్ధ పదం **ధ్రువాగాన** మందు **వస్తువు** అవుతుంది.

నియతాక్షరములు గలదై, ఛందో - యతిసమన్వితమై తాలపాతములతో కూడిన పదం నిబద్ధ మనబడుతుంది.

కాన పద - వర్ణ- అలంకార - యతి, ప్రాణ-లయ- సమ్మిళితమైన రచనకు **''ధ్రువం''** అని పేరు

వస్తువు - ప్రయోగము - ప్రకృతి - రసము - భావము - ఋతువు - దేశము, కాలము - అవస్థ - వయస్సు - దృష్టి యందుంచుకొని తదనుగుణంగా ధ్రువాగానం చేయవలెను

కేవల వాక్యముల (మాటల) చేత వాచ్యం చేయరాని ఉదాత్త విషయమును మాత్రమే ధ్రువాగీతులందు అభినయించవలెను.

కేవలం గీతము చేతనే రసము జనింపదు. కావున రస సిద్ధికి - అనుయుక్తంగా గీత - వాద్యములను ప్రయోగించాలి.

## నృత్త - నృత్య - నాట్యములు

**'నృత్'** అను ధాతువు నుండి నృత్తము **'నట్'** అను ధాతువు నుండి నాట్యము ఉత్పన్నమైనవి.

నృత్ అనే ధాతువునకు ''క్యప్'' ప్రత్యయం చేరగా **'నృత్తం'** అనే పదం నిష్పన్నమైంది.

**1. నృత్తం:-**

'నృత్తం తాళ లయాశ్రయం'. అనగా నృత్తంలో కేవలం తాళ లయములతో కూడిన అంగ, ప్రత్యంగముల కదలికలు మాత్రమే ఉంటాయని, సుకుమార ఉద్ధత గతులు రెండూ ప్రదర్శన యోగ్యములని చెప్పబడినవి. ఇది రస భావ విహీనమైన స్వాభావిక గతులు కలది కనుక దీనిని 'దేశి' అన్నారు.

**2. నృత్యం:-**

**''భావాశ్రయంతు నృత్యం స్యాత్''** అనగా భావముతో కూడినది నృత్యం

ఇందు నర్తకి ఏదో ఒక గేయం లేక పదం లేక శ్లోకం స్వీకరించి తదర్థ ప్రదర్శకమైన అభినయం చేస్తుంది కావున నృత్యం - ప్రతిపద - అర్థ - అభినయ మయింది ''రస భావ వ్యంజకాది యుతం నృత్యమిత్యభిధీయతే'' అన్నారు గనుక రస భావములతో కూడినది ఆంగికాభినయమైంది.

**3. నాట్యం:-**

**''నాట్యం తన్నాటకేష్వేవయోజ్యం పూర్వకథాయుతం''**

అనగా నాట్యం నాటకమున పూర్వ కథ ననుసరించి చేయునది (''నాట్య శాస్త్రం'') అయితే దశ రూపక కారుడు ధనంజయుడు **నాట్యాన్నే** రూపకమని వ్యవహరించి, నృత్య గానాదియుతమైనది నాట్యమని వెల్లడించాడు అనగా నాట్యం ఒక నిర్దిష్ట భావముతో కూడిన, కథ లేక గీతములోని వాక్యము యొక్క లేక వాక్య సమూహములయొక్క సంతుష్టార్థమును వాచిక, ఆంగిక, సాత్త్వికాభినయములతో ప్రదర్శించునది.

అనగా-

లక్ష్య లక్షణ సద్భావనలతో కూడిన గీతమందు చరణమునకు - చరణమునకు మధ్య నుండు శబ్దము లేక స్వరము లేక వాద్య సంగీతము భావయుక్తమైనదైతే అది నృత్యం అవుతుంది. అనగా చరణమున సంతరించుకున్న వాక్యాభినయమునకు, సంచారి భావములు ఇందు వ్యక్తమవుతాయి.

అట్లుగాక అవి భావ రహితమైనదైతే నృత్త మనబడుతుంది.

నృత్త, నృత్యములతో కూడిన **గీతము నాట్యమని** గ్రహించవలెను

లయ ప్రధానమైన దేహముయొక్క కదలిక **నృత్తం** అన్నాము.

ఇందు శిల్ప, చిత్ర లేఖనములందలి అలంకారశిల్పం - సంగీతములోని రాగాలాపనం - కవిత్వంలోని శబ్దచమత్కారం నాట్యమందు నృత్తమును పోల్చవచ్చును

అంటే నృత్తం అలంకార ప్రదర్శనమైంది. అలంకార మాత్ర స్వరూపమైన కళకు వ్యావహారికమైన అర్థం లేకపోవచ్చును.

దివ్య నాదమైన **ఓంకారమే** అలంకార స్వరూపంగా భాసిస్తుంది. జగల్లీలలోని సామ్యస్థితి అది.

అలంకారమే **పరమశ్రుతి** అలంకార శిల్పం కావ్య పదార్థంలో ఉండే అపశ్రుతిని సామ్య స్థితిలోనికి తెచ్చే **మహాశ్రుతి.**

అనగా ప్రకృతి సహజరూపమైన 'రాయి' అపశ్రుతి అనుకుంటే' శిల్పి మలిచిన శిల్పాకృతి 'నటరాజు' విగ్రహము మహాశ్రుతి అనబడుతుంది. అదే పరమానంద స్వరూపం. నృత్త పరమార్థం.

## లాస్య – తాండవ లక్షణం

శ్లో॥ ''లాస్యతాండవ భేదేన
ద్వయ మేత ద్ద్విధా పునః
సుకుమారం తయోరాద్యం
భవేదపరముద్ధతం.''
(''నృత్త రత్నావళి'')

పూర్వము నిరూపించిన నృత్త, నృత్యములు రెండును లాస్య - తాండనము లగుచున్నవి.

1. సుకుమార మగు నృత్తం - లాస్యం
2. సుకుమారమగు నృత్యం - లాస్యం
3. ఉద్ధతమగు నృత్తం - తాండవం
4. ఉద్ధతమగు నృత్యం - తాండవం.

శాస్త్రీయ మగు నృత్యమున కోమల భావములను, ఉద్ధత భావములను వేరువేరు విధానములతో ప్రదర్శింతురు కావున లాస్యము సుకుమారమని, తాండవము ఉద్ధతమని వ్యవహారము కలిగినది. 'దేశి' అనే నృత్తములోను ఈ భేదం ఉంది.

లోకమున వ్యవహరించు నృత్తములలో ఉద్ధత, కోమల విధానములు గోచరిస్తూనే ఉన్నవి.

స్త్రీ, పురుషులకు సంబంధించిన అనురాగాత్మక మయిన భావమునకు 'లాస' మని పేరు తదర్థమగు విధానం లాస్య మవుతుంది లాస్యము

మనసునకు ఉల్లాసహేతువు. కామ భావమును- ఈ లాస్యం సముల్లసింప జేస్తుంది. లాస్యము కోమలములయిన అంగహారములతో కూడి ఉంటుంది.

| అట్టి లాస్యాంగములు :- 10 విధాలు | |
|---|---|
| 1. గేయ పదము | 6. త్రిమూఢకము |
| 2. స్థిత పాఠ్యము | 7. సైంధవకము |
| 3. ఆసీనము | 8. ద్విమూఢకము |
| 4. పుష్ప గంధిక | 9. ఉత్తమోత్తమము |
| 5. ప్రచ్ఛేదకము | 10. ఉక్త ప్రత్యుక్తము |

**1. గేయ పదము :-**

గాయనీమణులు ఆసనములందు సుఖాసీనులై, తంత్రీవాద్యముల ననుసరించి తామే గానం చేయడాన్ని, 'గేయ పదం' అంటారు. ఇందు ప్రియుని గుణగణాదులను వర్ణించు గేయములు ముఖ్యంగా ఉంటాయి. ప్రయోగ సంగతమైన గేయ పదము సామాజిక రంజక-మవుతుంది.

ఇది తాళ లయా శ్రితం. త్ర్యశ్ర, చతురశ్రాది తాళ సంపదలో ఎక్కువగా ఉంటుంది. (ఇది నేటి 'గానా బజానా' వంటిది).

**2. స్థిత పాఠ్యము:-**

స్థితి:- అనగా నిర్ణీతమైనది.

పాఠ్యము.- అనగా చదువ దగినది.

విరహతప్తయైన స్త్రీ ఒక చోట నిలబడి ప్రాకృతపు (నీచ) పలుకులను, ఆత్రుతతో పలుకుట స్థిత పాఠ్యం. ఇందు తాళ గతు లుండవు.

**3. ఆసీనము:-**

విరహార్తియైన స్త్రీ ప్రియుని గానక చింతా శోకాన్వితయై, అధోముఖమున కూర్చుండి, అతి సుకుమారముగ గీతమును ఆలపించడాన్ని ఆసీనం అంటారు.

ఇది కరుణ రస ప్రధానమైనది.

**4. పుష్ప గంధిక:-**

దీనిని **'పుష్పగండిక'** అని కూడ అందురు. ఇందు నానా విధ వాద్య, గీత, నృత్తము లుంటాయి. స్త్రీలు, పురుష వేషమున పురుష చేష్టలు, పురుషులు స్త్రీ వేషమున స్త్రీ చేష్టలు, లేక ఆహార్యమున మార్పులు లేకుండానే స్త్రీలు పురుష చేష్టలు, - పురుషులు స్త్రీ చేష్టలు అభినయించడాన్ని పుష్పగంధిక అంటారు. దీనినే చిత్రాభినయం అంటాం.

**5. ప్రచ్ఛేదకము:-**

విరహోత్కంఠితయైన స్త్రీ - జ్యోత్స్న (వెన్నెల) సంచార మొనర్చుతూ ఛాయాకృతినే ప్రియునిగ భావించి హర్షాతిశయమున ప్రియుని చేరినట్లు భావించడాన్ని ప్రచ్ఛేదక మంటారు. అట్లే మదిరా (కల్లు) ప్రతి బింబిత ప్రియ భావనము, దర్పణ (అద్దము) ప్రతిబింబిత ప్రియ భావనము, జల ప్రతి బింబిత ప్రియ భావనము వనితకు సంతోష దాయకం అవడాన్ని ప్రచ్ఛేదకం అంటారు.

**6. త్రిమూఢకము:-**

అపరాధియైన నాయకుని, నాయిక విషణ్ణ హృదయయై ద్వేషించడాన్ని త్రిమూఢకం అంటారు. ఇందు అనిష్ఠురములు, సన్నని పదముల పొందిక త్రిమూఢకమున ఉంటుంది.

**7. సైంధవము:-**

దీనిని **'సైంధకము'** అని కూడ అంటారు నాయకి తామేర్పరుచుకున్న సంకేత స్థలమున ప్రియుని కానక, 'వంచితుడ ! ద్రోహి ! నీచుడ! అను పలుకుల సువ్యక్తములగు హస్త విన్యాసములతో వ్యవహరించుటను సైంధవం అంటారు ఇందు నాట్యమున పాఠ్య సంబంధ మేమియు నుండదు.

**8. ద్విమూఢకము:-**

లాస్యాశ్రయమైన కావ్యమున నాయికా నాయకుల కిద్దరకు వ్యామోహము వర్ణితమయితే అది ద్విమూఢక మవుతుంది.

ముఖ, ప్రతిముఖ సంపత్తి యిందొక రమణీయతను సంపాదిస్తుంది

మొదట సామాజికులకు ముఖమభిముఖముగా నుంచుట, అనంతరము ప్రతిముఖవిధానమున లాస్యాంగము నభినయించుట యిందు ముఖ్యము.

**9. ఉత్తమోత్తమకము:-**

నానాభావ రసాశ్రితమైన రచనా వైచిత్రికి మనోహరముగా లాస్యాంగమున అభినయించుట ఉత్తమోత్తమకమనబడుతుంది. లీలా, హేలా, హావ భావముల చేత ఇది దీప్తి చెందుతుంది.

**10. ఉక్త ప్రత్యుక్తము:-**

అనగా ఉక్తవచనము ప్రత్యుక్త భావము నిచ్చును (సూటిపోటి మాటలు). కోపావేశమున మాటకు మాటగా పలుకు వచనములు రసావేశమున రహస్యమై భాసించుట ఉక్త ప్రత్యుక్తకము.

# తాండవము

మహేశ్వరుని శాసనమున- తండువు భరతునకు ఉద్ధతముగ నిరూపించిన నృత్యము. ఇది 'తండుని' పేరున తాండవ మనబడింది.

తండువు ఉద్ధతమునే నిరూపించినందున తాండవము ఉద్ధతమని లోకము భావించినది.

అంగహారములలో సుకుమారములైనవి కూడా ఉన్నవి. కరణములన్నీ ఉద్ధతములు కావు. కావున సుకుమార విన్యాసములకు లాస్యమని, ఉద్ధత విన్యాసములకు తాండవ మని శాస్త్రవేత్తలు భావించారు.

(నృత్యంలో సంచలనాన్ని నాలుగు రీతులుగా పేర్కొన్నారు)

1. మండలము :- దేహ భంగిమ
2. ఉత్ప్లవనము :- గంతు

3. భ్రమరి :- తిరుగుట

4. పాదచారి :- ముందుకు - వెనుకకు వెళ్లుట.

| మండలాలు:- 10 విధాలు | |
|---|---|
| 1. స్థానకము | 6. ప్రేరితము |
| 2. ఆయతము | 7. స్వస్తికము |
| 3. ఆలీఢము | 8. మోటితము |
| 4. ప్రత్యాలీఢము | 9. సమసూచి |
| 5. ప్రేంఖణము | 10. పార్శ్వ సూచి |

**1. స్థాపక మండలం:-**

నడుం మీద రెండు ప్రక్కలను రెండు అర్ధ చంద్ర హస్తాలను ఉంచి, సమరేఖతో నిలిస్తే అది స్థానక మండలం అవుతుంది.

**2. ఆయత మండలం:-**

రెండు పాదములను ఒక వితస్తి (జాన లేక అరమూర) ఎడం కలవిగా చతురస్రంగా జానువు (మోకాలు)లను అడ్డంగా వంచి నిలిస్తే అది ఆయతమండలం అవుతుంది.

**3. ఆలీఢ మండలం:-**

వామ పాదాన్ని, కుడి పాదం ముందు మూడు వితస్తులు (జానల) దూరంలో ఉంచి ఎడమ చేత శిఖరహస్తం, కుడి చేతకటకా ముఖ హస్తం పట్టి నిలిస్తే అది ఆలీఢ మండలం అవుతుంది.

**4. ప్రత్యాలీఢ మండలం:-**

ఆలీఢ మండలంలోని పాదాలు వ్యత్యస్తములైతే అది ప్రత్యాలీఢమండలం అవుతుంది.

**5. ప్రేంఖణ మండలం:-**

ఒక పాదాన్ని రెండవ పాదం యొక్క చీల మండ ప్రక్కను నిల్పి, కూర్మ

హస్తం పట్టి నిలిస్తే అది ప్రేంఖణ మండలం అవుతుంది.

**6. ప్రేరిత మండలం:-**

ఒక పాదంతో రెండవ పాదం ప్రక్కగా మూడు వితస్తుల (జానల) దూరంలో భూమిని గట్టిగా కొట్టి, మోకాళ్లను ఒక దాని మీద ఒకటి అడ్డంగా ఉంచి, ఎడమ చేతితో శిఖర హస్తం రొమ్ము మీద పట్టి, కుడి చేతితో పతాక హస్తం చాపి పట్టి నిలిస్తే ప్రేరిత మండలం అవుతుంది.

**7. స్వస్తిక మండలం :-**

కుడిపాదమును ఎడమ పాదం మీదుగాను, కుడిచేతిని ఎడమ చేతిమీదుగాను అడ్డంగాను అలపల్లవ హస్తములు పట్టినిలిస్తే స్వస్తిక మండలం అవుతుంది.

**8. మోటిత మండలం:-**

రెండు చేతులతో త్రిపతాక హస్తములను పట్టి, పాదాగ్రాల (వ్రేళ్ల) మీద నిలిచి, ఒక్కొక్క మోకాలితో క్రమంగా భూమిని తాకితే మోటిత మండలం అవుతుంది.

**9. సమసూచీ మండలం:-**

పాదాగ్రాలతో (ముని వ్రేళ్లతో) మోకాళ్లతో భూమిని వరుసగా తాకితే అది సమసూచీ మండలం అవుతుంది.

**10. పార్శ్వ సూచీ మండలం**

రెండు పాదాల వ్రేళ్ల మీద నిలిచి ఒక మోకాలితో ప్రక్కగా భూమిని తాకితే అది పార్శ్వ సూచీ మండలం అవుతుంది.

# స్థానకం (Resting Posture)

ఆ యా గతి, ప్రచారాలకు ముందుగానీ తరువాతగానీ నిలబడే విధానమే స్థానకం.

| స్థానకములు : 6 విధాలు | |
|---|---|
| 1. సమ పాదం | 4. ఇంద్రం |
| 2. ఏక పాదం | 5. గారుడం |
| 3. నాగ బంధం | 6. బ్రహ్మం |

**1. సమపాద స్థానకం:-**

పాదాలు సమంగా ఉంటే అది సమపాద స్థానకం అనబడుతుంది.

**వినియోగం:-** పుష్పాంజలి, దేవతా రూపాలు ధరించుట యందు.

**2. ఏకపాద స్థానకం:-**

ఒక కాలుమీద నిలిచి, రెండవ కాలును మొదటి కాలిమోకాలి మీదుగా అడ్డంగా ఉంచితే అది ఏకపాద స్థానకం అవుతుంది.

**వినియోగం:-** నిశ్చలత్వం, తపస్సు మొదలగు వాటియందు.

(ఇది భరతముని చెప్పిన వైష్ణవ స్థానకమునకు దగ్గరగా ఉన్నది).

**3. నాగబంధ స్థానకం:-**

ఒక పాదంతో రెండవ పాదాన్ని ఒక చేతితో రెండవ చేతిని చుట్టి నిలిస్తే అది నాగబంధ స్థానకం అవుతుంది.

**వినియోగం :-** నాగబంధము అను అర్థమందు.

**4. ఇంద్ర స్థానకం:-**

ఒక కాలును బాగుగా వంచి, రెండవ పాదంయొక్క జానువు (మోకాలు)ను పైకెత్తి చేతిని జారవిడిస్తే అది ఐంద్ర స్థానకం అవుతుంది.

**వినియోగం:-** ఇంద్రుడు, రాజు మొదలైన పాత్రలకు వర్తిస్తుంది.

**5. గరుడ స్థానకం:-**

ఆలీఢ మండలమందలి ఒక మోకాలును నేలమీద ఆన్చి, రెండు చేతులు మోయుటకు వీలుగా మండల ఆకారంగా ఉంచితే అది గరుడ స్థానకం అవుతుంది.

**వినియోగం :-** గరుత్మంతుని సూచించడానికి.

**6. బ్రహ్మ స్థానకం:-**

ఒక మోకాలి మీద రెండవ పాదాన్ని, ఒక పాదం మీద రెండవ మోకాలిని ఉంచి కూర్చుంటే అది బ్రహ్మస్థానకం అవుతుంది.

ఇది ఉపదేశ విధికి (కూర్చుండుటకు) సంబంధించిన పద్మాసనం.

**వినియోగం:-** జపం మొదలగు వాటి యందు.

| **ఉత్ప్లవన భేదాలు (గంతు) - 5 విధాలు** | |
|---|---|
| 1. అలగం | 3. అశ్వం |
| 2. కర్తరి | 4. మోటితం |
| 5. కృపాలగం | |

**1. అలగోత్ప్లవనం:-**

ఒకసారి దుమికి, శిఖరహస్తాలుగా ఉన్న రెండు చేతులను నడుం మీద రెండు ప్రక్కలను ఉంచితే అది అలగోత్ప్లవనం అవుతుంది.

**2. ఉత్ప్లవన కర్తరి:-**

ప్రప్రథమం ముంగాలు మీదుగా ముందుకు దుమికి, ఒక చేతితో ఎఢమ పాదమునకు వెనుకగా కర్తరీహస్తమును పట్టి, రెండవ చేతితో అధోముఖంగా శిఖర హస్తం పట్టి, దానిని కటి మీద ఉంచితే ఉత్ప్లవనకర్తరి లేక కర్తర్యుత్ప్లవనం అవుతుంది.

**3. అశ్వోత్ప్లవనం:-**

రెండు చేతులతో త్రిపతాక హస్తములు పట్టి మొదట, ఒక పాదంతో ముందుకు దుమికి, తరువాత రెండవ పాదాన్ని మొదటి పాదంతో సమానంగా ఉంచితే అది అశ్వోత్ప్లవనం అవుతుంది.

**4. మోటితోత్ప్లవనం:-**

రెండు చేతులతో త్రిపతాక హస్తములను పట్టి, ఉత్ప్లవన కర్తరి యందువలెనే పర్యాయంగా రెండు ప్రక్కలకు దుముకుట మోటితోత్ప్లవనం అవుతుంది.

**5. కృపాలగోత్ప్లవనం:-**

ఒక్కొక్క చీల మండతో పర్యాయంగా కటిని తాకుతూ మధ్య అర్ధ చంద్ర కలా హస్తం పట్టితే అది కృపాలగోత్ప్లవనం అవుతుంది.

| భ్రమరీ భేదాలు (తిరుగుట) 7 విధాలు | |
|---|---|
| 1. ఉత్ప్లుత భ్రమరి | 5. కుంచిత భ్రమరి |
| 2. చక్ర భ్రమరి | 6. ఆకాశ భ్రమరి |
| 3. గరుడ భ్రమరి | 7. అంగ భ్రమరి |
| 4. ఏకపాద భ్రమరి | |

**1. ఉత్ప్లుత భ్రమరి:-**

సమ పాదాలతో నిలిచి, తరువాత ఎగిరి అంతరాళమందు (భూమికి తగలకుండా శరీరాన్ని అంతటినీ త్రిప్పితే అది - ఉత్ప్లుత భ్రమరి అవుతుంది.

**2. చక్ర భ్రమరి:-**

రెండు చేతులతో త్రిపతాకహస్తాలను పట్టి, నేలను పాదాలతో మాటి మాటికి తడుతూ చక్రాకారంగా తిరిగితే అది చక్రభ్రమరి అవుతుంది.

**3. గరుడ భ్రమరి:-**

ఒక పాదాన్ని అడ్డంగా చాచి పిమ్మట మోకాలును భూమి మీద ఉంచవలెను. తరువాత రెండు బాహువులను బాగుగా చాపి, వేగంగా త్రిప్పితే అది గరుడ భ్రమరి అవుతుంది.

**4. ఏక పాద భ్రమరి:-**

ఒక పాదాన్ని ఇంకొక పాదం చేత (పాదం మీద) పర్యాయంగా త్రిప్పితే అది ఏక పాద భ్రమరి అవుతుంది.

**5. కుంచిత భ్రమరి:-**

జానువును (మోకాలును) వంచి తిరిగితే అది కుంచిత భ్రమరి అవుతుంది.

**6. ఆకాశ భ్రమరి:-**

ఒకసారి ఎగిరి పాదాలను ఎడంగా చాపి ఉంచి, తరువాత శరీరమంతటిని గుండ్రంగా త్రిప్పితే, అది ఆకాశ భ్రమరి అవుతుంది.

**7. అంగ భ్రమరి:-**

పాదాలను ఒక జానెడు దూరంగా ఉంచి, తరువాత శరీరాన్ని గుండ్రంగా త్రిప్పితే అది అంగ భ్రమరి అవుతుంది.

## చారీ భేదాలు

ఊరు - కటి - పాద - జంఘలయొక్క కర్మల పరస్పర సంయోజన ఫలమైన చేష్ట ''చారి'' అనబడుతుంది.

**'చారి'** అను పదమునకు చరించుట అనునది భావార్థం.

పాదచారి అనగా పాద ప్రచారము, అనగా అడుగులు. దీనినే వ్యాయామం అని కూడ అన్నారు.

| నందికేశ్వరుడు చెప్పిన చారీ భేదాలు 8 విధాలు | |
|---|---|
| 1. చలన చారి | 5. కుట్టన చారి |
| 2. చంక్రమణ చారి | 6. లుఠిత చారి |
| 3. సరణ చారి | 7. లోలిత చారి |
| 4. వేగినీ చారి | 8. విషమ సంచర చారి |

**1. చలన చారి:-**

పాదాన్ని ఉన్న చోటి నుంచి కదిలించితే దాన్ని చలనచారి అంటారు

**2. చంక్రమణ చారి:-**

పాదాలను ప్రయత్న పూర్వకంగా ఎత్తి ఎత్తి ఆ పాదాల ప్రక్కలకు పర్యాయంగా వేస్తూ ఉంటే అది చంక్రమణచారి అవుతుంది.

**3. సరణ చారి:-**

ఒక పాదంయొక్క చీల మండ చేత రెండవ పాదంయొక్క చీల మండను తాకుతూ రెండు చేతులతో పతాక హస్తాలను పట్టి జలగవలె భూమి మీద ప్రాకడాన్ని సరణచారి అంటారు.

**4. వేగినీ చారి:-**

చీల మండ చేత లేదా పాదాగ్రం చేత వేగంగా చరిస్తూ, రెండు చేతులతో వరుసగా అలపద్మహస్తం లేక త్రిపతాకహస్తం పట్టి వేగంగా నడిస్తే దానిని వేగినీ చారి అంటారు.

**5. కుట్టన చారి:-**

చీల మండ చేత లేదా పాదాగ్రం చేత లేదా మొత్తం పాద తలంచేత నేలను తడితే అది కుట్టనచారి అవుతుంది.

**6. లురిత చారి:-**

స్వస్తిక స్థితిలో ఉంచి (ఒక పాదం మీద రెండవ పాదం అడ్డంగా చేర్చి) పాదాగ్రంతో కుట్టినం చేస్తే (తడితే) అది లురితచారి అవుతుంది.

**7. లోలిత చారి:-**

ముందు చెప్పిన విధంగా కుట్టనం చేసి, పిమ్మట భూమిని తాకకుండా పాద చాలనం చేస్తే, అది లోలితచారి అవుతుంది.

**8. విషమ సంచర చారి:-**

కుడి పాదం ప్రక్కగా ఎడమ పాదాన్ని, ఎడమ పాదం ప్రక్కగా కుడి పాదాన్ని తడుతూ పర్యాయంగా పాద విన్యాసం చేస్తే అది విషమసంచరచారి అవుతుంది.

భరతుడు చెప్పిన చారీ విధానం

చారులు : 2 విధాలు

(1) భౌమీ (2) ఆకాశికీ.

(పాదము నేల మీద ఆని ఉండునది భౌమీ చారి)

| భౌమీ చారులు: 16 విధాలు | |
|---|---|
| 1. సమపాద | 9. ఊరూద్వృత్త |
| 2. స్థితావర్త | 10. అడ్డిత |
| 3. శకటాస్య | 11. ఉత్స్పందిత |
| 4. అధ్యర్ధిక | 12. జనిత |
| 5. చాషగతి | 13. స్యందిత |
| 6. విచ్యవ | 14. అపస్యందిత |
| 7. ఏడకాక్రీడిత | 15. సమోత్సారితమత్తల్లి |
| 8. బద్ధ | 16 మత్తల్లి |

**1. సమపాద చారి:-**

గోళ్లు సమానములుగా ఉండునట్లు పాదములను దగ్గరగా చేర్చి నిలిచినచో అది సమపాద చారి అవుతుంది.

**2. స్థితావర్త చారి:-**

అగ్రతల సంచార పాదముతో - జానువుల (మోకాలు) వద్ద స్వస్తికము కావించి, విడదీసి రెండవ పాదముతో మరల అట్లే చేయటాన్ని స్థితావర్త చారి అంటారు.

**3. శకటాస్య చారి:-**

నిషణ్ణాంగము (సమ స్థితి యందున కూర్చొనియున్న) అంగముతో అగ్రతల సంచార పాదమును ప్రసారితము చేసి, ఉరమును (ఱొమ్మును) ఉద్వాహితము చేయుట (పైకి ఎత్తుట) శకటాస్యచారి అంటారు.

**4. అధ్యర్ధిక చారి:-**

దక్షిణ పాదముయొక్క మడమ మీద వామ పాదమును ఉంచి, పిమ్మట దానిని తొలగించడాన్ని అధ్యర్ధిక చారి అంటారు.

**5. చాషగతి చారి:-**

పాదమును మొదట ఒక తాలము (చాపబడిన బొటనవ్రేలి - చూపుడు వ్రేలి నడిమి కొలత) ముందునకు ప్రసారితము చేసి, పిమ్మట రెండు తాలముల దూరముండునట్లు వెనుకకు చాచవలెను. అట్లే వామ పాదముతో కూడ చేయాలి దానినే చాష గతి చారి అంటారు.

**6. విచ్యవ చారి:-**

సమ పాద స్థానమందలి పాదములు ఎడము చేసి పాదము యొక్క చివరి భాగముచే భూమిని గ్రుచ్చడము విచ్యవ చారి అంటారు.

**7. ఏడకాక్రీడిత చారి:-**

(దీన్ని ఏళకాక్రీడిత అని కూడ అందురు.)

అగ్రతల సంచార పాదముతో మీది కెగురుచు, క్రింద పడుతుండటాన్ని ఏడకాక్రీడిత చారి అంటారు.

**8. బద్ధ చారి:-**

జంఘలను స్వస్తికముగా ఉంచి, విడదీసి, మోకాలు, ఊరు (తొడ) మధ్య మందు తగులునట్లుగా ప్రక్కలకు నడవడం బద్ధ చారి.

**9. ఊరూద్వృత్త చారి:-**

అగ్రతల సంచార పాదముయొక్క మడమను రెండవ పాదము యొక్క వెనుక భాగమునందుంచి, మోకాలితో పాటు పిక్కను వంచి ఊరువును పైకి త్రిప్పడం ఊరూద్వృత్త చారి అంటారు.

**10. అడ్డిత చారి:-**

అగ్రతల సంచార పాదముచే సమ పాదముయొక్క అగ్ర భాగమును కాని, వెనుక భాగమును కాని రాయటాన్ని అడ్డిత చారి అంటారు.

**11. ఉత్స్పందిత చారి:-**

రేచకము నందు వలెనే రెండు పాదములను క్రమముగా ప్రక్కలకు ఊపడం ఉత్స్పందిత చారి అంటారు

**12. జనిత చారి:-**

ముష్టిహస్తమును వక్షమునందుంచి, రెండవ హస్తము చలించు చుండగా అగ్రతల సంచపాదము ప్రదర్శించటాన్ని జనితచారి అంటారు.

**13. స్యందిత చారి:-**

వామ పాదము నుండి, దక్షిణ పాదమును అయిదు తాలముల ( జానల) ఎడముగా ఉండునట్లు ముందునకు ప్రసాదించటాన్ని స్యందిత చారి అంటారు.

**14. అపస్యందిత చారి:-**

వామపాదమును పై విధముగానే అయిదు తాలముల ఎడముగా ప్రసాదించుట (అనగా స్యందిత చారి వ్యత్యస్త మగును) అపస్యందిత చారి అంటారు.

**15. సమోత్సారితమత్తల్లి చారి:-**

అగ్రతల సంచార పాదములతో గుండ్రముగా తిరుగుట, వెనుకకు వెళ్లుట సమోత్సారితమత్తల్లి చారి అంటారు.

**16. మత్తల్లి చారి:-**

హస్తములు ఉద్వేష్టితములును, అపవిద్ధములును కాగా రెండు పాదములతో గుండ్రముగా తిరుగుచు ముందునకు వెళ్లుట మత్తల్లి చారి అంటారు.

# ఆకాశ చారులు

ఆకాశ సంచారులగుట వలన వీటికి ఆకాశచారులను నామము కలిగినది.

| ఆకాశ చారులు: 16 విధాలు | |
|---|---|
| 1. అతిక్రాంత | 9. ఆవిద్ధ |
| 2. అపక్రాంత | 10. ఉద్వృత్త |
| 3. పార్శ్వ క్రాంత | 11. విద్యుద్భ్రాంత |
| 4. ఊర్ధ్వ జానువు | 12. అలాత |
| 5. సూచి | 13. భుజంగత్రాసిత |
| 6. నూపురపాదిక | 14. హరిణ ప్లుత |
| 7. డోలా పాద | 15. దండ పాద |
| 8. ఆక్షిప్త | 16. భ్రమరి |

**1. అతిక్రాంత చారి:-**

కుంచిత పాదమును పైకెత్తి, ముందునకు చాచి, మరల పైకెత్తి, పిమ్మట క్రింద పడవేయవలెను. గంతవ్యాతిక్రమమున నిది **అతిక్రాంత** మనబడినది.

**2. అపక్రాంత చారి:-**

ఊరువులను (తొడలను) వలితముల నొనర్చి, కుంచిత పాదములను పైకెత్తి ప్రక్కగా ఉంచవలెను. అపక్రమము వలన ఇది **అపక్రాంత** మనబడినది.

**3. పార్శ్వ క్రాంత చారి:-**

కుంచిత పాదమును పైకెత్తి, మోకాలిని స్తన సమముగా ఉంచి, రెండవ పాదముతో **ఉద్ఘట్టితము** (ఎత్తి) వేయవలెను.

**4. ఊర్ధ్వజానువు చారి:-**

జాను (మోకాలు) స్తన సమమునగునట్లుగా కుంచిత పాదమును పై కెత్తి, రెండవ పాదమును నిశ్చలముగా ఉంచవలెను. పిమ్మట రెండవ పాదముతో పైవిధముగా చేసి మొదటి పాదమును నిశ్చలముగా ఉంచవలెను.

**5. సూచీ చారి:-**

కుంచిత పాదమును మోకాలికి పైగా ఎత్తి, పిమ్మట కొన భూమికి తగులునట్లుగా క్రిందపడవేయవలెను. సూచ్యాకారము వలన ఇది సూచి అనబడినది.

**6. నూపురపాదికా చారి:-**

అంచిత పాదమును రెండవ పాదముయొక్క వెనుకకు జరిపి, పాదము యొక్క కొన భూమికి తగులునట్లుగా వేగముగా క్రిందపడవేయవలెను.

**7. డోలాపాద చారి:-**

కుంచిత పాదమును పై కెత్తి పార్శ్వమునుండి పార్శ్వమునకు, ఊగులాడించి, అంచిత పాదముగా క్రిందపడవేయవలెను.

**8. ఆక్షిప్త చారి:-**

కుంచిత పాదమును పైకెత్తి, ప్రక్కలకు తెచ్చి, పిక్కలు స్వస్తికములగునట్లు కావించి అంచిత పాదమును భూమిపై ఉంచవలెను.

**9. ఆవిద్ధ చారి:-**

స్వస్తికముగా ఉన్న పాదములను విడదీసి, కుంచిత పాదమును ముందుకు చాచి, అంచిత పాదముగా రెండవ పాదముయొక్క మడమ మీద ఉంచవలెను.

**10. ఉద్వృత్త చారి:-**

ఆవిద్ధ చారి యందలి కుంచిత పాదమును రెండవ పాదము చుట్టును త్రిప్పి పైకెత్తి భ్రమరకము నొనర్చి, నేల మీద పడవేయవలెను.

**11. విద్యుద్భ్రాంత చారి:-**

ఒక పాదమును ప్రక్క నుండి వెనుకకు వలితము చేసి, తలను రాచుకొనునట్లుగా చాచి, పిమ్మట అన్ని వైపులకును గుండ్రముగా త్రిప్పవలెను.

**12. అలాత చారి:-**

వెనుకకు చాచిన పాదమును, వలనముతో ముందునకు లాగి, మడమ నేల కానుకొనునట్లుగా క్రిందికి దించవలెను. అలాత చక్రాకృతి ఇది అలాత మనబడినది.

**13. భుజంగ త్రాసిత చారి:-**

కుంచిత పాదమును రెండవ పాదముయొక్క ఊరు మూలము వరకును పైకెత్తి, కటి, జానువులను త్ర్యశ్ర ఊరువును వివర్తితము చేయవలెను.

(పాదోపాంత భుజంగ భయభావిత గతి సాదృశ్యము వలన ఇది **భుజంగ త్రాసిత** అనబడినది.)

**14. హరిణ ప్లుత చారి:-**

అతిక్రాంత చారి యందలి కుంచిత పాదమును పైకెత్తి, పైకెగిరి క్రిందికి పడునట్లు చేసి, రెండవ పాదముయొక్క అంచిత జంఘమును దాని వెనుక భాగమును క్షిప్తము చేయవలెను. (ఇది విదూషకాదుల గతియందు కన్పడుతుంది )

**15. దండపాద చారి:-**

నూపురపాదిక యందలి కుంచిత పాదమును, రెండవ పాదముయొక్క మడమ మీద ఉంచి, ముందునకు జరిగి, వేగముగా ఆవిద్ధము చేయవలెను. (దండాకారత్వము వలన **దండపాద** మనబడినది.)

**16. భ్రమరి చారి:-**

అతి క్రాంత చారి యందలి కుంచిత పాదమును పైకెత్తి, త్రికమును పరివర్తితము చేసి, రెండవ పాదముయొక్క అడుగు భాగమును కదలించ వలెను. (సర్వ శరీర పరివర్తనము మూలమున భ్రమణము కలుగుట వలన ఇది **భ్రమరి** అనబడినది.)

# గతి ప్రచారము

గతి అనగా :- నడక.

ప్రచారమనగా :- గతుల యందలి విశేష ప్రయోగము.

సన్నివేశ, సందర్భముల ననుసరించి నానార్థ, రస సంభవకారులైన ఉత్తమ, మధ్యమ, అధమ పాత్రలయొక్క, ప్రకృతిని, అవస్థను, దేశమును, కాలమును అనుసరించి, రస పుష్టి కొరకు గతి విధానము మారుతుంటుంది.

పాత్రల ఔచిత్యమును, సన్నివేశ పటిష్టత ననుసరించి, స్థిత (విలంబ) **మధ్య, ద్రుతలయలను** పరిశీలించి, నాట్యాచార్యుడు, ఆ యా ప్రకృతుల గతుల కనుగుణంగా, ఆ యా లయలను కూర్చాలి.

ఉత్తమ పాత్రయొక్క గతి **స్థైర్యోపేతముగాను,** మధ్యముల గతి **మధ్యమముగాను,** అధముల గతి **ద్రుతముగాను** ఉండాలి.

ఇట్లు మూడు లయలను **రసగతులు** అనగా శృంగార, హాస్య, కరుణ, రౌద్ర, వీర, ·భయానక, బీభత్స, అద్భుత, (ఉనికి) శాంత రసగతులను, **సత్త్వ**వశమున కూర్చవలసి ఉంటుంది.

సాత్త్విక, రాజసిక, తామసిక మార్గములను బట్టి, నౌక, విమాన, గజ అశ్వవాహనాలను బట్టి - వృద్ధ, విట, (బక్క) కృశ, కుంటి, గుడ్డి, స్త్రీ, పురుష విభేదాన్ని బట్టి - ఆసన, శయనాది స్థితులను బట్టి - ·ఏయే గతులు, ఏ యే ప్రచారాలు, ఏ యే రీతులలో ఉండవలెనో నాట్యాచార్యుడు ప్రకృతి నాధారంగా గ్రహించి కూర్చాలి.

ఇవి గాక అభినయ దర్పణ కారుడు నందికేశ్వరుడు - పది గతులుగా విభజించాడు. అవి...

| | | |
|---|---|---|
| 1. హంస | 4. గజలీల | 7. భుజంగి |
| 2. మయూరి | 5. తురంగిణి | 8. మండూకి |
| 3. మృగి | 6. సింహి | 9. వీరము |
| | | 10. మానవి. |

| | | |
|---|---|---|
| 1. | హంస | పక్షులు |
| 2. | మయూరి (నెమలి) | |
| 3. | మృగి (లేడి) | జంతువులు |
| 4. | గజలీల (ఏనుగు) | |
| 5. | తురంగిణి (గుఱ్ఱము) | భూచరములు |
| 6. | సింహి (సింహము) | |
| 7. | భుజంగి (పాము) | భూ, జల |
| 8. | మండూకి (కప్ప) | చరములు |

వీటికి సంబంధించిన ఆహార్యములు (రూపములు) ధరించి లేక వాటి మాదిరిగా అనుకరించి జరుపు నడకలతో నర్తకీ నర్తకులు ప్రదర్శించడాన్ని మనము చూస్తూనే ఉన్నాము.

ఇవి ముఖ్యముగా **కథాకళి** నృత్యమందు స్పష్టంగా గోచరమవుతాయి.

కవులు స్త్రీల నడకలను వర్ణించునపుడు - ఈ పశు పక్ష్యాదులను ఉదాహరణగా తీసుకుని - అతి మెల్లగా నడుచు అందమైన స్త్రీని **హంసగమన** అని, జఘన భారమున గంభీరముగా నడుచు స్త్రీని **గజగమన** అని వర్ణించుట కద్దు.

9. ఇక **వీరము** అనునది నవ రసముల లోనిది. ఆ రసమునకు తగినట్లు సందర్భ, సన్నివేశముల ననుసరించి గతులను సమకూర్చాలి.

10. మానవి

మానవి అనగా మనుషులకు, స్త్రీ పురుషులకు సంబంధించిన గతులు.

వీటికి దేశ, కాల, జాతి, ఉత్తమ, మధ్యమ, అధమ ప్రకృతుల ననుసరించి గతులను కూర్చాలి.

**నపుంసకుని గతి:-**

ఇది ఎక్కువగా స్త్రీ నడకను పోలి ఉంటుంది.

**అర్ధనారీగతి:-**

అర్ధనారీగతి స్త్రీ - పురుషగతుల సమ్మేళనము. పురుషుల గతి యందలి ఉదాత్తతను, స్త్రీల గతి యందలి లాలిత్యమును ప్రదర్శనమున ద్యోతకము చేయాలి.

**పాత్రల ప్రవేశ - నిష్క్రమణ గతులు:-** (దరువులు)

ఉత్తమ, మధ్యమ, అధమ పాత్రల ననుసరించి వారి వారి గతులు (నడకలు) ప్రయుక్తము కావల్సి ఉంటుంది.

అడుగులు వేయునపుడు లయ - తాల - కలా విధిని గతి ప్రచారము జరగాలి.

ఇవి సందర్భోచితమై రసోత్పత్తికి తోడ్పడాలి.

అనగా ఏ పాత్ర, ఏ అవస్థలో, ఎచ్చట, ఏ విధముగా నడవవలెనో తెలిసి గతి ప్రచారము జరగాలి.

**శ్లో॥ వయోஉనురూపః ప్రథమస్తువేషో**
**వేషానురూపేణ గతి ప్రచారః**
**గతి ప్రచారానుగతం చ పాఠ్యం**
**పాఠ్యాను రూపోஉభినయశ్చ కార్యః.**

(నాట్య శాస్త్రం 12వ అధ్యా - 247)

**తా॥** ప్రప్రథమంగా వేషము వయస్సునకు అనురూపంగా (తగినట్లు) ఉండాలి.

పిమ్మట వేషమునకు అనురూపమైన గతి ప్రచారం జరగాలి. పాఠ్యము (పాట) ఈ గతి ప్రచారానుగతంగా ఉండాలి. ఇక అభినయం పాఠ్యాను రూపంగా ఉండాలి.

ఏ కళకైనా భావం ముఖ్యం భావమును అనుసరించి అన్ని కళలు ఉద్భవిస్తాయి. అందువల్ల మనస్సులోని భావమును తెల్పు పాఠ్యము (పాట లేక సాహిత్యము).

పాఠ్యములోని భావమునకు తగిన అభినయం-

అభినయమునకు తగిన వేషం -

వేషమునకు తగిన వయస్సు -

వయస్సుకు తగిన గతిప్రచారం ఉండి తీరాలి.

నృత్త - నృత్య - నాట్యములు

భావ సారూప్యతకు దోహదమై ప్రేక్షకుని హృదయంలో రసోత్పత్తికి ఆలవాలమై, మహానందమును కలుగజేసే విధంగా గతి ప్రచారము ఉండాలి.

**లోక ప్రామాణ్యం**

తాను చెప్పక విడిచిన వాటిని ప్రయోగానుసారంగా లోకము నుండి గ్రహించవలెను అని భరతుడు నాట్య శాస్త్రమున పదే పదే వివరిస్తూ వచ్చాడు. అంటే నాట్యమునకు లేదా నటనకు ప్రామాణ్యం లోకమే. అందుకే **''లోకాను సరణం నాట్యం'' అన్నాడు భరతుడు.**

అంతా విని-

అందులో ఒక విద్యార్థి 'అబ్బో! ఇదంతా నేర్చుకోవాలంటే ఎన్ని సంవత్సరాలు పడుతుంది గురుదేవ! ఇది సాధ్యమేనా?' అని అడిగాడు.

**సర్వేశ్వర గురువులు:-**

''ఎందుకు కాదు?

భూమి ఎంత పెద్దది? మానవుడు 'రాకెట్' సృష్టించి, దానిమీద భూమిని చుట్టి వస్తున్నాడు గదా?

ఇతర గ్రహాలను దర్శించాలనే దీక్షతో చంద్రునిపై దిగి వచ్చాడు గదా! అలాగే ఏ పని చేయాలన్నా పట్టుదల, దీక్ష అవసరం.

కళలు కూడ అంతే! కళలు నేర్చుకున్నంత మాత్రాన చాలదు.

**కళల యొక్క ప్రయోజనాన్ని గుర్తించాలి.**

ఏ కళ ఐనా మానవ జీవిత వికాసానికి దోహదం చెయ్యాలి. కాని, మానవుణ్ణి అధోగతికి నడిపించి, పవిత్ర భారత సంస్కృతికి చరమ గీతం పాడరాదు.

శాస్త్రాన్ని క్షుణ్ణంగా ఆకళింపు చేసుకుని, నేటికీ ప్రసిద్ధ రూపములుగా నిలిచిన అంశములను ఆధారంగా గ్రహించి ; దేశ, కాల, సాంఘిక, రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని, నూతన ప్రక్రియల ద్వారా (Stage Craft) వినూత్న, విలక్షణ, విజ్ఞాన సన్నివేశములను ప్రజలకు అందించాలి. ఆ సన్నివేశాలను ప్రదర్శించడంలో శిల్ప నైపుణ్యం, రస భావములు కుంటుపడకూడదు.

కథా వస్తువు సందేశాత్మకం, ప్రబోధాత్మకంగా ఉండాలి అప్పుడే సద్భావన, సత్సంప్రదాయములతో కూర్చిన అంశములను నాట్యకళ ద్వారా ప్రజలకు అందించి, వారి జీవన - వికాసానికి తోడ్పడిన వాడవుతాడు కళాకారుడు.

విద్యాజ్ఞానం, శాస్త్రానుభవం, నేర్పు, ఏకాగ్రత, చాకచక్యం, నిత్యాభ్యాసం, భక్తి, నిర్మల చరిత్ర, సృజనాత్మక శక్తి నృత్యోపాసకునకు ముఖ్యం

## నాట్య పరమార్థము

నాట్యము జీవితానికి కేవల ప్రతిబింబం కారాదు. జీవిత యథార్థత నుండి, రసానందానుభూతి ద్వారా ప్రేక్షకుల మనస్సులను రంజింపజేయాలి. ఊహాతీతమైన (Fantacy) అంశములు కూడ రస విహీనములు కారాదు.

చైతన్యవంతమై జనించే - రస భావములు. పరమానందభరితమైన సత్య స్వరూపం సంతరించుకోవాలి. అప్పుడే నాట్యం ఉత్తమ కళగా శాశ్వతంగా నిలిచిపోతుంది.

**''ధర్మ్యం యశస్య మాయుష్యం హితం బుద్ధి వివర్ధనమ్,**

**లోకోపదేశ జననం నాట్యమేత ద్భవిష్యతి''**

**తా॥** ధర్మమువలన కీర్తి, ఆయుస్సు, మంచి బుద్ధి, అభివృద్ధి చెందును లోకమందు ధర్మము నుపదేశించుటకు నాట్య మావిర్భవించినది.

# గ్రంథము - రచన

గురుదేవులు జ్ఞానపీఠగ్రహీతలు Dr విశ్వనాథ సత్యనారాయణగారు మాకు కాలేజీలో చెప్పిన అలంకారశాస్త్ర పాఠములు నన్ను ఉత్తేజపరిచాయి.

నాట్యశాస్త్రమును క్షుణ్ణముగా చదువుకుని అష్టపదులు, దశావతారములు, తరంగములు, జావళీలు, మొదలగు సాంప్రదాయ అంశములనే గాక నాటి గురజాడ. వీరేశలింగం, శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, కొనకళ్ల, నండూరి మొదలగు విశిష్టకవుల గేయములకు భావగర్భితమైన నాట్యములను సమకూర్చి ప్రజలను ఉత్తేజపరిచిన ఘనత మాగురువులు కీ॥ శే॥ శ్రీ బి.వి. నరసింహారావు గారికే దక్కింది. వారు నా గురువులు కావటం నా అదృష్టం.

వీరిశిక్షణ, సాంగత్యబలం నాయీ గ్రంధ రచనకు ప్రోద్బలం.

సాహిత్య, చిత్రకళాకోవిదులు కీ॥ శే॥ అడివిబాపురాజుగారు నాకు ఆదర్శ మూర్తులు, వారి గ్రంథములలో పొందుపరచిన నాట్యకళావిశేషములు, పత్రికలలో వెలువడిన వ్యాసరచనలు నాకు నాట్యశాస్త్రఅవగాహనకు తోడ్పడ్డాయి.

## నాకు స్ఫూర్తినిచ్చి నన్ను నడిపించిన
## గ్రంధములు - రచయితలు

1. నాట్యశాస్త్రము (అనువాదం) DR P.S.R అప్పారావు
2. నాట్యశాస్త్రము (విశ్లేషణాత్మక అధ్యయనం) DR P.S.R అప్పారావు
3. నందికేశ్వరప్రణీత అభినయ దర్పణం DR P.S.R అప్పారావు
4. అభినయ స్వయబోధిని (అభినయ శాస్త్రము) - దేవులపల్లి వీరరాఘవమూర్తిశాస్త్రి
5. భరత రస కల్పలతామంజరి
6. నృత్త రత్నావళి (శ్రీ జాయసేనాపతి గ్రంధమునకు వ్యాఖ్యానము) - శ్రీ జమ్మలమడక మాధవ రామశర్మ

7. దక్షిణ దేశములు - నాట్యములు - తుమ్మలపల్లి సీతారామారావు

8. కూచిపూడి నాట్యమంజరి - మునుకుట్ల సాంబశివ

9. దాక్షిణాత్య నాట్యము - డా॥ ముట్నూరి సంగమేశం ఎంఏ, పిహెచ్. డి

10. కావ్యకళ - కవిభట్టారక మొవ్వాదాశరధి సూరి

11. ఆంధ్ర నాట్యం - భరతకళా ప్రపూర్ణ డా॥ నటరాజరామకృష్ణ

12. నాట్యరాణి - డా॥ నటరాజరామకృష్ణ

13. అభినయం శ్రీనివాస చక్రవర్తి

14. నటన శ్రీనివాస చక్రవర్తి

15. సభారంజని - శ్రీ వెలుగోటి సర్వజ్ఞకుమారయాచేంద్ర బహదరు

16. నందికేశ్వర ప్రోక్తం అభినయ దర్పణమ్ -
వావిళ్లరామస్వామి శాస్త్రులు & సన్స్.

17. రసమంజరి - శ్రీ భానుమిశ్ర కవివిరచితం

18. గీతగోవిందం - జయదేవకవి.

19. Indian Dance Natya & Nrıtya - C.R. శ్రీనివాస అయ్యంగారు

20. నాట్యశాస్త్రము మన్‌మోహన్ ఘోష్

21. భరతసారము- లంకాసూర్యనారాయణశాస్త్రి

# అనుబంధం

# నాయికా ప్రకరణం

నాయికలు:- 3 విధములు.

1. స్వీయ
2. పరకీయ
3. సామాన్య

1. స్వీయ :- ప్రేమించిన లేక పెండ్లాడిన పురుషుని యందే అనురాగం గలది.

2 పరకీయ:- పరపురుషుని యెడల ప్రీతి గలిగి, అతనితో గూడి సుఖించునది.

3. సామాన్య:- ద్రవ్యాపేక్షతో సకల పురుషులయం దనురాగం నటించునది.

1 స్వీయ:- 3 విధములు

1. ముగ్ధ
2. మధ్య
3. ప్రగల్బ లేక ప్రౌఢ

1. ముగ్ధ:- అంకురిత యౌవన. లజ్జ ఎక్కువగా గలది.

ముగ్ధ రెండు విధములు

(a) అజ్ఞాత యౌవన

(b) జ్ఞాత యౌవన

అజ్ఞాత యౌవన·- తనకు అంకురించిన యౌవనము తెలియనిది.

జ్ఞాత యౌవన:- తనకు అంకురించిన యౌవనము తెలిసినది.

2. మధ్య.- లజ్జ, కామములు సమానముగా గలది.

3. ప్రగల్బ లేక ప్రౌఢ -

లజ్జను జయించి కామేచ్ఛ పూర్తిగా గలది.

శృంగార రసము:- 2 విధములు

1 సంభోగ శృంగారం

2. విప్రలంభ శృంగారం

**1. సంభోగ శృంగారం**

నాయికా నాయకులు అనుకూలురై, విలాసవంతులై, ఆలింగన, చుంబనాది కలాపములచే కలుగు ఆనందమయావస్థ సంభోగ శృంగారం.

ఇవి రెండువిధములు.

1. సంక్షిప్తము

2. సంపన్నము

1. సంక్షిప్తము

నాయికా నాయకులు - సాత్త్వికము, సిగ్గు, బిడియము మొదలగు ఉపచారములను బొందుట.

2. సంపన్నము:-

దేశాంతరగతులైన నాయికా నాయకులు విరహతప్తులై, తిరిగి గూడిన సంభోగము సంపన్నము.

**2. విప్రలంభ శృంగారం**

కారణాంతరములచే కొంత తడవు గాని, కొన్నాళ్లుగాని నాయికా నాయకులకు కలిగిన ఎడబాటు నందు పొందు హృదయ వికారము విప్రలంభ శృంగారం.

ఇందు - 5 విధములు

1 అయోగ విప్రలంభము

2. మానకృత విప్రలంభము

3. ఈర్ష్యా మాన విప్రలంభము

4. ప్రవాస మాన విప్రలంభము

5. శాపగ్రస్త విప్రలంభము

1. అయోగ విప్రలంభము:-

అత్యంత ప్రేమ కలిగిన నాయికా నాయకులకు ప్రథమ సమాగమా త్పూర్యమందు గల ఉత్సాహజనిత స్థితిని అయోగ విప్రలంభ మందురు.

ఉదా:- నాయకుని జూడ నాయకి తన గృహమున లోనికి బయటకు వచ్చి - అతని దృష్టిని ఆకర్షించి, చిరునగవుల - తన అంగసౌష్ఠవమును ప్రదర్శించుట. సాభిప్రాయములను ప్రకటించి - లజ్జా, భయములతో నిర్జన ప్రదేశమును జేరుట. అనగా ఏకాంతమున జేరుట.

2. మానకృత విప్రలంభ శృంగారం

ప్రణయ కలహముచే అనగా పరస్పరాజ్ఞోల్లంఘనముచే నాయికా నాయకులు దూరమగుట.

ఇందు చేష్టలు:-

మాట్లాడకుండుట. ముఖమును త్రిప్పుకొనుట మొ॥నవి.

3. ఈర్ష్యా మాన విప్రలంభ శృంగారం:-

ప్రియుడు అన్యస్త్రీ సంగమమై యుండునని తాను స్వయముగా చూసిగాని, దూతిక ద్వారా వినుట వల్లగాని కలిగిన కోపమున దూరమగుట ఈర్ష్యామాన విప్రలంభ శృంగారం.

ఇందు చేష్టలు :

1. మాట్లాడకుండుట
2. దూషించుట
3. ఎత్తిపొడుపు మాటలు
4. బెదరించుట
5. కొట్టుట
6. వైముఖ్యం
7. కన్నీరు
8. కోపగించుట

**4.** ప్రవాస విప్రలంభ శృంగారం

నాయికా నాయకులు విడిచి దేశాంతరంబుల నుండుట ప్రవాస విప్రలంభ మనబడును. ఇందు చేష్టలు:-

చిక్కి బోవుట

వైవర్ణ్యము

నిట్టూర్పు

చింత

దైన్యము

కన్నీరు

**5. శాపగ్రస్త విప్రలంభ శృంగారం.**

నాయికా నాయకులు ఒకే గ్రామమున నుండి, కారణాంతరముల వలన గాని-జ్వర, రోగ, అనారోగ్య కారణముల వలన గలిగిన ఎడబాటు కారణమున పొందిన చిత్తవికారము శాపగ్రస్త విప్రలంభ మనబడును.

ఇందుచేష్టలు:-

చింత

సంతాపము

నిఃశ్వాసము

పాండిమ (తెల్లనగుట)

-: శ్రీ :-

# అష్ట విధ నాయికలు

## విప్రలంభ శృంగారం

( స్థాయీ భావం - రతి)

**నాయిక:-** స్వీయ

ప్రతిస్త్రీ తన జీవితంలో అనుభవ యోగ్యంగా ప్రభవించుచునే యున్నవీ అష్టవిధ నాయిక లక్షణములు.

**నాయికలు:-** 8 విధములు

1. అభిసారిక
2. విప్రలబ్ధ
3. విరహోత్కంఠిత
4. స్వాధీన పతిక
5. వాసక సజ్జిక
6. ప్రోషిత భర్తృక
7. ఖండిత
8. కలహాంతరిత.

## 1. అభిసారిక

**నాయిక:-** అవివాహిత - కన్య - ముగ్ధ - అజ్ఞాత యౌవన.

ప్రేమాంకురితయై - అతి ఉత్సాహముతో నాయకుడు నిర్దేశించిన సంకేత స్థలమునకు జేరి, ప్రియుని గానక పరిసర ప్రాంతమంతా వెదకి వెదకి వేసారి, తన ఆవేదనను తెలియజేయు అమాయిక స్త్రీ - అభిసారిక.

చేష్టలు:- 1. జడుపు

2. విచారం

3. నిర్వేదం

4. తాపం

5. నిట్టూర్పు

6. కన్నీరు

## 1. అభిసారిక

రాగం:- ఆరబి

తాళం:- ఖండ

పల్లవి॥ తాళలేనయ్యా! గోపాలా!
కాన రావయ్యా! కన్నయ్యా!

చ॥1 వెదకి వెదకి చాల । వేసారితిని కృష్ణ।
వేగ రావయ్యా। గోపాల ! ॥తాళ॥

చ॥ 2(చతు) మురళీ రవమున। పలికె రాగములు
అనురాగ సుధామృత। గాన వీచికలు.
కృష్ణా! కృష్ణా!

చ॥ 3 మనసులే దోచేవు। దోబూచు లాడేవు
మదన తాపము రేపి॥ మరుగుపడి తిరిగేవు ॥తాళ॥

చ॥ 4 పొన్నంగి తరువు కడ। పొంచి నను జూచి
కనుగీటి రమంటెకాంతులే మెరిసెరా ॥తాళ॥

చ॥ 5 దోరవయ సూనాది। దొంతరలె విడలేదు
చల్లగా నను జేర్చి। సంధించరా స్వామి ॥తాళ॥

చ॥ 6 మర్మమెరుగని దాన। మది నమ్మితిని చాల
ముదముతో నను గూడి। తరియింపజేయరా ॥తాళ॥

## 2. విప్రలబ్ధ

**నాయిక** - కన్య - ముగ్ధ - జ్ఞాత యౌవన

ప్రియుని కామక్రీడలకు పరవశించిన నాయిక మరు సమాగమమునకు నిర్ణీత సమయమున సంకేత స్థలమునకు జేరి, ప్రియుని గానక, తాను వంచింపబడితినని భావించి, గత స్మృతులను తలచుకొని విరహవేదన ననుభవించు స్త్రీ - విప్రలబ్ధ

చేష్టలు:- 1. మిక్కిలి విచారము

2. నిట్టూర్పు

3. కన్నీరు

4. మూర్ఛిల్లుట.

### *2. విప్రలబ్ధ*

రాగం:- కమాచీ

తాళం.- రూపకం

ప॥ రావేల ఈవేళరా
మదన గోపాల! ॥రావేల॥

చ॥ 1 కవ్వించి కవ్వించి
కన్నెవలపులు దోచి నా
బుగ్గ పై పెదవి ముద్రవేసిన స్వామి ॥రావేల॥

చ॥ 2 ముద్దె ఒట్టని చెప్పి మురిపించి చాలా
మరిపించితివ పోరా! ఏలరా!
జాలమేలరా! సొగసుగాడ! ॥రావేల॥

చ॥3 సంజవేళ పూపొదలో సమరతుల గూడిన
మధుమాసపు గడియలె
మరి మరి యెద రేగెనురా
తాళ జాల మరుని బాధ
తనివిదీర కలియ రార ॥రావేల॥

# 3. విరహోత్కంఠిత

నాయిక:- కన్య - మధ్య

పూవెన్నెల, సెలయేరు, మలయ మారుతం, వికసించిన పూదోట - ప్రకృతి పరవశించి విశ్రమీగువేళ సంకేత స్థలమున ప్రియుని గానక - విరహతప్తయై విలపించు నాయిక ''విరహోత్కంఠిత'.

చేష్టలు:- 1. తాపము

2. దుఃఖము

3. ఆవలింతలు

4. శరీరము వణుకుట

5. గద్గద స్వరము.

## *3. విరహోత్కంఠిత*

రాగం:- కాపీ

తాళం:- మిశ్రచాపు

ప॥ రారా గోపాల! రాకేందు వదన!
రసికుడా రారా నీతో। రమించు వేళర ॥రారా గోపాల॥

చ॥ వెన్నెలల విరిసేను పూ।
మల్లెలల నూగేను మనసు॥
సుధను గ్రోలి మనసు నిలుపర।
సుమధుర గీతము పాడరా॥ ॥రారా గోపాల॥

చ॥ 2 చల్లని గాలులు తాకె। తనువు లేశగలాయెరా
పైట జారెను గుబ్బలుబికెను।
వీడెముడి విడిపోయెరా।
నొక్కి మరి గుప్పించరా। ॥రారా గోపాల॥

చ॥ తలపు వలపుల హొయలు నిండెను।
మదన తాపము నధిక మాయెను
రమణి మక్కువ తీర్చరా!
రతికేళి నను బంధించరా! ॥రారా గోపాల॥

## 4. స్వాధీన పతిక

నాయిక:- ప్రౌఢ

నాయకుడు సురతాది రసబద్ధుడై చెప్పినట్లు విని, కోరినట్లు జరుపు మగడు గల స్త్రీ ''స్వాధీన పతిక''.

చేష్టలు:- 1. వికసిత వదనము

2. మదించి యుండుట

3. కోపము ప్రదర్శించుట

4. ప్రగల్భములు పలుకుట

5. తాను కోరిన కోరికలు సానుకూల మొనర్చుకొనుట.

### 4. స్వాధీన పతిక

రాగం:- మోహన

(సఖితో) తాళం:- ఆది (చతు)

ప॥ మోహనాంగుడే మా
మదన గోపాలుడు
చెలియా; ఓ। చెలియరో!

చ॥ 1 నామాటె నమ్మెను।నన్నే పాలించేను
సమ్మతి మది నెంతో। సంతోష పరిచేను ॥మోహ॥

చ॥ 2 ముద్దు ముచ్చటలాడి। నాతో।
ముదముతో నను జేరి। క్రొమ్ముడి
విరులు దురిమి। వాసనలు జూచి
మరులు గొలిపే నాధుడే। చెలి! ॥మోహ॥

చ॥ 3 (ఖండ) గుట్టుగా నను జేరి। కోక విప్పేసి।
నగ్నసుందరి వంచు। కౌగిట బిగియించి
ఎత్తుకొని పాన్పున। జేర్చి;
మొలక నవ్వులతోడ। తనువెల్ల;

ఝుమ్‌ఝుమ్మన। మరి మరి॥
ముద్దులే కురిపించె। నే - చెలి!
సిగ్గులే మరిపించె। నే; ॥మోహ॥

చ॥ 4 గుబ్బల కసిదీర। గోరులంటా నాటి
అధర సుధలను గ్రోలి। వగల కళలంటి
రతుల సొక్కించి। మరుకేళి మెప్పించి
రతికేళి సొగసులో। సొగసు లేలే స్వామి ॥మోహ॥

## 5. వాసక సజ్జిక

**నాయిక:-** ప్రౌఢ

కేళికా గృహము నలంకరించి తానలంకృతయై పంచభక్ష్యపరమాన్నములు సిద్ధపరచి - పన్నీరు, చందన కర్పూరాది సురత ద్రవ్యములను సిద్ధపరచి - పతిరాకకై నిరీక్షించు స్త్రీ ''వాసక సజ్జిక''.

చేష్టలు:- 1. మాటిమాటికి అద్దమున తన విలాసమును జూచుకొని మురిసి బోవుట
2. ప్రియుని రాకకై ప్రతీక్షించుట
3. భయం, శంక, చింతలు ప్రదర్శించుట
4. ప్రియుడు రాలేదని విషణ్ణహృదయయై ద్వారము వద్ద చేరబడి నాయకుని రాకకు నిరీక్షించుట.

### 5. వాసక సజ్జిక

రాగం:- ఆనంద భైరవి
తాళం:- ఆది

ప॥ మాపటివేళ। విందుకు రమ్మని
మరి మరి వేడితి। రా కృష్ణా! కృష్ణా! కృష్ణా!
చ॥ అతిరుచులు పాయసాలు। అందించెదను రారా
తీయదనాల సుధలు। ద్రావించెదను రార ॥మాపటి వేళ॥

చ॥ 2 పసిడి గిన్నెలు నిండె। కస్తూరి గంధము
పన్నీట నాకాంక్ష లే వేసి
రంగరించితిరా! కృష్ణా! కృష్ణా! కృష్ణా!

చ॥ 3 మల్లెలు విరిసెరా॥ మనసులే పొంగెరా
విరివానలే కురిసె। శయ్యా నిండా పరిచి
తినిరా కృష్ణయ్య రా రా వేగ ॥మాపటి వేళ॥

చ॥ 4 నడిరేయి దాటెను। నెలవంక గ్రుంకెను
గూటికి జేరెను। గువ్వల జంట
ఊరెల్ల నీదాయె। ఊరు మాటు మనిగె
గుండెల్లో గుబులాయె। ఎంతకూ రావాయె ॥మాపటివేళ॥

చ॥ 5 వాకిట నిలిచి। చూసి చూసి నీకై
కనులు కాయలు। కాసెరా
ఓపజాల స్వామీ నా
వశము గాదురా। నీయాన ॥మాపటివేళ॥

## 6. ప్రోషిత భర్తృక

నాయిక:- ప్రౌఢ

పతిదేశాంతరమునకు జని నిర్ణీత సమయమునకు రానందున వ్యాకుల బడు స్త్రీ ''పోషిత భర్తృక''.

చేష్టలు:-

1. ఎన్నాళ్లయింది అని వ్రేళ్ల లెక్కించుట
2. భర్త సౌందర్యమును, గుణగణములను గూర్చి తలంచుట
3. పరాకుగా ఏదో తలపోయుట
4. కనురెప్పలు వాల్చక - ఎటో చూచుట
5. భ్రమతో ఉలిక్కిపడి చూచుట
6. ఆకాశమున చూస్తూ కన్నీరు కార్చుట
7. నిరాశతో వలవల ఏడ్చుట.

## 6. ప్రోషిత భర్తృక

రాగం :- ఝుంఝూటి

(సఖితో) తాళం :- ఆది

ప॥ ఏలాగున్నా। డో నా స్వామి
దూరానున్నా। డే గోపాలుడు

చ॥ 1 మొన్నె వస్తానని। నాతో
బాసలు జేసి। నాడేనను
బాసి ఎరుగడే। గోపాలుడు నను
మరువజాలడే। రమణి రో ॥ఏలాగున్నాడో॥

చ॥ 2 దినములు గడిచినా। గడియలు గడువవె
ఆకలి ఎరుగడు। నన్నే తలచుచు
ఇతరము ముట్టడె॥ నను బాసి
శుష్కించెనొ ఏమో నాస్వామి ॥ఏలాగున్నాడో॥

చ॥ 3 పున్నమి రేయి। మరి మరి నాతో
గడిపిన సురతలు। తలచి తలచి నను
నిద్దురలే కరు। వాయెనో స్వామికి
ముద్దులె మనసున। నిలిచెనొ రమణిరొ ॥ఏలాగున్నాడో॥

చ॥ 4 ప్రియా! ప్రియా యని। పిలిచి స్వప్నమున
నను కౌగిలి బం। ధించిన
అయ్యో? పలువురు నవ్వరె
భామరో నా। గోపాలుడు ॥ఏలాగున్నాడో॥

## 7. ఖండిత

(ఈర్ష్యా మాన కృత విప్రలంభము)

**నాయిక:-** ప్రౌఢ

ప్రియునియందు అన్య స్త్రీ సంగమ చిహ్నములను జూచి కుపితురాలైన స్త్రీ ''ఖండిత''.

చేష్టలు:-

1. విచారము
2. కోపము
3. పలుకకుండుట
4. నిరాకరించుట
5. నిట్టూర్పు విడుచుట

### *7. ఖండిత*

రాగం:- శ్రీరాగం

తాళం:- ఖండ

ప॥ పో పోరా। గోపాల నిన్నింక
నమ్మజాలను నన్ను। వదలిపోరా

చ॥1 తెలిసెరా నీ నడత। విరిగెరా నా మనసు
మాయ మాటల నింక। మరిపించలేవురా ॥పోపోరా॥

చ॥2 ముక్కుపై జారిన। కుంకుమ రేఖలు
రెప్పపై కారిన। కాటుక చారలు
మేనెల్ల చిందిన। గంధపు పూతలు
తెల్పుచున్నవి చాలు। పోపోరా ॥పోపోరా॥

చ॥3 చెక్కిలి చెలివొందు కస్తురి
పెదవి పై కందిన కెంపులు

నిడువాలు కన్నుల నిద్దుర సొక్కులు
తెల్పెరా నీ కథలు చాల్‌చాల్ పోపోర ॥పోపోర॥

చ॥ 4 రాతిరంతా దాని। రతికేళి మర్మములు
పఠియించి వచ్చితివ। పోపోర
మనసు లింకెను। మమత వీడెను
మధుర స్మృతులే। అంతరించెను
మన్నించలేనురా। నిన్నింక
నమ్మజాలను రా। పోపోర ॥పోపోర॥

## 8. కలహాంతరిత

**నాయిక:-** ప్రౌఢ

పతిని అవమానించి - అతడు దూరమైన తదుపరి పశ్చాత్తాపముతో బాధపడు స్త్రీ ''కలహాంతరిత''.

చేష్టలు:-

1. తొందరపడుటచే విచారపడుట
2. మోహముచేత దుఃఖించుట
3. తరచుగా మాట్లాడుట
4. నిట్టూర్పు లిచ్చుట.

### 8. కలహాంతరిత

రాగం:- కాంభోజి

(సఖితో) తాళం:- మిశ్ర చాపు

ప॥ అయ్యో ఏమి సేతునే? సఖి
ఆలకించడాయెనే! నా మొఱ
గోపాలుడు ఆలకించడాయెనే?

చ॥ కాంతుని మది నొప్పించితి

కరుణ చూపి రాడాయెనె

అంతలోనె ఇంతింతగ

రాపిడి జేయుట తగునటె సఖి!　　　　॥అయ్యో॥

చ॥ 2　మందమతిని తూలనాడి

మగనికి కడు దూరమైతి

మరులుగొన్న మానవతిని

మ్రొక్కి వేడినా రాడే॥ అయ్యో॥

చ॥ 3　ఏమి సేతు? ఏల మనుదు

మదన తాప మోర్వజాల

ప్రాణనాధు విడిచి నేను

బ్రతుకజాలనో చెలియా సఖి॥　　　　॥అయ్యో॥

## సంయోగం

(ఇంతలో కృష్ణుని మురళిగానం వినవచ్చింది నాయిక తన్మయురాలై)

వేణుగాన విలోలిత కృష్ణా!

నీవే శ్రుతివై నేనే లయనై

ఆడి పాడి నీలో నేనై

పరవశించి పరమార్థము

నొందెద కృష్ణా! కృష్ణా!!

– సమాప్తము –

శుభమస్తు

# సుందరి
## నవరస విన్యాసం

-: శ్రీ :-

# సుందరి (నృత్య నాటిక)

## 1. శృంగారము

స్థలం:- పూదోట                                        సమయం:- వెన్నెల రేయి

నర్తకి సుందరి తాను నేర్చిన నాట్య గీతికను మననం చేసుకుంటూ - పాడుకుంటూ - నృత్యం ప్రారంభించింది.

**గీతిక:-**

ప॥ మురళీ గానం। మ్రోగింది
గోకుల మంతా। గలగలమన్నది

చ (1)॥బృందావనమున। విరిసెను పువ్వులు
కల కల నవ్వుల। కంఠారవములు
మధుర భావనలు। మంజుల రవములు
నిండెను జగమున। కృష్ణలీలలు ॥మురళి॥

చ (2)॥ తరుణ వయసులో। తన్మయురాలై
హృదయావేశము। ముప్పిరి గొనగా
రాధ కృష్ణుని। కౌగిలించెను
కాంతులె జగమున। ప్రజ్వరిల్లెను.

నర్తకి సుందరి శృంగార రస స్థాయీభావమున తన్మయురాలై, బరువెక్కిన హృదయంతో అలా ఒక భంగిమలో- ఒక తిన్నెపై నిలిచింది

సుదూరంలో నున్న నాట్యాచార్య మదనుడు ఆమె పాట విని ఆనందించి, ఆ వెన్నెట్లో అలా వెతుక్కుంటూ పూదోటలోకి నడిచాడు.

మదను డా భంగిమను చూసి ''శిలా ప్రతిమా! లేక సజీవాకృతా!'' అని విస్తుబోయి, దాని చుట్టూ తిరిగి అన్ని కోణాల నుండి తిలకించి ముగ్ధుడై కవిత నల్లుతున్నాడు.

**మదనుడు:–**

పాట:-

ప॥ ఓహో! సుందరి
జగదేక సుందరి
అందము నీదే స్త్రీ
ఆనందము మాదే తరుణి ॥ఓహో॥

వయసున సొగసున
నిండిన సొరులు
ఒడల హొయలు
ముదమాయెను సఖి! ॥ఓహో॥

(ఆమె కదలి నడిచింది)

**మదనుడు:–** ఓహో! మందగమన వయ్యారిభామ!

**సుందరి:–** (చిరునగవున) హా!హా!హా!

**మదనుడు:–** సుహాసినీ!

**సుందరి:–** (వ్యంగ్యంగా) ప్రియతమా!

**మదనుడు:–** సుమధురభాషిణీ!

**సుందరి:–** ఉ (క్రీగంట దృక్కుల త్రిభంగిమలో నిలిచింది)

**మదనుడు:–** ఓహో! త్రిభంగిమ (భంగిమ మార్చింది) సుందరి
ఆ! అది సోల పద్మ హస్తవిన్యాసం
''రతి'' స్థాయీ భావం.

''శృంగార రస ప్రదానం''

ఓహో!

పాట.- ప॥ 1 శృంగార రసామృత పానం

రసిక హృదయ రంజిత విలాసం

2. హావ భావ విన్యాస మనోహర

నటనా లాస్య కలాపం ॥శృంగారం॥

3 ప్రణయ విమోహస్థాయీ భావం

రాగరాగిణీ రంజన లలితం ॥శృంగారం॥

(మదనుని కవితకు సుందరి నాట్యమాడింది)

## 2. హాస్యము

సుందరి:- (మదనుని ప్రవర్తనను శంకించి, అతనిని ఆడించదలచి) నోటితో జతిని పలుకుతూ, చేతులతో తాళం వేస్తూ నృత్యం చేస్తుంది.

జతి:- *తత్త త్తకతక ధగిన దిగినగిన।*

*తా ధి నోంతతక తధినతోం తకిట॥*

త్తై త్త తోం - తోం - 3

(ఆడి పకపక నవ్వింది) హ!హ!హ!

**మదనుడు:-**

సాకి:- హస్య రస రాగిణి

హాస హసిత విలాసిని

ఆనందమయ గామిని

అతిమధుర మానస శోభిని

**సుందరి:-** హ!హ!హ!

(ఖండ) హస్య రస రాగిణి

హాస హసిత విలాసిని
ఆనందమయ గామిని
అతిమధుర మానస శోభిని
- హ!హ!హ!

(అభినయించి ఒక భంగిమలోనిలబడింది)

**మదనుడు:-**

రాగమయీ!
అది - హంసాస్య హస్త
విన్యాసం
హాసము స్థాయీ భావం
''హాస్య రసాన్వితం''.

## 3. కరుణ

సుందరి:- (మెల్లగా ఏడ్పు మొదలెట్టింది)

మదనుడు:- అయ్యో! పాపం
ఏ మా ఆర్తి? ఎందుల కా కన్నీరు?

పాట:- కమల నయనీ!
కాంతుల రమణీ॥
కాంచలేను నీ। కన్నీరు,॥
భరించలేను యీ। దృశ్యం;
చంద్రముఖీ! పూబోడి!

సుందరి:- ఊఁ ... (ఏడ్చి ఏడ్చి ఒక భంగిమలో నిలబడింది)

మదనుడు:- ఆ!
అది ఒక ముకుళహస్తవిన్యాసం
శోకము స్థాయీభావం
''కరుణ రసాన్వితం''.

# 4. రౌద్రము

ఆమెకు దగ్గరగా వచ్చాడు మదనుడు. సుందరి కోపమున..

జతి:- తత్త త్తా దిగితక! దిత్త త్తోం తకిట॥

తధిన తోం దికిట। తా - తది గిణత॥

దిగిదిగిదిగిదిగి దిగి దిగి దిగి దిగి।

త తోం తతోం దిత్తోం॥

సుందరి:-(రుద్ర రూపిణియై వెనక్కు తిరిగింది)

మదనుడు:- ఏమా కోపము?

పరిహాసమా?

లేక

అలుకయా?

సుందరి:- అసభ్యత! (అంటూ ప్రక్కకు తిరిగి ఒక భంగిమలో నిలబడింది)

మదనుడు:-(పాట)

కోపమ సఖి! నవయౌవని

సరసుడ! మాన్యుడ

చులకన ఏలనె। భామా

గుణధామా! సఖి ॥కోపము॥

ఆ! అది శుకతుండ

హస్త విన్యాసం

కోపము స్థాయీభావం

రౌద్ర రసాన్వితం.

## 5. వీరము

మదనుడు:- (ఆమె కళ్లల్లోకి చూశాడు)

సుందరి:- (ఛల్‌న అతని చెంపమీద చరిచింది)

మదనుడు:- (నిర్ఘాంతపోయి)

ఓహో!

ఏమా గంభీరత! వీర శిఖామణి!

నీ ధైర్య స్థైర్య సాహసముల కిదే జోహార్! (తల వంచాడు)

పాట:- కందెనొ కరములు। సుకుమారి॥

నొప్పించితినా। నీ హృదయం॥

(అంటూ ఆమె చేతిని తన చేతిలోకి తీసుకొని అనునయించాడు. ఆమె చటుక్కున తన చేతిని లాక్కుని, ఒక భంగిమలో నిలబడింది.

మదనుడు:- అది - త్రిపతాక హస్త విన్యాసం

ఉత్సాహ జనిత స్థాయీ భావం

**''వీర రసాన్వితం''.**

(గంభీరంగా నిలబడ్డాడు)

## 6. భయము

సుందరి:- (ఉత్సాహం దిగజారి భయపడింది)

మదనుడు:- ఏమే! చంచల!

పాట:- వలదు వలదు

సుందరాంగు।లకు తగునా!

గుండెల శక్తత।

ముచ్చెమటలు ఏలనె సఖి॥

బేలవు గాకుము। నవ యౌవని॥ ॥వలదు॥

(దగ్గరగా వచ్చాడు - ఆమె భయపడి వెనక్కు నడిచి ఒక భంగిమలో ఆగింది)

మదనుడు.- అది పతాక హస్త విన్యాసం

భయం స్థాయీ భావం

''భయానక రసాన్వితం''.

## 7. బీభత్సము

సుందరి:- అయ్యో!

(అంటూ జుట్టు పీక్కుంది)

మదనుడు:- ఛీ! ఏమా విభ్రాంతి

అది నీ ప్రకృతా!

లేక

వికృతి ప్రహసనమా!

సుందరి.- (ఎదురుగా వచ్చి అతనిని గోళ్లతో గిచ్చబోయింది. అతడు వెనక్కు తగ్గాడు. ఆమె విలయతాండవం మొదలెట్టింది.)

జతి:- (చతు)

తా- తత్త తత్త దిత్త। తా- తత్త తత్త దిత్త॥

దగిన దిగిన గిన। తత్తత్తోం॥

త్తైత దిగితక త్తైత్త దిగితక॥త్తైత దిగితక తకతత్తోం

దిగితత్ దిగితత్ దిగితత్ దిగితత్। 2

తదిగిణత 3

మదనుడు.- ఆ! ఉగ్రావేశం!

సుందరి.- (రెచ్చిపోయి ఆడుతుంది)

జతి:-

(మిశ్రం) తకిట తక ధిమి ధిమిత కిటతక।

కిటత తకఝుణు తోం ధిత్తోం॥

తద్ధిత్తోం తకతోం ధితోం

తోం తకతోం

(ఖండ) తక తకిట తోంతకిట।

కిట తకిట తకతోం॥

తకతోం తకతోం।

తత్త కిట కిటతోం॥

(చతు) దిత్త తత్త తత్త దింద।

తోం తత్త తత్తా కిటతక

మదనుడు:-( పాట)

ఉగ్రరూపిణి ఆర్భటీ భట

దర్ప పూరిత హృదయ మండిత

ధగ ధగ ద్ధగ జ్వలిత కామిని

ఆగుమంతట రూప యౌవని

సుందరి:- (ఆగి ఒక భంగిమలో నిలబడింది)

మదనుడు:- అది ఊర్ణనాభ హస్త

విన్యాసం

జుగుప్స స్థాయీ భావం

''బీభత్స రసాన్వితం''.

## 8. అద్భుతము

సుందరి:-(అతని వంక తదేకంగా చూసింది- హాస, వికసిత, విస్మయ, సంభ్రమాశ్చర్యాలతో నాట్యరాణియై, వివిధ కర్ణప్రకటనలతో- అద్భుత నృత్తప్రదాయినియై తారస్థాయి నందుకుంది)

# ఆనంద పుష్కరిణీ నృత్యం

పల్లవి:- ధీం తాత్త । తా - తత్త ఝణు
తద్ది త్తా ఝణు। తా తధిన గిన

1. ధీం తాత్త ధిన। ధన గిన గిన ఝణు
తాధితోం తక। తోంగిణత తోం

2. ధీం తత్ తద్దిన। ఝణా ఝణత ఝణు
తా - తకఝం। తకిట తోం గిణత

3. ఝం, తక। ఝం;
తక దికు తకఝం। తకిట దికిట ఝం

4. తకిట దికిట తకత ఝణుత।తధిన్నాంతక తధిగిణత త
గిణ తాగిణత। తా తధి గిణత

5 తా - తాత్త ఝణు। తోం తాత్త గిణ
తోం, 1 తధి గిణ తోం

6. ధీం ధిన తక ఝణు। తద్దితక ఝణు
తకతోం దికుతోం। తక దికు తకతోం

7 ధిత్తాతక। ధిత్తా;
దిత్త తత్తా। దిత్తా కిటతక

8. తకతక తకతక తకతక తకతక।
తకతక దిగుతక తకతత్తోం

9 దిగితత్ దిగుతత్ దిగుతత్ దిగుతత్।
తకఝణు తకతక తధిగిణతోం

10. తకఝణు తకిట కిటతక తధిగిణత
తక తధిగిణత తధిగిణత

(సుందరి ఆడి ఆడి ఒక భంగిమలో ఆగింది)

మదనుడు - (విస్మయుడై)

సుందరీ! నీవొక జగదేక సుందరివి కాదు

విప్పారిన మృదుకమలం కాదు

నాట్య మయూరివి కానే కాదు

నాట్య కళాధిదేవతవు

ఓహో! అద్భుతం - అత్యద్భుతం

పాట:- అద్భుత మన్నది సాటిలేనిది

ఆశ్చర్యం! ఆనంద దాయకం ॥

అది నందంశ హస్త విన్యాసం

విస్మయం స్థాయీ భావం

అద్భుత రసాన్వితం

(మదనుడు ఆమెకు దగ్గరగా వచ్చాడు)

## 9. శాంతము

సుందరి - (అవివేకియై - ఆవేశపూరితయై దగ్గరలో నున్న కర్ర తీసుకుని అతనిని బాద బోయింది)

మదనుడు.- సుందరీ! (అరిచాడు)

(అంజలి ఘటించి నమస్కరించాడు)

సుందరి:- (ఆగింది)

మదనుడు - ఏం? ఆగావేం?

ఒక్క దెబ్బతో నా జీవితం అంతం కావాలి నిన్ను - నీ సౌందర్య ప్రతిమను చూస్తూ హాయిగా నా ఆత్మ అనంత ఆనందమయ వాయువులో కలిసిపోతుంది.

ధన్యుడను! ఉ! కానివ్వు!

సుందరి:- (చలితయై - నిర్ప్రాణయై అతని పాదాక్రాంత అయింది)

మదనుడు:- (లేపుతూ)

సుందరీ:- కుమారీ!

నీవు నా కవితా కుమారివి. నా కవితకు ఆవేశం నీవే నమ్మా! నేను కాముకుణ్ణి కాదు. సౌందర్య పిపాసిని. ప్రకృతిలోని సౌందర్యమయ ప్రతి వస్తువు నాకు ఆరాధ్య దైవమే.

పాట:- నీరూప లావణ్య
నాట్య విన్యాసాలు
నను ముగ్ధుడను జేసె
సుందరీ -
నిను జూచి నా హృదయ
ముప్పొంగి మైమరచి
ఆనంద డోలికల విహరించితిని
స్త్రీ - మూర్తీ!
సుందరి, జగదేక సుందరీ!
నీ విప్పుడు - శాంతమూర్తివి
శమము స్థాయీ భావం
హస్తము హంసాస్యము
శాంత రసాన్వితం
'ఆనందో పరబ్రహ్మ' గద!
అదే;- సత్యం - శివం - సుందరం
ఓం - శాంతి - శాంతి - శాంతి
''సర్వే జనాః సుఖినో భవంతు''

-: శ్రీ :-

# -: గోపికా కృష్ణ :-

## నవరస భరితం (నృత్య నాటిక)

బృంద గానం:- (ఒక నర్తకి ప్రవేశించి)

నాంది:- పాట:-

ప॥ మధురం మధురం। అతి మధురం

రమ్య మనోహర। కృష్ణలీలలు

మధుర కవిత గా। నా మృత నటనం

రాగ రంజిత। నవరస భరితం

భావ రాగ తాళ। లయాన్విత

శోభిత హృదయా। నంద దాయక ం ॥ మధురం॥

### 1. శృంగారము:-

(తటాకమున నీటితో నింపుకొని కుండను రొణ్ణిన బెట్టి ఒయ్యారంగా నడిచిపోవు గోపికను జూచి కృష్ణుడు).

కృష్ణ:- ప॥ హే! సఖి! పూ బోడి!

హంస గమన! ఒయ్యారి!

గోపిక:- ఆ!

(వెనక్కు తిరిగి చూసి, క్రీగంట నిలిచింది)

కృష్ణ:- ఓహో!! చంద్రముఖీ!

కంటిని నీ! కుంచిత దృష్టిని

సంకోచించకె। భామా!

సరసకు రావే। సొగసరి తరుణీ

గోపిక:- (చిరునవ్వు చిందించింది)

కృష్ణ:- ఓహో! సుందరి వికసిత వదన! వనజాక్షి!

ప్రహసితవై నను। గనుమా సఖి ॥ఓహో॥

కృష్ణ:- హే సఖీ! పూబోడి

గజగమన। ఒయ్యారి

సుందర జఘనే। మధు నితంబిని

హస విలాసిని। రస విభావరి

ప్రేమార్తిని నా। దాహము తీర్చవె

ప్రియా! ప్రియా! ప్రియవదనే!

(ఆమెను అడ్డగించి దోసిలిబట్టి కూర్చున్నాడు. ఆమెనీళ్లు వంచబోవ త్రాగక ఆమె వంక చూడ; అతని కొంటె చేష్టకు చిరుకోపంతో)

హాస్యము

గోపిక:- హే! కృష్ణా!

కొంటెతన మిక। చాలుర నను

అల్లరి చేయుట। తగు నటర

కృష్ణ:- అల్లరి గాదది। ప్రేమ సరాగము

ముద్దిడి పోవే। కమలాక్షి!

గోపిక:- ఛీ! పో!

(అంటూ కృష్ణునిపై నీళ్లు చల్లును)

కృష్ణ:- పరిహసించతగు। భామిని నీవే

నా హృదిలో దాగిన। గోపిక నీవే!

(అంటూ ఆమె చేయి పట్టుకున్నాడు)

గోపిక :- వదులు వదులు గోపాల

వ్రజవనితలు నను। జూచి నవ్వెదరు

విడువర ఇది। తగదుర

సొగసుగాడ ఇది। సమయము గాదుర ॥వదులు॥

(ఆమె బ్రతిమిలాడుతున్నా - అతని కవ్వింపులకు కుండ క్రిందపడి బ్రద్దలైంది)

**కరుణ**

(అనునయించుచూ)

కృష్ణ:- అయ్యో! పాపం।

హృదయేశ్వరి! నీ

కంట తడినే। కనజాలనె సఖి!

విలపించకు మరి। చింతన ఏలనె

విధి బలీయము। లేలెమ్మిక

(అంటూ లేపుతూ కౌగిలించబోవ - ఆమె రుద్ర రూపిణియై)

**రౌద్రము**

గోపిక:- చీ! పోరా! స్త్రీలోలా

తెలిసెరా నీ! ప్రేమ నటనలు

గోపాలుడ వని। చను విచ్చిన

నలుగురిలో నను। రట్టు జేయుట

తగు నటరా! చంచల లోల!

వదలి పొమ్మిక। పో! పోరా!

**వీరము**

(ఆమె చేయి గట్టిగా పట్టి)

కృష్ణ:- పట్టితి కరమును। పూబోడి

పట్టువిడువ నే! నల్పుడనా సఖి!

వీరుడ పర। మార్థుడ!

లలిత మధువదనాంగీ
కోరితి అధరామృత పానం
లలనా! చెలియా!
(అర్థించును - అంత గోపిక భయంతో)

**భయము**

గోపిక:- కృష్ణా! కృష్ణా!
ఏల నన్ను వేధింతువు!
నిలువజాలరా కృష్ణా!
కత్తి కోతలగాడు నను గొన్న నా మగడు
అత్తగాదది జగదత్త గయ్యాళి
ఏమి సేతునెట్లు మనుదు
రగడలు తప్పవు కృష్ణా!

కృష్ణ:- తప్పవు నను బాధించిన
తిప్పలు పలు రెట్లు నగును
ముద్దిడు మరి హరిణాక్షి
(అని ముద్దిడబోవ)

గోపిక:- ఛీ! పో! (అని త్రోసి వేయును)

కృష్ణ:- పోవుచుంటి! నా కేల?
గతులు తప్పు నను భవించు
(అని కొంత దూరం పోవ)

**బీభత్సము**

గోపిక:- కృష్ణా! కృష్ణా! కృష్ణా!
(అంటూ జుట్టు పీక్కుంటూ కూలబడింది)

గోవర్ధన గిరిధర। గోవింద

గోకుల పాలక। గోపాల

కృష్ణా!కృష్ణా!కృష్ణా! (వలవల విలపిస్తుంది)

**అద్భుతము**

(కృష్ణు డామెకు నీటితో నిండిన నొక పాత్రను సృష్టించి యిచ్చును. ఆమె సంభ్రమాశ్చర్యాలతో)

గోపిక:- కృష్ణా! కృష్ణా!

ఆశ్రిత జన సంరక్షక కృష్ణా!

అమర చరిత పరమానంద కృష్ణా! కృష్ణా!

**శాంతము**

తన్మయురాలై గోపిక కృష్ణుని జేరి అతనిని పలుమారు ముద్దిడ - నతడు మురళి పట్టి అనంత అనురాగ రసభావనలు సుస్వరముల బలుక - వికసిత వదనయై గోపిక కృష్ణుని జూస్తూ ఉండిపోయింది.

**సత్యం - శివం - సుందరం**

## కణ్వుడు - శకుంతల (నృత్య నాటిక)

(పతి గృహోన్ముఖురాలైన శకుంతల డోలాయనస్కుయై ముందు కడుగిడలేక చెలితో)

ప॥ పితృపాదు నెటుల విడుతు
పితృసేవ నెటుల మరతు
పితృదేవు నమృత దృష్టి
ప్రాణ వృష్టి యౌను నాకు ॥పితృ॥

చ॥ 1. తపము చేత శుష్కమైన
వృద్ధమూర్తి విడిచి నేను
సుఖము గోరి పతిని జేర
బోవుచున్న దాన నిపుడె ॥పితృ॥

2. రాగ రహిత వనము వీడి
భోగ మహిత భువన మేగి
మరతు నేమొ నాదు తండ్రిన్
దూర మగునొ ప్రకృతి శోభ ॥పితృ॥

(లేడి వద్దకు వచ్చింది)

3. నిండు చూలు హరిణం బిది
నెటుల విడుతు, నెటుల చనుదు
(కణ్వుడు ప్రవేశిస్తూ:)-
అతి త్వరలో విందువులే
ప్రియ హరిణపు సుఖ ప్రసవము

శకుంతల :-

ఓ ప్రాణదాతా! ఓ పూత చరితా!

వీడలేను జనకా! ఎడబాయలేను ॥ఓ ప్రాణదాతా!

(ఒక లత వద్దకు వచ్చి)

చేతులార పెంచినాను,

చివురు వేయ పొంగినాను,

ఈ చిరులత కేమౌనో,

మరినేనెట్లు మనుదు తండ్రి

కణ్వుడు:-

తమ కీడగు తరుశాఖల

పెనవేసుకు బ్రతుకునులే

అదియె సహజీవనము

అదియె జీవిత ధ్యేయమ్మ.

ఓ వినయ శీల!

ఓ సుగుణధామ!

చలిత లలిత శకుంతలా!

చనిరా శకుంతలా ॥ఓ వినయ॥

(పతి దుష్యంత మహారాజు గృహానికి

పయనమై వెళ్తున్న శకుంతలను జూచి కణ్వుడు)

శ్లో॥ అర్థో హి కన్యా పరకీయ ఏవ

తా మద్య సంప్రేష్య పరిగ్రహీతుః

జాతో మమాయం విశదః ప్రకామం

ప్రత్యర్పిత న్యాస ఇవాన్తరాత్మా.

తా॥ కన్య పరుల సొత్తు - దానిని పుడు పరిగ్రహీత కప్పగించగా, తన యొద్ద దాచిన వస్తువును తిరిగి అప్పగించినప్పటి శాంతి - నా అంతరాత్మకు చేకూరెను.

(అని తృప్తిపడతాడు కణ్వుడు)

- : సమాప్తము :-

# ఆదిశక్తి (నృత్య నాటిక)

వ్యాఖ్యాత:- స్థలం - నది ఒడ్డు

సమయం:- భానూదయం

విశ్వేశ్వరుడు కవి - చెట్టుక్రింద కూర్చున్నాడు.
సూర్యుని ఉషఃకాంతులు భూమిన విరజిమ్ముతున్నాయి.
అరుణారుణ ప్రవంతులు వింత శోభ లల్లుతున్నాయి.
పిల్ల తెమ్మెర చల్లని గాలుల పూపొదలు ఊగిసలాడుతున్నాయి.
సౌందర్య పిపాసి విశ్వేశ్వరుని
హృదయంలో అనంత భావనలు మెదిలి అదృశ్య మౌతున్నాయి.
ఇంతలో అలలు అలలుగా ప్రసరించే మధురగానం వినవచ్చింది.
అది ఒక రూపమై, ఉషాకన్యయై
నృత్యంప్రారంభించింది
విశ్వేశ్వరుని హృదయం
ఆనంద డోలికల నుప్పొంగి వాక్కున
శబ్దప్రసారం కాజొచ్చింది.

-:ఉషానృత్యం:-

ప॥ అవతరించెను। ఉషా సుందరి
సిరి మబ్బుల నట। లాస్య మాడుచు

చ॥1. అరుణారుణ । నవ కాంతులు
అవని నిండెను। ఉషఃకాంతులు॥అవత॥

2. తమస్సును భగ్నం। జేసే దీప్తి
జ్ఞానోదయ। ప్రసారిత వ్యాప్తి ॥అవత॥

3. వెలుగు నీడల। సంభ్రమాలతో
జగతి లేచెను। జీవన భృతికై ॥అవత॥

4. పక్షులు కిలకిల। రవములు పలుకుచు

నింగి కెగసెను। విజృంభణతో ||అవత||

5. పొదుగున కుడిచే। లేదూడలు

చంగ్ చంగ్ మని। గంతులు వేసెను ||అవత||

6. స్వార్థం ఉబికిలో। మునిగి మానవుడు

నిద్రావస్థలో । నున్నా డతడే

మానవుడు। మానవుడు

స్వార్థం నిండిన। మానవుడు||

**వ్యాఖ్యాత:-**

ప్రపంచమున జీవరాసులన్నీ

తమ తమ ఆహార సముపార్జన కొరకు

ఉదయ సంధ్య నే లేచి పోతుంటాయి.

స్వార్థపరుడు మానవుడు అధికారం సూచించు నొక కర్రను

కుడిచేతను - ధనమును సూచించు

నొక సంచిని ఎడమచేతను బట్టి

నిద్రావస్థలో నున్నాడు.

సర్వాధికారం, సర్వసంపద

తనకే దక్కాలి - మరొకనికి అందరాదు.

తోటి మానవుని విస్మరించి

ప్రకృతిలోని సర్వం తానే అనుభవించాలి.

ఇది అతని విశేషాశయం.

కవి ప్రబోధం:-

ప॥ లేరా! లేరా!
లేరా మానవ। వింత జీవి
బ్రతుకున కర్థం। తెలుసుకోరా

చ॥ 1. స్వార్థపు టొడిలో। నిద్రించే నీ
అంధ జగత్తును। చూడర మూర్ఖా।

చ॥ 2. ప్రబలి రాక్షస। హత్య క్రీడల
ధరణి నిండెను। రక్త స్రవంతులు
ఆ.....ఆ.......ఆ......ఆ.......

చ॥ 3. వినరా మానవ। వింతజీవి
అభాగ్యుల। ఆహా రవములు
ఆ.....ఆ.....ఆ....ఆ....

చ॥ 4. కనరా స్వార్థపు। దుష్టజీవి
ఆకలి మంటల। మలమలమాడే
అనాధ జీవుల। వేదన బ్రతుకులు
గుండెలు పగిలే। మృత్యురోదనలు
అమ్మో! అయ్యో! బాబూ! ॥ వినరా॥

చ॥ 5. బుద్ధుడు గాంధి। పుట్టిన దేశం
అహింసమున। స్వాతంత్ర్యం
సాధించిన మన। భారత సంస్కృతి
కిదా పరమార్థం?

స్వార్థపరుడు:- (కన్నులు తెరచి)
పరమార్థం?
పేరుప్రతిష్ఠలు। పదవులు బిరుదులు
అన్నీ డబ్బుకు। సాధ్యం
డబ్బు। డబ్బు
డబ్బుకు లోకం। దాసోహం

కవి:- మూర్ఖా! నీ
బుద్ధికి పట్టిన। జాడ్యం వదలదు
అజ్ఞానానికి । నిష్కృతి లేదు
అనుభవించు। దుష్ఫలితం।

స్వార్థపరుడు:- ఉ! దుష్ఫలితం
ఎవరి కెరుక నీ సూక్తులు
నీతులు పో। పొమ్మిక!
నీతులు పలికి। దీనుల నణచి
దోపిడి జేసే। మహానుభావులు
జగమంతా వారే! మేధావులు
ఘరానా! మనుషులు
ఇది నా స్వార్జితం.

కవి:- ఉ! స్వార్జితం!
దుర్మార్గపు టంగడిలో
ఆర్జించిన నీ ధనం
అల్పజీవుల కష్టఫలం
బ్రతుకు భారం పగిలి రగిలే
కష్టజీవుల ఆకలి మంటలు
ఆహా రవములు కనరా మూర్ఖా!
(లోన) అమ్మో! అయ్యో! ఆ....ఆ.....

స్వార్థపరుడు:- ఆ! వాక్ప్రలాపీ! ఎవరక్కడ?

బానిస:- అయ్యా! (వచ్చాడు)
కట్టి చేతులు
మూత వేయం డతని నోటికి

**వ్యాఖ్యాత:-**

భారత సంస్కృతికి ప్రతిబింబమైన 'కవి' నోటికి నొకగుడ్డతో మూత బడింది. జగమంతా వేదన ధ్వనులు చెలరేగాయి

cash - crime - corruption

ధనం - నేరం - దుర్నీతి

జెండాలతో బయలు దేరాడు స్వార్థపరుడు

**అనుచరులు:-**

ధనం - వర్ధిల్లాలి

నేరం - వర్ధిల్లాలి

దుర్నీతి - వర్ధిల్లాలి.

జై! స్వార్థపరునికి జై!

జై! స్వార్థపరునికి జై!

జై! స్వార్థపరునికి జై!

Note - భరతమాత కిరువైపుల సంస్కృతి జెండా ప్రక్కన ధనం - నేరం - దుర్నీతి జెండాలు ఎత్తబడ్డాయి. అయ్యో! బాబూ! అమ్మో!.. ఆర్తనాదాలు, ఆహా రవములు మిన్ను ముట్టాయి.

ఆకాశవాణి:- ఆగండి!

స్వార్థపరుడు.- ఎవరది?

ఆకాశవాణి:- ఆదిశక్తి! అనంతశక్తి.

ప్రచండ శక్తి! పరమ శక్తి!

(భరతమాత విగ్రహం నుండి ఒక వింతరూపం ఆవిర్భూతమై ముందు కురికింది విలయ తాండవం చేస్తుంది. స్వార్థపరుని వెంబడించింది. స్వార్థపరుడు తప్పుకో చూస్తున్నాడు)

ఆదిశక్తి విలయ తాండవం:-

పాట:-

ప॥ ఆది శక్తి - అనంత శక్తి
ప్రచండ శక్తి - ప్రళయ శక్తి
జగణ గగణ గగణ జగణ
ధీంత తకిట తద్దిన గిన
ధీంతక తక ధీంతక తక
ధీం తత్తోం తోం తకతోం
నిలు నిలు స్వార్థపరుడు
అనర్థాల కారకుడ
ధనం దోచి నేరం ప్రబలి
దుర్నీతికి పాల్పడి
రక్కసివై ప్రజను వ్యథల
పాలుజేయు దురాత్ముడ ॥ నిలునిలు॥
జగ జ్జగ జ్జ్వలిత జ్వలిత
భుగ భుగ జ్జ్వలో జ్వల
మంట గలిపి నిను భస్మం
చేసెద నరాధమ ॥ నిలు నిలు॥
తాం తత్త తోం తకిట
తకిట దికిట తకత ఝణుత
దిత్తా త్తోం తోంతకతోం
తకతోం తక తధిగిణతోం
మానభంగ మతం జాతి
రాజకీయ విషశక్తుల
ప్రబలి నలిగి ముక్కలై

పోరాటపు ఘర్షణలో
రక్తస్రవంతుల నింకిన
ధరణి ఘోష వినరా మూర్ఖా! ॥ నిలునిలు॥
స్వార్థపరుడ!
నరపిశాచి!
చావు చావు అంతిమ దశ
అనుభవించు దుష్ఫలితం.
( అని శూలంతో పొడిచేస్తుంది )

స్వార్థపరుడు:- ఆ.... అమ్మో! చచ్చాన్రో.. అయ్యో! ఆ!....

వ్యాఖ్యాత:- స్వార్థపరుణ్ణి మట్టుబెట్టింది.

ఆదిశక్తి:-

( ధనం - నేరం - అవినీతి పారిపోయాయి. ఆదిశక్తి కవినోటికి బిగించిన గుడ్డను, రెండు చేతులను బిగించిన త్రాటిని విప్పి భరతమాత వెనుకకు అదృశ్యమైంది. )

కవి సందేశం:-

మానవులారా!

ప॥ మన దేశం - మన సంస్కృతి
విజ్ఞాన విభవ ఘన రచనలు
మరువకండి చదవండి
మంచిగ బ్రతకండి. ॥ మన ॥

చ॥ 1 పుణ్య నదులు ప్రవహించి
నందన వనములు వెలిసిన
భరత భూమి పుణ్యభూమి
జీవన ధాత్రి. ॥ మనదేశం॥

చ॥ 2 సృష్టియందు ప్రతి జీవికి
దక్కుతుంది సమాన హక్కు
స్వార్థ రహిత జీవనమే
బ్రతుకు బాట వెలుగుబాట. ॥మనదేశము॥

చ॥3 తరతరాల సంస్కృతిని
వమ్ము చేయకండి,
అనంతకోటి జీవుల
నానందపరిచి బ్రతకండి. ॥మనదేశము॥

చ॥4 మానవతను అభ్యసించి
ప్రేమ - త్యాగం - న్యాయం
ధర్మం విడువక బ్రతికే
వాడే మనిషి ॥ మనదేశం॥

చ॥ 5 సహజీవన సమానత్వ
సౌభ్రాతృత్వం
మానవతకు మంచిబాట
జీవితపు వెలుగు బాట ॥మనదేశం॥

ఓమ్ అసతో మా సద్గమయ
తమసో మా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతం గమయ
హరిః ఓం తత్సత్ ఓమ్
శాంతి! శాంతి! శాంతి!

# నవరస మంజరి

రచన:- మల్లాప్రగడ శ్రీరంగారావు

శివలీలల నుండి తొమ్మిది రసములకు - తొమ్మిది కథావస్తువులను తెల్పు శ్లోక భరిత కవితా వైభవము - అభినయానికి అద్భుత రచనా వైశిష్ట్యము.

ప్రార్థన:- రాగము·- గంభీర నాట

శ్లో:- నమామ్యహం మహాదేవం
గౌరీ వామార్ధ ధారిణం
లాస్య తాండవ నృత్యాద్యైః
శోభితం నట శేఖరం॥

శృంగారము:- రాగము - భీం ప్లాస్

శ్లో॥ శృంగార రస పూర్ణాంతం
శివా మాశ్లిష్య శంకరః
స్రష్టు కామోఽభవత్ జీవాన్
లోక కళ్యాణ హేతునా.

రౌద్రం:- రాగము:-సింహేంద్ర - మధ్యమం

శ్లో॥ దక్షయజ్ఞే సతీదేవీ
సందగ్ధా యోగ వహ్నినా,
రౌద్రో రుద్రస్తదా యాగం
ధ్వంసయామాస తత్క్షణం

శాంతము: రాగము:-శ్యామ

శ్లో॥ దృష్ట్వా గౌరీశం సంక్రుద్ధం
దక్షయజ్ఞ వినాశనే,
సాంత్వయామాస తం దేవం
బ్రహ్మాద్యాః సత్త్వ భాషణైః.

**వీరము :-** రాగము:- కేదార గౌళ

శ్లో॥ త్రిపురాసుర సంహారే
క్రోధరూపో మహేశ్వరః,
వీర ప్రతాప మాపన్నో
సంజఘాన సురాన్ కిల.

**బీభత్సము:-** రాగము:- హంసానందిని

శ్లో॥ పరేత భూమౌ పతితాన్ సురేతరాన్
అసృగ్వసా పూరిత ఖండితాంగాన్
దృష్ట్వ్యా విరూపాయిత ప్రాణి సంచయాన్
ననర్త బీభత్స్యమయాకృతిశ్శివః.

**భయానకము:-** రాగము:- హిందోళం

శ్లో॥ భస్మాసురస్య వరదాన భయాన్మహేశః
కిం వా మయాద్య కరణీయ కమస్తి భీతాన్
సంస్మృత్య లోక భయదం పరమార్థనాశం
దూరాతి దూర మగమత్ స్వకృతం విచిన్వన్.

**హాస్యము:-** రాగము:- కాఫీ

శ్లో॥ పశ్యన్ హసంతీం పరమోహినీం శివః
తదానుధావన్ పరిహాసభాజనః
తథా విధం తం పరిధానయంతం
గౌరీ విలోక్యాత్మని సంజహాస॥

**కరుణ:-** రాగము:- దర్బారు కన్నడ

శ్లో॥ కరుణైక రసావిష్టాం
రతీదేవీం విభర్తృకాం
దృష్ట్వ్యా దయార్ద్ర నయనా
కామముజ్జీవయత్ శివా॥

అద్భుతము:- రాగము:- మధ్యమావతి

శ్లో॥ క్షీరాబ్ధిజ విషం తీక్ష్ణ
మగ్ని జ్వాలా సమాకులం,
పితంబ మీశ్వరం మేనే
గిరిజా మహదద్భుతమ్॥

# రిక్షావాలా

రచన:- అనిసెట్టి సుబ్బారావు
నృత్యం:- డి. వేణుగోపాల్
గాత్రం:- బి. గోపాలం

6-2- 1955నుండి దక్షిణ భారతాన
పలుచోట్ల ప్రదర్శించి, విశేష ఖ్యాతి గడించిన
నృత్య రూపకం

**వ్యాఖ్యాత:-** పాడిపంటల భాగ్య సీమలో, రత్నగర్భ భారతదేశంలో, గంగ ప్రవహించి పునీతం చేసిన యీ దేశంలో అంతా ఆనందిస్తున్నవారు కారు.

ఎంతోమంది నిరాశా జీవులు, ఇంకెందరో నిర్భాగ్య మానవులు, ఎందరెందరో లెక్కకందరు. ఆ నైరాశ్య జీవిత నిర్భాగ్య మానవుల జీవిత ప్రతిబింబం రిక్షావాలా!

తన శరీరాన్ని యంత్రంగా మార్చి, తన ఎముకల్ని మరలుగా చేసి, నిశ్వాసల పొగలు వదులుతూ - చెమట కాలువలై కారిపోతుంటే, అధికారుల అదలింపులకు బెదురుతూ-

తోటి మానవుల చీత్కారాలకు తలొగ్గి, జీవిత శకటాన్ని లాగేందుకు యీ శకటాన్ని లాగుతూ, విశ్రాంతి ఎరుగని అస్థిపంజరం. దరిద్ర జీవుల ప్రతిబింబం. **''రిక్షావాలా''.**



# రిక్షావాలా!

నాంది:- సమయం:- ఉదయ సంధ్య

పాట:- ఓహో! రిక్షావాలా!

ఓ. .. .రిక్షావాలా!

చర చర చర పోవేలా!

ఉదయవేళ జాగేలా!

గుక్కెడు టీ నీళ్లు
వేడివేడిగా త్రాగవోయ్!
గుండెలోకి దమ్ము
ఘాటు ఘాటుగా లాగవోయ్!

నర్తకుడు ప్రవేశం:-

నడూ నడూ నడూ నడూ
నడూ నడూ నడువవోయ్!
అపార మోయి దూరం
సువిశాల మోయి నగరం
ఏ దూర భారమైన
ఏ చౌక బేరమైన
నీ మదిలో బెదురేల
అడుగడుగున అలుపేలా
నడూ నడూ అవలీలా
ఓ రిక్షావాలా!
ఇంటి బాధ నీడగ
నీ వెంట నంటి వచ్చినా
గుండెలోన శూలాలై
కోరికలే గుచ్చినా
పిలిచే యీ నరులందరి
బాడుగలే మోస్తావా?
బలిసిన యీ నగరానికి
ఊడిగమే చేస్తావా?
బ్రతుకున నీకున్న మార్పు
ప్రతి యేటా భార్య కాన్పు

రేపే సుఖమన్న భ్రాంతి
ఒకటే నీ మదికి శాంతి
రేపు రేపు రేపంటూ!
తీపి తీపి కలగంటూ!

సమయం:- (మధ్యాహ్నం)

ఎండలెగసి పైన కండ
నిప్పులు గుప్పించి నా!
విసిరే వడగాలి
బుజాలెక్కి స్వారి చేసినా!
దుమ్ము తెరలు కమ్మినా!
కడుదూరం!
పెనుభారం!
రొమ్ములలో కుమ్మినా
ఊపిరి తీస్తున్నావే ...
చాకిరి చేస్తున్నావే....

(రిక్షాను ఒక చెట్టుక్రింద నిలిపి. తాను గత జీవితాన్ని నెమరు వేసుకుంటున్నాడు రిక్షావాలా. కవి నిర్వచనమునకు పాత్ర నటించాలి)

ఏ వూరు నీది?
ఏ పేరు నీది?
ఎందుకొచ్చావోయ్?
ఎవరోయి నీవు?
లెక్కలే నీ సిరులు
మీ వారు దొరలే!
ఊరిలో పెద్దలే

ఎన్నో తరాల.

గడపలో గౌరవం

కడుపులో కరువు

గతిలేక వెతికావు

బస్తీకి తెరువు.

ఇరుగు పొరుగెరుగని

ఒక్క అర్ధరాత్రి

కాళ్లీడ్చుకుంటూ

ఆలి- పిల్లల కడుపులే

మాడ్చు కుంటూ

ఈనాటి దుస్థితికి

మది నేడ్చుకుంటూ

ఆనాటి జ్ఞాపకాలే

పూడ్చుకుంటూ

చేరినావా మహానగరం

ఘోరమౌ యీ శోక సాగరం.

వ్యాఖ్యాత:- అరె! రిక్షా! పద బస్స్టాండుకు;

(రిక్షావాడు వాడిని ఎక్కించుకుని బయలుదేరాడు)

అంతులేని సాగరమే

ఇంత మహానగరం

ఏకాంత బాధ ఏలరా?

ఇంత చింత ఏలరా?

నడూ!నడూ! చూచినాడూ!

వేచి నడూ వడూ నడూ

అదె టాక్సీ! అతి జరూర్

బలె హుషార్!
అడుగడుగున అదె తయార్
ఆగి ఆగి సాగవోయ్! ఆగి ఆగి సాగవోయ్!
అదె జట్కా!
సకిలిస్తూ, చర్నకోల విదలిస్తూ
లాగిలాగి సాగవోయ్!
బ్రతుకుబండి లాగవోయ్
బరువు బండి లాగవోయ్
లాఠీలతో హెచ్చరించు
సాయుధ రక్షకుల చూడు
రోడ్డు మధ్య పడిపోయే
అనాథ భిక్షకుల చూడు
లాగవోయ్! లాగవోయ్! లాగవోయ్!
బరువు బండి లాగవోయ్!
బ్రతుకు బండి లాగవోయ్!
(రిక్షావాడు ఒక బ్రిడ్జి మీదకు లాగలేక లాగలేక ఎక్కి దిగబోతూ ప్రక్క కాలువలో పడబోయి తమాయించుకున్నాడు)
అతను:- (పాటకుడు) ఏయ్! ఆపరా రిక్షా!
హుఁ! నీ ముఖానికి డబ్బులు కూడానా?
కాస్తయితే కాలువలో పడేవాణ్ణి.
ఛీ! పో! రిక్షా లాగటం చేతకాని వెధవకు
ఒక రిక్షా! చాలు! చాలు! అంటూ వెళ్ళిపోయాడు.
(రిక్షావాడి దుస్థితిని వర్ణిస్తూ!)
జనులకు కడు హేళనగా
జంతువులకె హీనంగా
నీ బ్రతుకే హేయంగా

నడూ! నడూ! దీనంగా
ఎందుకు ఏకాంత బాధ
నిత్యం కన్నీటి గాథ
లోకానికి లొంగిపోయి
శోకంతో వంగిపోయి
బాటలపై పాకుతున్న
పామరులను చూడవోయ్!
కాలి బాటపై లోకపు
లీల చూసి మౌనపు చిరు
నవ్వు లోలుకు శవం చూడు
ఇది నగరం కాదోయీ
ఇది దుస్స్వహ నరకమోయీ!

మాట:- ఒరే! రిక్షా! పద స్టేషనుకు.

(మరొకనుని ఎక్కించుకుని బయలుదేరాడు రిక్షావాడు)

పాట:- నరులు నిన్ను గదిమి గదిమి తరిమి నా
నగరం నిను తరిమి తరిమి తన్ని నా
ఆశలుడిగి నీ నెత్తురు నీళ్లు కారిపోతున్నా
అడుగున కొక ఏడాదిగ ఆయువుడిగి పోతున్నా
తరిమి తరిమి కొట్టే
సుడిగాలిలో ....
తిరిగి సురిగి పోయే
ఒగుడాకులా....
వీధి వీధి వాడ వాడ
ఊరంతా, పగలంతా
రోజుతూ వగర్చుతూ

బ్రతుకు బండి నీడ్చుతూ
ఊపిరి బిగబట్టి నడూ
ఆయువు నెగదట్టి నడూ
నడూ, నడూ, నడవ వోయ్!
(అతనిని స్టేషను వద్ద విడిచాడు)

మాట:- ఇదిగో! అర్ధరూపాయి!
(ఆ అర్ధరూపాయి తీసుకొని చీకట్లు కమ్మి, వర్ష సూచనలు
కన్పించగా తిరుగు ముఖం పట్టాడు.)

పాట:- వెర్రి మెదడు ఈ నగరం
నిద్రించెను వేగిరం
కలలు గనే నగరాన్ని
కబళించెను కాళరాత్రి
పెనుభూతపు నోరులాగ
బావురుమను వీధిలో
మరలి ఇంటి దారిబట్టి
తరలే ఓ రిక్షావాలా!
చిట చిట చిట వానజల్లు
చిలికి రాళ్లు విసరినా
ఇళ్ళవరుస కిటికీల్
చప్పట్లు చరిచి పిలిచినా
పట పట పట పళ్లుకొరికి
మెరుపులు కోపించినా
ఫెళ ఫెళ ఫెళ కారుమబ్బు
లురిమినా శపించినా
ఈ నగరం ప్రళయకాల
సాగరమై వూగినా

పెనుభూతపు నోరులాగ
బావురుమను వీధిలో
బిక్కుబిక్కుమంటూ
నీ వొక్కడివే
తడిసి తడిసి ముద్దగా
చల్లబడిన తనువంతా
పిల్లలగతి ఏమోనని
తల్లడిలగ మనసంతా
ఆయాసం - నీరసం
ఆవరించి - ఆగుతూ
లాగుతూ - తూలుతూ
వాలుతూ - కూలిపోతివేలా
(తూలిపడిపోగా) అయ్యో! అన్నా!
ఇది ఘోర, కఠోర, నగర మిది
భయంకరాటవి
గతి, స్థితి, బ్రతుకు రీతి
చితికిన ఓ! అనాథుడా
లేవోయి! లేవోయి!
లేవోయి!
భయపడినవాడా!
గతి చెడినవాడా!
క్షణం క్షణం చావునే
చవిచూచువాడా!
పట్టవోయి యిక యింటి జాడ
దాటవోయి యిక వాడ వాడ

బ్రతికినా, చచ్చినా
లేదులే విలువ
నీమోత బండియే
నీపాలి శిలువ
ఈ ప్రపంచం నిన్ను
వంచించినా ఎంత
ద్వేషించినా ఎంత
హింసించినా - నీవు
కించ పడకోయి - తల
వంచ బోకోయీ
ఈ ముష్టి లోకమే
ఈ దుష్టలోకమే - మారులే?
- మారులే!
ఈనాటి కష్టమే
నీ మహారిష్టమే - తీరులే!
తీరులే!
ఆశాజ్యోతి:- బ్రతుకు ప్రాంగణాన నింక
పచ్చతోరణాలోయీ
నిఖిలావనిలోన నిండు
నిత్యం కళ్యాణమే
భోగాలు - భాగ్యాలు
పిలసిల్లునులే అన్నా!
చల్లగ యీ జగమంతా
వర్ధిల్లును లే అన్నా!
ఓ అన్నా! ఓ అన్నా!
ఓ అన్నా!

- శ్రీ -

# అభయ హస్తము

తిశ్రం:- తాళం.- ఆది

రాగం:- ప్రవేశ దరువు:-

(తత్తోం తోం తకిట। తోం తధిగిణతోం॥)

జతి:-1 తా తా తా తకిట।
ధీం ధీం ధీం గిణత॥
తాగిణత తోం గిణత।
తక తోం ధిత్తోం గిణత॥
తకిట దికిట తకత ఝణుత।
దిగుద త్తోం తోం గిణత॥
తకిటత త గిణత।
త గిణత త గిణత॥

ప॥ సృష్టికి ప్రతి సృష్టి చేయు
శక్తి మహాశక్తి
భావానికి రూపకల్ప
మధిక శక్తి దివ్యశక్తి

జతి:- 2 తధి త్త తోం తకిట।
తకతోం తక తోం ధిత్తోం॥

అను - ప॥మన దేశం మన సంస్కృతి
విజ్ఞానాత్మక బోధలు
జగతికి సౌభాగ్యం
జీవికి పరమానందం ॥సృష్టికి॥

జతి. - మి॥ చాపు॥ తకిట తకధిమి ధిమిత కిటతక।
కిటత తకఝణు తోం గిణతోం॥

చ॥1 భావ గర్భిత బోధనాత్మక।
సందేశాత్మక సరళ కవితలు॥
మధురస్వరముల పలుకు పాటకు
నాట్యరీతులు తెలిసి ఆడిన

జతి - 4

తతత ధిమితక ధిమిత కిటతక
కిడత తకఝుణు తోం గిణతోం
మధుర స్వరముల పలుకు పాటకు
నాట్యరీతులు తెలిసి ఆడిన
రసికులను రంజింప జేయును
మెచ్చు ప్రజ ఘన కీర్తి దక్కును ॥సృష్టికి॥

జతి - 5

తక తక ధిమితక కిటతక
తద్దిత్తోం గిణతోం।
తత్తోంకిట తోం గిణతోం
తోం గిణతోం తోం గిణతోం॥

చ॥ మానవత్వం నశించి మనిషిలో
ధనదాహపు దుష్టశక్తులు
ప్రబలి రాక్షస హత్య క్రీడల
ధరణి నింకెను రక్తధారలు ॥సృష్టికి॥

జతి:- 6

దిగితక తోం ధిత్తోం తోం గిణతోం
తకతక దిగితక కిటతక తకతత్తోం గిణతోం
తకతత్తోం గిణతోం తక తత్తోం గిణతోం॥

చ॥ పక్షులకు కార్పణ్యములకు
పట్టువలె సమాధి యుందిట

దుష్టశక్తుల నణచి వేగమె
ఎత్తవలె మానవత జెండా
జతి:- 7
ఖండ:- తా తకిట తోం తకిట
తత్తకిట దిద్దికిట॥
చ॥4 ఎగరాలి ఎగరాలి
మానవత జెండా
శాంతి సౌభాగ్యములె
నిండాలి భువిలోన ॥సృష్టికి॥
జతి- - 8
(మి - చాపు)
తధిన తోంతక తోం గిణతోం
తాన ధిమితక ధిమిత కిటతక
తక దిగితక తకతోం ధిత్తోం తోం గిణతోం
తోం గిణతోం తోం గిణతోం॥
చ॥ మనిషి జీవిత కాలమందున
సాటి జీవికి నొకని కైనను
సాయ మొసగుట పరమధర్మము
ఇట్లు దలచిన లోకమంతటు
సుఖశాంతులె జీవితంబగు
సాకి- - ఇట్లు దలచిన లోకమంతటు
సుఖశాంతులె జీవితంబగు
తిశ్రం. - జై! శాంతి మానవత
జెండా మానవత
"సర్వే జనాః సుఖినో భవంతు"



# అర్ధనారీశ్వర

రచన : నార్ల చిరంజీవి

రాగం : కళ్యాణి

నటి- సూత్రధారులు ఈశ్వరుని ప్రార్థిస్తూ .-

ఓం! నమశ్శివాయ

శ్లో॥ వాగర్థా వివ సంపృక్తౌ

వాగర్థ ప్రతిపత్తయే

జగతః పితరౌ వందే
పార్వతీ పరమేశ్వరౌ॥

జతి-1

(చతు) తద్ధి తధిగిణ తోం - 2
తధిగిణతోం
తా తకిట తక। ఝుణుత ధిమిత ధిమి
తోం, తక। తదిగిణతోం ॥
తక దిగితక తకతత్ ధిత్త।
తకిట దికిట తకత ఝుణుత ॥
తకతోం ధిత్తోం తధిషిణ తోం।
తధిగిణత - 3

ప॥

జయ జయ ఈశా। నమో! నమో!
జయ జగదీశా। నమో ! నమో!
జయ జయ ఈశా! నమో! నమో!
,, ,, త్తైదిత్తై త్తైదిత్తై త్తై ॥

జతి -2

తధిత్తోంతక। తాఝుణుత ధిమి
తా ధీం గిణత। గిణత తాగిణత

చ॥ సకల చరాచర। జగతీ పాలన - 2
సర్వపాపహర। ఆర్త జనావన - 2
కైలాసాచల। వాసా ఈశా - 2
కరుణాభరణా। సుందర చరణ - 2

॥జయ జయ॥

పరమేశ్వరిని ప్రార్థిస్తూ:-

నటి - సూత్రధారులు :-

జతి -3

ఝం ఝంత కిణ । తోంధిత్తోం
ఝంత రీంత కిణ । తక ఝం తక
తక ఝం; । తకిట దికిట తక
తక ఝం తధి। గిణత గిణత తా
గిణత తా గిణత - 2

రాగం : కమాచ్

తాళం : ఆది

ప॥

జయ జయ మాతా। నమో। నమో
ప్రాలేయాచల । తనయ దయామయి
జయ జయ మాతా। నమో నమో। .
త్తై ది తై - త్తై ధి తై త్తై

జతి -4

తాధిత్తో । తోం కిట తోం
తది మిత కిటతక । తఝణు తకిట తక

చ॥ ఆపన్నులకే । అన్నపూర్ణవై
అసురులకే । ప్రచండ దుర్గవై
తకతక తకతక తకతక తకతక
తకతోం తక తోం తకతోం ధిత్తోం
అసురులకే । ప్రచండ దుర్గవై
పరాశక్తివై । వర ప్రదాయివై
బ్రహ్మాండము పా । లించెడు తల్లీ - 2
జయ జయ మాతా । నమో నమో - 2
" " । త్తై ది తై త్తై దితై త్తై

జతి-5

తా ధిమి । తా ఝణుత ధిమి

తా తకిట తక । తోం ధిత్తోం

తక తరికిట తక । దిగి తక తకతోం

తళాంగు తధిగిణతోం - 3

**ఈశ్వరుడు :-** రాగం :- కేదారగౌళ

సురలను బ్రోవగ త్రిపురా

సురులను హరించి దివ్యసుందరి గంగన్

శిరమున దాలిచి వచ్చిన

పరమేశ్వరుడను సమస్త భక్త వరదుడన్.

జతి- 6

(మి-చాపు)

దొద్దొ దీందాం। దొదొదొదీం దాం

తద్దిగి తక । తాహతకిట తక

తకదికి తక । తళాంగు తధిగిణ

తోం త్తై। య్యత్త తాం

చతు 7

ధీకు ణాంగుతక తకుందరి కిట తక

దిత్త ళాంగుతక తళాంగు తోం॥

తరికు ణాంగుతక తాహత కిటతక

దిత్త ళాంగుతక తళాంగు తోం॥

ధీకు ణాంగుతోం తరికు ణాంగుతోం

తళాంగుతోం- తళాంగు తోం

తళాంగు

**పాట:-** **రాగం :** శంకరాభరణం

**తాళం :** ఆది

ప॥

వేం చేసే । విశ్వనాధు

డు; కైలాసగిరికి

వేంచేసే : విశ్వనాధు

డు;

తద్ధి తధిగిణతోం - 3

చ॥

1. త్రినేత్రములతో । త్రిశూలంబుతో

త్రిభువనవనముల్ ను । తించి మించగను

॥ వేంచేసే ॥

2. దుష్ట శిక్షణకు । శిష్ట రక్షణకు

దైత్య పురమ్ముల । దగ్ధము చేసి

॥ వేంచేసె ॥

3. శాంతి సుఖమ్ములు । సర్వుల కొసగి

సర్వలోకర । క్షాదక్షుండై

॥ వేంచేసే ॥

(సతిని గానక ఈశ్వరుడు)

**పాట :** **రాగం :-** కాంభోజి

ప॥ **తాళం :-** మిశ్ర-చాపు

ఎందేగియున్నదో ఈ శైల తనయ

దర్శింపరాదేమి తడవైన దేల

చ॥

1. నీరాజనము లీయ నెలత రాలేదు
సాంధ్య తాండవ మందు సన్నిధి లేదు
2. దాగుడుమూతలకు తరుణమ్మ కాదు
సరస పరిహాసముల సమయమూ కాదు
3. కన్ను మెరుగైన యా కారణంబేమో
నన్ను గికురించు కథనంబు లవి యేమో
4. నా లీల లూహించి యీ లీల చేసెనో
బిట్టు కోపమ్ముతో పుట్టిల్లు చేరెనో
5. ఆడుదానికి చెడ్డ అనుమానమున్న

నటి:-

ప్రళయమ్ము తప్పదిక పరమేశుకైనా
(తెరమార్పుగా)

పార్వతి : రాగం : ఆ. భైరవి

ప॥ తాళం : మిశ్ర-చాపు

మనసు నిలుప జాలనే - ఓలలన
మనసు నిలుపజాల- మదిరాక్షి! ఈవేళ
మదనుడు చిగురాకు తూపుల
మరి మరి ఎద గాఢ నేసె

చ॥

1. కలికి చిలుకలు కూసెనే పలుమారు
కోయిలలు సందడి చేసెనే..
వలపు మిక్కుటమాయెనే
వరు డెంతకు రాడాయెనే
తెలియరా దది మోహ వార్ధిని
మునిగి పోవలసి నట్లాయెనె
2. చిలిపి మన్మధుడు వేసెనే

చందురు డెంతో వేడి వెన్నె గాసెనే
కత్తికోతగ చల్లగావిపై బడెనే అల్ల
కొదము తుమ్మెద రొదలు వింటే
గుండె ఝుల్‌ఝుల్ ఝుల్మనెనే

||మనసు||

**సంవాదం:-**

రాగం : శ్యామ
తాళం : ఆది

**ఈశ్వరుడు:**

తాళలేను యీ విరహ మోర్వనే
తలుపు తీయవె భామా। దర్శన మీయవె భామ!

**పార్వతి :-**

జడలో ముడివేసుక వచ్చితివ
సఖియ పేరు ఏమోయి నీ సయ్యాట చాలోయ్।

**ఈశ్వరుడు:-**

తాపహరమ్మని జలదేవతనే
తలపై దాల్చితి గౌరి। ఇక తగువు చేయకే నారీ!

**పార్వతి :-**

చెక్కిలి నొక్కులు గుట్టు తెలిసెను
టక్కరి మాటలు చాలోయ్। ఆ టక్కులాడితో పోపోవోయ్।

**ఈశ్వరుడు:-**

కయ్యమాడి నన్నల్లరి చేయకు
కనికరించవే భామ। నను కాదనకే గుణధామ।

**పార్వతి :-**

జగడాల మారి సవతిని తెచ్చి
ఆగడమెందుకు పోరా? నీ ఆటలు చాలును లేరా!

పార్వతి :–

అర్ధభాగమును ఇచ్చినాడనే
ఆదరించవే కొమ్మా! నిన్నొడబాయను సుమ్మా!

పార్వతి :–

మాయమాటలను నమ్మలేను పో
మరచిపోర సుకుమార। నా మనసు విరిగె పోపోర।

ఈశ్వరుడు:–

పురుష శక్తితో ప్రకృతి ఏకమై
ముక్తి పొందవలె భామా।
అనురక్తి చూపవే భామా।

పార్వతి :–

పరమ శివుండవు భక్తావనుడవు
పాలింపర నను స్వామి
నీ పదములు కొలుతును స్వామి

సమాప్తము!



MY creations will not be a were imitation of the past nor Burdened with narrow conventions. I take the help of the modern to awakẹ others understand the ancient.

A cultural Revival can not be achieved simply by offering the public the so called finished products of Art especially those dealing with subjects of past periods. There must be a real mingling of spirit between the Artiste and Masses.

***Uday shankar***

*The thoughts, presentation and spirit of uday shankar inspired and to start our the Indian Ballet centre at Madras in 1955.*



# Why the **Indian Ballet centre?**

Gods creation is cosmos.

The Earth we live in is a part of casmos. Man who is mortal dominates the Earth and he is surrounded and moulded by nature.

Rhythem and Harmoney are natures gifts to man. Dance enolved from naturs Rhythem and Music from Natures Harmony.

Man expresses himself and understands others through the Leanguage.

Language links Man to Dance and Music. So Dance,Music and Literature are interrelated.

Ballet is a synthesis of Dance, Music literature, presented in a dramatic form. Thus, of all art forms Ballet appeals Most to man. It is this thought that enthused me to delve deep in to the realm of Ballet and estbalish.

*The Indian Ballet centre at Madras in 1955.*

***- D. Venugopal***

--:శ్రీ:--

**ఈ నాట్యశాస్త్ర దర్పణమును చదివి,**

**హర్షించి తమ అమూల్యాభిప్రాయములను**

**అందజేసిన మహనీయులు...**

1 చిత్ర జగత్తులో ఆణిముత్యాలు, అపురూప కళాఖండాలను సృష్టించి విశేషఖ్యాతి గాంచిన దర్శక శిఖామణి శ్రీ విశ్వనాథ్ గార్కి,

2. చిత్ర నిర్మాతగా, National Film Development Corporation అధినేతగా ప్రశంసలనందుకొని, 'ప్రపంచ తెలుగు సమాఖ్య' ప్రెసిడెంటుగా విశేష సేవల నందిస్తున్న మహావ్యక్తి శ్రీ D V.S. రాజు గార్కి,

3. పండిత శ్రేష్ఠులు, శాస్త్ర విజ్ఞాన ప్రవక్తలు, సుమధుర భాషి శ్రీ దేవళ్ళ చిన్నికృష్ణయ్య గార్కి,

4. సహజకవితా విలాస, సాయితత్త్వసందర్శన శ్రీ చిల్లర భావనారాయణరావు గార్కి,

5 నాట్య, సంగీత, సాహిత్య కళలయందు సముచిత జ్ఞానాన్ని సముపార్జించి, సవిమర్శకుడుగా పేరొందిన శ్రీ V.A.K. రంగారావు గార్కి,

6 హాస్యనట చక్రవర్తి, దర్శక నిర్మాత, ఆప్తమిత్రుడు శ్రీ బి. పద్మనాభం గార్కి,

7. "కళకు జీవం జన జీవనం" అను నినాదాన్ని బోధించే ఆదర్శగురువు శ్రీ కాకరాల గార్కి,

8. బహుముఖ ప్రజ్ఞా విశేష సాహితీ వాచస్పతి
శ్రీ మొవ్వ వృషాద్రిపతి గార్కి,

9. నచ్చి, మెచ్చి ఒక్క పలుకున కొనియాడిన మేజరు
Ch. రాజేశ్వరరావు గార్కి,

10. అందరికి సోదరుడు - నాకు ఆత్మీయుడు - సర్వుల శ్రేయస్సును
కోరే శ్రీ వింజమూరి ప్రభాకర్ గార్కి,

11. ఆప్తమిత్రుడు, ఆదర్శ కళామూర్తి, విజ్ఞానఖని, పద్మభూషణ్,
కళావాచస్పతి శ్రీ K. జగ్గయ్య గార్కి,

12 సాహిత్య, ఆధ్యాత్మిక, ధార్మిక విజ్ఞాన శోభితుడు, స్నేహశీలుడు,
ఆదర్శమూర్తి, ఆత్మబంధువు శ్రీ గూడపాటి శ్రీనివాసరావు గార్కి,

13. ఆత్మకు ఆత్మ అనుబంధం మా స్నేహం మా జీవితపథం -
శివపథం - నా ప్రాణమిత్రుడు శ్రీ P.V.B. మహాదేవ్ గార్కి

నా హృదయ పూర్వకాభివందనములు.

నా హస్తముద్రలకు ప్రతిరూపం మా గురువులు

శ్రీ దాసరి వీరయ్య గారి

రేఖా సృష్టి

వారికి నా హృదయాంజలులు.

ఇందులో ఆరు హస్తముద్రలు 'ఈశ్వరీ ఆర్టు' రాజా రచించినవి.

వారికి శుభాశీస్సులు.

**- డి. వేణుగోపాల్**

56016

# కృతజ్ఞతలు

ఈ నా గ్రంథము - **నాట్యశాస్త్ర దర్పణము** - వెలువడుటకు తిరుమల తిరుపతి దేవస్థానము వారి ఆర్థిక సహాయము ప్రధాన కారణము. ఆ సహాయమే లేకున్న ఈ గ్రంథమునకు ఇనాలోక భాగ్యము కలిగి యుండెడిది కాదు. అటువంటి ఆర్థిక సహాయమందించిన తిరుమల తిరుపతి దేవస్థానము వారి కార్యనిర్వహణాధికారి డా. పి. కృష్ణయ్య I.A.S., గారికి, తదితర కార్యవర్గమునకు ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ గ్రంథమును సాధ్యమయినంత చక్కని రీతిలో లేజర్ టైప్ సెట్టింగ్ చేసి ఇచ్చిన క్రియేటివ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ వారికి కృతజ్ఞతలు.

ఈ గ్రంథముఖచిత్రమును సర్వాంగసుందరంగా, హృదయంగమంగా తీర్చిదిద్దిన సుప్రసిద్ధ చిత్రకారులు శ్రీ అంకయ్య గారికి ప్రత్యేక ధన్యవాదములు.

అనతికాలంలో సర్వాంగసుందరంగా ముద్రించి ఇచ్చిన 'హిందీ ప్రచార ప్రెస్' యాజమాన్యమునకు, వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

ఈ గ్రంథము వెలువడుటకు ఆదరాభిమానములతో విశేష సహకారమందించిన విబుధజనవిధేయుడు, ప్రవాస భాషకు యాసను దిద్ది, లాస్యాన్ని అద్దుతున్న అసమాన భాషాశిల్పి, ప్రియ మిత్రులు డా. తూమాటి సంజీవరావు గారికి హృదయాంజలులు.

ఈ గ్రంథగుణదోషముల విషయమున పాఠకోత్తములే న్యాయ నిర్ణేతలు. వారి అభిప్రాయములను శిరసా వహించగలనని మనవి.

చెన్నై - 24. నాట్య కళా తపస్వి

31-5-2002. **డి. వేణుగోపాల్**

56016

తెలుగు సంస్కృతికి నీరాజనాలర్పించి,
అభినయ కళకు వన్నె తెచ్చిన
విదుషీమణులు

కళాభినేత్రి
**వాణిశ్రీ**

కళాభారతి
**జమున**





మా సంస్థ

# The Indian Ballet Centre లో

విరిసిన కుసుమ రాజములు

56016

**D. వేణుగోపాల్**